ఈనాడు

కరీంనగర్ 10-2-2018 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 181

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఈనాడు



కరీంనగర్ 10-2-2018 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 181

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

బోదకాలు బాధితులకు పింఛను

నెలకు రూ.1,000



- అందరికీ ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు
- రెండో ఏఎన్ఎంలకూ జీతాలు పెంపు
- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు
- కేసీఆర్ కిట్స్ పథకం ప్రైవేటుకు ఉండదని స్పష్టీకరణ
- వైద్య ఆరోగ్యశాఖపై సమీక్ష

హైదరాబాద్ - న్యూస్‌టుడే

బోదకాలు బాధితులను ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వారికి నెలకు వెయ్యి రూపాయల పింఛనుతో పాటు అవసరమైన మందులు, ఇతర వైద్య సహకారం అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. సీఎం నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 46,576 మంది బోదకాలు బాధితులకు మేలు జరగనుంది. శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖపై ముఖ్యమంత్రి ప్రగతిభవన్‌లో సమీక్షించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, శాంతకుమారి, మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ వాకాటి కరుణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ లలితకుమారి, సీఎంఓ ప్రత్యేక అధికారి రాజశేఖర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి బోదకాలు బాధితులకు పింఛను కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామన్నారు. తమ నియోజకవర్గాల్లో ఇలాంటి బాధితులు చాలామంది ఉన్నారని, వారిని ఆదుకోవాలని ఎంపీ కవిత, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహా పలువురు ప్రజాప్రతినిధుల నుంచి వినతులు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈ వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్తగా గ్రామాల్లో అందరికీ ప్రభుత్వ ఖర్చుతోనే రోగ నిర్ధారణ పరీక్షలు చేయించాలని సీఎం ఆదేశించారు. ఆశా వర్కర్లకు ఇప్పటికే జీతాలు పెంచినా.. మరోసారి పెంచడానికి సిద్ధంగా ఉన్నామని, వారిని విలేజ్ హెల్త్ అసిస్టెంట్లుగా గుర్తిస్తామన్నారు. సెకండ్ ఏఎన్ఎంలకు కూడా జీతాలు పెంచుతామని, వారి సేవలను సమర్థంగా వినియోగించుకుంటామని సీఎం ప్రకటించారు. పీహెచ్‌సీలలో సౌకర్యాలు పెంచుతామన్నారు. ప్రజారోగ్యం విషయంలో తెలంగాణ ఆదర్శంగా మారాలన్నది తమ లక్ష్యమని కేసీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ కిట్స్ పథకం అద్భుతంగా అమలవుతున్నదని.. దీంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. అదనపు భారం పడినా వైద్యులు, (మిగతా 2లో)

కేసీఆర్ దిల్లీ పర్యటన

- నాలుగు రోజులు అక్కడే
- పట్టాదారు పుస్తకాల పంపిణీకి ప్రధానికి ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం రాత్రి దిల్లీకి వెళ్లారు. ఈ పర్యటనలో ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్రమంత్రులతో భేటీ అవుతారు. దిల్లీలోని వైద్యులతో దంత వైద్య పరీక్షలు చేయించుకోనున్నారని సమాచారం. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆయన దిల్లీకి వెళ్లాలని భావించారు. ఈ క్రమంలోనే శుక్రవారం పార్లమెంటు సమావేశాలు ముగియడంతో ఆయన రాత్రి దిల్లీకి బయల్దేరి వెళ్లారు. కొత్త నమూనాలో రూపొందించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీతో పాటు ధరణి పేరిట రూపొందించిన కొత్త వెబ్‌సైట్‌ను ప్రభుత్వం మార్చి 11న ప్రారంభించనుంది. ఈ కార్యక్రమానికి ప్రధానిని (మిగతా 2లో)

పాసుపుస్తకంపై నా ఫొటో వద్దు



రైతులకు అందజేయనున్న నూతన పాసుపుస్తకాల ముఖచిత్రం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నమూనాను ఖరారు చేశారు.

- రైతు చిత్రం, తెలంగాణ ముద్ర మాత్రమే ఉండాలి
- అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రైతులకు ఇచ్చే పట్టాదారు పాసుపుస్తకంపై తన ఫొటో ముద్రించవద్దని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించారు. రైతులకు కొత్తగా ఇవ్వనున్న పాసు పుస్తకాల నమూనాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రికి చూపారు. సీఎం ఫొటో ముద్రించి ఉన్న పుస్తకాన్ని అధికారులు చూపగా.. ఆయన తిరస్కరించారు. అంతిమంగా పైరు పచ్చని రంగులో ఉన్న పుస్తకాన్ని (మిగతా 2లో)




విశ్వం గుట్టు విప్పే సరికొత్త అస్త్రం!

-7లో

- అంతరిక్ష అన్వేషణకు భారీ ఆప్టికల్ టెలిస్కోపు నిర్మాణం
- హవాయి దీవుల్లో ఏర్పాటు
- నాలుగు దేశాలతో జట్టు కట్టిన భారత్

ప్రయోగశాలలో మానవ అండాల అభివృద్ధి

- తొలిసారిగా పరిపక్వ దశకు తీసుకొచ్చిన శాస్త్రవేత్తలు



ప్రయోగశాలలో పరిపక్వ దశకు చేరిన మానవ అండం

సంతాన సాఫల్య చికిత్సారంగంలో సరికొత్త ముందడుగు! మానవ అండాలను ప్రయోగశాలలో విజయవంతంగా పెంచడంలో శాస్త్రవేత్తలు తొలిసారిగా విజయవంతమయ్యారు. కీమోథెరపీ వంటి చికిత్సల కారణంగా గర్భధారణ సామర్థ్యాన్ని కోల్పోయే ముప్పున్నవారు సంతానాన్ని పొందేందుకు తాజా ఆవిష్కరణ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. -3లో

సరస్వతీ ప్రసాదం.. తయారీ అస్తవ్యస్తం!

- బాసర ఆలయ ప్రసాదం తయారీలో అడుగడుగునా నిర్లక్ష్యం
- కానరాని శుచీ, శుభ్రత..
- పోటులో దారుణ పరిస్థితులు
- అంతర్గత కమిటీల ఊసులేదు
- పడకేసిన రూ.120 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టు

-2లో



అపరిశుభ్ర వాతావరణంలోనే లడ్డూబూందీని వార్చుతున్న సిబ్బంది

హామీలపై త్వరలో నిర్ణయం

- పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆగకుండా నిధులు
- విభజన చట్టంలోని మిగిలిన అంశాలపై శాఖలవారీగా జరుగుతున్న కసరత్తు
- రాజ్యసభలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడి
- అమిత్‌షా రాజకీయ ఆమోదముద్ర తర్వాతే ప్రకటన
- సమస్యకు ముగింపు పలకాలని సూచించిన వెంకయ్య

-5లో



ఎల్లెడలా సంఘీభావం

- ఏపీ డిమాండుకు మద్దతిచ్చిన అద్వాణీ
- ప్రత్యేక హోదాకే సై అన్న రాహుల్
- ఎంపీలకు తెరాస, తృణమూల్, సీపీఐ, సమాజ్‌వాదీ, బాసట
- చివరి రోజూ ఆందోళనల పర్వం

-5లో




ట్విటర్ మిలియనీర్ కేటీఆర్

-2లో

అనుసరించే వారి సంఖ్య పది లక్షలు

ఇదీ సంగతి!



మనం నూరుగురు. ప్రచారానికి వాళ్లు ఐదుగురే సార్!

చాలా నష్టపోయాం

- ఈసారైనా న్యాయం చేయండి
- 15వ ఆర్థిక సంఘానికి తెలంగాణ విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితులను 14వ ఆర్థిక సంఘం పూర్తి స్థాయిలో పరిగణనలోకి తీసుకోలేదని దీని వల్ల తమకు నష్టం జరిగిందని తెలంగాణ రాష్ట్రం 15వ ఆర్థిక సంఘానికి స్పష్టం చేసింది. ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా కేటాయింపులు జరగలేదని తెలిపింది. 15వ ఆర్థిక సంఘమైనా తగిన న్యాయం చేయాలని కోరింది. హైదరాబాద్‌లో శుక్రవారం 15వ ఆర్థిక సంఘం దక్షిణాది రాష్ట్రాల అధికారులతో సమావేశమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటకలతోపాటు మహారాష్ట్రకు చెందిన ఆర్థిక, పురపాలక, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆర్థిక సంఘం కార్యదర్శి అర్వింద్ మెహతాతో పాటు కేంద్ర ఆర్థికశాఖ ఉన్నతాధికారులు, తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఏపీ ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి వికాస్‌రాజ్, పురపాలకశాఖ డైరెక్టర్ శ్రీదేవి సహా ఆరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అప్పుడేం జరిగిందంటే..

14వ ఆర్థిక సంఘం తన నివేదికను 2014 డిసెంబరు 15న అందచేసింది. అంతకు చాలాముందుగానే రాష్ట్రాలనుంచి వివరాలను సేకరించి వాటి ఆధారంగా ఓ అభిప్రాయానికి వచ్చింది. 2014 జూన్ 2న ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర పరిస్థితుల గురించి పూర్తి స్థాయిలో నివేదించలేకపోయింది. అయితే అప్పటికే ఆర్థిక సంఘం చాలా అంశాల్లో ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితుల్నే పరిగణనలోకి తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వివరాలు, సమాచారాన్ని ప్రాతిపదికగా తీసుకుంది. తెలంగాణలోని ప్రత్యేక పరిస్థితులు ఈ నివేదికల్లో పూర్తి స్థాయిలో ప్రస్ఫుటం కాలేనందున 14వ ఆర్థిక (మిగతా 2లో)



వడ్డీ మొత్తాలను తిరిగి ఇవ్వనందున రెండేసి కిస్తీలు ఎక్కువవుతున్నాయని వాపోతున్న సంగారెడ్డి జిల్లాలోని పొదుపు సంఘం సభ్యులు

వడ్డీ రాయితీ ఉందా?

- స్వయం సహాయక సంఘాలకు అందని బకాయిలు
- ఇప్పటికి చెల్లించాల్సింది రూ.1,443 కోట్లు
- బ్యాంకు రుణాలు కూడా అంతంత మాత్రమే

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో స్వయం సహాయక (పొదుపు) సంఘాలకు వడ్డీ రాయితీ పథకం అసలు అమల్లో ఉందా? లేదా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఎందుకంటే.. తెలంగాణలో ఏకంగా మూడేళ్లగా ఆయా మహిళా సంఘాలు భారీగా వడ్డీలను చెల్లించటమే తప్ప ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా వెనక్కి తీసుకోలేదు. ఇలా ఇప్పటివరకు పేరుకు పోయిన మొత్తం ఏకంగా రూ. 1,443 కోట్లకు చేరింది. బకాయిల గురించి గ్రామీణాభివృద్ధి శాఖ ఎటువంటి స్పష్టత ఇవ్వటం లేదు. మరో వైపు జిల్లాల వారీగా చూసినప్పుడు బ్యాంకుల రుణ (మిగతా 2లో)

ఆరోగ్యంగా తెలుగు రాష్ట్రాలు

- తక్కువ బరువు నవజాత శిశువుల్ని తగ్గించడంలో తెలంగాణది మొదటి స్థానం
- జననాల నమోదులో అగ్రస్థానాన ఏపీ
- మొత్తంమీద ఏపీది 8, తెలంగాణది 11వ స్థానం
- నీతిఆయోగ్ ఆరోగ్య సూచీలో కేరళ నెంబర్ వన్
- అట్టడుగున యూపీ, రాజస్థాన్, బిహార్

ఈనాడు, దిల్లీ: దేశంలో ఆరోగ్య రంగంలో కేరళ మరోసారి అగ్రస్థానాన్ని నిలబెట్టుకొంది. ఆ తర్వాత స్థానాలను పంజాబ్, తమిళనాడు, గుజరాత్ దక్కించుకున్నాయి. తక్కువ బరువున్న నవజాత శిశువుల సంఖ్యను తగ్గించే విషయంలో తెలంగాణకు మొదటి స్థానం, ఏపీకి మూడో స్థానం వచ్చాయి. శిశు జననాలను నమోదు చేయించే విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రథమ ర్యాంకు లభించగా, తెలంగాణ 12వ ర్యాంకు సాధించింది. ఆడ-మగ శిశువుల నిష్పత్తి అనే ప్రామాణికంలో తెలుగు రాష్ట్రాలు రెండింటికీ సమానంగా 8వ ర్యాంకు లభించింది. మొత్తంమీద 30 ప్రామాణికాల్లో పెద్ద రాష్ట్రాల విభాగంలో పనితీరును మదింపు చేస్తే ఏపీ 8వ స్థానంలో, తెలంగాణ 11వ స్థానంలో నిలిచాయి. 2014-15 సంవత్సర గణాంకాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఆ ఏడాదితో పోలిస్తే 2015-16లో ఏపీ 2.41 పాయింట్లు, తెలంగాణ 0.45 పాయింట్లు పెంచుకోగలిగాయి. కేరళ 3.45 పాయింట్లను కోల్పోయినా మొదటి స్థానంలోనే నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు 5.55 పాయింట్లు పెరిగినా 21వ స్థానంలో అట్టడుగున ఉంది. 29 రాష్ట్రాలను, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును నీతిఆయోగ్ పరిశీలించి ర్యాంకులు కేటాయించింది. పెద్ద రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణలను చేర్చగా చిన్న రాష్ట్రాల్లో గోవా, మణిపూర్, మేఘాలయా వంటివి ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలది మూడో విభాగం. 'ఆయుష్మాన్' పథకాన్ని (మిగతా 2లో)

వారసత్వంతోనే ఎదగలేం

- అది ప్రవేశం వరకే పనికొస్తుంది
- సొంత ముద్ర ఉంటేనే నిలదొక్కుకోగలం
- రాజకీయాల కంటే ఆర్థిక వ్యవస్థే ముఖ్యం
- రెండున్నరేళ్లలో 6వేల సంస్థలకు టీఎస్ఐపాస్ ద్వారా అనుమతులు
- క్రెడాయ్ సదస్సులో మంత్రి కేటీఆర్




క్రెడాయ్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ ● వేదికపై సచిన్ పైలట్, క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు సతీష్, ఒమర్ అబ్దుల్లా

ఈనాడు, హైదరాబాద్: రాజకీయాల్లోనైనా, వ్యాపారంలోనైనా వారసత్వం కేవలం ప్రవేశం వరకే పనికొస్తుందని, ముందు తరం కీర్తి కొంతవరకే ఉపకరిస్తుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. దాన్ని నిలబెట్టుకోవాలంటే చాలా శ్రమించాల్సి ఉంటుందని చెప్పారు. మొదటి తరంలో ఉన్న కసి రెండు, మూడో తరంలో కన్పించడం లేదని.. సొంత ముద్ర వేయాలంటే చివరి వరకు ఉత్సాహం తగ్గకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభమైన కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) యువ విభాగం రెండో జాతీయ సమావేశం 'యూత్‌కాన్-2018'లో శుక్రవారం ఆయన మాట్లాడారు. 'దేశవ్యాప్తంగా యువ నాయకులు ఎంతోమంది రాజకీయాల్లో రాణిస్తున్నారు. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో రాజకీయాలే చాలా విషయాలను నిర్దేశిస్తాయి. ఐదేళ్లకోసారి వచ్చే రాజకీయాలతో పోలిస్తే దేశానికి ఆర్థిక వ్యవస్థ (ఎకానమీ) ముఖ్యమని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారు. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థకు విజ్ఞానమే ముడిసరకు. అదే సంపద, ఉపాధి అవకాశాలను సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా ఎక్కువ మందికి ఉపాధినిస్తున్న స్థిరాస్తి రంగంలో కొత్త తరానికి ఎన్నో అవకాశాలున్నాయి. దేశంలో మరెక్కడా లేని విధంగా టీఎస్ఐపాస్ విధానం ప్రవేశపెట్టి తెలంగాణలో పరిశ్రమలకు 15 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. రెండున్నరేళ్లలో దీని ద్వారా 6వేల సంస్థలకు అనుమతులిచ్చాం. నిర్ణీత గడువులోగా అనుమతి ఇవ్వకపోతే అనుమతులిచ్చినట్లు పనులు ప్రారంభించుకోవచ్చు. అధికారులు జాప్యం చేస్తే జరిమానా విధిస్తున్నాం. సరళతర వ్యాపార నిర్వహణ (ఈజ్ ఆఫ్ డూయింగ్)లో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. రెండున్నరేళ్లలో రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మూడు లక్షల మందికి ప్రత్యక్షంగా, అంతకంటే ఎక్కువ మందికి పరోక్షంగా ఉపాధి లభించింది. స్థిరాస్తి పరంగా హైదరాబాద్ మార్కెట్ ప్రస్తుతం బాగుంది. కార్యాలయ స్థలాల లీజులోనూ దేశంలోనే ముందున్నాం. క్రెడాయ్, క్రెడాయ్ యువ విభాగం ఆలోచనలు కూడా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని సంస్కరణలు తీసుకొస్తాం' అని కేటీఆర్ చెప్పారు. జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దులా మాట్లాడుతూ నిర్మాణ రంగంలో మహిళా సభ్యులు ఉండటం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. బిల్డర్లు తక్కువ అంచనా వేసుకోవద్దని.. దేశాభివృద్ధిలో భాగంగా భావించాలన్నారు. రాజకీయాల్లోకి వస్తున్నప్పుడే ఏకాంతం వద్దనుకుని అడుగుపెడుతున్నామన్నారు. కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ కెరీర్‌లో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడే పరిపూర్ణత సాధిస్తారన్నారు. రాజకీయాల్లో అయినా, వ్యాపారంలోనైనా గెలుపోటములను చూసి వెనకడుగు వేయవద్దన్నారు. సమావేశంలో క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు జాక్సేషా, ఛైర్మన్ గీతాంబర్ ఆనంద్, యూత్ వింగ్ ఛైర్మన్ రోహిత్ రాజ్ మోదీ, దక్షిణాది ఉపాధ్యక్షుడు శివారెడ్డి, తెలంగాణ, హైదరాబాద్ అధ్యక్షులు జి.రాంరెడ్డి, ఎస్.రాంరెడ్డి, సీబీఆర్ఈ ఇండియా ఛైర్మన్ అన్షుమన్ పాల్గొన్నారు. సీబీఆర్ఈ రూపొందించిన యూత్ బారోమీటర్ నివేదికను విడుదల చేశారు.

డ్రోన్ పరిశ్రమను ప్రోత్సహిస్తాం: డ్రోన్ పరిశ్రమను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూల విధానాన్ని అమలు చేస్తోందని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దీనిలో పెట్టుబడి పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. నానక్‌రాంగూడ ఐటీక్షేత్రంలో సైయంట్, డీజేఐ, మైక్రోసాఫ్ట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన హ్యాకడ్రోన్- 2018 పోటీల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు.

కేటీఆర్.. తమిళ రాజకీయాలను టేకోవర్ చేయండి

మంత్రి కేటీఆర్ ప్రసంగం ముగిశాక సభకు హాజరైన యువ డెవలపర్లు పలు ప్రశ్నలు వేశారు. తమిళనాట రాజకీయాల్లో అనిశ్చితి దృష్ట్యా ఆ రాష్ట్ర రాజకీయాలను టేకోవర్ చేయాలని చెన్నైకి చెందిన ఓ యువ డెవలపర్ కేటీఆర్‌ను కోరారు. తమిళ రాజకీయాలను రజనీకాంత్ చూసుకుంటారని, త్వరలో పరిస్థితులు సర్దుకుంటాయని కేటీఆర్ నవ్వుతూ సమాధానమిచ్చారు. దీనికి సమాధానపడని ఆ యువకుడు 'మిమ్మల్ని చూస్తుంటే ఈర్ష్యగా ఉంది.. మీలాంటి నేత మాకు లేడు' అని నిరుత్సాహపడ్డాడు.

ట్విటర్ మిలియనీర్ కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్‌ను ట్విటర్‌లో అనుసరించే వారి సంఖ్య పది లక్షలకు (మిలియన్ ఫాలోయర్స్) చేరింది. ఈ ఘనత సాధించిన ప్రముఖుల జాబితాలో ఆయన శుక్రవారం చేరారు. తనను అనుసరించే వారి సంఖ్య పది లక్షలకు చేరగానే కేటీఆర్ స్పందించి 'మిలియన్ థ్యాంక్స్' అని ట్విటర్‌లో కృతజ్ఞతలు తెలిపారు. 'అందరికీ అందుబాటులో ఉంటాను' అని పేర్కొన్నారు. విస్తృత ప్రాచుర్యం గల సామాజిక మాధ్యమాల్లో ఒకటైన ట్విటర్‌ను వేదికగా చేసుకొని కేటీఆర్ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను వివరిస్తున్నారు. ప్రజా సమస్యలు, వైద్య చికిత్సకు సంబంధించిన వినతులపై సత్వరమే స్పందిస్తున్నారు. పలు అంశాల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. విదేశీ పర్యటనల్లో ఉన్నప్పుడు సైతం ట్విటర్‌లో సమాచారం రాగానే అధికారులకు ఆదేశిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆయనకు 50 వేల మంది అభిమానులుండగా, ఇప్పుడు ఆ సంఖ్య పది లక్షలకు చేరింది. తాజా పరిణామంతో బ్రిటిష్ ఉప హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్, మంత్రి పద్మారావు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, హైదరాబాద్ మేయర్ రామ్మోహన్, ఉప మేయర్ ఫసియుద్దీన్ తదితరులు కేటీఆర్‌కు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. ఈ జాబితాలో ఉన్న అతికొద్ది రాజకీయ నేతల్లో కేటీఆర్ ఒకరని వారు పేర్కొన్నారు.

బోదకాలు బాధితులకు పింఛను

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది ఓపికగా విధులు నిర్వర్తిస్తున్నారని, వారికి ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రులకు కేసీఆర్ కిట్స్ పథకం వర్తింపచేయాలని వినతులు వస్తున్నా ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అవసరమైన సౌకర్యాలు, సిబ్బందిని పెంచుతామని స్పష్టం చేశారు.

పాసుపుస్తకంపై నా ఫొటో వద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక చేశారు. పాసు పుస్తకంపై రైతు ఫొటో, తెలంగాణ ప్రభుత్వ ముద్ర మాత్రమే ఉండాలని స్పష్టంచేశారు. 'గతంలో ఇచ్చిన వాటికన్నా కొత్త పుస్తకం చిన్నగా ఉంటుందని, అట్టపైన బంగారం రంగులో అక్షరాలను ముద్రిస్తామని' ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు తెలిపారు.

చాలా నష్టపోయాం

(మొదటి పేజీ తరువాయి)

సంఘం నుంచి తెలంగాణకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని అధికారులు వివరించారు. వివిధ అంశాలకు సంబంధించి రాష్ట్రాలకు పంపిన నమూనాల మేరకు సమాచారం అందించాలని కార్యదర్శి అర్వింద్ మెహతా సూచించారు. పంచాయతీల వారీగా కూడా సమాచారం అందించాలని కోరగా, వేలాది పంచాయతీల సమాచారం ఇవ్వడం కష్టమవుతుందని అధికారులు వివరించారు. ఏప్రిల్ రెండోవారం తర్వాత ఆర్థిక సంఘం పూర్తి స్థాయిలో రాష్ట్రాల్లో పర్యటించి ప్రభుత్వం, ఇతర సంస్థల అభిప్రాయాలను తెలుసుకుంటుంది.

నేడు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన: 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అర్వింద్ మెహతా శనివారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఆయనతోపాటు సీఎస్ ఎస్.కె.జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు కాళేశ్వరం వెళ్లనున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ ముఖ్య అధికారులు మిషన్ భగీరథ ప్రాజెక్టును సందర్శించనున్నారు.

రాష్ట్రపతితో కేటీఆర్ భేటీ

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్‌లో ఈనెల 19 నుంచి 21 వరకూ నిర్వహించే ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు రావాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆహ్వానించారు. శుక్రవారమిక్కడ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతితో భేటీ అయ్యారు. నాస్కామ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సుకు 30 దేశాల నుంచి ఆహూతులు రానున్నారని కేటీఆర్ తెలిపారు.

కేసీఆర్ దిల్లీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించనున్నట్లు తెలిసింది. దీంతోపాటు రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చిస్తారు. ప్రధానిని కలిసేందుకు సీఎం ఇప్పటికే సమయం కోరారు. శనివారం అది ఖరారయ్యే వీలుంది. ప్రధానిని కలిసే సందర్భంలో ఎస్సీ వర్గీకరణ కోసం అఖిలపక్ష భేటీకి ముఖ్యమంత్రి సమయం కోరతారని తెలిసింది. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, పీయూష్‌గోయల్, నితిన్ గడ్కరీ తదితరులతో భేటీ అవుతారు. కాళేశ్వరానికి జాతీయ హోదా, మిషన్ భగీరథతోపాటు ఇతర ప్రాజెక్టులకు నిధులు, ఎయిమ్స్, బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఇతర అసంపూర్ణంగా ఉన్న ప్రాజెక్టులపై చర్చిస్తారు.

వేతనాలు పెంచకుంటే ఉద్యమం

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల్లో ఒప్పంద అధ్యాపకులకు వేతనాలు పెంచుతామని 4 నెలల క్రితం చెప్పినా ఇప్పటివరకు జీఓ విడుదల చేయలేదని, ఈనెల 15లోపు జారీ చేయకుంటే ఉద్యమిస్తామని ఒప్పంద అధ్యాపకుల సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.

ఆరోగ్యంగా తెలుగు రాష్ట్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ నివేదిక ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. ఈ ర్యాంకుల ఆధారంగానే 'జాతీయ ఆరోగ్య మిషన్' (ఎన్‌హెచ్ఎం) కింద కేంద్రం నుంచి ప్రోత్సాహకాలు అందనున్నాయి.

- ఏడాది వ్యవధిలో ఏపీ ఒకస్థానం పైకి వెళ్లింది.
- తెలంగాణతో పాటు 9 రాష్ట్రాలను 'కార్యసాధక రాష్ట్రాలు' (ఎచీవర్స్)గా నీతిఆయోగ్ వర్గీకరించింది.
- 62 పాయింట్లకు పైగా సాధించిన పంజాబ్, తమిళనాడు, కేరళలను మొదటి విభాగంలో చేర్చి, విజేతలుగా (ఫ్రంట్ రన్నర్స్)గా చూపించారు.
- 48 కంటే తక్కువ పాయింట్లు వచ్చిన యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశా వంటి రాష్ట్రాలను మూడో విభాగంలో 'ఆశావహ రాష్ట్రాలు' (ఏస్పిరెంట్స్)గా పేర్కొన్నారు.

పాయింట్ల వారీగా పెద్ద రాష్ట్రాల పరిస్థితి

రాష్ట్రం	2014-15	2015-16	మార్పు	ర్యాంకు
కేరళ	80	76.55	(-)3.45	1
ఏపీ	57.75	60.16	(+)2.41	8
తెలంగాణ	54.94	55.39	(+)0.45	11
యూపీ	28.14	33.69	(+)5.55	21

తెలంగాణకు మెరుగైన స్థానం

ఈనాడు, హైదరాబాద్: నీతిఆయోగ్ రూపొందించిన ఆరోగ్య నివేదికలో తెలంగాణ రాష్ట్రం మెరుగైన ర్యాంకు సాధించింది. ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగడంతో పాటు, శిశు మరణాలు, ఐదేళ్లలోపు శిశువుల మరణాలు, తక్కువ బరువుతో జన్మించే శిశువుల సంఖ్య తగ్గాయని వెల్లడైంది. ఆసుపత్రి ప్రసవాల్లో తెలంగాణ నాలుగో ర్యాంకు సాధించింది. రాష్ట్రం ఏర్పాటైన రెండేళ్లలోనే ఈ ఘనత సాధించడం పట్ల ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. ఈ తరహా వృద్ధి సాధించిన రాష్ట్రాల్లో తెలంగాణ ఐదోస్థానంలో ఉంది. 2014 నాటికి నవజాత శిశు మరణాల రేటు 25గా ఉంటే.. ఆ మరుసటి ఏడాదికి 23కి తగ్గింది. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటు 37 నుంచి 34కి తగ్గింది. రెండేళ్ల క్రితం నాటి వివరాల్లోనూ రాష్ట్రం మంచి ర్యాంకు సాధించిందని వైద్య ఆరోగ్య శాఖ పేర్కొంది. 2016-17, 2017-18లోను ఆరోగ్య, కుటుంబసంక్షేమ పథకాల అమలుతో తెలంగాణకు మరింత మెరుగైన స్థానం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కేసీఆర్ కిట్, గర్భిణులకు సహాయం, 102 సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ యూనిట్లు, ఐసీయూ కేంద్రాలు, తదితర విషయాలు దోహదం చేస్తాయని తెలిపింది.

పరిగణించిన అంశాలు ఇవే...: నవజాత శిశు మరణాలు, అయిదేళ్లలోపు పిల్లల్లో మరణాల శాతం, ఆడ-మగశిశువుల నిష్పత్తి, వ్యాధి నిరోధక టీకాలు తీసుకుంటున్నవారి సంఖ్య, ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల సంఖ్య, క్షయ వ్యాధి తీవ్రత, హెచ్ఐవీ కేసులు, ప్రసవానికి సగటు ఖర్చు వంటి అంశాలను ప్రామాణికాలుగా పరిగణించారు. ఆరోగ్య విభాగంలో ఖాళీలు, జననాల నమోదు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో 24 గంటల వైద్య సేవలు వంటి ఇతర అంశాలనూ విశ్లేషించినట్లు నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ వెల్లడించారు. 'ఆరోగ్యకర రాష్ట్రాలు... పురోగమన భారత్... రాష్ట్రాలు-కేంద్రపాలిత ప్రాంతాల ర్యాంకులు' పేరుతో శుక్రవారం దిల్లీలో ఈ నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ ఏడాది జూన్ నాటికి 730 జిల్లా ఆసుపత్రులకూ ర్యాంకులు కేటాయిస్తామని చెప్పారు.

(వివిధ అంశాలు, ర్యాంకుల వివరాలు www.eenadu.net లో...)

వడ్డీ రాయితీ ఉందా?

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీలో కూడా తీవ్ర అంతరాలున్నాయి. లక్ష్యంలో వికారాబాద్ జిల్లాకు అతి తక్కువగా 56 శాతం మాత్రమే అందగా.. ఖమ్మం జిల్లాకు 122 శాతం అందాయి. పొదుపు సంఘాల్లోని మహిళలు వడ్డీతో సహా తమ రుణాలను బ్యాంకులకు చెల్లించి తిరిగి ఆ వడ్డీ మొత్తాలను ప్రభుత్వం నుంచి పొందటమే 'వడ్డీ లేని రుణాల' (వీఎల్ఆర్) పథకం స్వరూపం. బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణాలను వడ్డీతో సహా 96 శాతం మంది మహిళలు సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ వడ్డీ సొమ్ము మాత్రం వారి ఖాతాల్లో తిరిగి జమ కావటంలేదు. అధిక వడ్డీలు పిండే సూక్ష్మ రుణ సంస్థల బారిన పడకుండా ఏర్పాటైన మహిళా బ్యాంకు (స్త్రీనిధి) ద్వారా పొందిన రుణాలదీ ఇదే పరిస్థితి. ఇలా ఇంతవరకు పొదుపు సంఘాలకు రూ.1,443 కోట్లు రావాల్సి ఉంది. ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్వహించే సమీక్షా సమావేశాల్లో ఈ వడ్డీ బకాయిల అంశం ప్రస్తావనకే రావటంలేదు.

దేశంలోని పేద కుటుంబాలను 2024-25 నాటికి దారిద్ర్యరేఖపైకి తీసుకురావటం కోసం కేంద్రం అమలు చేస్తున్న జాతీయ జీవనోపాధుల మిషన్‌ను కేంద్ర కమిటీ ఒకటి ఇటీవల సమీక్షించింది. రాష్ట్ర ప్రభుత్వాలు జాప్యం లేకుండా తమ ఖజానా నుంచి నిధులిస్తున్నప్పుడే పేద కుటుంబాలకు చేయూత లభించినట్లవుతుందని అభిప్రాయపడింది.

రుణాల పంపిణీలో అంతరాలు: రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లోని పొదుపు సంఘాలకు బ్యాంకుల చేయూత సరైన రీతిలో ఉండటంలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో(2017-18) పొదుపు సంఘాలకు రూ. 7వేల కోట్ల మేర రుణాలివ్వాలనేది బ్యాంకర్ల సమితి లక్ష్యం. ఇందులో 2017 డిసెంబరు నాటికి రూ.4,167 కోట్లను ఇవ్వాల్సి ఉండగా రూ.3,421 కోట్లు (82శాతం) పంపిణీ అయ్యాయి. రాష్ట్ర సగటు 82 శాతంగా ఉన్నప్పటికీ 10 జిల్లాల్లో ఇచ్చింది డిసెంబరునాటికి ఉన్న లక్ష్యంలో 75 శాతంలోపే. వికారాబాద్ జిల్లాలో 55 శాతం, నిర్మల్‌లో 58 శాతం, గద్వాలలో 65 శాతం, వనపర్తిలో 66 శాతం మేర మాత్రమే పంపిణీ అయ్యాయి. ఖమ్మం, సంగారెడ్డి వంటి కొన్ని జిల్లాల్లో లక్ష్యాలకు మించి రుణాలను ఇచ్చినందునే రాష్ట్ర సగటు 82 శాతంగా కనిపిస్తోంది. పలు పొదుపు సంఘాలు అన్ని అర్హతలను సాధించినప్పటికీ వాటికి రుణాలందటంలేదు.

బ్యాంకులకు పొదుపు సంఘాలు చెల్లించిన వడ్డీ (రూ.కోట్లలో)

2015-16	424
2016-17	427
2017-18(నవంబరుకు)	292
స్త్రీనిధికి చెల్లింపు	300

సరస్వతీ ప్రసాదం.. తయారీ అస్తవ్యస్తం!

ఈనాడు - హైదరాబాద్
న్యూస్‌టుడే - బాసర



అపరిశుభ్ర వాతావరణంలో పులిహోర, లడ్డూ బూందీ తయారీ.. చిత్రంలో ధ్వంసమైన వెంటిలేటర్లు

భక్తులు పరమ పవిత్రంగా భావించే దైవ ప్రసాదం తయారీలోనూ అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తే.. బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ప్రసాదాలు రూపొందిస్తున్న తీరు ఇలాగే ఉంది. వార్షిక ఆదాయం రూ.15 కోట్లపైనే ఉన్న జ్ఞాన సరస్వతి ఆలయం అభివృద్ధి సంగతి అటుంచి లడ్డూ ప్రసాదాల తయారీ విధానం నానాటికి తీసికట్టుగా మారుతోంది. ఏటా లక్షల సంఖ్యలో భక్తులు దర్శించుకునే చదువుల తల్లి చెంత నిర్లక్ష్యం రాజ్యమేలుతుందనడానికి ఆలయ పోటు తీరే ఉదాహరణగా నిలుస్తోంది. రోజూ వేలమంది స్వీకరించే లడ్డూ ప్రసాదం తయారుచేసే పోటు భవనం లోపలి భాగం దుర్భరంగా ఉంది. మట్టి పొయ్యిలను బట్టీలుగా మలిచి వంటలు చేస్తున్నారు. పైకప్పు పొగ చూరి నల్లగా మసిపట్టింది. వంట మొదలు పెడితే గదిలోపల ఎవరున్నారో కూడా కనిపించే పరిస్థితులు లేవు. వంట గది లోపలికి వెలుతురు, గాలి వచ్చే వీలు లేదు. లోపలి పొగ బయటికి వెళ్లే ఏర్పాట్లు సరిగ్గా లేవు. వెంటిలేటర్లు ధ్వంసమైపోయాయి. అన్నం గంజిని వార్చిన ప్రతిసారీ గది చెమ్మగా మారిపోతోంది. తిరిగి అక్కడే బూందీ తయారు చేస్తున్నారు. లక్షల మంది భక్తుల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న ఇక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. గుడ్డి విద్యుత్తు దీపాల కింద మసకవెలుతురులో కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆహార పదార్థాలు వండేటప్పుడు కనీస రక్షణకు ఉపయోగించాల్సిన చేతి తొడుగులు, తలపై ధరించే వస్త్రం, చేతులు శుభ్రం చేసుకునే వసతి వంటి సౌకర్యాలూ అందుబాటులో లేవు.

భక్తికీ శుద్ధికీ.. రాంరాం

ఆలయంలో ప్రసాదాల తయారీని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించాల్సి ఉంటుంది. పోటులోపలికి వచ్చే కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది తప్పకుండా పరిశుభ్రతను పాటించాల్సి ఉండగా.. బాసరలో ఇవేమీ కనిపించడం లేదు. కొంతమంది మాత్రమే భక్తి శ్రద్ధలతో ప్రసాదం తయారీలో పాల్గొంటుండగా.. మిగిలినవారు సాధారణ కార్మికుల మాదిరే విధులు నిర్వహిస్తున్నారు. సమశ్రేణి వస్త్రాలు, పోటు లోపలికి అడుగు పెట్టేముందే కాళ్లూ చేతులు శుభ్రం చేసుకునేందుకు కొళాయి కూడా లేదు. ఇద్దరు ముగ్గురు మినహా మిగతావారు కనీసం తలకు ప్రత్యేక వస్త్రం కూడా ధరించడం లేదు. చేతులకు తొడుగులు లేకుండానే లడ్డూలు తయారు చేస్తున్నారు. 1966లో తితిదే నిర్మించిన భవనంలోనే ఇప్పటికీ పోటు నడుస్తోంది. వంటగది దూళి, పొగతో అపరిశుభ్రంగా తయారైంది. పైకప్పు పెచ్చులు ఊడిపోతున్నాయి. తలుపులకు రంగులు వెలిసిపోయాయి. ముడి సరకుల్ని నిల్వ ఉంచేందుకు అల్మారాలు, బీరువాలు లేవు. నెయ్యి, బియ్యం, జీడిపప్పు, ఎండుద్రాక్ష, నూనె, పోపు సామగ్రి నేలపైనే పట్టాలు పరిచి ఉంచుతున్నారు. సగటున రోజుకు దాదాపు పది వేల లడ్డూలు తయారు చేస్తున్నారు. కనీసం నిల్వ సమయంలోనూ ప్రమాణాలు పాటించడం లేదు. లడ్డూల్ని గోనె సంచులు, పట్టాలపై వేసి నేలపై నిల్వ చేస్తున్నారు. కార్మికులు కింద కూర్చునే తయారు చేసి ఆ పక్కనే నేలపై వాటిని ఉంచుతున్నారు.

రూ.120 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టు ఏమైనట్లు

బాసర అమ్మవారి ఆలయ అభివృద్ధికి మూడేళ్ల క్రితం రూ.120 కోట్లతో బృహత్ ప్రణాళిక తయారు చేశారు. లడ్డూ తయారీ భవనం, క్యూ కాంప్లెక్స్, భక్తులకు 500 గదుల విశ్రాంతి గృహ నిర్మాణాలు చేపట్టాలని ప్రణాళిక తయారు చేశారు. దీనిపై ఎప్పటికప్పుడు దాటవేత ధోరణి కనిపిస్తోంది. ఆలయంలో జరిగే వేడుకల సందర్భంగానో.. ప్రత్యేక కార్యక్రమాల సమయంలో ప్రజాప్రతినిధులు వస్తున్నా హామీల అమలు ఊసు మాత్రం ఎత్తడం లేదు. దీంతో ఆలయ అభివృద్ధి అక్కడికే పరిమితమవుతోంది.

ధరలు పెంచినా.. నాణ్యత పాటించాలి

అమ్మవారి ప్రసాదాల ధరలను ఇటీవలే పెంచారు. గతంలో రూ.10 ఉన్న 100 గ్రాముల లడ్డూ ధర ప్రస్తుతం రూ.15కు పెంచారు. రూ.50 ఉన్న 400 గ్రాముల లడ్డూ (ప్రత్యేక లడ్డూ) తూకం 500 గ్రాములకు పెంచి ధరను రూ.100 చేశారు. ఇప్పటికైనా ప్రసాదాల తయారీలో నాణ్యత, శుభ్రత పాటించాలని భక్తులు కోరుతున్నారు.

అంతర్గత కమిటీలు వేయరేం..

లక్షల మంది భక్తుల తాకిడి ఉన్న బాసరలో ఆలయం, ప్రసాదాల తయారీ, ప్రత్యేక పర్వదినాలు, నిత్యాన్నదానం, దుకాణాల టెండర్లు, సరకుల కొనుగోళ్లపై ప్రత్యేక శ్రద్ధలేదు. వివిధ రకాల కార్యక్రమాలు సజావుగా సాగేందుకు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టింపు లేకుండా పోయింది. ప్రస్తుతం 14 మంది సభ్యులతో ఉన్న పాలకమండలి మాత్రమే ఉంది. 1981లో ఆలయ అవసరాలకు తీసుకున్న సిబ్బంది సంఖ్యలో ఇప్పటికీ మార్పులు చేయడం లేదు. వందల క్వింటాళ్ల సరకులు, ముడి ఆహార పదార్థాల కొనుగోళ్లు ఇష్టారాజ్యంగా సాగుతుండటంతో నాసిరకమైన సరకులు సరఫరా అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎయిమ్స్‌కు అధికారిక ప్రకటన ఇవ్వాలి

- కేసీఆర్ కిట్లకు నిధులు కేటాయించండి
- కేంద్ర మంత్రులు జైట్లీ, నడ్డాలకు లక్ష్మారెడ్డి విజ్ఞప్తి



కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీని కలిసిన మంత్రి లక్ష్మారెడ్డి. ఎంపీలు జితేందర్‌రెడ్డి, నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: తెలంగాణకు ఎయిమ్స్ ఇస్తామని వెంటనే అధికారిక ప్రకటన చేయాలని కేంద్ర మంత్రులు జైట్లీ, నడ్డాలకు రాష్ట్ర ఆరోగ్యమంత్రి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎయిమ్స్ ప్రకటనతో పాటు ఈబడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. శుక్రవారం పార్లమెంటులో కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. తెలంగాణ హెల్త్‌హబ్‌గా మారిందని ఎయిమ్స్ ఇస్తే బాగుంటుందని జైట్లీకి తెలిపారు. కేంద్ర పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని తదనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

అనంతరం ఆరోగ్యమంత్రి నడ్డాతో భేటీ అయిన లక్ష్మారెడ్డి.. సూర్యాపేట, నల్గొండలలో వైద్య కళాశాలలకు అనుమతులు త్వరగా ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం నడుస్తున్న, నూతన కళాశాలలకు అదనంగా సీట్లు కేటాయించాలన్నారు. గాంధీ ఆసుపత్రిలోని ఫర్టిలిటీ కేంద్రానికి, కేసీఆర్ కిట్ల పథకాన్ని ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకం కింద నిధులివ్వాలన్నారు. వెల్‌నెస్ సెంటర్లకు ఆయుష్ సేవలు, ఏఎన్ఎంల వేతనాలపై చర్చించారు. బస్తీ దవాఖానలకు కేంద్రం సహకరించాలని నడ్డాకు లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.

సిరిసిల్ల సెస్‌కు నిధులివ్వాలి

తెలంగాణలోని సిరిసిల్ల సెస్‌కు నిధులివ్వాలని కేంద్ర విద్యుత్తుశాఖ మంత్రి ఆర్కేసింగ్‌కు తెరాస ఎంపీ వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారమిక్కడ సెస్ పాలకవర్గ ఛైర్మన్, సభ్యులు దోర్నాల లక్ష్మారెడ్డి, ఎల్.శ్రీనివాస్, తదితరులతో కలిసి కేంద్ర మంత్రికి వినోద్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. 1.50 లక్షల గృహాలకు మీటర్లు మార్పు, లోఓల్టేజ్ నుంచి హైఓల్టేజ్ లైన్లు ఏర్పాటు, పాత ట్రాన్స్‌ఫార్మర్లు, పాత విద్యుత్తు లైన పునరుద్ధరణకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల సెస్‌కు సహకరిస్తామని కేంద్ర మంత్రి వారికి హామీ ఇచ్చారు.

రామప్ప దేవాలయాన్ని వారసత్వ సంపదగా గుర్తించాలి

తెలంగాణలోని రామప్ప దేవాలయాన్ని యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చాలని కేంద్రానికి తెరాస ఎంపీలు జితేందర్‌రెడ్డి సీతారాంనాయక్‌లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారమిక్కడ కేంద్ర మంత్రి మహేశ్‌శర్మతో భేటీ అయిన ఎంపీలు వినతి పత్రం అందజేశారు. ఈ ఏడాది తప్పకుండా ప్రాధాన్యమిస్తామని కేంద్ర మంత్రి వారికి హామీ ఇచ్చారు.

గద్వాల-మాచర్ల లైను ఒప్పందం చేసుకోండి

తెలంగాణలోని గద్వాల- ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల రైల్వే లైనుపై రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవాలని శుక్రవారం ప్రధాని మోదీకి కాంగ్రెస్ ఎంపీ నంది ఎల్లయ్య లేఖలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రప్రభుత్వం, రైల్వేశాఖ ఒప్పందానికి సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం పెండింగ్‌లో ఉంచిందన్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా విస్మరిస్తున్నారని కార్మికులకు మేలు చేసే ఈ లైను పనులు త్వరగా ప్రారంభించేలా చూడాలని కోరారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సాధారణంకన్నా 2 నుంచి 4 డిగ్రీల వరకు అదనంగా నమోదవుతున్నాయి. ఖమ్మం, మెదక్, ఆదిలాబాద్ తప్ప మిగతా ప్రాంతాల్లో చలి బాగా తగ్గింది. శుక్రవారం తెల్లవారుజామున అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 11 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. మెదక్‌లో 15, హైదరాబాద్, ఖమ్మంలో 18 డిగ్రీలుగా నమోదయింది. పగటి పూట పలు ప్రాంతాల్లో 35 డిగ్రీలుంటోంది. 'రాష్ట్రంలో మరో 3 రోజులు పొడి వాతావరణముంటుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా సోమ, మంగళవారాల్లో బలమైన గాలులతో మోస్తరు వాన లేదా అక్కడక్కడా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశాలున్నాయి.' అని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

గ్రహం అనుగ్రహం

10-2-2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
దశమి: సా. 4-20 తదుపరి ఏకాదశి
జ్యేష్ఠ నక్షత్రం: రా. 9-29 తదుపరి మూల
అమృత ఘడియలు: ఉ. 11-51 నుంచి 1-36 వరకు
వర్జ్యం: తె. 6-18 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 6-32 నుంచి 8-03 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-34; సూర్యాస్తమయం: సా.5-55

హామీ ఇచ్చి అమలు చేయరా?

- రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటులో జాప్యంపై హైకోర్టు అసంతృప్తి
- కౌంటరు దాఖలు చేయాలని సీఎస్‌కు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రస్థాయిలో రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చి అమలు చేయకపోవడంపై శుక్రవారం ఉమ్మడి హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. మూడు నెలల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఏర్పాటు చేయకపోవడం సరికాదంటూ గడువు పొడిగించాలని కోరుతూ ప్రమాణపత్రం కూడా దాఖలు చేయకపోవడాన్ని ప్రశ్నించింది. కమిషన్ ఏర్పాటు చేయలేకపోవడానికి కారణాలతోపాటు దీన్ని ఎందుకు కోర్టు ధిక్కరణగా పరిగణించరాదో వివరిస్తూ కౌంటరు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. రైతు విమోచన కమిటీ ఏర్పాటు చేస్తామంటూ చేయకపోవడంతో భాజపా సీనియర్ నాయకుడు ఇంద్రసేనారెడ్డి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది బాలాజీ వదేరా వాదనలు వినిపిస్తూ.. రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ సమాధానమిస్తూ.. కమిషన్ ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోందని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి మరికొంత గడువు అవసరమని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ మూడు నెలల్లో కమిషన్ ఏర్పాటు చేస్తామంటూ ప్రభుత్వమే హామీ ఇచ్చిందని, హామీని నమోదు చేసి పిటిషన్‌పై విచారణ ముగించామన్నారు. గతేడాది నవంబరు 21తో హామీ గడువు ముగిసిందని, కనీసం గడువు పెంచాలంటూ హైకోర్టులో ప్రమాణపత్రం కూడా దాఖలు చేయకపోవడం సరికాదంది. పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

2019 జనవరి నాటికి గజ్వేల్‌కు చుక్‌చుక్

- మంత్రి హరీశ్‌రావుతో భేటీలో దక్షిణ మధ్య రైల్వే జీఎం వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

సికింద్రాబాద్ నుంచి గజ్వేల్‌కు 2019 జనవరి నాటికి రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ తెలిపారు. మంత్రుల గృహనిర్మాణ సముదాయంలోని మంత్రి హరీశ్‌రావు నివాసంలో ఆయనతో శుక్రవారం ద.మ.రైల్వే జీఎం సమావేశమయ్యారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైలు మార్గం, స్టేషన్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ మార్గం పనుల్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి కోరారు. జీఎం స్పందిస్తూ మనోహరాబాద్-గజ్వేల్ పనులు వేగం పుంజుకున్నాయని, ఏడాదిలో గజ్వేల్ వరకు రైలు నడిచేలా పనులు చేస్తున్నామని తెలిపారు. రెండోదశ కింద గజ్వేల్-సిద్దిపేట పనుల్ని కూడా మొదలుపెట్టామని వివరించారు. గజ్వేల్ నుంచి కొత్తపల్లి మధ్యలో భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదని, అసంపూర్తిగా ఉన్న దాన్ని పూర్తిచేసేలా చూడాలని మంత్రిని కోరారు. సిద్దిపేట, గజ్వేల్ రైల్వేస్టేషన్లను అత్యాధునికంగా నిర్మించాలని హరీశ్‌రావు సూచించారు. మనోహరాబాద్-కొత్తపల్లి లైనులో కుకునూరుపల్లి, దుద్దేడ తదితర చోట్ల భూసేకరణ అసంపూర్తిగా ఉందని జీఎం చెప్పారు. తూప్రాన్ మండలం పరికిబండ రక్షిత అటవీప్రాంతం భూముల సేకరణకు అడ్డంకులు తొలగిపోయాయని వివరించారు. మెదక్-అక్కన్నపేటమార్గంలో పనులు ముఖ్యమంత్రి కేసీఆర్ అంచనాల కంటే నెమ్మదిగా సాగుతున్నాయని, వేగవంతం చేయాలని మంత్రి సూచించగా కొంత మేర భూసేకరణ మిగిలి ఉందని, భూముల్ని సేకరించి ఇవ్వాలని జీఎం కోరారు. రామాయంపల్లి దగ్గర, గజ్వేల్ సమీపంలో ఆర్వోబీ, ఆర్‌యూబీ నిర్మిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.



మంత్రి హరీశ్‌రావుతో సమావేశమైన వినోద్‌కుమార్ యాదవ్. చిత్రంలో ఎంపీ బీబీ పాటిల్

సుబాబుల్ టన్నుకు రూ.5500 ఇవ్వాలి

రాష్ట్రంలో రైతులు సాగుచేస్తున్న సుబాబుల్, జామాయిల్ తోటల కలపకు వ్యవసాయ మార్కెట్ల ద్వారా టన్నుకు రూ.5500 ఇచ్చి కొనుగోలు చేయాలని తెలుగుదేశం నేతలు మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావుకు విన్నవించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, నేతలు బీఎన్ రెడ్డి, బుచ్చిలింగం, బ్రహ్మయ్యలు శుక్రవారం ఉదయం మంత్రి నివాసానికి వెళ్లి సుబాబుల్ రైతుల సమస్యలపై వివరించారు. ఇతర రాష్ట్రాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా ఈ కలపను కొంటున్నారని, కానీ ఖమ్మం జిల్లాలో బీపీఎల్ కంపెనీ దళారుల ద్వారా తక్కువ ధరకు కొనడం వల్ల రైతులు నష్టపోతున్నారని వారు వివరించారు. దళారుల బారి నుంచి రైతులను కాపాడాలని, నేరుగా కొనేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

జాతీయ పార్టీలు మనల్ని బిచ్చగాళ్లను చేస్తాయి: హరీశ్‌రావు

కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపాలకు జెండా మోసేవారు లేరని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో కాంగ్రెస్, భాజపా, తెదేపాలకు చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం రాత్రి బొమ్మకల్ గ్రామంలో తెరాసలో చేరారు. ఈ సందర్భంగా మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. గ్రామాల్లో దుకాణం ఖాళీ అవుతుంటే గాంధీభవన్‌లో కూర్చుని 100 సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ వారు మేకపోతు గాంభీర్యం ప్రకటిస్తున్నారని విమర్శించారు. ''జాతీయ పార్టీలు మనల్ని దిల్లీలో బిచ్చగాళ్లను చేస్తాయి. వీటిని నమ్ముకుంటే దిల్లీలో బానిసలం అవుతాం. బాత్రూం కట్టాలంటే పర్మిషన్ తెచ్చుకోవాల్సి ఉంటుంది'' అని అన్నారు.

ప్రయోగశాలలో మానవ అండాల అభివృద్ధి

లండన్: సంతాన సాఫల్య చికిత్సారంగంలో సరికొత్త ముందడుగు! మానవ అండాలను ప్రయోగశాలలో విజయవంతంగా పెంచడంలో శాస్త్రవేత్తలు తొలిసారిగా విజయవంతమయ్యారు. మానవ అండాల అభివృద్ధి తీరును క్షుణ్నంగా తెలుసుకునేందుకు అవి దోహదపడతాయని వెల్లడించారు. క్యాన్సర్ చికిత్సతో గర్భధారణ శక్తి కోల్పోయే ప్రమాదమున్న మహిళలకు ఈ ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. ఎలుకల అండాలను శాస్త్రవేత్తలు దాదాపు 20 ఏళ్ల క్రితమే ప్రయోగశాలలో పెంచారు. మానవ అండాల విషయంలో మాత్రం అది సాధ్యపడలేదు. దీనిపై బ్రిటన్‌లోని ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు విస్తృత పరిశోధనలు నిర్వహించి.. ఎట్టకేలకు విజయవంతమయ్యారు. పరిశోధనల్లో భాగంగా వారు 25-40 ఏళ్ల మధ్య వయసున్న 10 మంది మహిళల నుంచి అండాశయ కణజాలాన్ని సేకరించారు. అనంతరం అండాలు ప్రాథమిక దశ నుంచి సంపూర్ణంగా అభివృద్ధి చెందేందుకు వీలుగా.. నాలుగు దశల్లో భిన్న పోషకాల మిశ్రమాలను కణజాలానికి అందించారు. మొత్తం 48 అండాలు పరిపక్వ దశకు చేరువగా వచ్చినప్పటికీ.. వాటిలో 9 మాత్రమే పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయి. తక్కువ సంఖ్యలో మాత్రమే అండాలు పరిపక్వం చెందాయి కాబట్టి.. తాము రూపొందించిన విధానం ఇంకా మెరుగుపడాల్సి ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ విధానంలో లభించిన అండాలు ప్రస్తుతానికి ఫలదీకరణ చెందని సంగతిని కూడా గుర్తుచేశారు.

సాధారణంగా కీమోథెరపీ, రేడియోథెరపీ వంటి క్యాన్సర్ చికిత్సలు రోగుల్లో గర్భధారణ సామర్థ్యాన్ని హరించివేస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అందుకే క్యాన్సర్ సోకిన మహిళలు చికిత్స కంటే ముందే తమ అండాలను, అప్పటికే ఫలదీకరణ చెందిన పిండాలను శాస్త్రీయ విధానంలో భద్రపర్చుకుంటారని పేర్కొన్నారు. చిన్నతనంలోనే క్యాన్సర్ బారిన పడ్డ బాలికల్లో మాత్రం ఈ విధానం సాధ్యం కాదని చెప్పారు. అలాంటి బాలికలకు కూడా తమ నూతన ఆవిష్కరణ సంతానాన్ని ప్రసాదించగలదని అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర కర్రసాము సంఘం అధ్యక్షునిగా రామ్మోహన్‌రావు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పి.రామ్మోహన్‌రావు రాష్ట్ర కర్రసాము (సిలబం) సమాఖ్య అధ్యక్షునిగా నియమితులయ్యారు. కర్రసాము సమాఖ్య జాతీయ అధ్యక్షుడైన తమిళనాడు సహకార సంఘాల ఎన్నికల కమిషనర్ రాజేంద్రన్ ఆయన నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్రసాము సంఘానికి క్రీడా ప్రాధికార సంస్థ గుర్తింపుతో పాటు అభివృద్ధికి సహకరించాలని రామ్మోహన్‌రావు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.. త్వరలో తెలంగాణలో దీనిపై పోటీలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణలో కర్రసాము ప్రసిద్ధ క్రీడ అని, పండుగలు, పర్వదినాలు, శుభకార్యాల్లో దీనిని ప్రదర్శిస్తారని వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు.

13న పీపుల్స్‌ప్లాజాలో ఫ్రెంచ్ ఏరియల్ షో

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఈ నెల 13న ఫ్రెంచ్ ఏరియల్‌షో నిర్వహిస్తున్నట్లు పర్యటక, సాంస్కృతికశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. సచివాలయంలో శుక్రవారం ఆయనమాట్లాడారు. ఇండో-ఫ్రెంచ్ ప్రభుత్వాల ఒప్పందంలోభాగంగా 'బంజోర్ ఇండియా 2018' ఉత్సవాల్ని దేశవ్యాప్తంగా 33 నగరాల్లో ప్రదర్శిస్తున్నారని.. ఇందులో మొదటి ప్రదర్శన వేదికగా హైదరాబాద్‌ను ఎంచుకోవడం ఆనందదాయకమన్నారు. ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 18మంది కళాకారులతో సాంస్కృతికప్రదర్శనలు నిర్వహిస్తారన్నారు. సంగీతం, నృత్యం,సర్కస్, ఆర్కెస్ట్రాకలిసి ఈ ప్రదర్శన ఉంటుందని పర్యటక శాఖ కార్యదర్శి వెంకటేశం చెప్పారు. ప్రవేశానికి రుసుము ఉండదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పాపారావు పాల్గొన్నారు.

ప్రధాని ప్రసంగంలో హేతుబద్ధత ఏది?

- సురవరం విమర్శ
- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్‌తో కలిసే పోటీచేస్తామని వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం అభ్యంతరకరంగా ఉందని, ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీల అమలుపై స్పష్టతనివ్వకపోగా ఎన్డీయే వైఫల్యాల నుంచి ప్రజలదృష్టిని మరల్చేందుకే దేశవిభజన, ఏపీ విభజన అంశాలపై హేతుబద్ధత లేకుండా మాట్లాడారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర విభజన శాస్త్రీయంగా లేదని భావించినట్లయితే.. అధికారంలో ఉన్న ఎన్డీయే ఆస్తుల విభజన వంటి అంశాల్ని ఎందుకు సరిదిద్దలేదని ప్రశ్నించారు. శుక్రవారమిక్కడ పార్టీ కార్యాలయంలో జాతీయకార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయింపులపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదన్నారు. ఏపీకి గత ప్రధాని ఇచ్చిన ప్రత్యేక హోదా అంశాన్నీ పట్టించుకోని కేంద్రం పోలవరానికీ సరిపడా నిధులివ్వట్లేదని ఆక్షేపించారు. సుదీర్ఘపోరాటం సహా అన్ని పార్టీలు మద్దతిచ్చాకే రాష్ట్ర విభజన జరిగిందని, అలాంటప్పుడు తెలంగాణ ఏర్పాటుపై ప్రధానికి అభ్యంతరం ఎందుకో అర్థం కావటం లేదన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం తీరుకు నిరసనగా ఏపీ పోరాటం చేస్తుండగా..తెలంగాణ ప్రయోజనాల విషయంలో కేంద్రాన్ని నిలదీయడంలో తెరాస ప్రభుత్వానికి భయమెందుకో చెప్పాలన్నారు. జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ..ఆలస్యంగానైనా ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రంపై తిరగబడ్డారని, ఇప్పటికైనా ఆయన భాజపాను వీడితే మంచిదని వ్యాఖ్యానించారు. గాలి ముద్దుకృష్ణమనాయుడు అనారోగ్యాన్ని సకాలంలో గుర్తించి చికిత్స అందించడంలో వైద్యులు విఫలమయ్యారన్నారు. ఓ వార్తా సంస్థతో సురవరం మాట్లాడుతూ..త్వరలో జరగబోయే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్‌తో కలిసి పోటీ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

కేటీఆర్ వాడిన భాష అభ్యంతరకరం

- సీఎల్పీ నేత జానారెడ్డి
- విదేశాలు తిరిగి ఇదే నేర్చుకుంటున్నారా: గీతారెడ్డి, జీవన్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సీఎల్పీ నేతగా తీవ్రంగా ఖండిస్తున్నానని జానారెడ్డి తెలిపారు. కేటీఆర్ వాడిన పదజాలం జుగుప్సాకరంగా, రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనంగా ఉందన్నారు. సర్వేలు, సీట్లను పక్కనబెడితే.. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గీతారెడ్డి, సంపత్‌కుమార్, రాంమోహన్‌రెడ్డిలతో కలిసి ఆయన శుక్రవారం అసెంబ్లీ మీడియాహాలులో మాట్లాడారు. సీఎం కేసీఆర్, తెరాస నేతలు కాంగ్రెస్, రాహుల్ గాంధీ గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా... అదే రీతిలో స్పందించవద్దని మా పార్టీ నేతలకు తాము సూచించానన్నారు. దాన్ని అలుసుగా తీసుకుని పదేపదే ఇలాంటి పదజాలం వాడటం సంస్కారం అనిపించుకోదన్నారు. ఎదుటివారిని దిగజార్చి మాట్లాడితే గొప్పవాళ్లమైపోమన్న విషయాన్ని కేటీఆర్ గ్రహించాలన్నారు. జాతీయ పార్టీకి సారథిగా ఉన్న రాహుల్‌ను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీని కాలి గోరుతో పోల్చిన ఆయన..ఆ పార్టీ నేత కాళ్లు పట్టుకున్న సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డి, గీతారెడ్డిలు మాట్లాడుతూ..దేశాలు తిరిగి కేటీఆర్ ఇదే సంస్కారం నేర్చుకున్నారా? అని ప్రశ్నించారు.

విద్యుత్ సరఫరాపై ప్రజాపద్దుల సంఘం ఆరా

తెలంగాణలో విద్యుత్ స్థితిగతులపై రాష్ట్ర ప్రజాపద్దుల సంఘం(పీఏసీ) ఆరా తీసింది. శుక్రవారం శాసనసభ కమిటీ హాలులో ఛైర్‌పర్సన్ గీతారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి ఏమిటి, ఉత్పత్తి సామర్థ్యం, కొత్త విద్యుత్ కేంద్రాల నిర్మాణం, సౌర విద్యుత్ ఇతర అంశాల గురించి గీతారెడ్డి, సభ్యులు ప్రశ్నించారు. విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా దృశ్యరూపక వివరణ ఇచ్చారు. నిరంతర విద్యుత్‌ను సమర్థంగా అమలు చేస్తున్నట్లు, వేసవిలోనూ ఎలాంటి సమస్య ఉండదని అధికారులు వివరించారు.

3 వర్సిటీలకే పీహెచ్‌డీ అర్హత పరీక్ష నిర్వహణ హోదా

- మిగతావాటిలో చేరాలంటే నెట్ లేదా సెట్ తప్పనిసరి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మూడు విశ్వవిద్యాలయాలకు మాత్రమే పీహెచ్‌డీలో ప్రవేశానికి అర్హత పరీక్ష నిర్వహించుకోవడానికి వీలుంది. గత ఏడాది జూన్‌లో విశ్వవిద్యాలయం నిధుల సంఘం (యూజీసీ) పీహెచ్‌డీలో ప్రవేశాలపై ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం విశ్వవిద్యాలయాలకు కనీసం జాతీయ అంచనా, గుర్తింపు కమిటీ (న్యాక్) 'ఎ' శ్రేణి హోదా ఉంటేనే పీహెచ్‌డీ అర్హత పరీక్ష నిర్వహించుకోవడానికి అవకాశం ఉంది. రాష్ట్రంలో ఆ స్థాయి న్యాక్ హోదా ఉన్న రాష్ట్ర విశ్వవిద్యాలయాలు కేవలం ఓయూ, కాకతీయ, జేఎన్‌టీయూహెచ్ మాత్రమే. తెలంగాణ, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి న్యాక్ 'బి' శ్రేణి మాత్రమే ఉంది. ఇక పాలమూరు శాతవాహన విశ్వవిద్యాలయాలకు ఈ హోదాలేదు. అర్హత పరీక్ష నిర్వహించుకోవడానికి వీల్లేని విశ్వవిద్యాలయాలు జాతీయస్థాయిలో యూజీసీ నిర్వహిస్తున్న జాతీయ అర్హత పరీక్ష(నెట్) లేదా రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న రాష్ట్ర అర్హత పరీక్ష(సెట్) ఉన్న వారికే నేరుగా ప్రవేశాలు కల్పించుకోవాల్సి ఉంది. అంతేకాకుండా నెట్‌లో ప్రతిభ చూపి జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)తోపాటు రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్ ఉన్న వారికి ప్రవేశాలు కల్పించుకోవచ్చు. పీహెచ్‌డీలో ప్రవేశాలపై వర్సిటీల్లో ఏకరూపత తెచ్చేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కొద్ది నెలల క్రితం ముగ్గురు ఉపకులపతులతో కమిటీని నియమించింది. కమిటీ ఇంకా తుది నివేదికను సమర్పించలేదు. అయితే యూజీసీ జారీ చేసిన నిబంధనల మేరకు ప్రవేశాలు ఉండాలని కమిటీ సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్లు ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం పీహెచ్‌డీ పర్యవేక్షకులుగా అర్హత ఉన్నవారు తక్కువగా ఉండటంతో ప్రస్తుతం తాము నెట్ లేదా సెట్ ఉత్తీర్ణులైన వారికే ప్రవేశాలు ఇస్తున్నామని, ఇటీవలే ఈ ప్రక్రియను పూర్తిచేశామని పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పాండురంగారెడ్డి తెలిపారు.

పెట్టుబడులకు తెలంగాణ వైపు చూస్తున్నారు

- మంత్రి ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రపంచ దేశాలు పెట్టుబడుల కోసం తెలంగాణ వైపు చూస్తున్నాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. యూఏఈ అబుదాబీకి చెందిన ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ కంపెనీ విభాగమైన ఎన్‌పీసీసీ డిజైన్ ఇంజినీరింగ్ తమ కార్యకలాపాల కోసం హైదరాబాద్ కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డులోని మంజీరా ట్రినిటీ కార్పొరేట్ 16వఅంతస్థులో అనివా, నెల్ సంస్థలతో కలిసి ఏర్పాటుచేసిన కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పరిశ్రమలు స్థాపించేందుకు నగరం అనువైన ప్రాంతంగా ప్రతి ఒక్కరూ ఎంచుకుంటున్నారన్నారు. ఇప్పటికే ఎన్నో పరిశ్రమలు, ఐటీ సంస్థలు ఏర్పాటయ్యాయన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ రాకముందు 5వస్థానంలో ఉంటే ఇప్పుడు 3వ స్థానానికి మెరుగవ్వడమే దీనికి నిదర్శనమన్నారు. అనివా, నెల్ సంస్థలు తమ ఇంజినీరింగ్ కార్యకలాపాల కోసం ఏర్పాటు చేసిన కేంద్రం మరింత పెట్టుబడులు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను పెంపొందించుకునే స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. అనివా, నెల్ సంస్థల ఛైర్మన్ అఖిల్‌మెది మాట్లాడుతూ.. భారతదేశం, యూఏఈ మధ్య మంచి వ్యాపార, స్నేహ సంబంధం ఉందన్నారు. తమ సంస్థలను హైదరాబాద్‌లో మరింత విస్తృతం చేసే ఆలోచనలు ఉన్నాయని చెప్పారు. అంతకు ముందు ఆ సంస్థల ఎండీ ఒసామా మాట్లాడారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈ-అభ్యాసన

ఈనాడు, హైదరాబాద్: మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ) రూపొందించిన తెలంగాణ ఈ-అభ్యాసన నిర్వహణ విధానాన్ని(టీమ్స్) రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ శుక్రవారం ప్రారంభించారు. మొదటిగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ)కు సంబంధించి ఈ-అభ్యాసన విధానాలను విడుదల చేశారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. సుస్థిర అభివృద్ధిపై ఉద్యోగులు సహా ఎవరికైనా శిక్షణ ఇచ్చేందుకు, సులభంగా అర్థం చేసుకునేందుకు ఇది చక్కగా ఉపయోగపడుతుందని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ బి.పి.ఆచార్య తెలిపారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ సలహాదారు జి.ఆర్.రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.



టీమ్స్‌ను విడుదల చేస్తున్న ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, బి.పి. ఆచార్య తదితరులు

కనీస నీటిమట్టం సాధ్యం కాదు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోండి
- మెట్రో వాటర్ వర్క్స్ ఎండీకి స్పష్టం చేసిన నీటిపారుదలశాఖ

ఈనాడు, హైదరాబాద్: తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని నాగార్జునసాగర్‌లో కనీస నీటిమట్టం 510 అడుగులు ఉండేలా చూడాలన్న హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ చేసిన విజ్ఞప్తిని నీటిపారుదల శాఖ తిరస్కరించింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టంచేసింది. వేసవిలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని కనీస నీటిమట్టం 510 అడుగులు ఉండేలా చూడాలని కోరుతూ హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ నీటిపారుదల శాఖకు లేఖ రాశారు. స్పందించిన ఆ శాఖ కనీస నీటిమట్టం నిర్వహించడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. 'నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం నీటిమట్టం 526.80 అడుగులు ఉంది. ఎడమ కాలువ కింద, ఎ.ఎం.ఆర్.పి కింద సాగు, తాగు నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుంటే 500 అడుగుల వరకు వెళ్లాల్సి రావచ్చు. వేసవిలో మరింత దిగువ నుంచి నీళ్లు తీసుకునేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.' అని సూచించింది. గతేడు సుమారు 500 అడుగుల నుంచి నీటిని తీసుకోవడానికి హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోగా.. ఈ ఏడు కూడా అదే పరిస్థితి పునరావృతం కాకతప్పని పరిస్థితి కన్పిస్తోంది.

వ్యవసాయాన్ని పండగలా మార్చడమే లక్ష్యం

- అగ్రిటెక్-2018 ప్రారంభోత్సవంలో మంత్రి పోచారం

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయాన్ని పండగలా మార్చడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీలో రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య, వ్యవసాయశాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'అగ్రిటెక్ సౌత్-2018' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ...''వారంలోగా రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ఏర్పాటుచేస్తాం.. క్యాబినెట్‌మంత్రి హోదా దీని ఛైర్మన్‌కు ఉంటుంది. దేశానికి అన్నం పెడుతున్న రైతు అప్పుల కోసం చేయి చాచాల్సి వస్తోంది. ఎకరానికి రూ.50 వేల లాభం వచ్చేలా అందరూ కృషి చేయాలి. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాలని, నిధులు పెంచాలని సీఎం కేసీఆర్ ఇటీవల సూచించారు. ప్రతి నియోజకవర్గంలోను అధికంగా పండే పంటకు సంబంధించిన ఆహార శుద్ధి పరిశ్రమ ఏర్పాటుకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సాహం అందించడంలేదు. పసుపు, మిర్చిలాంటి పంటలకు మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారు. త్వరలో కోటి ఎకరాలకు రెండు పంటల సాగుకు సరిపోయేంత నీరు అందిస్తాం. మార్చి 11న రాష్ట్రంలోని 72 లక్షల మంది రైతులకు పట్టాపాసుపుస్తకాలు ఇవ్వనున్నాం. వీటి ఆధారంగా ఏప్రిల్ 1 నుంచి మే 15 మధ్య ఎకరానికి రూ.4వేల చొప్పున రూ.6వేల కోట్లను పంపిణీ చేస్తాం. వచ్చే ఏడాది రైతులు పండించిన పంటను వ్యాపారులు కొనకపోయినా రైతు సమన్వయ సమితులు కొంటాయి'' అని చెప్పారు. వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 12 రకాల వంగడాలను విశ్వవిద్యాలయం నూతనంగా ఆవిష్కరించిందన్నారు. వర్సిటీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు అనీల్‌కుమార్, రమేష్‌దాట్ల, సమీర్‌గోయల్, సంజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ట్రాక్టర్ నడుపుతున్న పోచారం

అమెరికాలో దుండగుడి ఘాతుకం

ఇద్దరు ప్రవాస భారతీయులపై కాల్పులు

వాషింగ్టన్: అమెరికాలో సాయుధుడైన ఓ దుండగుడు ఇద్దరు ప్రవాస భారతీయులపై దాడికి తెగించాడు. తుపాకితో జరిపిన కాల్పుల్లో పరంజిత్ సింగ్(44) అనే వ్యక్తి మృతిచెందారు. ఆ తర్వాత పార్థీ పటేల్(30) అనే వ్యక్తిపై కాల్పులు జరపగా అతనికి తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఈ రెండు ఘటనలూ మంగళవారం సాయంత్రం జార్జియా రాష్ట్రంలోని ఫ్లాయిడ్ కౌంటీలో పది నిమిషాల వ్యవధిలో చోటు చేసుకున్నాయి. దుండగుడు తొలుత బర్నెట్ ఫెర్రీ రోడ్‌లోని హైటెక్ క్విక్ స్టాప్ వద్ద స్టోర్‌లోకి ప్రవేశించి అక్కడ కౌంటర్ వద్ద ఉన్న పరంజిత్ సింగ్‌పై మూడు సార్లు కాల్పులు జరిపాడు. అయితే, దోపిడీకి యత్నించలేదు. సమీపంలోనే ఉన్న మహిళా ఉద్యోగిపై ఎలాంటి దాడి యత్నం చేయలేదు. ఆ తర్వాత ఎల్మ్ స్ట్రీట్ ఫుడ్ అండ్ బెవరేజెస్ స్టోర్‌లోకి ప్రవేశించి డబ్బును దోచుకున్నాడు. అక్కడే ఉన్న క్లర్క్ పార్థీ పటేల్‌పై కాల్పులు జరిపాడని స్థానిక పోలీస్ అధికారి వెల్లడించారు. దుండగుడిని రషద్ నికోల్సన్(28)గా గుర్తించారు. అతను పాతనేరస్థుడు. గతంలో దోపిడీ కేసుల్లో జైలు శిక్ష అనుభవించి విడుదలయ్యాడని పోలీసులు తెలిపారు. కాల్పుల ఘటనల దృశ్యాలు వీడియోలో రికార్డు అయ్యాయని వెల్లడించారు. పరంజిత్ సింగ్ గత ఏనిమిదేళ్లుగా జార్జియాలో ఉంటున్నారని ఆయన సోదరుడు వెల్లడించారు.

జాతీయస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దుతా

ఎస్సీ స్టడీసర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ ఎస్సీ స్టడీసర్కిల్‌ను జాతీయ స్థాయి ఉత్తమ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆ స్టడీసర్కిల్ డైరెక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఎస్సీ స్టడీసర్కిల్ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఇదే కేంద్రంలో 1994వ బ్యాచ్‌లో సివిల్స్ శిక్షణ తీసుకుని ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తాజాగా తాను చదువుకున్న విద్యాలయానికి డైరెక్టర్‌గా వ్యవహరించనున్న నేపథ్యంలో ప్రవీణ్‌కుమార్ 'ఈనాడు'తో మాట్లాడారు. స్టడీసర్కిల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించడాన్ని గౌరవంగా భావిస్తున్నానని, సవాల్‌గా స్వీకరిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతమున్న సమస్యలను పరిష్కరిస్తే శిక్షణ వ్యవస్థ గాడినపడుతుందని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోని స్టడీసర్కిళ్లను బలోపేతం చేస్తానన్నారు. నిధుల కొరత లేదని, అత్యాధునిక ఐటీ పరిజ్ఞానాన్ని వినియోగించి పాఠ్యాంశాలు బోధించాల్సి ఉందని వివరించారు. బోధనా పద్ధతి, ఇక్కడి వ్యవహారాలు పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సివిల్స్ శిక్షణకు ముందస్తుగానే సన్నద్ధమయ్యేందుకు గురుకులాల్లో తొమ్మిదో తరగతి నుంచి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

త్వరలో ఎలక్ట్రిక్ వాహన విధానం

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా

ఈనాడు, హైదరాబాద్: త్వరలో ఎలక్ట్రిక్ వాహన విధానం తేవడానికి తెలంగాణ పరిశ్రమల శాఖ, రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తున్నాయని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఇంధనశాఖ ప్రయత్నాలు చేస్తోందన్నారు. శుక్రవారం ఇక్కడ ఎలట్స్ టెక్నో మీడియా సంస్థ, రాష్ట్ర ఇంధనశాఖ సంయుక్తంగా నిర్వహించిన విద్యుత్ సదస్సుకు అజయ్ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశ్రమలకు అనుకూలంగా ఉండే కొత్త సౌర విద్యుత్ విధానాన్ని తేవడానికి కూడా యోచిస్తున్నామన్నారు. ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ రంగం సాధించిన విజయాలను దృశ్యరూపకంగా వివరించారు. సేద్యానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఎలా సాధ్యమైందో చెప్పారు. సమీప భవిష్యత్తులో రోజుకు 20 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న అజయ్‌మిశ్రా

త్వరలో రాష్ట్రం మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరిస్తుందన్నారు. సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఎండీ సుధాకర్‌రావు వివరించారు. బ్రిటీష్ ఉప హైకమిషనర్ అండ్రూ ఫ్లెమింగ్, స్వీడన్ వాణిజ్య వ్యవహారాల కౌన్సిలర్ జోసా కరే, పలు దేశాలు, రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యుత్ రంగంలో వ్యాపార అవకాశాలపై చర్చించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని పలు సంస్థలకు ఈ సందర్భంగా పురస్కారాలు అందజేశారు.

కందుల కొనుగోలు పరిమితి 75,300 టన్నులకు పెంపు

ఈనాడు, హైదరాబాద్: మద్దతు ధరకు కొనే కందుల పరిమితిని 75,300 టన్నులకు పెంచుతూ కేంద్రం శుక్రవారం కేంద్రం ఉత్తర్వులిచ్చింది. గతంలో 53,300 టన్నులకు అనుమతించగా ఈ పరిమితిని 1.13 లక్షల టన్నులకు పెంచాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ పలుమార్లు విన్నవించింది. రాష్ట్ర ఎంపీలు దిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కలిసి కూడా ఇదే విషయమై విన్నవించారు. చివరికి 75,300 టన్నులకు కేంద్రం అనుమతించింది. మిగిలిన వాటిని రాష్ట్ర నిధులతోనే కొనుక్కోవాల్సి ఉండగా..ఇందుకోసం బ్యాంకుల నుంచి రుణం తీసుకునేందుకు 'రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య'(మార్క్‌ఫెడ్)కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇప్పటికే 1.10 లక్షల టన్నుల కందులను మార్క్‌ఫెడ్ కొనేసింది. వీటిలో 75,300 టన్నులకు కేంద్రం తరపున నాఫెడ్ నిధులు అందుతాయి. మిగిలిన వాటికి మార్క్‌ఫెడ్ చెల్లింపులు చేస్తుంది.

మావోయిస్టు రామన్న దంపతుల అరెస్టు



రామన్న

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు సీనియర్ నాయకుడు రామన్న, ఆయన భార్య పద్మలను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మహారాష్ట్రలోని చంద్రపూర్ పోలీసులు బల్లార్షలో వారిని శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. సికింద్రాబాద్‌కు చెందిన రామన్న అసలు పేరు శ్రీనివాస్. 1976లో దళ సభ్యుడిగా ఉద్యమంలోకి అడుగుపెట్టి రామన్న పేరుతో వివిధ ప్రాంతాల్లో పనిచేశాడు. ఆయుధాలు తయారు చేయడంలో ప్రావీణ్యం ఉన్న ఆయన మావోయిస్టులకు అవసరమైన ఆయుధాలు తయారు చేయడంతోపాటు క్యాడర్‌కు శిక్షణ ఇచ్చేవాడు. వాస్తవానికి ఈపాటికే కేంద్ర కమిటీ స్థాయికి ఎదగాల్సి ఉన్నప్పటికీ అగ్రనాయకత్వంతో తలెత్తిన వివాదం కారణంగా ప్రస్తుతం దండకారణ్యం ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యుడిగానే కొనసాగుతున్నాడు. రామన్నపై రూ.50 లక్షల రివార్డు ఉంది. ఆయన భార్య పద్మ గడ్చిరోలి వాసి. ఆమెపై రూ.6 లక్షల రివార్డు ఉంది. ఇద్దరూ ప్రస్తుతం అబూజ్‌మడ్‌లో పనిచేస్తున్నారు. అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకునేందుకు వచ్చిన రామన్న దంపతులను బల్లార్ష రైల్వేస్టేషన్‌లో పోలీసులు అరెస్టు చేశారు.

ఉగ్రవాది షఫిక్ ఏడు రోజుల కస్టడీకి అనుమతి

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబ దేవాలయం వద్ద జరిగిన బాంబు పేలుడు నిందితుడు షఫీక్‌కు సీఐడీ న్యాయస్థానం ఏడు రోజుల కస్టడీకి అనుమతించింది. దాదాపు 16 సంవత్సరాల నుంచి యమెన్‌లో అజ్ఞాతంలో ఉంటున్న షఫీక్‌ను ఇంటర్‌పోల్ సహకారంతో పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తదుపరి దర్యాప్తులో భాగంగా న్యాయస్థానం అనుమతితో సీఐడీ పోలీసులు ఉగ్రవాది షఫిక్‌ను ఏడు రోజుల కస్టడీకి తీసుకున్నారు.

ఈనాడు


కరవైన ఆరోగ్య ధీమా

నిరుపేదలకు ఆసరాగా 'ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ యోజన'కు శ్రీకారం చుడుతున్నట్లు ఇటీవలి బడ్జెట్‌లో వెల్లడించిన కేంద్రం తాజాగా మరికొన్ని 'స్వస్థ' నిర్ణయాలు ప్రకటించింది. దేశ వ్యాప్తంగా వైద్యారోగ్య రంగాన మానవ వనరుల లభ్యతను ఇనుమడింపజేసేందుకంటూ కొత్తగా 24 మెడికల్ కళాశాలల ఏర్పాటు సహా వివిధ పథకాల్లకై దాదాపు రూ.15 వేల కోట్లు ప్రత్యేకించామంటోంది. ఏకాయెకి 50 కోట్లమందికి మేలు చేయగలదంటున్న ఆరోగ్య బీమా నిమిత్తం కేంద్ర బడ్జెట్‌లో అత్తెసరుగా రూ.2,000 కోట్ల కేటాయింపు విస్మయపరుస్తోంది. 'నీతి ఆయోగ్' ముఖ్య కార్యనిర్వహణాధికారి అమితాబ్ కాంత్ అంచనా ప్రకారం, అయిదు లక్షల రూపాయల బీమా కోసం ఒక్కో కుటుంబానికయ్యే కిస్తు రమారమి రూ.1,100. పది కోట్ల కుటుంబాల ప్రయోజనార్థం భరించాల్సిన రూ.11 వేలకోట్ల మొత్తం, అదనపు విద్యాసుంకం రూపేణా ఒనగూడుతుందన్నది కేంద్రం ధీమా. జాతీయ స్థాయిలో ఆరోగ్య బీమా అమలుకయ్యే వ్యయంలో 40 శాతాన్ని రాష్ట్రాలే నిభాయించాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా చెబుతున్నారు. ఈసరికే విస్తృత ప్రాతిపదికన ఆరోగ్య బీమా పథకాలు అమలవుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు దీనిపై ఎలా స్పందిస్తాయో చూడాలి! కేంద్రం లోగడ రూ.30 వేల పరిమిత బీమా రక్షణతో ఆరంభించిన 'రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన' బాలారిష్టాల దశ దాటి విస్తరించలేకపోయింది. రెండు లక్షల రూపాయల వరకు ఆరోగ్య వ్యయ ధీమా ఏర్పరుస్తుందన్న ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, వ్యక్తిగత ప్రమాద బీమాకు ఉద్దేశించిన సురక్షా యోజన లాంటివి పరిమిత స్థాయిలోనే ఆగిపోయాయి. గతానుభవాలన్నింటినీ క్షుణ్నంగా మదింపు వేసి రాష్ట్రాల తోడ్పాటుతో 'ఆయుష్మాన్ భారత్'ను సజావుగా పట్టాలకు ఎక్కించే విధివిధానాల క్రోడీకరణ బాధ్యత 'నీతి ఆయోగ్'కు దఖలుపడింది. రెండు నెలల్లో ఆ కసరత్తు పూర్తయితే ఆగస్టు 15నాటికి 'పైసా చెల్లించకుండానే పేదలకు ఉచిత వైద్యం' కలను సాకారం చేయాలని కేంద్రం అభిలషిస్తోంది. క్షేత్రస్థాయి స్థితిగతులు చూడబోతే, ఎన్నో శంకలు ముమ్మరిస్తున్నాయి.


దేశంలో జబ్బుపడిన వ్యక్తికి చికిత్స చేయించే కుటుంబం ఆర్థికంగా చితికిపోయే దురవస్థకు మూలాలు ఎక్కడున్నాయో ప్రపంచ బ్యాంకు విశ్లేషణే నిగ్గుతేల్చింది. పౌరుల సొంత ఆరోగ్య వ్యయ అంతర్జాతీయ సగటు సుమారు 18 శాతం. అదే భారత్‌లో అనారోగ్యాన్ని వదిలించుకోవడానికయ్యే ఖర్చులో 63 శాతందాకా జనమే భరించాల్సి వస్తోంది. చైనా, జర్మనీ, ఇటలీ, గ్రీస్, హాంకాంగ్ వంటి చోట్ల సార్వత్రిక ఆరోగ్య రక్షణ పథకాలు కుటుంబాల సొంత ఖర్చును గణనీయంగా తగ్గించివేస్తున్నాయి. జనాభాలో అయిదో వంతుకైనా ఆరోగ్య బీమా లేని భారత్‌లో ఇంతలంతలవుతున్న చికిత్సా వ్యయాన్ని నిభాయించలేక ఏటికేడాది కోట్లాది కుటుంబాలు పీకలోతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత మిడిమిడి జ్ఞానంతో సొమ్ము చేసుకునేవాళ్ల పాలబడి అభాగ్య జనం విలవిల్లాడే దుస్థితిని కొనితెస్తోంది. ఒకే సిరంజితో ఇంజెక్షన్లు చేసి 41 మందికి హెచ్ఐవీ సోకడానికి పుణ్యం కట్టుకున్న యూపీ, ఉన్నావ్ జిల్లా ప్రబుద్ధుడి ఉదంతం ఆ వరసలో సరికొత్తది! ఈ అవ్యవస్థకు విరుగుడుగా నూతన కళాశాలల ఏర్పాటు మొదలు ప్రైవేటు రంగం తోడ్పాటు వరకు రాష్ట్రాల సహాయ సహకారాల్ని కేంద్రం ఆశిస్తోంది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో వైద్యకేంద్రాల అవతరణకు రాష్ట్రాలు చొరవ చూపితే- లక్షిత లబ్ధిదారులకు నిరంతరాయంగా ఆరోగ్య సేవలు సమకూర్చగలమంటోంది. కార్యాచరణ పరంగా భిన్నాంశాలను పరిగణిస్తూ అర్థవంతమైన సమన్వయంతో ఇంతటి బృహత్తర బాధ్యతను నిర్వర్తించడం ఆషామాషీ కాదు. మౌలిక సమస్యల్ని చక్కదిద్దకుండా యాభై కోట్లమందికి ఆయుష్మాన్ భారత్ ఎలా చేరువవుతుంది?

రోగులకు స్వస్థత చేకూర్చడంలో సుశిక్షిత వైద్య సిబ్బందిది కీలక పాత్ర. దేశవ్యాప్తంగా రమారమి 20 లక్షల మంది వైద్యులు, 40 లక్షల మంది నర్సులకు కొరత ఉందని 'జాతీయ ఆరోగ్య చిత్రణ' గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. ఉన్న సిబ్బందిలోనూ సగం మందికి పైగా వైద్యపరమైన ప్రామాణిక అర్హతలు కొరవడినవారే. కొత్తగా వైద్య కళాశాలలు నెలకొల్పినంతనే సిబ్బంది కొరత అమాంతం తీరిపోయేది కాదు. ఇంచుమించు 70 రకాల మందులుండాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అరకొరగానే మాత్రలు లభ్యమవుతుండటం, బహుముఖ దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను ప్రస్ఫుటీకరించేదే. స్థూల దేశీయోత్పత్తిలో సుమారు ఒక్క శాతాన్నే ఆరోగ్యపద్దుకు కేటాయిస్తున్న భారత్- రువాండా (10), అమెరికా (8), అఫ్గానిస్థాన్ (7) ప్రభృత దేశాల సరసన వెలాతెలా పోవడమే జనారోగ్యాన్ని ఖర్చు రాసేస్తోంది. వైద్యారోగ్య వ్యయాన్ని గణనీయంగా పెంచడంతోపాటు ప్రత్యామ్నాయ చికిత్సా విధానాలకూ దీటుగా నిలవడం, భారత్ తక్షణ కర్తవ్యం. జాతీయ అవసరాలకు తగ్గట్లు వైద్యుల్ని సహాయ సిబ్బందిని రూపొందించడం, మారుమూల ప్రాంతాలకూ ఆరోగ్య సేవలు విస్తరించడమన్నవి- ప్రణాళికాబద్ధంగా ప్రాథమ్య ప్రాతిపదికన ప్రభుత్వాలు చక్కబెట్టాల్సిన కనీస విధులు. ఆలోగా నిరుపేద రోగులకు స్వస్థత చేకూరేదెలా? 130 కోట్లమందికి సార్వత్రిక స్వాస్థ్య రక్షణను విస్తరించిన చైనాలో కాలినడకన సంచరించే వైద్యులు గ్రామీణుల ఆప్తులుగా మసలుతూ నిరంతర సేవలందిస్తున్నారు. ప్రాథమిక వైద్యసేవలు నీరోడుతున్న భారత్‌లో శాస్త్రీయతకు ఢోకాలేని హోమియో, ఆయుర్వేదం, యునానీ వంటి ప్రత్యామ్నాయ వైద్య విధానాలు ఎందరికో ఉపశమనం ప్రసాదించగలుగుతాయి. సంప్రదాయ వైద్య పద్ధతుల్ని సముచితంగా ప్రోత్సహించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని కనీస వసతులతో పరిపుష్టీకరిస్తే కోట్లాది అభాగ్యులు తెరిపిన పడతారు. 'ఆయుష్మాన్ భారత్' ఆవిష్కరణ క్రమంలో అదీ, తొలిమెట్టు!

కమ్ముకొస్తున్న చమురు మంటలు



చాలాకాలంపాటు తగ్గుముఖం పట్టి భారత ఆర్థిక వ్యవస్థకు ఊరట కలిగించిన చమురు ధరలు ఇప్పుడు పెరుగుతున్నాయి. ఈ నెల ఒకటిన పీపా బ్రెంట్ ముడిచమురు 'ఫ్యూచర్స్' ధర 70 డాలర్లు పలికింది. గడచిన నాలుగేళ్లలో చమురు ధర ఇంతగా పెరగడం ఇదే మొదటిసారి. గత ఆరు నెలల్లో ముడిచమురు ధరలు 55 శాతం పెరగ్గా, ఒక్క జనవరిలోనే ఆరు శాతం హెచ్చాయి. ఈ పరిణామానికి కారణమేమిటి? ఇదే పరిస్థితి మరి కొంతకాలం కొనసాగితే భారత్‌పై పడే ప్రభావం ఏమిటనే ప్రశ్నలు నేడు విధానకర్తల్నే కాదు, సామాన్యుల్నీ వేధిస్తున్నాయి. ఒక దశలో పీపా 28 డాలర్లకు పడిపోయిన చమురు ధర, ఇప్పుడు పైచూపులు చూడటం సహజంగా సంచలనం రేపుతోంది. గతంలో మితిమీరిన ఉత్పత్తి, చైనా నుంచి గిరాకీ తగ్గిపోవడం వల్ల అంతర్జాతీయంగా చమురుకు డిమాండ్ కోసుకుపోయి ధరలు క్షీణించాయి. చమురు ఉత్పత్తిని తగ్గిస్తే ధరలు పెరిగి ఉండేవి కానీ పశ్చిమాసియా రాజకీయ పరిస్థితుల వల్ల చమురు ఉత్పత్తి దేశాల సంఘం (ఒపెక్) ఆ పని చేయలేదు. పాశ్చాత్య దేశాలు చిరకాల ఆంక్షలు ఎత్తివేశాక మళ్ళీ విపణిలోకి వచ్చిన ఇరాన్ చమురు ఎగుమతులను పెంచి ఆర్థికంగా బలపడుతుందేమోనన్న భయంతో సౌదీఅరేబియా దాన్ని అడ్డుకోదలచింది. సౌదీ రాజకీయాల వల్లే ఒపెక్ చమురు ఉత్పత్తిని తగ్గించకుండా హెచ్చు స్థాయిలో కొనసాగించింది. మరోవైపు ఇరాన్ నుంచి కొత్తగా చమురు వచ్చిపడింది. ఇంకోవైపు అమెరికా నుంచి షేల్ ఆయిల్ కూడా మార్కెట్‌ను ముంచెత్తసాగింది. ఈ పరిస్థితిలోనూ ఒపెక్ తన ఉత్పత్తిని తగ్గించకపోవడంతో చమురు గిరాకీకన్నా సరఫరా ఎక్కువై ధరలు పడిపోయాయి. అటు ఇరాన్‌ను, ఇటు అమెరికన్ షేల్ ఆయిల్ పరిశ్రమను దెబ్బకొట్టాలని సౌదీ నాయకత్వంలోని ఒపెక్- చమురు ఉత్పత్తిని పెంచుతూ పోయింది. దీని దుష్ప్రభావాన్ని సౌదీ కూటమి సైతం అనుభవించక తప్పలేదు. ఈ దేశాలకు చమురు ఎగుమతుల వల్ల వచ్చే ఆదాయం నానాటికీ కుదించుకుపోయి బడ్జెట్ లోటు అధికమైంది. చమురు ధరలు ఇంకా దిగజారితే ఒపెక్ దేశాల ఆర్థిక మూలాలకే ఎసరు వస్తుంది. ఈ ప్రమాదాన్ని గుర్తించి ఇకపై చమురు ఉత్పత్తిని ఒక స్థాయికి పరిమితం చేయాలని 2016 నవంబరులో ఒపెక్ తీర్మానించింది. రష్యానూ ఒపెక్‌లో చేర్చుకోవడం, సంక్షుభిత లిబియా తన అవసరాల మేరకు చమురు ఉత్పత్తి చేయడానికి అనుమతించడం వంటి చర్యలూ తీసుకుంది. దీనివల్ల 2017 మధ్యకాలం నుంచి చమురు ధరలు మళ్ళీ ఊపందుకోసాగాయి. చైనాతోపాటు మిగతా ప్రపంచంలోనూ ఆర్థికాభివృద్ధి మెలమెల్లగా పుంజుకోవడంతో చమురుకు గిరాకీ ఇనుమడించి, ధరలు మళ్ళీ పైచూపులు చూడసాగాయి. అయితే, ధర ఏకంగా 70 డాలర్లు పలకడానికి ప్రధాన ప్రేరణ- అమెరికా డాలర్ విలువ తగ్గడమే! 2017 ఆరంభం నుంచే డాలర్ విలువ అన్ని ప్రధాన కరెన్సీలకన్నా తగ్గసాగింది. బలహీన డాలరే తమ విధానమని దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో అమెరికా ఆర్థికమంత్రి స్టీవెన్ మెనూచిన్ ప్రకటించినప్పటి నుంచి చమురు ధరలు పైకి ఎగబాకసాగాయి.



ఆధారం: ఒపెక్ గణాంకాలు

ఉత్పత్తిపై ప్రభావం

మరి ఈ ధరలు 70 డాలర్ల స్థాయిలో ఎంతకాలం కొనసాగుతాయన్నది ముఖ్యమైన ప్రశ్న. ఇక్కడ రెండు అంశాలను గమనించాలి. ఒకటి- చాలా కాలం తరవాత మొట్టమొదటిసారి చమురు దేశాలు తమ ఉత్పత్తిని తగ్గించి ధరలు పెంచాలని నిశ్చయించడం. చమురు హెచ్చుధర పలికితే సౌదీ ప్రభుత్వరంగ సంస్థ అరామ్ కో మార్కెట్ విలువ బాగా పుంజుకొంటుంది. అప్పుడు ఆ కంపెనీలో కొన్ని వాటాలను ప్రైవేటు సంస్థలకు అమ్మి పెట్టుబడులు సేకరించవచ్చునని సౌదీ ప్రభుత్వం ఆశిస్తోంది. చమురు ధరలు పెరగడం రష్యాలో పుతిన్ ప్రభుత్వానికి అవసరం. అమెరికాలో షేల్ చమురు ఉత్పత్తిలో పెట్టుబడులు పెట్టినవారికీ ఈ పరిణామం ఎంతో హర్షదాయకం.

బెంబేలెత్తిస్తున్న ధరలు

ప్రపంచ ఆర్థికవ్యవస్థ మళ్ళీ వృద్ధిబాట పట్టడమూ చమురుధరల వృద్ధికి దోహదం చేస్తోంది. వివిధ దేశాల్లో ఆర్థిక కార్యకలాపాలు జోరందుకొన్నందు వల్ల చమురుకు గిరాకీ పెరిగిందే తప్ప, కేవలం స్టాక్ మార్కెట్ల విజృంభణ వల్ల కాదు. అమెరికా, జపాన్, ఐరోపా దేశాల్లో వృద్ధిరేటు పుంజుకొనడంతో మిగతా ప్రపంచం మాంద్యం పరిస్థితుల నుంచి తేరుకొంటోంది. దీన్నిబట్టి చమురుకు గిరాకీ, ధరలు పెరగడం తాత్కాలికం కాదని, దీర్ఘకాలం కొనసాగే పరిణామమని భావించవచ్చు. దీనికి ఇతర కారణాలూ ఉన్నాయి. డాలర్ విలువ క్షీణించాలని అమెరికా కోరుకోవడం వీటిలో ప్రధానమైంది. దీని ప్రభావం ఎంతోకాలం ఉండకపోవచ్చు. అమెరికా ప్రభుత్వం వడ్డీరేట్లు పెంచుతున్నందువల్ల ఇతర దేశాలనుంచి భారీయెత్తున పెట్టుబడులు రానున్నాయి. దీనివల్ల డాలర్ విలువ అధికమై చమురు రేట్లు తగ్గవచ్చు. ప్రస్తుతానికి చమురు ధరలు పైకి ఎగబాకడం వల్ల అమెరికాలో షేల్ ఆయిల్ ఉత్పత్తి మళ్ళీ ఊపందుకొంటుంది. షేల్ ఉత్పత్తిదారులపై ఒపెక్‌కు ఎలాంటి అదుపూలేదు కాబట్టి విపణిలో గిరాకీకి మించిన చమురు ప్రవహించి మళ్ళీ ధరలు దిగివస్తాయి. ఇక ఒపెక్‌లోనూ పూర్తి క్రమశిక్షణ ఉంటుందనుకోవడం పొరపాటు. చమురు ధరలు నేడు పెరుగుతున్నందువల్ల కొన్ని ఒపెక్ దేశాలు తమకు నిర్దేశించిన కోటాకన్నా ఎక్కువ చమురు ఉత్పత్తిచేసి లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తాయి. వెనెజువెలా, నైజీరియా వంటి ఒపెక్ సభ్యులు గతంలోనూ ఇలాంటి పని చేశాయి. ఈ తరహా క్రమశిక్షణ రాహిత్యం గిరాకీకన్నా ఎక్కువ చమురు ఉత్పత్తికి దారితీసి ధరలను క్షీణింపజేస్తుంది. ఏదిఏమైనా చమురు ధర పీపాకు 30 డాలర్లకన్నా తక్కువకు పడిపోయే అవకాశం లేదు. అంతమాత్రాన చమురు దిగుమతులపై ఆధారపడాల్సిన భారత్ వంటి దేశాలు ఉదాసీనత వహించకూడదు.

భారత్ ముందున్న మార్గాలు

అంతర్జాతీయ విపణిలో చమురు ధరల సెగ భారత్‌కు ఇప్పటికే తగులుతోంది. దిల్లీలో ఈ ఏడాది జనవరిలోనే పెట్రోలు, డీజిల్ ధర లీటరుకు మూడు రూపాయల చొప్పున పెరిగింది. ఇది నిజంగా సామాన్యుడికి భారమే. ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపక మానదు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగితే సరకు రవాణా ఛార్జీలూ పైకెగబాకుతాయి, పారిశ్రామిక ఉత్పత్తి వ్యయమూ హెచ్చుతుంది. ఇదంతా ద్రవ్యోల్బణానికి దారితీసి పేద, మధ్య తరగతి ప్రజల జేబులకు చిల్లుపడుతుంది. ముడిచమురు ధర పీపాకు 10 డాలర్లు అధికమైతే, టోకు ధరల సూచీలో ద్రవ్యోల్బణం 1.3-1.4 పర్సంటేజి పాయింట్లు పెరుగుతుంది. వార్షిక కరెంటు ఖాతా లోటు జీడీపీలో 0.4 శాతం మేర ఎక్కువగా నమోదుకావచ్చు. ద్రవ్యోల్బణం వల్ల సామాన్యుల కొనుగోలు శక్తి హరించుకుపోయి, పరిశ్రమల ఉత్పత్తి వ్యయం పెచ్చరిల్లుతుంది. ఈ పరిణామాల వల్ల కంపెనీల లాభాలు కోసుకుపోయి, మొత్తం దేశ ఆర్థికాభివృద్ధి రేటు క్షీణించే ప్రమాదం ఉంది. చమురు పీపా ధర 70 డాలర్ల వద్ద నిలకడగా ఉంటే దేశ ఆర్థికాభివృద్ధి రేటు 40-50 బేసిస్ పాయింట్లు మేరకు తగ్గుతుందని అంచనా. ద్రవ్యలోటు, వడ్డీరేట్లను ప్రభుత్వం తగ్గించాలనుకున్నా అది సాధ్యపడకపోవచ్చు. వడ్డీరేట్లు తగ్గనిదే కంపెనీలకు చాలినన్ని పెట్టుబడులు లభించవు. దానివల్ల ఉపాధి సృష్టి కుంటువడుతుంది.

ఈ ప్రమాదాలను ఎదుర్కోవడానికి సమర్థ విధానాలను రూపొందించడం ఆవశ్యకం. మొదట సామాన్యుడిపై ధరల భారం తగ్గించడమెలా అని ఆలోచించాలి. పెట్రోలు, డీజిల్ ధరలపై రాయితీ ఇవ్వడం రివాజే కానీ, దానివల్ల చమురు మార్కెటింగ్ సంస్థలు నష్టాల్లో కూరుకుపోతాయి. దీనికి బదులు చమురు ఉత్పత్తులపై వేస్తున్న పన్నులు తగ్గించడం మంచి పరిష్కారమవుతుంది. భారత్‌లో ఈ పన్నులు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఇంతవరకు చెప్పుకొన్నవి స్వల్పకాలిక పరిష్కారాలే. అంతర్జాతీయంగా చమురు ధరలు షరా మాములుగా హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయి. భారత్ తన అవసరాల కోసం చమురు దిగుమతులపై ఆధారపడినంత కాలం ఆటుపోట్లకు గురికాక తప్పదు. స్వదేశంలో చమురు ఉత్పత్తి పెంచుకోవడం, ప్రత్యామ్నాయ ఇంధన వాడకాన్ని విస్తరించడం దీర్ఘకాలిక పరిష్కారాలవుతాయి. కొత్త చమురు నిక్షేపాల అన్వేషణకు అనువైన లైసెన్సింగ్ విధానాన్ని చేపట్టడంతోపాటు చైనా మాదిరిగా వ్యూహాత్మక చమురు నిల్వలను భారీయెత్తున సమీకరించాలి. చమురు ధరల పెరుగుదల పూర్తిగా ప్రతికూల సంకేతం కాదు. ప్రపంచ దేశాలు ఆర్థికంగా కోలుకొంటున్నందునే చమురుకు గిరాకీ, తద్వారా ధరలూ పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా వృద్ధిరేట్లు ఎగబాకాయంటే అర్థం- వస్తుసేవల వినియోగం పెరుగుతోందనే! దీనివల్ల భారతదేశ ఎగుమతులు పుంజుకోవడం ఖాయం. చమురు దిగుమతి బిల్లును తట్టుకోవడం అప్పుడు సులువవుతుంది. చీకటి వెన్నంటి వెలుగు ఉంటుందని మరచిపోకూడదు!

– డాక్టర్ మహేంద్రబాబు కురవ

వ్యయ నియంత్రణతో లబ్ధి

దేశంలో సాగు భూములకు, సౌరశక్తికి కొదవ లేదు. వర్షపాతమూ తక్కువ కాదు. కష్టపడి పనిచేసే వ్యవసాయదారులు లక్షలాదిగా ఉన్నారు. అధిక భాగం ఉష్ణమండల పంటలనే సాగుచేస్తున్నారు. అన్నీ బాగున్నా, పంట దిగుబడులు తగ్గుతున్నాయి. రుతుపవనాల వల్ల, వ్యవసాయ పనుల్లో లోటుపాట్ల కారణంగా దిగుబడులు తగ్గుతున్నాయని చెప్పడం ఇక్కడ పరిపాటిగా మారింది. ప్రపంచ సగటు దిగుబడులతో, ఇతర ఉష్ణమండలాలతో పోల్చుకుంటే- మన ఎకరా పంట దిగుబడులు తక్కువే! వ్యవసాయ పరిశోధనల్లో ఇంతకాలం పంటల రకాలపైనే దృష్టిపెట్టాం. అధిక దిగుబడులనిచ్చే వాటి రూపకల్పనకు పెద్దపీట వేశాం. ఇందులో కొంత పురోగతి ఉంది. గత 60 సంవత్సరాలతో పోల్చుకుంటే, ఇప్పుడు వాడుకలో ఉన్న రకాలు అధిక దిగుబడినిచ్చేవే. అందువల్ల లోగడ కంటే దిగుబడులు పెరిగాయి. వ్యవసాయ పెట్టుబడులూ ఎక్కువయ్యాయి. రసాయన ఎరువుల వాడకం అధికమైంది. వీటిలో చాలా వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవే. పంట పొలాల్లో సస్యరక్షణ అవసరాలు విస్తృతమయ్యాయి. చేలలో స్ప్రేయర్లు పనిచేయకుండా, పంటలు ఇళ్లకు చేరడం లేదు. అప్పటికీ, ఇప్పటికీ వ్యవసాయంలో కూలీ ఖర్చులు అనేక రెట్లు పెరిగాయి. వ్యవసాయ, ఉద్యాన దిగుబడులు 2-3 రెట్లకు మించి లేవు. ఈ ఉత్పత్తుల ధరలు హెచ్చినా, స్థిరత్వం లోపించింది. మార్కెటింగ్ సౌకర్యాలు తగినన్ని లేవు. దళారీ వ్యవస్థ పాతుకుపోయింది. ఇవన్నీ పైకి కనిపించేవి. తరచి చూస్తే కనిపించని లోటుపాట్లు మరెన్నో. పంట భూముల్లో, నీటి వినియోగంలో, సాగు పద్ధతుల్లో, పంటల సరళిలోనూ ఉన్నాయి. వీటిని సరిదిద్దుకోవాల్సి ఉంది.

పంటభూముల పరిస్థితి: సాధారణంగా పంట భూముల్లో సేంద్రియ కర్బనం ఒకటి నుంచి ఒకటిన్నర శాతం వరకు ఉంటుంది. వీటినే 'కండగల భూములు' అంటాం. ఈ కర్బనం- నేల స్వభావాన్ని, గుణగణాల్ని ప్రభావితం చేస్తుంది. వేరు వ్యవస్థ బలంగా ఉండటానికి, పోషకాల సమతుల్యతను కాపాడటానికి ఇది ఆదరువుగా ఉంటుంది. సాధారణంగా ఇది త్వరగా పెరిగేది, తరిగేది కాదు. కానీ, ఉష్ణమండలంలోని పంట భూముల్లో ఏటా కొంత హరించుకుపోతూ ఉంటుంది. ఎండలకు నేల వేడెక్కుతూ, తేమతో పాటు కొంత కర్బనం హరించుకుపోతుంది. దీన్ని తిరిగి అనువైన వ్యవసాయ పద్ధతుల ద్వారానే పూడ్చుకోవాలి. పంటభూముల్ని ఎక్కువకాలం ఖాళీగా ఉంచకూడదు. భూమిలోని సూక్ష్మ జీవులకు ముప్పు వాటిల్లకుండా- రకరకాల పంటల్ని విడిగా లేదా అంతర పంటలుగా పెంచుతూ భూమి ఆరోగ్యాన్ని భద్రపరచాలి. పంటభూములు చాలా ప్రాంతాల్లో కొద్దిగా ఏటవాలుగా ఉండి, పై పొర మట్టి వర్షంనీటితో పాటు పల్లం ప్రాంతాలకు కొట్టుకుపోతుంది. ఈ మట్టి విలువైనది. దీనిలో మొక్కలకు కావాల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. పైపొర మట్టితో పాటు సేంద్రియ కర్బనం లోపించడంతో, పంట భూములు నిర్వీర్యమవుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించకుండా ఏటా రసాయన ఎరువుల మోతాదును పెంచుకుపోవడం సరికాదు.



సాగు తీరు - కొత్త పోకడలు

రసాయనాల వినియోగ రీతి: రసాయన ఎరువుల్ని, పురుగుమందుల్ని నిషేధించాలని దేశ అవసరాలు గుర్తెరిగిన వారెవరూ చెప్పరు. వాటిని సరైన సమయంలో వాడుతూ, నీటి వాడకాన్ని అదుపుచేయగలగాలి. రైతులకు దీనిపై అవగాహన కలిగించాలి. కొద్దికొద్దిగా ఎరువుతో పాటు, తరచుగా నేలలో తేమకో సమే నీరుపెట్టడాన్ని మన రైతులు అలవాటు చేసుకోవాలి. నేల, నీరు వినియోగం తీరుతెన్నుల్ని వారికి వ్యవసాయాధికారులు తెలియజెప్పాలి.

సేద్యం ఖర్చుల తగ్గింపు: వ్యవసాయ పనుల్లో కూలీ ఖర్చులు పెరిగిపోయాయి. దీనికి యాంత్రీకరణ తప్ప మరొక దారి లేదు. అన్ని దేశాల్లోనూ వ్యవసాయంలో యాంత్రీకరణే ప్రధాన పాత్ర వహిస్తోంది. మనం ఇది గ్రహించి తగిన విధంగా వ్యవహరించాలి.

ఉత్పత్తుల మార్కెటింగ్: ప్రతి గ్రామంలోనూ గోదాముల నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. వీటిని ప్రైవేటు సహకార సంస్థలే బాగా నిర్వహించగలవు. ఉద్యాన పంటలకు శీతల గిడ్డంగుల్ని ప్రతి మండలంలోనూ ఏర్పాటు చేయాలి. ఇవి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో కొనసాగాలి. అలాగే చీడపీడల్ని తట్టుకోగల వంగడాల సృష్టి, సాగు పద్ధతులపై ప్రభుత్వం ప్రచారం సాగించాలి.

వినియోగదారులతో పాటు రైతుల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి. లోగడ వినియోగదారుణ్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర నిర్ణయించేవారు. వ్యవసాయ పెట్టుబడుల దృష్ట్యా, మద్దతు ధర పెంచాలని కేంద్రానికి వినతులు పంపినా, పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇలాంటి పరిస్థితులు కొనసాగడం శ్రేయస్కరం కాదు. రైతుకు గిట్టుబాటు లభించేలా సహేతుక మద్దతు ధరల్ని నిర్ణయించాలి. ధాన్యం కొనుగోళ్లను ఇ-మార్కెటింగ్ ద్వారా సాగించాలి. అప్పుడే వ్యవసాయం లాభసాటిగా ఉండి, రైతుల రాబడులు పెరుగుతాయి.

– డాక్టర్ మొవ్వ రామారావు

ఈనాడు లేఖలు

క్రికెట్ భవిష్యత్తుకు భరోసా

యువ ప్రతిభకు తోడు అమోఘమైన సాధన, అచంచల విశ్వాసం, దీటైన మార్గదర్శకత్వం తోడైతే ఎంతటి అద్భుత ఫలితాలు సాధించవచ్చో 19 ఏళ్లలోపు వయోపరిమితిలోని భారత క్రికెట్ జట్టు సాధికారికంగా నిరూపించింది. చరిత్రలో నాలుగోసారి ప్రపంచ కప్పు గెలుచుకున్న యువభారత్ జట్టు భవిష్యత్తుకు ఆశాదీపం. మొత్తం టోర్నీలో ఓటమి అన్నది లేకుండా వరస విజయాలు సాధించడం పృథ్వీషా సేన సత్తాను చాటుతోంది. అపార అనుభవశాలి, దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ శిక్షణలో యువ క్రికెటర్లు ఎంతగానో రాటుతేలారు. విశ్వవిజేతలుగా ఆవిర్భవించిన బృందంలోని సభ్యులందరూ పేరుపేరునా అభినందనీయులు. ప్రస్తుతం విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా సభ్యులందరూ అద్భుతంగా రాణిస్తున్నారు. వీరిలో కొందరు ఆటకు వీడ్కోలు పలికినా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి యువకులు సిద్ధంగా ఉన్నారు. ఇదే భారత క్రికెట్‌కు కొత్త భరోసా!

- వినోద్ కుమార్ సుద్దాల, ఉస్మానియా వర్సిటీ, హైదరాబాద్

పేరులోనే సంక్షేమం

వివిధ కళాశాలల్లో చదివే దళిత, గిరిజన, వెనకబడిన తరగతుల విద్యార్థుల కోసం పలు సంక్షేమ వసతి గృహాల్ని తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో అనేక లోటుపాట్లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి పట్టణాల్లో చదువుకుంటున్న అనేకమంది నానా అగచాట్ల పాలవుతున్నారు. అవి సంక్షేమ హాస్టళ్లనే పేరే కానీ, ఎటుచూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. అక్కడి మౌలిక వసతుల పరిస్థితి గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. ఆయా 'వసతి' గృహాల్ని చాలావరకు అద్దె గదుల్లో నడుపుతున్నారు. అగ్గిపెట్టెల్లా ఉండే ఆ ఇరుకిరుకు గదుల్లోనే విద్యార్థులెందరో మగ్గిపోతున్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి, సమస్యల సత్వర పరిష్కారానికి ఉపక్రమించాలి.

- ఎ.మనోజ్, వెల్గొండ, జగిత్యాల జిల్లా

అజాతశత్రువు

లోకంలో 'ఇతడికి అతడు మిత్రుడు; అతడికి ఇతడు శత్రువు' అనే నియమం లేదు. వ్యవహార సరళి వల్లనే మిత్రులైనా శత్రువులైనా ఏర్పడతారని 'పంచతంత్రం' చెబుతోంది. ప్రతి మనిషికీ మిత్రులుంటారు. కొంతమందికి శత్రువులూ ఉంటారు. కొద్దో గొప్పో విభేదాలు, అభిప్రాయ భేదాలు ఉన్నంత మాత్రాన ఎవర్నీ శత్రువులుగా పరిగణించనక్కర్లేదు. సాధారణంగా వ్యక్తి స్వభావం, కార్యశైలి, నడవడిక కారణంగా మిత్రులుగాని, శత్రువులుగాని ఏర్పడతారు. అకారణంగా ద్వేషం, ఈర్ష్య, వైరం పెంచుకొనేవారూ లోకంలో కనిపిస్తారు.


శత్రువులని తెలిసినా- వారి పట్ల ప్రతీకారం, పగ లేకపోవడం మహాత్ముల లక్షణం. సజ్జనుణ్ని 'అతడు అజాతశత్రువు' అనడం వింటుంటాం. అంటే, శత్రువులు లేనివాడని అర్థం. అందరికీ శత్రువులు ఉండరు. తనను విరోధిగా భావించేవారితోనూ సద్భావంతో ప్రవర్తించడం ఎంతో గొప్ప స్వభావం. అటువంటివారే అజాతశత్రువులు. ఆ మాట వినగానే అందరికీ ముందుగా ధర్మరాజు గుర్తుకొస్తాడు. ఆయన పట్ల ఈ విశేషణం సార్థకం.

ధర్మజుడికి ఎవరితోనూ వైరం లేదు. భీముడిపై దుర్యోధనుడికి, అర్జునుడిపై కర్ణుడికి ఈర్ష్యాద్వేషాలున్నాయి తప్ప- ధర్మజుడి పట్ల కౌరవ పక్షంలో వ్యక్తిగతంగా ఎవరికీ శత్రుభావన లేదు. ఆయనా వైరుల పట్ల పగ సాధించాలని అనుకోలేదు. ప్రతీకారంతో ఎప్పుడూ రగిలిపోనూ లేదు. ధర్మరాజు దృష్టిలో, శత్రువులు సైతం తన సహానుభూతి పొందడానికి పాత్రులే! అపకారికి కూడా ఉపకారం చేయడమే ఆయన మహోన్నత స్వభావం.

'ఘోష యాత్ర' నెపంతో పాండవుల్ని కవ్వించాలని వెళతాడు దుర్యోధనుడు. అతణ్ని ఇతరులు బంధిస్తే, విడిపించాలని సోదరుల్ని ఆదేశిస్తాడు ధర్మరాజు. 'కాగల కార్యం గంధర్వులే తీర్చారు' అని వారు ప్రతికూల భావాన్ని వ్యక్తం చేసినప్పుడు, ఆయన విభేదిస్తాడు. శత్రువునైనా ప్రీతితో కాపాడాలని, దానికి ఏ ధర్మాలూ సాటిరావని వారికి నచ్చజెబుతాడు.

ధర్మరాజుకు తల్లిదండ్రులు పెట్టిన పేరు- యుధిష్ఠిరుడు. స్వభావపరంగా ఆయన సాధించుకున్న పేరు ధర్మరాజు. ఆ పుట్టుడు పేరు కంటే ఈ పెట్టుడు పేరే లోక వ్యవహారంలో ఎక్కువగా స్థిరపడింది.

పాండవుల వద్దకు రాయబారిగా సంజయుణ్ని వెళ్లమంటాడు ధృతరాష్ట్రుడు. 'ధర్మరాజు



అంతర్యామి

అజాతశత్రువు, ధర్మపరాయణుడు. జూదంలో మోసం చేసి మనం పరాభవించినా నియమానికి కట్టుబడి వెళ్లిపోయాడు. ఒక్క ధర్మరాజు పేరు చెబితే నాకు కలిగే భయం ఎంతటిదో చెప్పలేను! తపోదీక్షలో ఉండే ఆయనకే క్రోధం కలిగిందంటే, అది ఎదుటివారిని నాశనం చేసి తీరుతుంది. అందువల్ల నేను శాంతినే కోరుతున్నానని పాండవులకు చెప్పండి' అంటాడు.

సంజయుడి రాయబార సరళికి భిన్నంగా, ధర్మరాజు అత్యంత యుక్తిగా సమాధానమిస్తాడు. వజ్రాన్ని వజ్రంతోనే కోయాలన్నట్లు ఆయన ప్రసంగం సాగుతుంది. ధృతరాష్ట్రుడి వద్దకు సంజయుడు తిరిగి వెళ్లి 'వశీకృత చిత్తుడు, మెత్తని పులి' అని ధర్మజుడి గురించి వ్యాఖ్యానిస్తాడు. లోలోపల అగ్నికీల చెలరేగుతున్నా, నిండుకుండలా కనిపించడం ధర్మరాజుకే చెల్లింది.

శ్రీకృష్ణుణ్ని కౌరవుల వద్దకు దౌత్యానికి పంపినప్పుడు కూడా ధర్మరాజు స్థిరచిత్తం కనబరుస్తాడు. 'వైరంతో వైరాన్ని ఉపశమింపజేయలేం' అంటాడు. ఎవరితోనూ విరోధం లేనివాడే ప్రశాంతంగా జీవించగలడని చెబుతాడు. శత్రువు ఒక్కడున్నా, తాచుపాము ఇంట్లో ఉన్నట్లేనని మనోగతం బయటపెడతాడు.

ధర్మజుడు ధీరోదాత్తుడు, వివేకవంతుడు, యశోధనుడు, శరణాగత రక్షకుడు, రాజనీతి సంపన్నుడు. అందుకే 'ఆయన ధర్మరాజు' అనే మాట లోకంలో పుట్టింది!

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు

వాతావరణ మార్పులతో పంటలపై ప్రభావం

- ఉష్ణోగ్రత పెరుగుదలతో తగ్గుతున్న దిగుబడి
- వాతావరణ అంశాలపై గ్రామాలకు సలహా సేవలుండాలి
- గ్రామీణ యువత, మహిళల భాగస్వామ్యం కీలకం
- రైతులకు ఆర్థిక సాయం, అధునాతన పరిజ్ఞానం అందాలి
- 'మేనేజ్' సంస్థ అధ్యయనంలో వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

"వాతావరణ మార్పులనేవి నిరంతరం కొనసాగే ప్రక్రియ.. దీనికి ఏదో ఒక పరిష్కారం కనుక్కోవడం కాకుండా, రైతులను, గ్రామీణ సమాజాన్ని వీటిని అధిగమించేలా ఎప్పటికప్పుడు ఏర్పడే నూతన పరిస్థితులకు అనుగుణంగా సన్నద్ధం చేయాలి" అని 'జాతీయ వ్యవసాయ విస్తరణ, నిర్వహణ సంస్థ'(మేనేజ్) సూచించింది. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పంటలపై పడుతున్న ప్రభావంపై ఈ సంస్థ మహారాష్ట్రలోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఇతర జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థలు జరిపిన అధ్యయనాల గురించి ఈ సందర్భంగా ప్రస్తావించింది. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని 3 గ్రామాలు, ఏపీలోని కర్నూలు జిల్లాలో మరో 3 గ్రామాలు, ఎంపీలో 8, మహారాష్ట్రలో 35 గ్రామాల్లో



మహారాష్ట్రలోని సంగమ్‌నేర్ గ్రామంలో రైతు కుటుంబాల మహిళలతో మాట్లాడుతున్న మేనేజ్ పరిశోధకురాలు

'జాతీయ మెట్ట పంటల పరిశోధనా కేంద్రం, నాబార్డు తదితర సంస్థలు వాతావరణ మార్పులపై గతంలో అధ్యయనాలు చేశాయి. వీటిని స్ఫూర్తిగా తీసుకుని మహారాష్ట్రలో తాజాగా 'మేనేజ్' అధ్యయనం నిర్వహించింది. 'వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం, సలహా సేవలు-భవిష్యత్తులో అనుసరించాల్సిన విధానాలు, ప్రభావం' అనే పేరుతో అధ్యయన నివేదికను తాజాగా విడుదల చేసింది. ముఖ్యాంశాలివీ..

- ఉష్ణోగ్రత సాధారణంకన్నా ఒక డిగ్రీ అదనంగా పెరిగితే గోధుమ పంట దిగుబడి ఏటా గరిష్ఠంగా అర కోటి టన్నుల వరకూ తగ్గే ప్రమాదముందని భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్) నిర్వహించిన పరిశోధనల్లో వెల్లడైంది.
- సాధారణంకన్నా 2 డిగ్రీలు పెరిగితే వరి ధాన్యం దిగుబడి హెక్టారుకు 10 క్వింటాళ్ల వరకూ తగ్గుతుంది.
- రాజస్థాన్‌లో 2 డిగ్రీలు అదనంగా పెరగడం వల్ల సజ్జ పంట దిగుబడి 10 నుంచి 15 శాతం తగ్గినట్లు గుర్తించారు.
- మధ్యప్రదేశ్‌లో 1998 నుంచి పోల్చి చూస్తే సగటున 3 నుంచి 3.5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడం వల్ల సోయాచిక్కుడు పంట దిగుబడి 5 శాతం వరకూ తగ్గింది.
- గుజరాత్, మహారాష్ట్రల్లోని తీర ప్రాంతాల్లో వాతావరణ మార్పుల వల్ల పంటల సాగుపై ప్రభావం అధికంగా పడింది.
- ఖరీఫ్‌లో వర్షానికి, వర్షానికి మధ్య ఎక్కువ రోజులు అంతరాయం ఏర్పడటం, రబీ సీజన్‌లో సగటు ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల పంటల దిగుబడి తగ్గుతోంది.
- వడగాలులు వీచే ప్రాంతాల్లో పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గి రైతులు ఆదాయం కోల్పోతున్నారు. వడదెబ్బ కారణంగా కోళ్ల ఫారాల్లో కోళ్లు చనిపోయి నష్టాలు పెరుగుతున్నాయి.
- వాతావరణ కాలాలు మారే కొద్దీ సముద్రంలో చేపల ఉత్పత్తిపైనా ప్రభావం పడుతోంది.
- రైతుల్లో కొందరిని తొలుత ఎంపిక చేసి వారికి వాతావరణ మార్పులను ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై శిక్షణ ఇవ్వాలి. వారి ద్వారా ఆయా గ్రామాల్లో ఇతర రైతులకు శిక్షణ కొనసాగించే విధానం ఉండాలి. తూర్పు ఆఫ్రికాలోని ఉగాండా, కెన్యా, టాంజానియా, రువాండా దేశాల్లో అధిక ఎండల సమయంలో పాల ఉత్పత్తి పెంచడానికి పశువుల సంరక్షణపై 400 మంది రైతులకు ఇచ్చిన శిక్షణ సత్ఫలితాలనిచ్చింది. వాతావరణ మార్పులను అధిగమించడానికి ఇలా రైతుల నుంచి రైతులకు అనే విధానమే సులభమార్గం.
- మహారాష్ట్రలో 2030 నాటికి సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల వరకూ పెరగనుందని అంచనా. గత ఐదేళ్లలో సైతం ఈ రాష్ట్రంలో తీవ్రమైన కరవులు ఏర్పడ్డాయి.
- ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా చెరకు పంట దిగుబడి 30 శాతం వరకూ తగ్గే ప్రమాదముంది.
- దేశంలో వాతావరణ మార్పుల వల్ల తీవ్ర ప్రభావం పడే తొలి 100 జిల్లాల్లో ఏడు మహారాష్ట్రలోనే ఉన్నాయి. పుణె, అహ్మద్‌నగర్ జిల్లాల్లోని కరవు పీడిత గ్రామాల్లో ప్రజలతో మాట్లాడినప్పుడు అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పురుషుల వద్దే సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. మహిళ దగ్గర తప్పనిసరిగా ఫోన్ ఉంటే దానికి నిత్యం వాతావరణ సమాచారం, సలహాలు పంపేలా ఏర్పాటు ఉండాలి. వారానికి కనీసం రెండుసార్లు స్థానిక భాషలో వాతావరణ సమాచారం పంపాలి.
- అంతగా భూసారం లేని ప్రాంతాల్లో ఎక్కువగా దానిమ్మ తోటలు సాగు చేస్తున్నారు. వీరికి ముందస్తుగా వాతావరణ మార్పులపై సమాచారం అందించే ఏర్పాట్లు ఉండాలి.
- పాడి పశువులను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపైగానీ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి చాలామంది రైతులకు కనీస సమాచారం తెలియదని తేలింది. ఈ లోపాలను సవరించాలి.
- వరదలు, వర్షాభావం, వడగాలులు, వడగండ్లు వంటి విపత్తుల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రత్యామ్నాయంగా రైతులేం చేయాలి, వారిని ఎలా ఆదుకోవాలనే అంశాలపై ప్రతి రెవెన్యూ తాలూకా స్థాయి పక్కాగా ప్రణాళికలు ముందే సిద్ధం చేయాలి.
- పంటలను కాపాడుకునేందుకు శాస్త్రీయంగా ఏం చేయాలన్న దానిని రైతులకు ప్రత్యక్షంగా వివరించేందుకు ప్రతి తాలుకాలో ఒకచోటయినా.. శాస్త్రవేత్తలే 'ప్రదర్శనా క్షేత్రం' పేరుతో నేరుగా పంట పండించాలి. దీనిని చూసి చుట్టుపక్కల రైతులు స్ఫూర్తి పొందుతారు.



వరదకాలువలో నీరు లేక నెర్రలిచ్చిన పొలం (అంతరచిత్రంలో) నారుమడి దశలోనే ఎండుతున్న వరినారు

మడులు తడారి.. ఆశలు ఆవిరి

ఎస్సారెస్పీ వరద కాల్వపై నమ్మకంతో వేసిన నారు.. మడిని దాటలేదు. గతేడాది యాసంగి పంటకు వరద కాల్వ నుంచి రెండు తడులకు నీళ్లు ఇచ్చారు. అదే ఆశతో ఈ ఏడాది నారుమళ్లు పోసుకున్నారు. ప్రస్తుతం జలాశయంలో తగినంత నీరు లేకపోవడంతో ఈ కాల్వకు నీళ్లిచ్చే పరిస్థితి లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వరద కాల్వ వెంట అన్ని మండలాల్లో వేలాది మంది రైతులు ఇలానే నారు దశలోనే వదిలేశారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్ గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

– ఈనాడు, కరీంనగర్

తెలుగు విద్యార్థులకు దేశవ్యాప్తంగా వైద్య సీట్లు

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు శుభవార్త. వచ్చే విద్యా సంవత్సరం నుంచి దేశంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 15 నుంచి 20 శాతం సీట్లకు మన విద్యార్థులు పోటీపడొచ్చు. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి జాతీయస్థాయిలో నీట్ నిర్వహిస్తుండటం, 15 శాతం జాతీయ కోటాలో తెలుగు రాష్ట్రాలు చేరడమే ఇందుకు కారణం. ఎయిమ్స్, జిప్‌మర్ సీట్లకు మాత్రమే ఏపీ, తెలంగాణ విద్యార్థులు ఏటా పోటీపడుతూ సీట్లు దక్కించుకుంటున్నారు. దేశంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వారు పోటీపడి ప్రవేశాలు పొందవచ్చు. అందుకు ఆయా రాష్ట్రాలు తమ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 15 శాతం సీట్లను జాతీయ కోటాకి ఇవ్వాలి. తెలుగు రాష్ట్రాలు ఆర్టికల్ 371డీ కారణంగా ఇప్పటివరకు జాతీయ కోటాలో చేరలేదు. అంటే ఇతర రాష్ట్రాల వారికి ఇక్కడ ప్రవేశాలు దక్కవు. అలాగే ఇతర రాష్ట్రాల్లో మనకు అవకాశం లేదు. జాతీయ కోటాలో చేరతామని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అంగీకరించగా కేంద్రం ఆమోదించింది. దీంతో 2018-19 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఉన్న 15 శాతం సీట్లకు తెలుగు విద్యార్థులు పోటీ పడనున్నారు. దీని వల్ల మన విద్యార్థులు భారీగా ప్రయోజనం దక్కుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

లాభమే ఎక్కువ

జాతీయస్థాయి కోటా (15 శాతం) కింద తెలంగాణ నుంచి 165, ఏపీలో 285 ఎంబీబీఎస్ సీట్లు ఇతర రాష్ట్రాల వారికి వదులుకోవాల్సి ఉంటుందని అంచనా. అదే సమయంలో దేశవ్యాప్తంగా జాతీయ కోటా కింద 7,300 వరకు సీట్లు అందుబాటులోకి వస్తాయి. గత ఏడాది నీట్‌లో మొదటి 1000 ర్యాంకుల్లో 16 శాతం తెలంగాణ, ఏపీ విద్యార్థులకే దక్కాయని శిక్షణ సంస్థల నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది కనీసం 20 శాతానికి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 7,300 సీట్లలో 20 శాతమంటే 1,460 సీట్లు మన విద్యార్థులకు దక్కుతాయని చెబుతున్నారు. 15 శాతమే అనుకున్నా దాదాపు 1100 సీట్లు వస్తాయంటున్నారు.

ఏపీలో తగ్గిన పరీక్ష నగరాలు

నీట్ పరీక్ష ఈ ఏడాది మే 6న ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం,విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలులో జరగనుంది. గతేడాది ఉన్న చీరాలను తొలగించారు. తెలంగాణలో యథావిధిగా హైదరాబాద్, వరంగల్‌లో పరీక్ష జరగనుంది.

సాగు వ్యయాన్నీ, కుటుంబ శ్రమనూ కలిపే
ఎంఎస్‌పీ నిర్ణయిస్తాం: జైట్లీ

దిల్లీ

వాస్తవ సాగు వ్యయాన్ని, రైతు కుటుంబం పడ్డ శ్రమకు చెల్లించని విలువనూ కలిపి పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణయిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. ఉత్పాదక వ్యయం మీద 50% ఎక్కువ మొత్తాన్ని మద్దతు ధరగా నిర్ణయిస్తామని చెప్పారు. 2019 ఖరీఫ్ పంటలకు పెట్టుబడిపై 1.5 రెట్లు ఎంఎస్‌పీగా లభించేలా చూస్తామని ఇటీవల కేంద్ర బడ్జెట్లో ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఉత్పాదక వ్యయ మదింపు సూత్రాన్ని వెల్లడించాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాజ్యసభలో ఈ అంశంపై ఆయన మాట్లాడారు.

కేంద్ర బడ్జెట్‌పై చర్చకు ఆయన సమాధానమిస్తూ మద్దతు ధరలను ప్రస్తావించారు. ఈ ధరల్ని ప్రభుత్వం నిర్ణయిస్తున్నా రైతులకు మాత్రం అందడం లేదని అంగీకరించారు. దీనిని దృష్టిలో పెట్టుకునే పెట్టుబడిపై 50% ఎక్కువ డబ్బు రైతు చేతికి వచ్చేలా బడ్జెట్లో ప్రకటించామన్నారు.

యూపీఏలో ఆర్థిక రంగం ఘోరంగా ఉండేది

యూపీఏ పదేళ్ల పాలనలో పి.చిదంబరం చేతుల్లో ఆర్థిక రంగం ఘోరంగా ఉండేదని జైట్లీ వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితి నుంచి ఇప్పుడు ప్రపంచంలోనే మెరుగైన వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని చెప్పారు. రెండు ప్రభుత్వాల పాలనలో వ్యత్యాసాన్ని చెప్పడానికి పలు గణాంకాలను ప్రస్తావించారు. భారతీయ కంపెనీలు తమ మిగులు నిధుల్ని తిరిగి పెట్టుబడులుగా పెట్టడానికి వీలుగా కార్పొరేట్ పన్నును తగ్గించాలని చిదంబరమే ప్రతిపాదించి, ఇప్పుడు దానికి విరుద్ధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కూర్చొనే స్థానం బట్టి వైఖరి మారిపోతుందా అని ప్రశ్నించారు. ఆధార్, జీఎస్టీ, కార్పొరేట్ పన్నుల విషయంలో గతంలో ఒకలా, ఇప్పుడు మరో విధంగా కాంగ్రెస్ మాట్లాడుతోందన్నారు. మినహాయింపుల్ని ఎత్తివేసినప్పుడు పన్నుల్ని తగ్గించాల్సిన అవసరం ఉందని జైట్లీ చెప్పారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

- ఆ రాష్ట్రానికిచ్చిన ఇతర హామీలనూ నెరవేర్చాలి
- ట్విటర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

దిల్లీ: రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని నెరవేర్చాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రానికి ఇచ్చిన ఇతర వాగ్దానాలనూ వెంటనే అమలు చేయాలని కోరారు. "ఆంధ్రప్రదేశ్ ప్రజల న్యాయమైన డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తోంది. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణం తదితరాలన్నిటినీ సాధించుకోవటానికి అన్ని పార్టీలు ఏకతాటిపైకి రావాలి" అంటూ ట్వీట్ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రాయితీ బియ్యం పట్టివేత
మంచిర్యాల జిల్లాలో 20 టన్నులు, వరంగల్ జిల్లాలో 50 టన్నులు

తాండూరు, న్యూస్‌టుడే: భారీ ఎత్తున రాయితీ బియ్యాన్ని జనగామ జిల్లా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా మంచిర్యాల జిల్లా తాండూరు మండలం మాదారం పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. 20 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా, మరో 50 టన్నులను జనగామ జిల్లాలోనే జప్తు(సీజ్) చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున రేషన్ బియ్యం మహారాష్ట్రకు తరలిస్తున్నారని తాండూరు సీఐ జనార్దన్‌రెడ్డికి వచ్చిన సమాచారం మేరకు మాదారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 20 టన్నుల రేషన్ బియ్యంతో ఉన్న లారీని అడ్డుకుని వాహనాన్ని ఠాణాకు తరలించారు. లారీలోని ముగ్గురు వ్యక్తులను విచారించగా బియ్యం అక్రమ రవాణా రాకెట్ విషయం తెలిసింది. వీరిచ్చిన సమాచారం మేరకు మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధం చేసిన మరో 50 టన్నులను జనగామ జిల్లాలో జప్తు చేశారు. ఈ కేసులో ఈ జిల్లాకు చెందిన మోతం రాజు, మోతం జంపయ్య, సిరిగిరి శంకర్, మోతం గురువయ్య, పవన్, మహారాష్ట్రకు చెందిన కోదండంవార్ ప్రదీప్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అటవీ 'వ్యాయామశాలలు'

- ప్రతి జిల్లాకు ఒక పట్టణప్రాంత అటవీపార్కు
- ఓపెన్‌జిమ్ ఏర్పాటు.. అటవీశాఖ నిర్ణయం

ఈనాడు-హైదరాబాద్: రాజధాని శివారు ప్రాంతాలతో పాటు జిల్లాల్లో కొన్నిచోట్ల పట్టణ ప్రాంత అటవీ పార్కులను ఏర్పాటుచేస్తున్న అటవీశాఖ వాటిని తెలంగాణవ్యాప్తంగా విస్తరించాలని, కొత్తగా జిల్లాకు కనీసం ఒకటి చొప్పున వీటిని నెలకొల్పాలని నిర్ణయించింది. పచ్చదనం, పిల్లల ఆటపాటలు, యోగా చేసేందుకు సౌకర్యాల కల్పనతో పాటు పార్కుకు వచ్చేవారు శారీరక కసరత్తు చేసేందుకు వీలుగా ఓపెన్ జిమ్‌లను కూడా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసేందుకు సిద్ధం అవుతోంది. ప్రతి జిల్లాలో అర్బన్ పార్కు ఏర్పాటుతో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటుచేయాలని అటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారి (పీసీపీఎఫ్) ప్రశాంత్‌కుమార్ ఝా అధికారుల్ని ఆదేశించారు. అన్నిజిల్లాల అటవీ అధికారులతో సచివాలయం నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో అడవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వన్యప్రాణుల సంరక్షణపై చర్చించారు. అడవుల్లో నీటివనరుల లభ్యతపై ఈనెల 24 నుంచి 26 వరకు సర్వే చేయనున్నట్లు పీసీసీఎఫ్ ప్రకటించారు. మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల అనుమతులపైనా చర్చించారు.

ఎల్లెడలా సంఘీభావం

- ఏపీ డిమాండుకు మద్దతిచ్చిన అడ్వాణీ
- ప్రత్యేక హోదాకే సై అన్న రాహుల్
- ఎంపీలకు తృణమూల్, సీపీఐ, సమాజ్‌వాదీ, తెరాస బాసట
- చివరి రోజూ ఆందోళనల పర్వం

ఈనాడు, దిల్లీ: విభజన హామీల అమలు కోసం పార్లమెంటులో తెలుగుదేశం ఎంపీలు చేస్తున్న ఆందోళనకు ఎల్లెడలా మద్దతు లభిస్తోంది. ప్రతిపక్షాలతోపాటు అధికార భాజపాలోనే అత్యంత సీనియరు నాయకుడైన అడ్వాణీ అనూహ్యంగా అండగా నిలిచారు. ఇక తృణమూల్, సీపీఐ, సమాజ్‌వాదీ, తెరాస తదితర పార్టీల నేతలంతా ఆంధ్రప్రదేశ్ డిమాండు సహేతుకమైనదేనని ముక్తకంఠంతో పేర్కొన్నారు. మరోవైపు రెండు సభల్లో ఎంపీల ఆందోళన మరింత ఉద్ధృతమైంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నంకల్లా వాయిదా పడగా రాజ్యసభ బడ్జెట్‌పై జైట్లీ సమాధానం కోసం సాయంత్రందాకా జరిగింది. అప్పటిదాకా ఎంపీలు ఆందోళన చేస్తూనే ఉన్నారు. చివరకు ప్రసంగించిన జైట్లీ మళ్లీ ఉసూరుమనిపించారు. దీంతో ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఆయన ట్విట్టర్‌లో స్పందించారు.

లోక్‌సభ వాయిదా..

శుక్రవారం ఉదయం తెదేపా, వైకాపా ఎంపీలు పార్లమెంటు వెలుపల ఆందోళన చేసి లోక్‌సభ ప్రారంభమైన వెంటనే వెల్‌లోకి వచ్చారు. ఉదయం పోతురాజు వేషం వేసుకొని పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేసిన ఎంపీ శివప్రసాద్ లోక్‌సభలోకీ నుదుటన పెద్ద బొట్టు, వెంట్రుకలు విరబోసుకున్నట్లుండే విగ్ పెట్టుకొని వెల్‌లోకి వచ్చారు. ఆందోళనల మధ్య స్పీకరు సుమిత్రా మహాజన్ సభను 12 గంటలకు వాయిదా వేసి వెళ్లిపోయారు. సభ పునఃప్రారంభమైన తర్వాత తెదేపా, వైకాపా సభ్యులు మళ్లీ ఆందోళన మొదలు పెట్టారు. మరోవైపు రాఫెల్ డీల్‌పై ప్రధాని సమాధానం చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు లేచి ఆందోళన ప్రారంభించారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. బడ్జెట్ సమావేశాల తొలి దశ చివరి రోజు కావడంతో స్పీకరు సభను మార్చి 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. ఆ తర్వాత లోక్‌సభలో ఉన్న అడ్వాణీని తెదేపా సభ్యులు గల్లా జయదేవ్, శ్రీరాం మాల్యాద్రి పలకరించారు. గత మూడు రోజులుగా ఆయన ముందే నిల్చొని ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో.. ఏమైనా ఇబ్బంది కలిగించి ఉంటే క్షమించాలని కోరారు. అడ్వాణీ స్పందిస్తూ... క్షమాపణ అవసరం లేదని, ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్య హక్కని, సహేతుకమైన కారణం కోసం ఆందోళన చేయడంలో తప్పులేదని పేర్కొన్నారు. సీనియరు నేతగా మీరూ ఒక మాట చెప్పండని తెదేపా సభ్యులు ఆయనకు విజ్ఞప్తి చేసినప్పుడు... 'నేను పాతబడిపోయాను కదా' అని అన్నట్లు తెలిసింది

ఆఖరి రోజు అదే జోరు

తొలి విడత బడ్జెట్ సమావేశాల చివరి రోజునా రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల నిరసన కొనసాగింది. సభ జరిగింతసేపు తెదేపా ఎంపీలు వెల్‌లో నిల్చొని 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ప్లకార్డు పట్టుకుని నిరసన వ్యక్తం చేయగా, కేంద్ర మంత్రి సుజనా చౌదరి రాజీనామా చేయాలని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండు చేశారు. బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి, రాపోలు ఆనంద భాస్కర్, తృణమూల్ ఎంపీ డెరిక్ ఓబ్రెయిన్, సమాజ్‌వాదీ సభ్యుడు నరేశ్ అగర్వాల్, సీపీఐ ఎంపీ డి.రాజా ఏపీ ఎంపీల నిరసనకు మద్దతు తెలిపారు. మధ్యాహ్నం సభ ప్రారంభమైన తర్వాత వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. భాజపా, తెదేపాలు మిత్రపక్షంగా ఉండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలో ఉన్నాయని, ప్రస్తుతం సభలో తెదేపా ఎంపీలు చేస్తున్న నిరసన చూస్తుంటే ఎవరిని ఎవరు న్యాయం కోరుతున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల డిమాండుకు సీపీఐ మద్దతిస్తోందని డి.రాజా తెలిపారు. గత ప్రభుత్వం, రాజ్యసభలో అప్పటి ప్రధాని ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం గౌరవించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎందుకివ్వరని, ఇవ్వకపోవడానికి కారణం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కవల పిల్లలని, అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కిచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కేంద్రానికి లేదా? అని ప్రశ్నించారు. మహిళలకు ఏ మాత్రం గౌరవమిస్తారో సభలో చూస్తేనే తెలుస్తోందని విమర్శించారు. ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజనను 'పకోడా' యోజనగా సంబోధిస్తూ ఆ పథకానికి నిధులివ్వలేదని ఎద్దేవా చేశారు. కొండ ప్రాంతాలు, ఆర్థికంగా వెనకబడిన ప్రాంతాలంటూ రెండు పద్ధతుల్లో ప్రత్యేక హోదా ఇస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌కు కొత్త పద్ధతిలో ప్రత్యేక హోదా ప్రకటించాలని కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ మద్దతుగా తామున్నామని తెరాస ఎంపీ కేశవరావు పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని ప్రధాని మోదీ ప్రస్తావించడం సరికాదని, అలా ఎందుకు అన్నారో అర్థం కాలేదని తెలిపారు. ఆంధ్రకు అదిచ్చాం... మీకు ఇదిచ్చాం.. అని మంత్రులు చెబుతున్నారని, ఆంధ్రకు మూడిస్తే తెలంగాణకు ఒకటి ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్ని హామీలపై త్వరలో నిర్ణయం

- రాజ్యసభలో ఆర్థికమంత్రి జైట్లీ వెల్లడి

ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలో చెప్పిన అన్ని అంశాలపై సంబంధిత శాఖలు కసరత్తు చేస్తున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చే సమయంలో ఏపీ సమస్యలపై మరోసారి ప్రకటన చేశారు. ఈనెల 5వ తేదీ నుంచి రాష్ట్ర తెదేపా, వైకాపా ఎంపీలు పార్లమెంటు ఉభయసభల్లో ఆందోళన కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆయన దీనిపై మాట్లాడారు. చాలా వరకు ఈనెల 6, 8 తేదీల్లో పార్లమెంటు ఉభయసభల్లో చేసిన ప్రకటననే పునరుద్ఘాటించారు. "ఆంధ్రప్రదేశ్ మిత్రులు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర విభజన కారణంగా పెద్ద ఎత్తున ఆదాయంకోల్పోయే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని అవశేష ఆంధ్రప్రదేశ్‌కు కొంత న్యాయం చేయాలని మేం నాడు డిమాండ్ చేశాం. అందువల్ల అప్పట్లో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పలు వాగ్దానాలు ఇచ్చారు. అందులో కొన్ని ఇప్పటికే అమలవుతున్నాయి. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న చాలా సంస్థలు తెలంగాణకు వెళ్లడంతో కొత్త రాష్ట్రంలో ఇప్పటికే చాలా సంస్థలు ఏర్పాటుచేశాం. రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇచ్చాం. నాబార్డు ద్వారా పోలవరం ప్రాజెక్టుకు నిధులు అందిస్తున్నాం. అది నిరంతర ప్రక్రియ, కొనసాగుతుంది. ఏ స్థాయిలోనూ ప్రాజెక్టు పనులు ఆగకుండా చూస్తాం. కొన్ని పెండింగ్ అంశాలు ఉన్నాయి. వాటిపైనా కసరత్తు జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం అయిదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ఆర్థిక సాయం అందించడానికి అంగీకరించింది. తొలుత ఈ సాయాన్ని విదేశీ ఆర్థిక కార్యక్రమాల కింద అందించాలనుకున్నాం. కానీ జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలు ప్రతిపాదించింది. నిర్ణయం చివరి దశలో ఉంది. అతి త్వరలో పరిష్కారం కనుగొంటాం. 2014-15లో రాష్ట్రం ఏర్పడిన ఏడాది తొలి పదినెలలకు సంబంధించిన రెవిన్యూలోటులో రూ.3,979.50 కోట్లు ఇప్పటికే ఇచ్చాం. తుది మొత్తం ఖరారుపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్రాల మధ్య కనిపిస్తున్న తేడాను తగ్గిస్తాం. దుగరాజపట్నం పోర్టు, మరో ఇతర పోర్టు, కడప జిల్లాలో సమీకృత ఉక్కు కర్మాగారం, పెట్రోలియం క్రాకర్ కాంప్లెక్స్, విశాఖలో రైల్వేజోన్, వైజాగ్-చెన్నై, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అంశాలను పరిశీలించాలని సంబంధిత అన్ని శాఖలను కోరాం. ప్రతి ఒక్క అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని చెప్పాం. వీటిపై కసరత్తు పురోగతిలో ఉంది" అన్నారు.

కీలకంగా వ్యవహరించిన అమిత్‌షా

కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్ ఎంపీలు చేస్తున్న ఆందోళనలకు ముగింపు పలకాలని రాజ్యసభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు సూచించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఇంతక్రితం చేసిన ప్రకటనకు కొంత భిన్నంగా స్పందించినట్లు తెలుస్తోంది. భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీలు ఇద్దరూ చర్చించుకున్నారు. అరుణ్‌జైట్లీ సభాముఖంగా ప్రకటన చేయడానికి ముందే దాని ముసాయిదాకు అమిత్‌షా ఆమోద ముద్ర వేశారు. దుగరాజపట్నం పోర్టు లాభదాయకం కాదని నీతి ఆయోగ్, భద్రతా కారణాల రీత్యా వద్దని ఇస్రో ఇప్పటికే నివేదిక ఇచ్చిన నేపథ్యంలో అరుణ్‌జైట్లీ ప్రకటనలో దుగరాజపట్నం పోర్టు, లేదా మరో ఇతర పోర్టు అని చెప్పారు. ఇక మిగిలిన అన్ని అంశాల గురించి స్పష్టంగానే ప్రస్తావించారు. విశాఖ రైల్వేజోన్‌పై రాజకీయ నిర్ణయం తీసుకోవాలని చర్చలు జరుగుతున్న దశలో అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనకు అమిత్‌షా ముందస్తు ముద్ర వేసినందున రాజకీయంగా దానికి భాజపా పచ్చజెండా ఊపినట్లేనన్న విశ్లేషణ వినిపిస్తోంది. గురువారం లోక్‌సభలో ప్రకటన చేసిన సమయంలో అరుణ్‌జైట్లీ ఈ విషయాలేవీ చెప్పలేదు. ఆర్థికశాఖ పరిధిలోలేని మిగతా విషయాల గురించి చెప్పాలంటే అమిత్‌షాతో రాయించుకురమ్మని జైట్లీ సుజనా చౌదరితో అన్నట్లు సమాచారం. ఈరోజు అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటన ముసాయిదాను రాజ్యసభలో కూర్చొని అమిత్‌షా టిక్ కొట్టడంతో ప్రస్తుతం దానికి రాజకీయ బలం చేకూరినట్లుగా చెబుతున్నారు.

అమిత్‌షా, జైట్లీలతో వెంకయ్య సుదీర్ఘ చర్చలు

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వపరంగా చేయాల్సిన సాయంపై రాజ్యసభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షాలతో సుదీర్ఘంగా చర్చించారు. వారిద్దరితో ఆయన పార్లమెంటులోని తన ఛాంబర్‌లో సుమారు రెండున్నర గంటలపాటు సమాలోచనలు జరిపారు. చర్చల్లో కొంత సమయం సుజనాచౌదరికూడా పాల్గొన్నారు.

బాబ్రీ మసీదు కూల్చిన చోటే నిర్మించాలి

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: బాబ్రీ మసీదును కూల్చిన చోటనే నిర్మించాలనే నిర్ణయానికి ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు కట్టుబడి ఉందని బోర్డు కార్యదర్శి హజ్రత్ మౌలానా ఒమ్రెన్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైన ఆలిండియా ముస్లిం లాబోర్డు సదస్సులో భాగంగా నిర్వహించిన వర్కింగ్ కమిటీ సమావేశంలో రాత్రి పొద్దు పోయేవరకూ సాగింది. బోర్డు కార్యదర్శి హజ్రత్ మౌలానా ఒమ్రెన్, సదస్సు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీతో కలిసి రాత్రి పొద్దుపోయిన తర్వాత మీడియాకు వివరాలు వెల్లడించారు. బాబ్రీ మసీదు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పునకు కట్టుబడి ఉంటామన్నారు. తీర్పు తమకు అనుకూలంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు ఎలా వచ్చినా.. అది ఒకరి విజయం, మరొకరి అపజయంగా భావించవద్దని సూచించారు.

క్రీడల కోటాలో గోల్‌మాల్ నిజమే

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: క్రీడా కోటాలో వైద్య విద్య సీట్లను అర్హులకు కాకుండా ఇతరులకు కేటాయించిన విషయం నిజమని తేలింది. ప్రవేశాల సమయంలో గోల్‌మాల్ జరిగిందని నిర్ధారణ అయింది. అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ హాకీలో పతకాలతో సత్తా చాటిన క్రీడాకారులకు క్రీడా కోటాలో వైద్య విద్య సీటు రాకపోవడాన్ని ప్రశ్నిస్తూ 'ఈనాడు' వరుస కథనాలు ప్రచురించింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన క్రీడా శాఖ ముఖ్య అధికారి.. నిజానిజాలు తేల్చేందుకు స్విమ్మింగ్ కోచ్ హజీరా అబ్బాసి, శాట్స్ అధికారి విమలాకర్‌రావు సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు. ప్రవేశాలప్పుడు ధ్రువపత్రాలు పరిశీలించిన తొమ్మిదిమంది అధికారులు.. పని ఒత్తిడి వల్ల తప్పు జరిగిందని విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది.



గద్వాల సభలో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు అమరీందర్‌సింగ్ రాజ్.. వేదికపై డీకే అరుణ, అనిల్‌కుమార్ యాదవ్

మోదీ, కేసీఆర్‌లకు రాజకీయ సన్యాసం తప్పదు
యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు అమరీందర్‌సింగ్ రాజ్

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే : దేశంలో మోదీ, తెలంగాణలో కేసీఆర్ అబద్ధాలతో పాలనలోకి వచ్చారని.. ప్రజలు అది గ్రహించారని, ఇద్దరినీ ఓడించి రాజకీయ సన్యాసాన్ని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు అమరీందర్‌సింగ్ రాజ్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన నిరుద్యోగ చైతన్యయాత్ర బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, ధనికులు దాచుకున్న సొమ్మును రాబట్టి పేదల ఖాతాలో వేస్తానని నరేంద్రమోదీ నమ్మించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో లక్షల ఉద్యోగాలు వస్తాయని ఉద్యమ సమయంలో చెప్పిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక చెప్పిన ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ప్రజలు గత నాలుగేళ్లలో వాస్తవాలను గుర్తించినందునే దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కోసం ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, గద్వాల ఎమ్మెల్యే డీకే అరుణ, నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నేడు పనిదినం

ఈనాడు, హైదరాబాద్: శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పనిదినం. రెండో శనివారమయినప్పటికీ జనవరి 1న ఇచ్చిన సెలవుకు బదులుగా దీనిని పనిదినంగా పేర్కొంటూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

ఎంప్లాయిమెంట్ కార్డుల పునరుద్ధరణ గడువు పెంపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంప్లాయిమెంట్ కార్డుల పునరుద్ధరణ గడువును జూన్ 30వతేదీ వరకు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రామప్ప ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు

భూపాలపల్లి జిల్లాలోని రామప్ప దేవాలయంలో మహాశివరాత్రి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి చందూలాల్ తెలిపారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు సాధించేందుకే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నటు పేర్కొన్నారు.

మరో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి రుణం

కాళేశ్వరంపై రూ. 20,950 కోట్లకు చేరనున్న అప్పు

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మరో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి బ్యాంకుల నుంచి ప్రభుత్వం రుణం తీసుకుంది. ఇప్పటికే రెండు విడతలుగా రుణం తీసుకున్న ప్రభుత్వం, తాజాగా బస్వాపుర, గంధమల రిజర్వాయర్ల నిర్మాణానికి రూ. 2,150 కోట్లు రుణం తీసుకోనుంది. విజయాబ్యాంకు నేతృత్వంలోని కన్సార్టియంతో ఈ రుణం తీసుకోవడానికి తుది నిర్ణయం జరిగింది. మేడిగడ్డ నుంచి నీటిని మళ్లించే పనులకు ఆంధ్రాబ్యాంకు నేతృత్వంలోని కన్సార్టియంతోనూ, మిడ్‌మానేరు నుంచి మల్లన్నసాగర్ వరకు పనులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలోని కన్సార్టియంతో రుణం తీసుకోవడానికి ఒప్పందం చేసుకోవడంతో పాటు ఇప్పటికే మూడో వంతు తీసుకుంది కూడా. తాజా రుణంతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి బ్యాంకుల నుంచి రూ. 20,950 కోట్లు తీసుకున్నట్లు అవుతుంది.

త్వరలో కాలువల తవ్వకం

మల్లన్నసాగర్, కొండపోచమ్మ తదితర రిజర్వాయర్ల నిర్మాణంలో జాప్యం జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయంగా పక్కన కాలువలు తవ్వి నీటిని మళ్లించడం, ఆయకట్టుకు నీటి సరఫరా పనులు పూర్తికాకపోయినా చెరువులకు నీటిని మళ్లించాలని కొన్నాళ్ల క్రితం నీటి పారుదల శాఖ నిర్ణయించింది. ఈ పనులను కూడా త్వరలోనే చేపట్టనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

పరిధులు తేల్చాల్సిందే

- రెండు రాష్ట్రాలతో చర్చించాకే నిర్ణయం
- కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డులపై కేంద్ర జలవనరుల శాఖ అభిప్రాయం

ఈనాడు - హైదరాబాద్

నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిగణలోకి తీసుకొని కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల పరిధిని నోటిఫై చేయాల్సిన అవసరం ఉందని, అయితే రెండు రాష్ట్రాలతో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోవాలని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ అభిప్రాయపడినట్లు తెలిసింది. రెండు రాష్ట్రాల కార్యదర్శులతో ఈనెల 15న నిర్వహించే సమావేశంలో ఓ అంగీకారానికి రాలేకపోతే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసైనా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నట్లు తెలిసింది. బోర్డు పరిధిని నోటిఫై చేయకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలు, ఒక రాష్ట్రం మీద ఇంకో రాష్ట్రం తరచూ చేసుకొంటున్న ఫిర్యాదులు, ప్రాజెక్టులపై కోర్టుల వరకు వెళ్లడం తదితర అంశాలపై వివరంగా చర్చించినట్లు మంత్రిత్వశాఖ వర్గాల ద్వారా తెలిసింది.

కృష్ణా, గోదావరి బోర్డుల పరిధితో సహా నిర్వహణకు సంబంధించిన అనేక అంశాలపై కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ చర్చించింది. పునర్విభజన చట్టం ప్రకారం బోర్డు పరిధికి సంబంధించిన అంశాలేంటి, పరిధిని నిర్ణయించడంలో ఎదురవుతున్న సమస్యలేంటి తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. జలవనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎస్.పి.సింగ్ వద్ద శుక్రవారం దిల్లీలో ఈ సమావేశం జరిగింది. కేంద్రజల సంఘం ఛైర్మన్ మసూద్‌హుస్సేన్, మంత్రిత్వశాఖ సీనియర్ అధికారులు కుందూ, కన్నోడియా, గోదావరి బోర్డు ఛైర్మన్ సాహు, కృష్ణా, గోదావరి బోర్డుల సభ్యకార్యదర్శులు పరమేశం, సమీర్‌ఛటర్జీ, జలసంఘం హైదరాబాద్ కేంద్రం చీఫ్ ఇంజినీర్ రంగారెడ్డి, కృష్ణాబోర్డు ఎస్.ఇ. శ్రవణ్‌కుమార్‌రెడ్డి, జలవనరుల మంత్రిత్వశాఖకు చెందిన పలువురు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బోర్డు పరిధి, నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఎక్కువగా చర్చించినట్లు తెలిసింది. పునర్విభజన చట్టం ప్రకారం పూర్తిస్థాయి బోర్డు సమావేశం జరిగే తీరు, కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన డిపిఆర్‌లపై కూడా వివరంగా చర్చించినట్లు సమాచారం. శ్రీశైలంలో విద్యుత్తు బ్లాక్‌ల ద్వారా నీటి విడుదల, ఏయే ప్రాజెక్టు ద్వారా ఎవరు నీటిని విడుదల చేస్తున్నారు, నాగార్జునసాగర్‌లో కుడి, ఎడమకాలువల పరిధిలో సమస్యల గురించి కేంద్ర కార్యదర్శి వివరంగా అడిగి తెలుసుకొన్నట్లు సమాచారం. నీటి వినియోగంలో రాష్ట్రాలు తమకు తోచినట్లుగా వ్యవహరిస్తుండటం వల్ల సమస్యలు వస్తున్నాయని, పరిధిని నోటిఫై చేయాల్సిన అవసరం ఉందని రెండు బోర్డుల అధికారులు సూచించినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ బోర్డు పరిధిని నోటిఫై చేయాలని కోరుతుండగా, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ప్రాజెక్టుల వారీ నీటి కేటాయింపు చేయకుండా బోర్డు పరిధిని ఎలా నిర్ణయిస్తారంటూ తెలంగాణ వ్యతిరేకిస్తుంది. బోర్డు పరిధిని నోటిఫై చేయకపోతే తమ ప్రాంతంలోని కాలువలను తామే నిర్వహించుకుంటామని ఆంధ్రప్రదేశ్ పేర్కొనడం పైన కూడా చర్చకు వచ్చింది. కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, వీటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు ఇవ్వడంలో జాప్యం, ఒక రాష్ట్రంపై ఇంకో రాష్ట్రం ఈ ప్రాజెక్టులపై ఫిర్యాదు చేసుకోవడం, శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నిర్వహణ, విద్యుదుత్పత్తికి నీటి వినియోగం తదితర అంశాలపై కూడా వివరంగా చర్చించినట్లు తెలిసింది. ఈనెల 15న రెండు రాష్ట్రాల కార్యదర్శులతో చర్చించిన తర్వాత తదుపరి కార్యాచరణకు శ్రీకారం చుడతామని మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి.

ఈ నెల 11లోగా వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలి

ఈనాడు, హైదరాబాద్: గురుకులాల్లో చిత్రలేఖనం, సంగీతం, క్రాఫ్ట్ ఉపాధ్యాయుల పోస్టులకుగాను ధ్రువీకరణపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు ఈ నెల 11వతేదీ లోపు సొసైటీలు, జోనల్ ప్రాధాన్య క్రమ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. గడువులోగా ఆప్షన్లు ఇవ్వని అభ్యర్థులను ఎంపిక చేయబోమంది. మరిన్ని వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సందర్శించాలనిసూచించింది.

సంసిద్ధత తెలియజేయాలి....: గురుకులాల్లో పీజీటీపోస్టులకు ఎంపికైనఅభ్యర్థులు టీజీటీ పోస్టుల అర్హతను వదిలివేసుకుంటున్నట్లు ఈ నెల 14లోగా ఆన్‌లైన్లో తెలియజేయాలని టీఎస్‌పీఎస్సీ కోరింది.

ఛత్తీసగఢ్‌లో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి

రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లా బొర్ల గ్రామం వద్ద శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారని ఆ జిల్లా ఎస్పీ ప్రశాంత్ అగర్వాల్ తెలిపారు. వీరిని 55వ దళం డిప్యూటీ కమాండర్ వినోద్, అదే దళం సభ్యుడు సాగర్‌గా గుర్తించామన్నారు. వినోద్‌ది మహారాష్ట్రలోని గడ్చిరోలి అని, సాగర్ దక్షిణ బస్తర్‌కు చెందినవాడని చెప్పారు. వీరిద్దరిపై వరుసగా రూ. 8 లక్షలు, రూ. 2 లక్షలు రివార్డు ఉందన్నారు. మరోవైపు భద్రతా దళాలకు సమాచారమిస్తున్నాడని ఆగ్రహిస్తూ హింగ మడ్‌కామి అనే మాజీ మావోయిస్టును నక్సల్స్ కాల్చి చంపారు. తల్లి చనిపోయిందని తెలుసుకుని, సంప్రదాయ పూజాదికాల్లో పాల్గొనడానికి ఫుల్పర్‌గ్రామానికి గురువారం వెళ్లిన హింగానుకత్తులతో నరికి, ఆపై కాల్చి చంపారని పోలీసులు చెప్పారు.

పురుషోత్తమ్‌రెడ్డి బినామీల అరెస్ట్

- స్థిరాస్తి, నిర్మాణ సంస్థల్లో రూ. 30 కోట్లు పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారన్న అభియోగాలు ఎదుర్కొంటున్న హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం సంచాలకుడు పురుషోత్తమ్‌రెడ్డి బినామీలు ఎ.యాదవరెడ్డి, జి.నిశాంత్‌రెడ్డిలను ఏసీబీ అధికారులు గురువారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. పురుషోత్తమ్‌రెడ్డి అక్రమార్జనను వీరిద్దరూ వేర్వేరుగా స్థిరాస్తి, నిర్మాణ సంస్థల్లో పెట్టుబడులు పెట్టారు. వారి కార్యాలయాలకు వెళ్లి రికార్డులను పరిశీలించగా.. రూ. 30కోట్లకు సంబంధించిన పత్రాలు లభించాయి. ఈఆధారాలతో యాదవరెడ్డి, నిశాంత్‌రెడ్డిలను అరెస్ట్ చేసి శుక్రవారం జైలుకు తరలించామని ఏసీబీ డీఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ వివరాలను ఆదాయపు పన్నుశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)లకు పంపుతున్నామన్నారు. పురుషోత్తమ్‌రెడ్డి, ఆయన బావమరిది శ్రీనివాస్‌రెడ్డిలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



పురుషోత్తమ్‌రెడ్డి అల్లుడి సోదరుడు నిశాంత్‌రెడ్డి



పురుషోత్తమ్‌రెడ్డి బినామీ ఎ.యాదవ్‌రెడ్డి

యాదవరెడ్డి ఉద్యోగం మాన్పించి: పురపాలకశాఖలో ఉద్యోగం పొందిన పురుషోత్తమ్‌రెడ్డి నాలుగైదేళ్లకే అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాడని ఏసీబీ అధికారులు ఆధారాలు సేకరించారు. 1990 ప్రాంతాల్లో పురుషోత్తమ్‌రెడ్డి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా.. పారిశుద్ధ్య విభాగంలో యాదవరెడ్డి పనిచేస్తుండేవాడు. వీరిద్దరూ స్నేహితులయ్యారు. అక్రమ సంపాదన పెరుగుతుండడంతో పురుషోత్తమ్‌రెడ్డి మిత్రుడు యాదవరెడ్డి ఉద్యోగాన్ని మాన్పించాడు. 1995లో శ్రీసాయి హరిహర ఎస్టేట్ లిమిటెడ్ పేరుతో హబ్సిగూడలో స్థిరాస్తి సంస్థను ప్రారంభించారు. దీనికి డైరెక్టర్లుగా పురుషోత్తమ్‌రెడ్డి, యాదవరెడ్డి భార్యలను నియమించారు. అప్పటినుంచి పురుషోత్తమ్‌రెడ్డి అక్రమ సంపాదనను ఈ సంస్థలోకి మళ్లించడం మొదలుపెట్టాడు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ హోదా వచ్చాక రూ. కోట్లలో ఇందులో పెట్టుబడులు పెట్టాడు. వీటి ద్వారా యాదవరెడ్డి నగరం, శివారు ప్రాంతాల్లో స్థలాలను కొని అపార్ట్‌మెంట్లను నిర్మించి విక్రయిస్తున్నాడు.

విల్లాల వ్యాపారం కోసం సంస్థ: హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించాక లేఅవుట్‌లు, భవన నిర్మాణ అనుమతులిచ్చేప్పుడు రూ. లక్షల్లోనే అవినీతి సొమ్మును తీసుకున్నాడని ఏసీబీ అధికారులు ఆధారాలు సంపాదించారు. కుమార్తెకు పెళ్లి చేశాక అల్లుడి సోదరుడు నిశాంత్‌రెడ్డితో కలిసి మరో స్థిరాస్తి వెంచర్‌కు తెరలేపారు. ఆర్థిక జిల్లా(మంచిరేవుల)లో ఆరెకరాల విస్తీర్ణంలో విల్లాలు నిర్మించి రూ. 100కోట్లు ఆర్జించాలని పథకం రూపొందించారు. ఇందుకోసం గోల్డెన్ రిడ్జ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. గతేడాది ఈ సంస్థకు పెట్టుబడి నిధులుగా రూ. 20కోట్లు పురుషోత్తమ్‌రెడ్డి సమకూర్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

తెలంగాణ.. కాంగ్రెస్ అబ్బసొత్తు కాదు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ అబ్బసొత్తు కాదని, ఊరికనే ప్రత్యేక రాష్ట్రం ఇవ్వలేదని, ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది కాబట్టే ఇచ్చిందని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీల శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏడు సీట్లయినా గెలిచే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందా అని ఆయన సవాల్ చేశారు. శుక్రవారం తెరాస రాష్ట్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ తెలంగాణకు తీరని ద్రోహం చేసిందని, కేసీఆర్ నేతృత్వంలో పెద్దఎత్తున జరిగిన ఉద్యమానికి దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించిందన్నారు. కాంగ్రెస్‌కు ఏ స్వార్థం లేకపోతే అధికారంలోకివచ్చేదని, ప్రజలు ఆ పార్టీని విశ్వసించలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆరే ముఖ్యమంత్రి కావడంతో ప్రత్యేక రాష్ట్రానికి సార్థకత ఏర్పడిందన్నారు. కేటీఆర్ వాస్తవాలు మాట్లాడితే ఆ పార్టీ జీర్ణించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. భాజపా పొత్తులతో పోటీచేయడం తప్ప సొంతంగా ఎప్పుడు గెలవలేదని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్‌కు ఆరోపణలు, విమర్శలు తప్ప వేరే పనిలేదు

ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నేతలకు గాంధీభవన్‌లో కూర్చొని ప్రభుత్వం మీద, కేసీఆర్ మీద ఆరోపణలు, విమర్శలు చేయడం తప్ప వేరే పని లేదని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దేశంలో పనికిరాని ప్రతిపక్షం ఏదైనా ఉందంటే అది తెలంగాణ కాంగ్రెస్సేనని ఆయన ఎద్దేవా చేశారు. శుక్రవారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ దౌర్భాగ్య పార్టీ అనేది ప్రజల అభిప్రాయమని, దానినే మంత్రి కేటీఆర్ చెప్పారన్నారు. 60 ఏళ్లపాటు మోసం చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు ఏమాత్రం సహించడం లేదన్నారు. మంత్రి కేటీఆర్ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ సిరిసిల్ల నుంచి సిలికాన్ వ్యాలీ వరకు రాష్ట్ర ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తం చేస్తున్నారని, ఆయనపై నిప్పులు పోస్తే కాంగ్రెస్ పార్టీయే దహనం అవుతుందని అన్నారు.

కాంగ్రెస్‌కు ధరావతులూ దక్కవు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలకు ధరావతులు దక్కవని తెరాస ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. కర్నె ప్రభాకర్, శంభీపూర్‌రాజు, బిగాల గణేశ్‌లు శుక్రవారం తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేతలు జీవితాంతం గాంధీభవన్‌కే అంకితమవుతారని, ప్రజల్లోకివచ్చే ధైర్యంలేదని అన్నారు. వారిది అవినీతి చరిత్రని, అక్రమాలతో వారు తెలంగాణకు తీరని నష్టం చేశారన్నారు.

ఆర్జన శూన్యం.. ఆదాయం ఘనం!

- ఒక్కసారిగా ఎదిగిన శ్రీనివాసరెడ్డి
- రూ.కోట్లలో రాబడి చూపిన వైనం
- పురుషోత్తమ్‌రెడ్డి కేసులో ఆసక్తికర అంశాలు

ఈనాడు, హైదరాబాద్: పెద్దగా చదువు లేదు. ఆదాయం అంతకంటే లేదు. సహాయ ఇంజినీరుగా పనిచేసిన తండ్రి 27 సంవత్సరాల క్రితమే మరణించాడు. తల్లికి వచ్చే పింఛనే జీవనాధారం. అలాంటి శ్రీనివాసరెడ్డి ఒక్కసారిగా స్థిరాస్తి సంస్థలో పెట్టుబడి పెట్టడం మొదలుపెట్టాడు. ఇదెలా సాధ్యం? అక్రమార్కులు తలుచుకుంటే ఏదైనా సాధ్యమే. ఆదాయానికి మించిన ఆస్తులకేసులో అరెస్టయిన హెచ్.ఎం.డి.ఎ. సంచాలకులు పురుషోత్తమ్‌రెడ్డి వ్యవహారంలో దర్యాప్తు జరుగుతున్న కొద్దీ ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకొని అడ్డగోలుగా ఆర్జించిన పురుషోత్తమ్‌రెడ్డి 2009లో ఒకసారి అవినీతి నిరోధకశాఖ (అనిశా)కు పట్టుబడ్డాడు. అప్పట్లో ఆస్తులన్నీ తాను, తన బంధువుల పేర్లమీదనే పెట్టుకున్నాడు. దాంతో అనిశాకు సులభంగా దొరికిపోయాడు. తన పలుకుబడి ఉపయోగించుకొని 2011లో కేసు ఎత్తివేయించుకున్నాడు. అప్పటి నుంచి అక్రమార్జనను చట్టబద్ధం చేసేందుకు ఆదాయంలేని తన బావమరిది.. నల్గొండకు చెందిన శ్రీనివాసరెడ్డిని ఎంచుకున్నాడు. అనిశా అధికారుల సమాచారం ప్రకారం 2014 తర్వాత ఇతని పరిస్థితి మారిపోయింది. పురుషోత్తమ్‌రెడ్డి పేరుమీద ఉన్న ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని క్రమంగా తన బావమరిది శ్రీనివాసరెడ్డి పేరుమీద చూపించడం మొదలుపెట్టాడు. 2009లోనే అనిశాకు దొరికినప్పటికీ కేసు ఎత్తివేయడంతో ఆస్తిపై పురుషోత్తమ్‌రెడ్డికి అధికారం వచ్చింది. వాటిపై వచ్చే అద్దెలను శ్రీనివాసరెడ్డి ఆదాయంగా చూపసాగాడు. 2014 నుంచి 2017 మధ్య శ్రీనివాసరెడ్డి రూ.కోటి శ్రీసాయి హరిహర ఎస్టేట్స్ సంస్థలో పెట్టుబడి పెట్టినట్లు గుర్తించారు. ఇది అధికారిక లావాదేవీనే. శ్రీనివాసరెడ్డి తన పేరుమీద ఉన్న రూ. 3.5 కోట్ల విలువైన భవనాన్ని తన మేనకోడలు(పురుషోత్తమ్‌రెడ్డి కుమార్తె)కు బహుమతిగా ఇచ్చినట్లు తేలింది. మూడేళ్లలో ఇతనికి ఇంత ఆదాయం ఎక్కడ నుంచి వచ్చిందన్నది పరిశీలిస్తే అదంతా పురుషోత్తమ్‌రెడ్డి ఎత్తుగడగానే భావిస్తున్నారు.

యాదవరెడ్డి సంస్థలో మరింత మంది..: పురుషోత్తమ్‌రెడ్డి తెలివిగా తన సహచరుడు యాదవరెడ్డితో చాలాకాలం క్రితమే శ్రీసాయి హరిహర రియల్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించాడు. తన అక్రమార్జనను వివిధ మార్గాల్లో ఈసంస్థలోకి మళ్లించేవాడు. పురుషోత్తమ్‌రెడ్డి మాదిరిగానే ఇంకా కొందరు బినామీల ద్వారా పెట్టుబడులు పెట్టి ఉండవచ్చని అనిశా అధికారులు అనుమానిస్తున్నారు. యాదవరెడ్డి, అతని భార్య రూ. 2 కోట్ల ఆదాయపన్ను చెల్లించినట్లు అనిశా అధికారులు గుర్తించారు. వాస్తవానికి స్థిరాస్తి సంస్థ ద్వారా వాస్తవంగా వచ్చిన ఆదాయం కంటే రికార్డుల్లో చూపించింది ఎక్కువై ఉండవచ్చని, అక్రమార్జనను ఇందులో ఆదాయంగా చూపించి ఉండవచ్చని, దాన్ని చట్టబద్ధం చేసేందుకు పన్నులు చెల్లించిఉంటారని అనుమానిస్తున్నారు.

వియ్యంకుడి సంస్థలో సోదాలు: పురుషోత్తమ్‌రెడ్డి కేసులో అనిశా అధికారులు శుక్రవారం సోమాజిగూడలోని చరణ్ లైఫ్ డివైజస్ సంస్థలో తనిఖీలు చేపట్టారు. పురుషోత్తమ్‌రెడ్డి వియ్యంకుడి సంస్థ అయిన ఇందులోనూ పెట్టుబడులు పెట్టి ఉండవచ్చన్న అనుమానంతోనే సోదాలు చేస్తున్నారు.

తెలంగాణలో టాఫే 'జేఫామ్' కేంద్రం

- రూ. 50-60 కోట్ల పెట్టుబడులు
- నెలలో అవగాహన ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: రైతుల ఆదాయాన్ని పెంచే, సాగు వ్యయాన్ని తగ్గించే చర్యలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం నడుం బిగించనుంది. సాగులో యంత్రాల వినియోగం, పంటల మార్పిడి, అవసరానికి తగ్గట్టుగానే ఎరువులు, పురుగు మందుల వినియోగం వంటి వాటిపై రైతులకు శిక్షణ ఇచ్చేందుకు, అవగాహన కల్పించేందుకు ట్రాక్టర్స్ అండ్ ఫామ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్(టాఫే)తో చేతులు కలపనుంది. వ్యవసాయంలో డ్రోన్లు వంటి అత్యాధునిక సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి టాఫే, రాష్ట్రప్రభుత్వం చర్చలు జరుపుతున్నాయి. వ్యవసాయరంగంలో టాఫేకు ఉన్న అనుభవం, నైపుణ్యంద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి తెలంగాణ రైతులకు అండగా నిలవాలని భావిస్తున్నామని, టాఫే 'జేఫామ్' వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయాలనుకుంటున్నామని టాఫే ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(పీఎస్, సీఆర్) టి.ఆర్.కేశవన్ తెలిపారు. రైతులు తమ వద్దనున్న ట్రాక్టర్లను ఇతర రైతులకు అద్దెకిచ్చి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి ఎఫ్2ఎఫ్ ప్లాట్‌ఫారమ్‌ను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు అత్యాధునిక ప్రెసిషన్ అగ్రికల్చర్ ఇప్లిమెంటేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం కోరుతోందని కేశవన్ చెప్పారు.

50 హెక్టార్లలో జేఫామ్: టాఫేకు చెన్నైలో 200 ఎకరాల్లో 'జేఫామ్' వ్యవసాయ పరిశోధన కేంద్రం ఉంది. ఇక్కడ వినూత్న సమగ్ర వ్యవసాయ విధానాల్లో శిక్షణ ఇస్తున్నారు. 2016, నవంబరులో 50 ఎకరాల్లో రాజస్థాన్‌లో ప్రారంభించింది. ప్రస్తుతం తెలంగాణ, అసోం, కర్ణాటకల్లో జేఫామ్ కేంద్రాల ఏర్పాటుకు చర్చలు జరుగుతున్నాయి. తెలంగాణలో జేఫామ్ ఏర్పాటుకు 50 హెక్టార్ల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరామని.. స్థలం కేటాయిస్తే.. అయిదేళ్లలో రూ. 50-60 కోట్ల పెట్టుబడులతో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కేశవన్ అన్నారు. నెలకు 500-600 మంది రైతులకు శిక్షణ ఇవ్వొచ్చని చెప్పారు. ఇందుకు రూ. 100-200 కోట్ల పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని, నెల రోజుల్లో అవగాహన ఒప్పందం కుదిరే వీలుందని కేశవన్ అన్నారు.

ట్రాక్టర్ల అమ్మకాల్లో 14% వృద్ధి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశంలో ట్రాక్టర్ల విక్రయాలు 13-14 శాతం వృద్ధి చెందగలవని అంచనా వేస్తున్నామన్నారు. వచ్చే 5-6 ఏళ్లలో అమ్మకాలు ఏడాదికి కనీసం 8శాతం చొప్పున వృద్ధి చెందగలవని వివరించారు.

దిల్లీలో యాదాద్రీశుడు

తెలంగాణ భవన్‌లో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠకు సన్నాహాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం దిల్లీలోని తెలంగాణ భవన్‌లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని భావిస్తోంది. యాదగిరిగుట్ట దేవాలయాభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) వైస్ ఛైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఈవో గీత ఈ క్రతువులో భాగంగా బుధవారం దిల్లీ వెళ్లారు. 'యాదగిరి క్షేత్ర ప్రాశస్త్యాన్ని నలుదిశలా చాటాలని ప్రభుత్వం యోచిస్తోంది. తెలంగాణ భవన్‌లో విగ్రహ ప్రతిష్ఠకు అనువైన స్థలం పరిశీలించిన అనంతరం సీఎం కేసీఆర్‌కు నివేదికను అందజేస్తాం. ఆయన ఆదేశాల మేరకుచర్యలు తీసుకుంటాం.' అని కిషన్‌రావు శుక్రవారం తెలిపారు.

విత్తన ధ్రువీకరణపై ఏప్రిల్‌లో శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: విత్తనాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ధ్రువీకరించే పద్ధతులపై ఏప్రిల్ మొదటి వారంలో విదేశీ శాస్త్రవేత్తలతో హైదరాబాద్‌లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తెలిపారు. ఇండో-జర్మనీ సహకార విత్తనాభివృద్ధి పథకంలో భాగంగా చేపడుతున్న పనులను తెలుసుకునేందుకు జర్మనీకి చెందిన ఎక్కేహార్డ్ ష్రోడర్ శుక్రవారం సచివాలయంలో వచ్చి పార్థసారథిని కలిశారు. రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకుడు కేశవులు, అధికారులు ఇందులో పాల్గొన్నారు. విత్తన పంటల సాగులో మెలకువలతో కరపత్రాలను ముద్రించి పంచితే రైతులకు సులభంగా సమాచారం చేరుతుందని పార్థసారథి చెప్పారు. వచ్చే నెల మొదటివారంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్శిటీలో విత్తన నాణ్యత పెంపుపై శిక్షణ ఇస్తామన్నారు. గతేడాది విత్తన ధ్రువీకరణలో జర్మనీ సహకారం వల్ల 17 వేల క్వింటాళ్లను విదేశాలకు ఎగుమతి చేశామని తెలిపారు.

మానవ పునరుత్పత్తి అవయవాలకూ 'ఎబోలా' ముప్పు

★ కోతులపై పరిశోధన చేసి నిర్ధారించిన శాస్త్రవేత్తలు



న్యూయార్క్: ఎబోలా వైరస్ మానవ పునరుత్పత్తి అవయవాలను సైతం దెబ్బ తీయగలదని తాజా అధ్యయనంలో తేలింది. స్త్రీ పునరుత్పత్తి కణజాలంలో వైరస్ నిలకడగా జీవిస్తుందని, ఎబోలా వైరస్ సోకితే గర్భిణులు 80 శాతానికి పైగా, పిండాలు దాదాపు వందశాతం మృత్యువు కబళిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2014-2016లో పశ్చిమ ఆఫ్రికాలో ఈ వైరస్ బారిన పడి బతికినవారిపై అమెరికాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అలర్జీ అండ్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్‌కు చెందిన శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. ఎబోలా వైరస్‌కు చెందిన జన్యుపదార్థం వైరల్ ఆర్ఎన్ఏ వీర్యంలో కూడా ఉందని తేలింది. ఇది సంక్రమించకుండా నివారించడానికి ఏమైనా మందులుగాని, టీకాలు పనిచేస్తాయా, లేదా? అనేది ఇప్పుడే చెప్పలేమంటున్నారు. నాలుగు మగ, ఎనిమిది ఆడ కోతులకు ఎబోలా వైరస్ ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి పరిశోధనలు చేశారు. వాటి బాధ చూడలేక ఆరు నుంచి తొమ్మిది రోజుల్లో వాటన్నింటినీ చంపేశారు. పరిశోధన వివరాలు 'ది అమెరికన్ జర్నల్ ఆఫ్ పాథాలజీ'లో ప్రచురితమయ్యాయి.


మళ్లీ గుండెపోటు వచ్చే ముప్పును పసిగట్టే రక్తపరీక్ష



వాషింగ్టన్: ఒకసారి గుండె పోటు వచ్చి, ఆసుపత్రి నుంచి క్షేమంగా ఇంటికి చేరినవారికి... మళ్లీ ఆ సమస్య తిరగబడే పరిస్థితి ఉందా, లేదా అన్నది ఇక తెలుసుకోవచ్చు! ఇందుకు ప్రత్యేకమైన రక్త పరీక్షను అభివృద్ధి చేసింది... యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్‌కు చెందిన రాబ్ స్టోరే బృందం. అధ్యయనంలో భాగంగా 4,300 మంది హృద్రోగ బాధితుల నుంచి రక్తంలోని తెల్లటి ద్రవాన్ని (ప్లాస్మాను) సేకరించారు. దానిని పరీక్షించి, నాళాల్లో రక్తస్రావ గరిష్ఠ సాంద్రత, ఇది జరగడానికి పట్టిన సమయాన్ని అంచనా వేశారు. వైద్యభాషలో దీనిని 'క్లాట్ లైసిస్ టైమ్' అంటారు. ఈ సమయం అధికంగా ఉన్నవారికి మళ్లీ గుండెపోటు, ఇతరత్రా హృద్రోగాలు వచ్చే ముప్పు 40% ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించారు. అయితే... ఈ రక్తపరీక్ష ఫలితాలను మరింత కచ్చితంగా నిర్ధరించుకుని, బాధితులకు ముందస్తు వైద్యం అందించే అవకాశాలపై దృష్టి సారించాల్సి ఉందన్నారు... రాబ్ స్టోరే!

భూమికి 612 కోట్ల కిలోమీటర్ల దూరంలో..

★ ఫొటోలు తీసిన నాసా వ్యోమనౌక



వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'కు చెందిన న్యూ హారిజాన్స్ అన్వేషణ మరో సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. భూమి నుంచి 612 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న 'విషింగ్ వెల్ నక్షత్ర సమూహం' చిత్రాలను న్యూ హారిజాన్స్ వ్యోమనౌక తీసింది. గతేడాది డిసెంబరు 5న ఈ చిత్రాలను క్లిక్‌మనిపించినట్లు నాసా తెలిపింది. గతంలో భూమికి 606 కోట్ల కిలోమీటర్ల దూరంలోని చిత్రాలను 'వాయేజర్ 1' తీసిందని.. ప్రస్తుతం ఆ రికార్డును న్యూ హారిజాన్స్ తుడిచిపెట్టేసిందని వెల్లడించింది.

విశ్వం గుట్టు విప్పే సరికొత్త అస్త్రం!

• 2026 కల్లా అందుబాటులోకి..

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: అనంతమైన విశ్వంలో వెలుగులోకి రావాల్సిన విషయాలెన్నో.. గతంలో విశ్వం ఎలా ఉండేది, భవిష్యత్తులో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం ఉందన్న దిశగా పరిశోధనలు చేసేందుకు అయిదు దేశాలు జట్టుకట్టాయి. ఇందుకోసం సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేస్తున్నాయి. శక్తిమంతమైన '30 మీటర్ల ఆప్టికల్ టెలిస్కోప్' నిర్మాణానికి నడుంకట్టాయి. ఈ ప్రాజెక్టు రూపకల్పనలో భారత్ కీలక భూమికను పోషిస్తోంది.

దీని ప్రధాన కటకం వ్యాసం 30 మీటర్లు. ఇప్పటిదాకా భూమిపై 8 నుంచి 10 మీటర్ల ఆప్టికల్ టెలిస్కోపులు మాత్రమే ఉన్నాయి. భారత్‌లో కేవలం 3.6 మీటర్ల టెలిస్కోపు ఇటీవలే నిర్మాణం పూర్తి చేసుకుంది. సరికొత్త 30 మీటర్ల టెలిస్కోప్ (టీఎంటీ) నిర్మాణానికి 140 కోట్ల డాలర్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు కోసం భారత్ దాదాపు రూ.1300 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ మొత్తంలో 30 శాతం నిధులను నగదు రూపంలోనూ, మిగతా 70 శాతం నిధులకు సమానమైన టెలిస్కోపు భాగాలను ఇక్కడే నిర్మించి ఇవ్వనున్నారు. 2013లో ఈ ప్రాజెక్టుపై వివిధ దేశాల మధ్య చర్చలు జరిగాయి. 2014లో భారత ప్రభుత్వం అధికారికంగా ఇందులో పాల్గొనేందుకు దేశంలోని వివిధ సంస్థలకు అనుమతి ఇచ్చింది. 2026 నాటికి ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావడానికి వందలమంది పరిశోధకులు శ్రమిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భారత్, కెనడా, చైనా, జపాన్‌తోపాటు అమెరికాలోని అనేక సంస్థలు భాగస్వామ్యం అవుతున్నాయి. మన దేశంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ), ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ), ఆర్యభట్ట రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఫర్ అబ్జర్వేషనల్ సైన్సెస్ (ఏఆర్ఐఈఎస్), టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చి(టీఐఎఫ్ఆర్) వంటి సంస్థలు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి.

ఏర్పాటు ఎక్కడ..

టీఎంటీ ప్రాజెక్టును హవాయి దీవుల్లోని మౌనాకీయలో నిర్మిస్తున్నారు. హవాయి దీవులు సముద్రమట్టానికి దాదాపు 4000 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. ఇక్కడి వాతావరణం చల్లగా, ప్రశాంతంగా, స్థిరంగా, అన్ని రకాల కాలుష్యాలకు దూరంగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో విశ్వం నుంచి వెలువడే వివిధ రకాల కిరణాలను విశ్లేషించడం తేలికవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

494 అద్దాలతో నిర్మాణం..

టెలిస్కోపును 494 అద్దాలతో నిర్మిస్తారు. అందులో 86 అద్దాలను భారత్‌లో తయారు చేయనున్నారు. తయారీ పనులు మరో మూడు నెలల్లో ప్రారంభమవనున్నాయి. అద్దాలకు దన్నుగా ఉండే కీలక పరికరాలను కూడా దేశంలోనే తయారు చేస్తున్నారు. అమెరికాతో కలిసి టెలిస్కోపు నిర్వహణ, ఫలితాల విశ్లేషణ, అబ్జర్వేటరీకి అవసరమైన సాఫ్ట్‌వేర్‌లను భారత్ అందించనుంది. ప్రస్తుతం భారత్‌లో దాదాపు 30 మంది శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టుపై పని చేస్తున్నారు. అనేక మంది ఇంజనీర్లు, ఇతర సహాయ సిబ్బంది కూడా ఇందులో మమేకమయ్యారు. టీఎంటీలో భారత్ అందించే పలు పరికరాలు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ ఆచార్యులు అనుపమ పర్యవేక్షణలో తయారవనున్నాయి.

ఉపయోగాలివీ..

విశ్వ అన్వేషణకు, పరిశోధనలకు టీఎంటీ ప్రాజెక్టు మైలురాయిగా నిలువనుంది. మన సౌరకుటుంబంలోని వివిధ గ్రహాల వాతావరణ పరిస్థితులు, సూర్యునిపై వాతావరణాన్ని అధ్యయనంచేసే అవకాశం కలుగుతుంది. సౌరమండలం అవతల ఉన్న వివిధ నక్షత్రాలు, ఖగోళవస్తువులను గుర్తించి వాటిపై పరిశోధనలకు వీలుకల్పిస్తుంది. విశ్వంలో అంతుచిక్కని కృష్ణశక్తి గుట్టువిప్పడానికి సాయపడుతుంది.

ప్రపంచానికెంతో ఉపయోగం

టెలిస్కోపు తయారీ పనులు పెద్ద ఎత్తున జరగబోతున్నాయి. 2026నాటికి పూర్తి చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. పరిశోధనలు మొదలుపెడితే విశ్వంలో ఇమిడి ఉన్న అనేక రహస్యాలను తెలుసుకోవడానికి వీలుపడుతుంది. దీనివల్ల మానవాళికి ఎంతో ప్రయోజనకరం.

-జీసీ అనుపమ, ఆచార్యులు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్

కేసీఆర్ తాతయ్యతో మళ్లీ వస్తా

• కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన చిన్నారి నెహాల్

కాళేశ్వరం, న్యూస్‌టుడే: నీటిపారుదలశాఖ ప్రచారకర్తగా నియమితులైన చిన్నారి నెహాల్ శుక్రవారం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాలను సందర్శించాడు. తల్లిదండ్రులు రజని, హన్మంతరావుతో కలిసి కాళేశ్వరం వచ్చిన నెహాల్.. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కన్నెపల్లి పంపుహౌజ్ వద్దకు వెళ్లారు. కాళేశ్వరం బ్యారేజీ డీఈఈ ప్రకాశ్ ఆయా నిర్మాణాలను గురించి అడగ్గా చిన్నారి గడగడా సమాధానాలు ఇచ్చాడు. కన్నెపల్లి పంపుహౌజ్‌లో 17 పంపులుంటాయని.. 11 పంపులతో నిత్యం రెండు టీఎంసీల నీరు ఎత్తిపోస్తుందని, ఆరు పంపులను అత్యవసర సమయాల్లో వినియోగిస్తారని టక్కున సమాధానం చెప్పాడు. కన్నెపల్లి పంపుహౌజ్ విద్యుత్ కేంద్రం 440 మెగావాట్లతో ఉంటుందని, ప్రతి పంపు 40 మెగావాట్ల విద్యుత్తుతో నడుస్తుందని తెలిపాడు. అదే విధంగా కాలువ 13.2 కిలోమీటర్లు ఉంటుందని, దీని ద్వారా అన్నారం బ్యారేజీలో నీరు కలుస్తుందని పేర్కొన్నాడు. అక్కడి నుంచి సుందిళ్ల, మిడ్ మానేరు, ఎల్లంపల్లికి నీరు రివర్సు పంపింగ్ ద్వారా చేరుకుంటుందని వివరించాడు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ఎందుకు పునరాకృతి చేశారని విలేకరులు ప్రశ్నించగా నీటి లభ్యత తక్కువగా ఉండడంతో కేసీఆర్ తాతయ్య కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారన్నాడు. నిర్మాణాలు అనుకున్నదానికన్నా 100 శాతం రెట్టింపులో పనులు నడుస్తున్నాయన్నాడు. తిరిగి మళ్లీ ఎప్పుడు వస్తావు అని ప్రశ్నించగా కేసీఆర్ తాతయ్యతో కలిసి తప్పకుండా వస్తానని తెలిపాడు. తమ కుమారుడిని ఆలయ అధికారులు, కాళేశ్వరం బ్యారేజీ ఇంజినీర్లు స్వాగతించిన తీరును తాము జన్మలో మరిచిపోలేమని నెహాల్ మాతృమూర్తి రజని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీని కూడా వారు సందర్శించారు.



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాలను పరిశీలిస్తున్న నెహాల్

గుణదల మేరీమాత మహోత్సవాలు ప్రారంభం

గుణదల, న్యూస్‌టుడే: క్రైస్తవుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న గుణదల మేరీ మాత మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు విజయవాడలోని గుణదల కొండ దిగువున బిషప్ గ్రాసీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో నూతనంగా నిర్మించిన ఆధ్యాత్మిక కళావేదికపై బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, వికార్ జనరల్ ఫాదర్ యం.గాబ్రియేలు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టార్ ఏలేటి విలియం జయరాజు, ఫాదర్ డేవిడ్‌రాజు తదితరులు దీపారాధన చేసి లాంఛనంగా మూడురోజుల తిరునాళ్లను ప్రారంభించారు. అనంతరం కథోలిక గురువులు సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. భక్తులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు. సాయంత్రం లూర్దుమాత తేరు ఊరేగింపు గుణదల వీధుల్లో సాగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. విదేశీయులు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు.



సందేశమిస్తున్న బిషప్ జోసెఫ్ రాజారావు

వైద్య పరీక్షల కోసం ఆసుపత్రిలో చేరిన 'బిగ్ బీ'!

ముంబయి: బిగ్ 'బీ' అమితాబ్ బచ్చన్(75) వైద్య పరీక్షల నిమిత్తం శుక్రవారం సాయంత్రం ఇక్కడి లీలావతి ఆసుపత్రిలో చేరారు. ఆయన కేవలం సాధారణ వైద్యపరీక్షల నిమిత్తం మాత్రమే ఆసుపత్రిలో చేరినట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఎండోస్కోపీ పరీక్షలు కూడా పూర్తయిన తర్వాత ఆయనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయనున్నట్లు వెల్లడించారు. అమితాబ్ ఉదరసంబంధ ఇబ్బందితో అవస్థపడుతున్నారనీ ...మెడ, వెన్నునొప్పితో బాధపడుతున్నారంటూ వార్తలు వచ్చినప్పటికీ.. .అధికారికంగా వాటిని ఎవరూ ధ్రువీకరించలేదు. మేనెలలో విడుదలౌతుందని భావిస్తున్న ఆయన తదుపరి చిత్రం '102 నాట్ ఔట్' టీజర్‌ను శుక్రవారం ట్విటర్‌లో విడుదల చేసిన విషయం గమనార్హం.

3 వేల మందికి 'ప్రధాని' ఫెలోషిప్

• వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

• పథకం జాతీయ సమన్వయకర్తగా హైదరాబాద్ ఐఐటీ సంచాలకుడు దేశాయ్

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక సంస్థల్లో బీటెక్ చదువుతున్న విద్యార్థులకు పీహెచ్‌డీ చేసే అవకాశమిచ్చే ప్రధాన మంత్రి పరిశోధన ఫెలోషిప్(పీఎంఆర్ఎఫ్) వచ్చే విద్యాసంవత్సరం(2018-19) నుంచి ప్రారంభం కానుంది. ఏటా వెయ్యిమంది చొప్పున మూడేళ్లలో 3వేల మందికి ఫెలోషిప్ అందజేసి వారిని పరిశోధన వైపు వెళ్లేలా ప్రోత్సహించాలన్నది లక్ష్యం. ఈపథకానికి మొత్తం రూ.1650 కోట్లను కేంద్రం ఖర్చు చేయనుంది. పథకం జాతీయ సమన్వయకర్తగా హైదరాబాద్ ఐఐటీ సంచాలకుడు ఉదయ్ బి.దేశాయ్‌ను కేంద్ర మానవ వనరులశాఖ నియమించింది. మరో ఆరు ఐఐటీలు, ఐఐఎస్‌సీ సంచాలకులను సభ్యులుగా నియమించారు. ఏపీలోని తిరుపతి ఐఐటీ సంచాలకుడు ఆచార్య కె.ఎన్.సత్యనారాయణ ఇందులో ఉండటం విశేషం. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్)ల నుంచి ప్రతిభావంతులను ఎంపిక చేస్తారు. బీటెక్‌లో కనీసం 8 గ్రేడ్ సాధించడంతో పాటు పరిశోధనపై నిజంగా ఆసక్తి ఉన్నవారికి అవకాశమిస్తారు. పీహెచ్‌డీ చేయడానికి ఎంపికైతే తొలి రెండేళ్లు నెలకు రూ.70 వేలు, మూడో ఏడాది నెలకు రూ.75 వేలు, నాలుగు, అయిదు సంవత్సరాలు నెలకు రూ.80 వేల చొప్పున అందజేస్తారు. ఇతర దేశాల్లో పరిశోధన పత్రాలను సమర్పించడానికి ఏడాదికి రూ. 2 లక్షల చొప్పున అయిదేళ్లలో రూ.10 లక్షలు పరిశోధన నిధి కింద ఇస్తారు.

విద్య అందరికీ అందుబాటులోకి రావాలి: కోదండరాం



శివాజీనగర్ (నిజామాబాద్), న్యూస్‌టుడే: విద్యావ్యవస్థ అందరికీ సమానంగా అందుబాటులోకి రాకపోవడం వల్లే చాలామంది చదువుకు దూరమవుతున్నారని ఐకాస ఛైర్మన్ కోదండరాం అన్నారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం ప్రాంగణంలో జరిగిన పీడీఎస్‌యూ 2వ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. నాణ్యమైన విద్యను అందరికీ అందించే వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించడంలో తెరాస ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు నియంత్రించాలని తల్లిదండ్రులు ఉద్యమాలు చేయవలసిన పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. విద్యాశాఖ మంత్రి సొంత నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని, నిర్ణయాలన్నీ ముఖ్యమంత్రే తీసుకుంటున్నారనీ అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగ నియామకాల క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ స్పందించడంలేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు అక్రమ సంపాదనకు నిలయాలుగా మారాయని ఆరోపించారు. అవసరం లేని ప్రాజెక్టుల మీద నిధులను వృథా చేస్తూ విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే కాలంలో విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ పోరాటాలు కొనసాగించవల్సిన అవసరం ఉందన్నారు. మహాసభలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాము, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి మాధవరావు, ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టుల పునరాకృతి చేపట్టాలి

సర్కారును కోరిన ఇంజినీర్ల ఫోరం

ఈనాడు, హైదరాబాద్: అభివృద్ధిలో వెనుకబడిన తమ జిల్లాలో ప్రాజెక్టులను పునరాకృతి చేయాల్సి ఉందని 'పాలమూరు ఇంజినీర్ల ఫోరం' పేర్కొంది. శుక్రవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఫోరం, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు మాట్లాడారు. ప్రాజెక్టుల రూపును మార్చే అనుభవమున్న ముఖ్యమంత్రి... తమ ప్రాంతంలోని ప్రాజెక్టులకు జరుగుతున్న నష్టాన్ని అంచనావేసి, తిరిగి వాటిని పునర్నిర్మించాలన్నారు. జూరాల నుంచి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును మార్చి, శ్రీశైలం జలాశయ వెనుక భాగానికి మార్చడంతో కొత్త సమస్యలు మొదలయ్యాయన్నారు. నారాయణపేట, కొడంగల్, షాద్‌నగర్ నియోజకవర్గాలకు నీళ్లు తరలించడం కష్టంతో కూడుకున్నదన్నారు. ఈ ప్రాంతాలకు చేరువలోనే ఉన్న జూరాల జలాశయం నుంచి కాకుండా శ్రీశైలం నుంచి నీళ్లు తీసుకురావడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. పాలమూరు ఎత్తిపోతల్లోని కీలకమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వెనక్కు పోయిందన్నారు. నార్లాపూర్-డిండి (నల్గొండకు 30 టీఎంసీలు తీసుకెళ్లే పథకం) కింద నిర్మించే 120 కిలోమీటర్ల కాలువ కారణంగా... మూడు రిజర్వాయర్ల పరిధిలోని విలువైన భూములు, కల్వకుర్తి ఆయకట్టు దెబ్బతింటుందని, ఇది పోతిరెడ్డిపాడులా సమస్యాత్మకం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో చేపట్టిన పాలమూరు ఎత్తిపోతలను వదిలేసి, ఏ ప్రమాణాల ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అడుగుతున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. అన్యాయాలన్నింటినీ సరిదిద్దేందుకు ప్రాజెక్టుల పునరాకృతిని చేపట్టాలని ప్రభుత్వాన్ని ఇంజినీర్లు కోరారు. ఫోరం అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, రఘుమారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ఆచార్య హరగోపాల్, కన్వీనర్ రాఘవాచారి, తెఐకాస నాయకుడు జి.రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమ వసతిగృహాల్లో బస, భోజనం

అధికారులకు జ్యోతిబుద్ధప్రకాష్ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు తెలుసుకునేందుకు జిల్లా సంక్షేమ అధికారులు విద్యార్థులతో కలిసి వారానికోసారి భోజనం చేయాలని, నెలకు మూడుసార్లు అక్కడే నిద్రించాలని ఎస్సీ సంక్షేమశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్ సూచించారు. వసతిగృహాలకు అవసరమైన సామగ్రి, పుస్తకాలను ఆగస్టు నాటికే సమకూర్చుకునేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. శుక్రవారమిక్కడ సంక్షేమభవన్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో క్రీడలు, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. విద్యార్థుల ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ ఉపకారవేతనాలకు మంజూరు ఉత్తర్వులు ఈ నెలాఖరులోగా సిద్ధం చేసి, ట్రెజరీలకు పంపించాలని తెలిపారు. వసతిగృహాల్లో ప్రతిభ చూపిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎస్సీ ప్రత్యేక అభివృద్ధినిధిలో 'టాలెంట్ ఫండ్' పేరిట కొత్త కేటగిరీ చేర్చాలని ఎస్సీ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణాకర్ చేసిన ప్రతిపాదనకు అంగీకరించారు. విద్యార్థులు ఆయా అంశాల్లో పాల్గొనేందుకు అయ్యే ఖర్చును భరించడంతో పాటు నగదు ప్రోత్సాకాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమశాఖ జేడీ ఉమాదేవి, జిల్లా సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు పోత్రాహకం అందిస్తున్న ఎస్సీ సంక్షేమశాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రకాష్, కమిషనర్ కరుణాకర్, జేడీ ఉమాదేవి

పోలీసు స్టేషన్.. 'మీ నేస్తం'

• హైదరాబాద్ తరహా ఆదర్శ స్టేషన్లు

• రూ.100 కోట్లతో 300 అర్బన్ స్టేషన్ల అభివృద్ధి

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి





పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో వసతులు

ఏదైనా కేసుపై పోలీసుస్టేషన్‌లోకి వెళ్లాలంటేనే ఇప్పటికీ భయపడే వారు ఎంతో మంది. ఆయాచోట్ల పరిస్థితులు దారుణంగా ఉండటమే అందుకు కారణం. కానీ, ఆ పరిస్థితుల్ని హైదరాబాద్ మహానగర పోలీసులు మార్చేస్తున్నారు. ఈ చర్యలతోనే పంజగుట్ట పోలీసుస్టేషన్ దేశంలోనే రెండో అత్యుత్తమ స్టేషన్‌గా అవార్డు అందుకుంది. ఇప్పుడు ఇదే విధంగా రాష్ట్రంలోని 300 అర్బన్ పోలీసు స్టేషన్లను ఆదర్శ స్టేషన్లుగా మార్చాలని డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్ణయించారు. దీని కోసం రూ.100 కోట్లు వ్యయం చేయనున్నారు. మిగతా స్టేషన్లను దశలవారీగా మారుస్తారు.

హైదరాబాద్ నగరంలో 60 శాంతి భద్రతల, 25 ట్రాఫిక్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. నాలుగైదేళ్ల కిందటి వరకు భవన నిర్మాణపరంగా ఈ స్టేషన్ల పరిస్థితులు దారుణంగా ఉండేవి. వీటిని అత్యాధునికంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించడంతోపాటు నిధులను కేటాయించారు. దీంతో అప్పటి హైదరాబాద్ పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి.. ఆయా స్టేషన్లను ఆదర్శంగా మార్చే ప్రక్రియను మొదలుపెట్టారు. 11 స్టేషన్ల భవనాలు శిథిల స్థితిలో ఉండటంతో వాటిస్థానే కొత్తవాటి నిర్మాణం మొదలుపెట్టారు. మిగిలిన వాటి భవనాలను విస్తరించి కొత్తవిగా తీర్చిదిద్దారు. బాధితులకు సాంత్వన చేకూర్చేలా, సిబ్బంది ఉల్లాసంగా పనిచేసేలా అత్యాధునిక వసతులు వీటిలో ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో మొత్తం 827 పోలీసు స్టేషన్లు ఉండగా ఇందులో అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని 300 స్టేషన్లను ఆదర్శంగా మార్చాలని నిర్ణయించారు. రూ.100 కోట్ల పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులను మొదలుపెట్టబోతున్నారు.

ప్రత్యేకం పంజగుట్ట స్టేషన్..

పంజగుట్ట పోలీసుస్టేషన్ దేశంలోనే ఆదర్శంగా మారింది. ఈ స్టేషన్ గుమ్మంలోనే రిసెప్షన్ కేంద్రం ఉంటుంది. అక్కడ కానిస్టేబుల్ కూర్చొని ఉంటారు. బాధితులకు ఎలాంటి సాయం కావాలో అడిగి అక్కడే తోడ్పాటు అందిస్తారు. ఫిర్యాదు చేస్తే ఈ కౌంటర్‌లోనే ఆన్‌లైన్‌లో దాన్ని నమోదు చేస్తారు. అవసరమైతే తెల్లకాగితం ఇచ్చి అక్కడే ఫిర్యాదు రాయిస్తారు. ఇతరత్రా ఎటువంటి ఫిర్యాదుల సమాచారం తెలుసుకోవాలన్నా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

పోలీసుల పనితీరును మారుస్తాం



రాష్ట్రంలోని 827 పోలీసుస్టేషన్లలో పోలీసుల పనితీరును గణనీయంగా మార్చబోతున్నాం. ఇందులో భాగంగా మొదటి దశలో 300 స్టేషన్లపై దృష్టి సారించాం. పోలీసు శాఖ ఆధునికీకరణకు ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తున్నారు. ఆయన ఆదేశాలతోనే పనులు మొదలుపెట్టాం. రాబోయే అయిదారు నెలల్లో పోలీసుల పని తీరులో మార్పులు తీసుకొస్తాం. ఆరోపణలకు అతీతంగా పోలీసు శాఖ పని చేసేలా తీర్చిదిద్దబోతున్నాం. జనంతోనే పోలీసులు.. జనం మధ్యన పోలీసులు అన్న నినాదంతో ముందుకెళ్తాం.

- మహేందర్‌రెడ్డి, డీజీపీ

పాసు పుస్తకాలపై తహసీల్దారు డిజిటల్ సంతకం

ఈనాడు, హైదరాబాద్: భూ దస్త్రాల ప్రక్షాళన అనంతరం రైతులకు కొత్తగా అందజేయనున్న పట్టా పాసు పుస్తకాలపై ఆన్‌లైన్‌లోనే తహసీల్దారు సంతకం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎల్ఆర్‌యూపీ ఆన్‌లైన్ చివరిదశకు చేరుకోగా అప్‌లోడ్ పూర్తయిన మండలాలకు అంతర్జాలంలో కొత్త వెసులుబాటు కల్పించారు. ప్రతి రైతు పాసు పుస్తకాన్ని ఆన్‌లైన్‌లో తెరిచి దానిపై తహసీల్దారు డిజిటల్ సంతకం చేయనున్నారు. దీంతో అన్ని ప్రక్రియలు పూర్తయిన పాసుపుస్తకాన్ని ప్రభుత్వ ముద్రణాలయం ముద్రించి ఇచ్చే అవకాశం ఏర్పడనుంది. ఒక్కో పాసు పుస్తకం ముద్రణకు దాదాపు రూ.200 వ్యయం కానున్నట్లు అంచనాలు ఉన్నాయి. మరోవైపు ధరణి వెబ్‌సైట్ రూపకల్పన, నిర్వహణకు టెండర్ దాఖలు చేసిన టీఎల్ఎఫ్ఎస్ సంస్థను ఖరారు చేసే ప్రక్రియ చివరిదశలో ఉన్నట్లు టీఎస్‌టీఎస్ సంస్థ అధికారులు స్పష్టం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: సంరక్షణ అవసరమైన బాలబాలికలకు కుటుంబ వాతావరణంలో పెరిగే అవకాశాన్ని కల్పించేందుకు ఫాస్టర్‌కేర్ కార్యక్రమం కింద ఆసక్తి కలిగిన కుటుంబాల నుంచి తెలంగాణ బాలల పరిరక్షణ సొసైటీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వివరాలకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి, జిల్లా సంక్షేమ అధికారులను సంప్రదించాలని సూచించింది.

స్వీయ చిత్రాలు.. దొంగ సంతకాలు

• ఘరానా మోసాలకు పాల్పడిన నిందితుడి అరెస్టు

• ఇతర కేసుల్లో పట్టుబడిన మరో నలుగురు మోసగాళ్లు

ఈనాడు, హైదరాబాద్: మంత్రులు, రాజకీయ ప్రముఖుల ఇళ్లలో శుభకార్యాలకు హాజరై వారితో స్వీయ చిత్రాలు (సెల్ఫీలు) దిగడం.. ఐఏఎస్ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడం.. వాటిద్వారా అమాయకులను నమ్మించి రూ.లక్షల వసూళ్లకు పాల్పడటం.. ఈ తరహా మోసాల్లో రాటుదేలిన నిందితుడు కనుకుర్తి చంద్రశేఖర్‌ను మధ్యమండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. హుందాయ్ క్రెటా కారు, రెండు చరవాణులు, రబ్బరు స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావుతో కలిసి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నడకుదురు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ బి.ఫార్మసీ చదువుకున్నాడు. కొద్దినెలల క్రితం ప్రభుత్వ కాంట్రాక్టు ఇప్పిస్తానంటూ కోల్‌కతాకు చెందిన కౌశిక్ అనే గుత్తేదారు నుంచి రూ.50 లక్షలు తీసుకున్నాడు. తర్వాత కనిపించకపోవడంతో అతడు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



నిందితుడు కనుకుర్తి చంద్రశేఖర్

పల్స్ ఫార్మాకు టోకరా: తెలుగు రాష్ట్రాల్లో ఈఎస్ఐ, ప్రభుత్వ వైద్యశాలలకు మందులు సరఫరా చేసే కాంట్రాక్టు ఇప్పిస్తానంటూ తనకు పరిచయమైన పల్స్ ఫార్మా డైరెక్టర్ సురేష్ బాబును చంద్రశేఖర్ నమ్మించాడు. అక్కడ లైజన్ అధికారిగా చేరాడు. రెండు రాష్ట్రాల ఐఏఎస్ అధికారుల సంతకాలతో బోగస్ ఆర్డర్లు తయారు చేశాడు. మందులు కొనాలంటే రూ.12 లక్షలు లంచం ఇవ్వాలని సురేష్ బాబు వద్ద తీసుకున్నాడు. మొబిలైజేషన్ అడ్వాన్స్ కింద పల్స్‌ఫార్మా కంపెనీకి రూ. 7.72 కోట్లు చెల్లించాలంటూ తెలంగాణ ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణరావు సంతకం ఫోర్జరీ చేసి లేఖను సృష్టించాడు. దీన్ని పల్స్ ఫార్మా కంపెనీకి ఇవ్వగా.. వారు మల్లాపూర్‌లోని ఆంధ్రాబ్యాంక్ కార్యాలయంలో సమర్పించారు. ఆ బ్యాంకు మేనేజర్‌కు అనుమానం వచ్చి సచివాలయంలోని ఆంధ్రాబ్యాంక్ ఉన్నతాధికారులను సంప్రదించారు. వారు వెంటనే ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణరావు దృష్టికి తీసుకెళ్లగా.. తాను సంతకం చేయలేదని ఆయన స్పష్టం చేశారు. అధికారులు సైఫాబాద్ పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు చంద్రశేఖర్ కదలికలపై నిఘా ఉంచి పట్టుకున్నారు.

జీహెచ్ఎంసీలో ఉద్యోగాల పేరుతో.. : రాజేంద్రనగర్‌లో ఉంటున్న ఆర్.రాజశేఖర్, ఆర్.రమాకాంత్‌లు జీహెచ్ఎంసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతుండగా అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు తెలిపారు. వీరిద్దరూ ఐఏఎస్ అధికారి రాజేశ్వర్ తివారీ, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సంతకాలను ఫోర్జరీ చేసి లేఖలు సృష్టించారు. వాటి ఆధారంగా నియామక పత్రాలు ఇచ్చి, నిరుద్యోగులను మోసం చేసి రూ.లక్షలు వసూలు చేశారని వివరించారు.

ప్రసారభారతిలో కొలువంటూ..: గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ కార్యదర్శి, ఐఏఎస్ హర్‌ప్రీత్ సింగ్ సిఫార్సు చేసినట్టు ఆయన సంతకం ఫోర్జరీ చేసి ప్రసారభారతిలో ఇంజినీరుగా ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన ఇద్దరు నిందితులు డి.రోహిత్ కుమార్(23), టి.కాశీశ్వరరావు(24)లను అరెస్ట్ చేశామని కమిషనర్ తెలిపారు.

సెన్సెక్స్ ▼ 407 **34006**

నిఫ్టీ ▼ 122 **10455**

రూపాయి 64.40 ▼ (ఒక అమెరికా డాలరుకు) 14 పైసలు

బంగారం 30130 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 125

వెండి 37920 ▲ ముంబయిలో కిలో రూ.లలో 250

ముడి చమురు 62.92 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	23,444	–415
నాస్‌డాక్	6,649	–128
నిక్కీ 225 (జపాన్)	21,383	–508
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,377	–39
షాంఘై(చైనా)	3,131	–131
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,092	–78
డాక్స్ (జర్మనీ)	12,107	–152


డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.59	67.93
పౌండ్ స్టెర్లింగ్	81.64	94.68
యూరో	71.80	83.26
జపనీస్ యెన్/100	53.71	62.30
ఆస్ట్రేలియా డాలరు	45.58	52.73
సింగపూర్ డాలరు	43.97	52.10
థాయ్ బాత్/100	183.95	219.99
బహ్రెయిన్ దీనార్	158.65	181.81
కువైట్ దీనార్	177.51	220.97
ఒమన్ రియాల్	155.36	177.79
సౌదీ రియాల్	15.58	18.47
యూఏఈ దిర్హమ్	15.95	18.64
మలేషియా రింగిట్	14.57	17.92





అమెరికా మార్కెట్లు మరోసారి మనపై నష్టాల వర్షాన్ని కురిపించాయి. అక్కడి మార్కెట్ల క్షీణత ప్రభావం మన సూచీలపై తీవ్రంగానే కనిపించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 407 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 10,500 పాయింట్ల దిగువకు చేరడమే ఇందుకు నిదర్శనం. అమెరికా వడ్డీ రేట్లు పెరగొచ్చన్న ఆందోళనలు అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్ల నష్టాలకు కారణమయ్యాయి. అక్కడి బాండు రాబడులు గణనీయంగా పెరగడంతో అమెరికా మార్కెట్లు కుప్పకూలగా.. ఆ సెగ మనకు తాకింది.

కథ మళ్లీ మొదటికి...!!

అమెరికా షాక్‌తో మరోసారి డీలాపడ్డ స్టాక్ మార్కెట్లు ● సెన్సెక్స్‌కు 407 పాయింట్ల నష్టం

సమీక్ష


సూచీల లాభాలు ఒక్కరోజు ముచ్చటగా మిగిలాయి. అంతర్జాతీయ మార్కెట్ల బాటలోనే మన మార్కెట్లు నడిచాయి. విదేశీ మదుపర్లు స్థిరంగా అమ్మకాలు కొనసాగించడం సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా సెన్సెక్స్ నెల కనిష్ఠానికి చేరగా.. నిఫ్టీ కీలకమైన 10,500 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. వారం ప్రాతిపదికన చూస్తే సెన్సెక్స్ 1,060.99 పాయింట్లు, నిఫ్టీ 305.65 పాయింట్లు మేర నష్టాలు నమోదు చేశాయి. గత ఏడాది ఆగస్టు తర్వాత ఒక వారంలో సూచీ ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే మొదటిసారి. ఆసియా మార్కెట్లు నీరసపడగా.. ఐరోపా షేర్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

రోజంతా నష్టాల్లోనే..: ఇక శుక్రవారం మార్కెట్ల విషయానికొస్తే.. అమెరికా ధాటికి మన సూచీలు కకావికలమయ్యాయి. సెన్సెక్స్ ఆరంభం నుంచే నష్టాల బాటలో నడిచింది. ఉదయం 400 పాయింట్ల నష్టంతో 34,002.45 వద్ద బలహీనంగా ప్రారంభమైన సూచీ.. ఇంట్రాడేలో 33,849.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. అనంతరం స్వల్పంగా కోలుకున్నప్పటికీ.. చివరకు 407.40 పాయింట్ల నష్టంతో 34,005.76 వద్ద ముగిసింది. జనవరి 4 తర్వాత సూచీకిదే అత్యల్ప ముగింపు కావడం గమనార్హం. ఇక నిఫ్టీ సైతం 121.90 పాయింట్లు కోల్పోయి 10,454.95 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,398.20- 10,480.20 పాయింట్ల శ్రేణిలో చలించింది.

గ్లెన్‌మార్క్ ఢమాల్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభం 78 శాతం క్షీణించడంతో గ్లెన్‌మార్క్ ఫార్మా షేరు కుదేలైంది. ఇంట్రాడేలో 9.31 శాతం కుప్పకూలిన షేరు.. చివరకు 7.43 శాతం నష్టంతో రూ.535.10 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,211.18 కోట్లు తగ్గి రూ.15,098.82 కోట్లకు చేరింది.

✦ ఇక ఆకర్షణీయమైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో రిలయన్స్ కేపిటల్ షేరు రాణించింది. ఒకానొకదశలో 6.36 శాతం పెరిగిన షేరు.. చివరకు 5.01 శాతం లాభంతో రూ.493.65 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టాలు చవిచూశాయి. యెస్ బ్యాంక్ 2.84%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.33%,



హెచ్‌డీఎఫ్‌సీ 2.13%, ఇన్ఫోసిస్ 2.01%, యాక్సిస్ బ్యాంక్ 1.93%, భారతీ ఎయిర్‌టెల్ 1.80%, ఎస్‌బీఐ 1.68%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.66%, విప్రో 1.59%, బజాజ్ ఆటో 1.55%, టాటా మోటార్స్ 1.51%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.46%, అదానీ పోర్ట్స్ 1.35%, ఎల్ అండ్ టీ 1.33% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. టాటా స్టీల్ 1.83%, డాక్టర్ రెడ్డీస్ 0.73%, ఏషియన్ పెయింట్స్ 0.67%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో బ్యాంకింగ్ 1.75% నీరసపడింది. ఫైనాన్స్, టెలికాం, వాహన, టెక్, ఐటీ, యంత్ర పరికరాలు, చమురు-గ్యాస్ షేర్లు అదే బాటలో నడిచాయి. లోహ, స్థిరాస్తి, విద్యుత్ షేర్లు మాత్రం రాణించాయి.

అమెరికా మార్కెట్లు ఇలా

గురువారం అమెరికా ప్రధాన సూచీ డోజోన్స్ భారీ నష్టాన్ని మూటగట్టుకుంది. 4 శాతం కోల్పోయిన సూచీ 1000 పాయింట్లు డీలాపడింది. ఈ వారం ప్రారంభంలో డోజోన్స్ ఒకే రోజు 1175 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక ఎస్ అండ్ పీ 3.7 శాతం, నాస్‌డాక్ 3.9 శాతం చొప్పున నష్టపోయాయి. నిరుద్యోగం 45 ఏళ్ల కనిష్ఠానికి చేరినా.. అధిక ద్రవ్యోల్బణం వల్ల అమెరికాలో వడ్డీ రేట్ల పెంపు వేగవంతం కావొచ్చన్న అంచనాలే ఇందుకు కారణం. ఇదే జరిగితే వర్ధమాన మార్కెట్ల నుంచి విదేశీ నిధులు తరలిపోతాయన్న ఆందోళనలు పెరిగాయి. ఇక శుక్రవారం సైతం డోజోన్స్ నష్టాలు కొనసాగాయి. మరో 350 పాయింట్లు కోల్పోయింది.

ఎన్‌సీఎల్ 10% మధ్యంతర డివిడెండు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ వాటాదారులకు మధ్యంతర డివిడెండును ప్రకటించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూపాయి (10 శాతం) డివిడెండు చెల్లించాలని బోర్డు సిఫారసు చేసిందని ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ పేర్కొంది. స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన 2017, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి రూ.13.71 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.18.83 కోట్లుండి. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.241.95 కోట్ల నుంచి రూ.223.28 కోట్లకు పరిమితమైంది. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.639.49 కోట్ల ఆదాయం రూ.39.70 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

భారీగా క్షీణించిన రామ్‌కీ ఇన్‌ఫ్రా లాభం

ఈనాడు, హైదరాబాద్: రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లాభం భారీగా తగ్గింది. 2017, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన రూ.86.6 లక్షల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.27.63 కోట్లతో పోలిస్తే దాదాపు 97 శాతం క్షీణించింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం కూడా రూ.381.85 కోట్ల నుంచి రూ.367.79 కోట్లకు పరిమితమైంది. 2017-18 మొదటి తొమ్మిది నెలలకు రూ.1,061.78 కోట్ల ఆదాయంపై రూ.6.42 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

పెరిగిన సెంట్రల్ బ్యాంక్ నష్టం

దిల్లీ: మొండి బకాయిలకు కేటాయింపులు రెట్టింపు కావడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నష్టం మరింతగా పెరిగింది. గత ఏడాది ఇదే కాలానికి ముగిసిన త్రైమాసికానికి రూ.605.70 కోట్లు నష్టం ప్రకటించిన బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి రూ.1,664.22 కోట్లు నష్టం వచ్చినట్లు తెలిపింది. సమీక్షా త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.6,787.87 కోట్ల నుంచి రూ.6,589.32 కోట్లకు తగ్గినట్లు బ్యాంకు వెల్లడించింది. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.1,571.18 కోట్ల నుంచి రూ.3,081.56 కోట్లకు పెరగడంతో స్థూల నిరర్థక ఆస్తులు 14.14 శాతం నుంచి 18.08 శాతానికి, నికర నిరర్థక ఆస్తులు 8.54 శాతం నుంచి 9.45 శాతానికి చేరాయని బ్యాంకు తెలిపింది.

ఆంధ్రా పెట్రో లాభం రూ.16 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ద ఆంధ్రా పెట్రోకెమికల్స్ రూ.15.76 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం లాభం రూ.3.42 కోట్లు మాత్రమే. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం కూడా రూ.106.06 కోట్ల నుంచి రూ.143.63 కోట్లకు పెరిగింది. తొమ్మిది నెలలకు రూ.421.02 కోట్ల ఆదాయంపై రూ.40.85 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు కంపెనీ తెలిపింది.

అవంతీ ఫీడ్స్ లాభంలో 128% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: ఏకీకృత ప్రాతిపదికన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి అవంతీ ఫీడ్స్ నికర లాభం ఆకర్షణీయంగా పెరిగింది. ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 128 శాతం వృద్ధితో రూ.46.01 కోట్ల నుంచి రూ.105.06 కోట్లకు చేరినట్లు కంపెనీ తెలిపింది. ఇదే కాలానికి మొత్తం ఆదాయం రూ.539.97 కోట్ల నుంచి రూ.722.60 కోట్లకు పెరిగింది. తొమ్మిది నెలలకు ఆదాయం రూ.2,591.77 కోట్లు కాగా.. లాభం రూ.380.47 కోట్లుగా నమోదైంది.

జీఓసీఎల్ లాభం మూడింతలు

ఈనాడు, హైదరాబాద్: జీఓసీఎల్ కార్పొరేషన్ (గతంలో గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్) త్రైమాసిక లాభం మూడింతలైంది. ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 2017, డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.3.33 కోట్ల నుంచి రూ.10.05 కోట్లకు చేరింది. దాదాపు మూడింతలైంది. అధిక ఉత్పత్తి, వ్యాల్యూ ఇంజినీరింగ్ విభాగాల పనితీరు లాభం పెరగడానికి దోహదం చేశాయి. సమీక్ష త్రైమాసికానికి స్థూల ఆదాయం రూ.168 కోట్ల నుంచి రూ.140 కోట్లకు తగ్గింది. తొమ్మిది నెలలకు నికర లాభం రూ.21.32 కోట్ల నుంచి రూ.23.24 కోట్లకు చేరింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2017–18	2016–17	2017–18	2016–17
డ్రెడ్జింగ్ కార్పొరేషన్	(22.52)	14.04	122.90	153.94
మణప్పురం ఫైనాన్స్	173.34	202.54	872.78	900.51
ఎల్‌టీ ఫుడ్స్	38.55	33.15	958.42	789.03
జిల్లెట్ ఇండియా	58.77	54.75	407.52	396.82
యూకో బ్యాంక్	(1016.43)	(437.09)	3721.93	4864.21
మారికో	223.28	191.64	1641.74	1439.99
హోటల్ లీలా	40.65	(10.39)	229.86	174.98
అల్కెమ్ ల్యాబ్	180.87	236.26	1765.05	1507.32
ఎంఎఫ్‌సీఎల్	22.94	7.73	668.10	550.44
జీఈ టీఅండ్‌డీ	71.8	44.3	1438.6	1217.6
స్రైడ్స్ శాసన్	85.22	196.17	764.71	751.96
దీపక్ ఫర్టిలైజర్స్	57.58	51.63	1651.56	-------
ఎంఓఐఎల్	103.78	101.41	299.80	355.30
సుజ్లాన్ ఎనర్జీ	(32.68)	282.54	2237.37	3341.48
ఎస్‌కేఎఫ్ ఇండియా	86.15	65.34	700.49	715.10
ఆర్‌సీఎఫ్	17.92	61.85	2006.57	1701.72
శోభా	53.40	32.60	700.40	554.40
వాల్కో	722.00	144.00	2360.00	----

ఇ-ప్రగతి ప్రాజెక్టుకు పెగా సిస్టమ్స్ సేవలు

ఈనాడు, హైదరాబాద్: డిజిటలీకరణలో భాగంగా ప్రజలకు ఆన్‌లైన్‌లో నేరుగా సమగ్ర ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇ-ప్రగతి ప్రాజెక్టుకు ఆధార ప్లాట్‌ఫారమ్‌గా 'పెగా గవర్న్‌మెంట్ ప్లాట్‌ఫామ్'ను ఎంపిక చేశారని పెగా సిస్టమ్స్ ఇండియా ఎండీ ఇ.సుమన్ రెడ్డి తెలిపారు. ఇ-ప్రగతి ప్రాజెక్టు 33 ప్రభుత్వ విభాగాలను, 315 ఏజెన్సీలను, 745 సిటిజన్ సేవలను ప్రజలకు అనుసంధానం చేయడానికి నిర్దేశించింది. ప్రజలకు అందించే సేవల అప్లికేషన్లను పెగా సాఫ్ట్‌వేర్ ఆధారంగా అభివృద్ధి చేస్తారని సుమన్ రెడ్డి తెలిపారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్ర డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టుల్లో ఇ-ప్రగతి ఒకటని, ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం రూ.2,400 కోట్లు ఖర్చు చేయనుందన్నారు. 'పెగా గవర్న్‌మెంట్ ప్లాట్‌ఫారమ్' లైసెన్స్ ఒప్పందం అయిదేళ్లు ఉంటుందని వెల్లడించారు. అనేక దేశాలకు చెందిన కంపెనీలకు పెగా కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజిమెంట్, డిజిటల్ ప్రాసెస్ సేవలను, సొల్యూషన్లను అందిస్తోంది. పెగా ఇండియాకు ఖాతాదారులు ఇప్పటి వరకూ విదేశాల్లోనే ఉన్నారు. దేశీయ మార్కెట్‌లోకి ఇంత వరకూ అడుగు పెట్టలేదు. పెగా సిస్టమ్స్ ఇండియాకు హైదరాబాద్, బెంగళూరుల్లో అభివృద్ధి కేంద్రాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 1500 మంది నిపుణులు పని చేస్తున్నారు. ఇ-ప్రగతి ప్రాజెక్టుకు సాఫ్ట్‌వేర్‌ను అందించడం ద్వారా దేశంలో పెగా సిస్టమ్స్ తొలి ప్రాజెక్టును చేజిక్కించుకున్నట్లవుతుంది. భవిష్యత్తులో అనేక కాంట్రాక్టులను భారత్‌లో చేజిక్కించుకోగలమని సుమన్ రెడ్డి చెప్పారు.


సిండికేట్ బ్యాంక్ నష్టం రూ.870 కోట్లు

దిల్లీ: నిరర్థక ఆస్తులకు కేటాయింపులు పెంచడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సిండికేట్ బ్యాంక్ రూ.869.77 కోట్లు నష్టం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలానికి రూ.93.56 కోట్లు లాభం ఆర్జించినట్లు బ్యాంకు తెలిపింది. ప్రస్తుత సమీక్షా త్రైమాసికానికి గత ఏడాది డిసెంబరుతో ముగిసిన కాలంతో పోలిస్తే మొత్తం ఆదాయం రూ.6,554.04 కోట్ల నుంచి రూ.5,945.15 కోట్లకు తగ్గింది. సంఘటిత నిధి కింద మొత్తం కేటాయింపులు గత ఏడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే ప్రస్తుత సమీక్షా త్రైమాసికానికి రూ.784.74 కోట్ల నుంచి రూ.2,089.99 కోట్లకు పెరిగాయి. ఇందులో నిరర్థక ఆస్తులకు కేటాయింపులు రూ.232.59 కోట్ల నుంచి రూ.1948.80 కోట్లకు చేరాయి. నికర నిరర్థక ఆస్తులు 5.63% నుంచి 5.44 శాతానికి దిగి వచ్చాయి.

ఇండియా సిమెంట్స్ నిరాశ


చెన్నై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఇండియా సిమెంట్స్ లాభం 57 శాతం తగ్గినట్లు సంస్థ ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఏకీకృత నికర లాభం రూ.35.34 కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.15.24 కోట్లకు పరిమితమైంది. 2017-18 తొమ్మిది నెలల కాలానికి సంస్థ నికర లాభం, గత ఏడాది తొమ్మిది నెలలతో పోలిస్తే రూ.141.73 కోట్ల నుంచి రూ.65.35 కోట్లకు తగ్గింది. ప్రస్తుత సమీక్షా త్రైమాసికానికి మొత్తం ఆదాయం గతంతో పోలిస్తే రూ.1,270.95 కోట్ల నుంచి రూ.1,216.75 కోట్లకు తగ్గిందని సంస్థ వెల్లడించింది. ఇండియా సిమెంట్స్ వైస్ ఛైర్మన్, ఎండీ ఎన్.శ్రీనివాసన్ మాట్లాడుతూ "సమీక్షా త్రైమాసికంలో వ్యయాలు పెరగడంతోపాటు, తమిళనాడులో అమ్మకాలు తగ్గిపోవడంతో సవాళ్లు ఎదుర్కోవల్సి వచ్చింద"న్నారు.

హెచ్‌సీఎల్



రూ.935 వద్ద ప్రారంభమై రూ.922.55 - 970.60 మధ్య కదలాడి క్రితం ముగింపు 944.35తో పోలిస్తే రూ.19.65 (2.08%) లాభంతో రూ.964 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో చేతులు మారిన షేర్లు 17,28,253.

యెస్ బ్యాంక్



రూ.330 వద్ద మొదలై రూ.324-331.45 మధ్య చలించి క్రితం ముగింపు 335తో పోలిస్తే రూ.9.45 (2.82%) నష్టంతో రూ.325.55 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో 93,95,513 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
భారత్ ఫోర్జ్	776	గ్లెన్‌మార్క్ ఫార్మా	524.20
గెలాక్సీ సర్ఫెక్టంట్స్	1742.80	ఆంధ్రా బ్యాంక్	43.60
ఇన్ఫినిట్ కంప్యూటర్	478.40	ధనలక్ష్మి బ్యాంక్	22.80
లుమాక్స్ ఆటో	877	బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	18.50
పొలారిస్ కన్సల్టింగ్	469.35		
టీవీ టుడే	493.35		

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
09/02	3,563	4,915	–1,352	3,152	2,563	+589
08/02	4,396	6,693	–2,297	5,671	3,297	2,374
07/02	5,875	6,897	–1,022	4,011	3,550	461
06/02	5,874	8,200	–2,326	5,594	3,895	1,700
05/02	5,806	7,069	–1,264	4,890	3,726	1,164

9వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	350	వరంగల్	352
చిల్లరగా(ఒక గుడ్డు)	4.10	విశాఖపట్నం	345
బెంగళూరు	365	చెన్నై	380
10వ తేదీకి..		చిత్తూరు	373
విజయవాడ/గోదావరి	338	నమక్కల్	365

ఎన్‌ఎస్‌ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 399.00 (405.10) 2936187
AMBUJA CEMEN 258.90 (261.90) 1742418
ASIAN PAINTS 1130.75 (1124.05) 666922
AUROBIND PHA 589.50 (601.85) 5001450
AXIS BANK LT 557.55 (568.45) 5865587
BAJAJ AUTO L 3099.25 (3157.95) 175504
BAJAJ FINANC 1639.40 (1662.15) 703720
BHARTI AIRTE 422.50 (429.80) 4861350
BHARTI INFRA 341.50 (349.20) 3050243
BOSCH LTD 19482.60 (19592.25) 19118
BPCL 475.40 (478.20) 2862450
CIPLA 621.40 (612.65) 2373799
COAL INDIA L 300.15 (300.00) 4731060
DR. REDDYS 2193.80 (2180.45) 479123
EICHER MOTOR 27747.95 (28198.00) 33515
GAIL 462.45 (461.85) 1881540
HCL TECH 964.00 (944.35) 1728253
HDFC 1773.05 (1811.80) 2773971
HDFC BANK 1849.50 (1880.95) 1602238
HERO MOTOCOR 3546.10 (3582.20) 604849
HINDALCO IND 243.50 (245.20) 7024965
HINDUSTAN UN 1333.05 (1329.55) 810004
HPCL 395.70 (399.80) 11811951
ICICI BANK 326.75 (333.85) 9493398
INDIABULLS H 1288.40 (1314.40) 1678616
INDIAN OIL 378.65 (385.60) 4405890
INDUSINDBANK 1649.85 (1670.85) 1206481
INFOSYS LTD 1109.15 (1134.25) 2191345
ITC 271.35 (274.10) 14204123
KOTAK MAHIND 1032.00 (1051.75) 1898563
LARSEN & TOU 1329.25 (1347.40) 2029257
LUPIN 822.15 (812.45) 2767071
M&M 750.05 (752.20) 2214895
MARUTI SUZIK 8936.10 (9030.70) 364892
NTPC LTD 163.25 (163.70) 3765185
ONGC 187.35 (188.70) 7314145
POWER GRID C 193.20 (193.20) 8540478
RELIANCE IND 897.85 (904.55) 5294279
SBI 296.40 (301.40) 15750824
SUN PHARMA 582.70 (584.10) 3796079
TATA CONSULT 2971.70 (2974.20) 1051229
TATA MOTORS 368.75 (374.85) 8816777
TATA STEEL L 685.30 (671.45) 9140288
TECH MAHINDR 595.25 (608.25) 3481551
ULTRATECH 4153.30 (4167.00) 181041
UPL LIMITED 708.35 (718.05) 1245192
VEDANTA LIMI 316.30 (314.45) 9515144
WIPRO 285.00 (289.80) 3151977
YES BANK LTD 325.55 (335.00) 9395513
ZEE ENTERTAI 580.95 (584.80) 868462

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1590.80 (1594.85) 152775
ACC 1660.95 (1693.25) 478965
ASHOK LEYLAN 134.20 (134.15) 17062623
AVENUE SUPER 1177.80 (1165.55) 469818
BAJAJ FINSER 5059.35 (5057.25) 144600
BANK OFBAROD 156.25 (156.20) 6223913
BEL 156.30 (156.95) 2979529
BHEL 94.40 (95.15) 8587666
BRITANNIA 4641.15 (4628.00) 120741
CADILA HEALT 411.75 (405.20) 1645064
COLGATE PALM 1100.85 (1100.85) 270893
CONTAINER 1317.65 (1341.35) 137679
CUMMINS INDI 824.45 (839.60) 150859
DABUR INDIA 340.55 (340.30) 744243
DLF LIMITED 229.05 (229.35) 7906691
EMAMI LIMITE 1088.05 (1115.70) 140768
GLAXOSMI PHA 2466.25 (2461.65) 8985
GLENMARK PHA 535.20 (579.60) 6588431
GODREJ CONSU 1016.60 (1017.55) 255643
HAVELLS INDI 515.25 (520.90) 891993
HINDUSTAN ZI 303.55 (287.30) 5294692
ICICI PRU LI 415.10 (420.70) 665433
IDEA CELLULR 83.70 (85.55) 13065572
INTERGLOBE A 1258.65 (1255.90) 690826
JSW STEEL LT 309.35 (304.20) 6726146
LIC HOUS.FIN 511.85 (514.45) 2114572
MARICO LIMIT 297.20 (300.10) 622959
MCDOWELL 3194.00 (3154.50) 333151
MOTHERSON 359.95 (364.00) 1810554
MRF 70013.80 (70171.05) 4799
NHPC LTD 28.70 (28.70) 5087255
NMDC LTD 136.00 (133.70) 4129629
OIL INDIA 355.05 (362.10) 573610
ORACLE FIN S 4069.15 (4092.80) 34297
P&G HYG&HEAL 9310.00 (9273.65) 58488
PETRONET LNG 246.80 (248.90) 3675351
PIDILITE IND 878.20 (884.90) 486696
PIRAMAL ENTE 2633.75 (2705.80) 113681
PNB 156.80 (159.35) 9608396
POWER FIN CO 109.30 (110.15) 3653807
RURAL ELEC C 149.95 (150.55) 3059986
SAIL 93.95 (86.00) 44334778
SHREE CEMENT 17041.45 (17005.05) 16017
SHRIRAM TRAN 1311.30 (1337.60) 863164
SIEMENS 1229.40 (1226.00) 155707
SUN TV LTD 973.55 (1006.55) 1086075
TATA POWER 85.05 (85.05) 3539836
TITAN IND 796.80 (800.75) 1564899
TORRENT PHAR 1434.35 (1380.85) 228837

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 186.95 (188.85) 868446
ADANI ENTERP 210.10 (204.50) 6060617
ADANI POWER 33.80 (32.80) 13839094
ALL BANK 59.50 (59.30) 2493842
AMARA RAJA 800.10 (809.65) 328643
ANANT RAJIND 59.35 (59.75) 1666228
ANDHRA BANK 47.25 (47.25) 4409590
APOLLO HOSPI 1122.70 (1131.80) 236165
APOLLO TYRES 270.80 (269.75) 2254834
APTECH 272.80 (268.15) 473802
BAJAJ ELECT. 537.00 (510.15) 1221873
BAJAJ HIND 14.00 (13.65) 5496545
BAJAJ HOLDIN 2693.80 (2709.75) 6149
BALAJI TELE 144.65 (144.15) 96720
BALLARPUR IN 15.20 (15.25) 1314290
BALRAMPUR CH 120.40 (119.90) 6443942
BANK OF MAHA 18.80 (19.00) 488173
BANK OFINDIA 142.20 (142.35) 3180829
BATA INDIA 714.90 (710.55) 567632
BGR ENERGY S 121.90 (123.40) 71628
BHARAT FORGE 762.80 (761.20) 3003733
BHUSHAN STEE 53.05 (52.25) 7629380
BIOCON LTD 606.95 (614.90) 1527841
BOMBAY DYE 245.10 (242.25) 8964229
CANARA BANK 321.15 (323.15) 2570155
CEAT LIMITED 1548.70 (1524.70) 797724
CENTRAL BANK 67.40 (67.00) 783594
CHAMBAL FERT 155.05 (156.60) 502479
CHENNAI PETR 376.40 (372.90) 1245868
CITY UNIBANK 162.25 (162.25) 1133364
CORPO BANK 35.60 (35.85) 209796
COX & KINGS 250.65 (255.35) 44180
D B REALTY L 56.00 (53.35) 1248095
DELTA CORP L 350.75 (335.95) 4113255
DENA BANK 22.40 (22.75) 1465262
DHANALAKBANK 24.40 (25.65) 994968
DIVIS LAB 1016.55 (1029.90) 472189
EDELWEISS CA 250.00 (259.60) 1940976
EID PARRY 326.45 (326.50) 105144
EIH 181.10 (180.05) 229920
ESSAR SHIPPI 26.05 (26.25) 26079
ESTER INDUST 65.40 (62.30) 244298
EXIDE INDUST 208.25 (209.85) 2369594
FEDERAL BANK 94.85 (94.75) 5325441
FINOLEX CABL 669.95 (676.10) 19565
G E SHIP LTD 395.15 (389.25) 32054
GAMMON INFRA 3.20 (3.20) 3194550
GATI LIMITED 116.65 (117.30) 766692
GITANJALIGEM 58.70 (56.35) 2456688
GMR INFRASTR 19.55 (19.35) 34887960
GODREJ IND 550.05 (551.25) 342194
GRASIM IND 1108.95 (1108.65) 798027
GUJ ALK&CHEM 742.95 (730.15) 182461
GUJ NRE COKE 0.90 (0.95) 2115235
HCL INFOSYS 57.70 (55.50) 3774181
HDFC BANK 1909.00 (1936.00) 110000
HEXA TECH 341.20 (337.35) 1971739
HIMACHAL FUT 30.70 (28.40) 20047876
HOUSING DEV 51.55 (52.55) 11191822
IDBI 62.75 (61.60) 7582351
IDFC 53.25 (53.80) 3014128
IFCI 23.40 (23.35) 10191660
IL&FS TRANS 75.80 (76.30) 400730
IND SWIFTLAB 66.55 (63.40) 49635
INDBULLS REL 227.60 (212.70) 23667077
INDIA CEM 161.40 (161.35) 7985869
INDIAN BANK 339.40 (340.45) 526269
INDO RAMA SY 37.70 (38.45) 143772
INDRAPRASTHA 289.55 (290.20) 2934374
IND-SWIFTLTD 9.40 (9.00) 40069
INGERSOLL-R 745.00 (743.00) 10992
IOB 20.90 (21.05) 911316
IPCA LAB 620.05 (593.35) 1893767
IRB INFRA DE 221.90 (222.95) 1093074
J&K BANK 70.20 (70.65) 295424
JAI CORP 161.50 (159.50) 2403112
JAIN IRRIGAT 118.15 (115.00) 15323838
JAYPEE INFRA 14.95 (14.90) 1816839
JAYSHREE TEA 111.05 (107.50) 136383
JET AIRWAYS 791.70 (776.55) 4967663
JINDAL SAW 134.05 (134.90) 2297630
JINDAL STEEL 272.65 (266.30) 15474462
JK LAKSHMI C 415.10 (419.25) 48117
JK PAPER LIM 140.80 (139.60) 495513
JM FINANCIAL 150.00 (158.00) 1365171
JP ASSOCIATS 17.50 (17.75) 50821831
JSW ENERGY L 82.50 (82.60) 2454333
JUBILANT FOO 1998.70 (1999.90) 665951
JUBILANT ORG 942.10 (970.20) 724616
JYOTHY LABS 352.35 (353.00) 14527
JYOTI STRUC 10.60 (10.50) 294695
KARNATA BANK 135.95 (136.35) 1662834

ఘనం (+)

నిఫ్టీ	9న	మార్పు %
HCL TECH	964.00	2.08
TATA STEEL	685.30	2.06
CIPLA	621.40	1.43
LUPIN	822.15	1.19
DR. REDDYS LAB	2193.80	0.61
ASIAN PAINTS	1130.75	0.60
VEDANTA	316.30	0.59
HUL	1333.05	0.26

గ్రహణం (-)

నిఫ్టీ	9న	మార్పు %
YES BANK	325.55	-2.82
INFOSYS	1109.15	-2.21
BHARTI INFRATEL	341.50	-2.21
TECH MAHINDRA	595.25	-2.14
HDFC	1773.05	-2.14
ICICI BANK	326.75	-2.13
AUROBINDO PHA	589.50	-2.05

KEC INTL LTD 357.55 (355.00) 851669
KOLTE PATIL 326.55 (328.70) 229438
KPIT CUMMINS 215.25 (221.15) 3531882
L&TFIN.HOLD 163.50 (163.20) 4285346
LAK VIL BANK 124.50 (126.40) 599571
M & M FINANC 444.30 (449.20) 1998434
MANAPPURAM G 104.35 (108.60) 6314872
MMTC LIMITED 56.75 (55.95) 1844345
MPHASIS LTD 897.60 (872.05) 369172
MRPL 118.75 (118.05) 1254990
MTNL 22.40 (22.85) 1272942
NAGARJUNA OI 3.90 (3.95) 323585
NCC LIMITED 114.25 (113.90) 3899571
NETWORK18 FI 51.60 (50.80) 478160
NEULAND LAB 695.80 (700.55) 12725
NIIT LTD 96.75 (98.40) 266246
NIIT TECHNOL 829.95 (827.85) 515853
OMAXE LTD 228.80 (229.10) 490230
ONMOBILE GLO 50.65 (51.05) 356960
ORIENT PAPER 40.45 (41.40) 444477
ORIENTALBANK 110.30 (110.05) 1956701
PARSVNATH DE 22.25 (21.55) 122621
PATEL ENGG 71.55 (72.45) 351472
PFIZER 2309.30 (2267.95) 23293
POLARIS SOFT 469.30 (463.55) 397063
POWERTRADING 99.05 (96.30) 2185660
PRAJ IND 94.95 (97.35) 891301
PRISM CEMENT 133.25 (133.45) 1071867
PROVOGUE (IN 5.50 (5.55) 443789
PUNJ LLOYD 21.85 (21.65) 1824582
PUNJAB & SIN 41.60 (41.55) 70870
PURAVANKARA 153.35 (156.60) 401879
PVP VENTURES 7.20 (6.95) 273696
PVR LIMITED 1396.60 (1414.15) 232769
RADICO KHAIT 335.45 (338.50) 1596719
RAJESH EXPOR 812.45 (810.75) 204367
RALLIS INDIA 229.35 (233.00) 189396
RAMCO IND 253.00 (263.65) 298882
RAMCO SYS 458.20 (460.80) 20910
RAMKY INFRA 202.95 (200.80) 374144
RAYMOND 966.15 (966.25) 670273
RELIANCE CAP 494.70 (470.15) 12044249
RELIANCE COM 27.00 (26.55) 104526292
RELIANCE INF 451.50 (444.20) 3132223
RELIANCE POW 44.90 (42.20) 17106102
ROLTA INDIA 68.70 (66.40) 1805145
SAGAR CEMENT 988.45 (967.30) 11393
SAREGAMA 762.95 (733.70) 269992
SHANTHI GEAR 141.55 (144.65) 20787
SHIPPNG CORP 77.40 (76.25) 935022
SHREE RENUKA 15.65 (15.30) 5588449
SINTEX IND 22.35 (22.75) 2795686
SOBHA DEVELO 567.15 (559.85) 864020
SOUTHINDBANK 27.50 (27.70) 6186935
SRS LIMITED 1.25 (1.30) 3240769
STERLITE TEC 346.15 (332.30) 2209189
SUJANA METAL 1.40 (1.40) 115049
SUN PHARMA 440.25 (432.05) 318748
SUND FASTNER 529.65 (524.55) 76521
SUZLON ENERG 13.50 (13.25) 38953133
SYND. BANK 65.00 (65.40) 3041785
TATA CHEM 700.75 (708.15) 1210510
TATA COFFEE 138.80 (140.45) 432595
TATA COMMUN 638.10 (618.95) 730373
TATA GLOBAL 278.25 (280.45) 3121544
TATA METALIK 832.15 (835.60) 111452
TATA MOT DVR 207.10 (210.90) 1958642
TATA TELESER 6.50 (6.60) 511487
THE INDIAN H 136.95 (136.85) 982808
TORRENT POWE 268.50 (257.50) 2067974
TRIVENI ENGG 66.60 (65.15) 1239410
TTK PRESTIGE 7040.85 (7000.15) 28864
TV TODAY NET 478.65 (456.80) 244774
TV18 BROADCA 55.40 (54.70) 4138109
TVS MOTOR 664.80 (666.20) 914427
UCO BANK 29.20 (29.55) 1083529
UNION BANK 126.25 (125.15) 3752919
UNITECH 7.50 (7.55) 21230851
UNITED BANK 15.15 (15.40) 553221
UNITED BREWE 1063.35 (1059.40) 252701
USHA MARTIN 23.65 (22.55) 1103302
VADILAL INDU 847.60 (852.90) 5967
VENKYS 2771.15 (2841.75) 84225
V-GUARD IND 218.00 (218.85) 547414
VIJAYA BANK 61.10 (60.15) 1633104
VIP 356.45 (354.05) 237683
VOLTAS 593.70 (600.20) 749611
ZEE LEARN LI 43.25 (43.45) 340932
ZUARI GLOBAL 217.70 (219.65) 433434
ZYDUS WELLNE 1147.20 (1146.90) 23831

ALPHAGEO 848.60 (861.35) 4296
AMAR RAJA BA 798.45 (810.20) 12549
ANDHRA BANK 47.20 (47.20) 473861
ANDHRA CEMEN 11.88 (12.02) 28057
ANDHRA PAPER 342.95 (325.10) 24020
ANDHRA PETRO 64.60 (68) 589893
ANDHRA SUGAR 507.75 (500.05) 5828
ANJANI PORTL 211.50 (209.75) 1802
ASTRA MICROW 105.15 (106.65) 54701
AUROBINDO PH 590.15 (601.90) 448272
AVANTEL SOFT 605.50 (568.70) 29521
AVANTI FEEDS 2437.95 (2523.20) 26886
BALAJI AMIN 644 (637.95) 10709
BARTRONICS 13.39 (13.50) 19336
BHAGIRA CHEM 287.60 (293.30) 1038
BHAGYA NAG 43.70 (43.20) 15934
BRILLIANT SE 12.30 (12.25) 424297
CAMBRIDGE TE 81.60 (80.05) 9564
CONT COFFEE 294.10 (298.55) 5765
COROMAN FERT 532.70 (545.85) 5883
CYBERMATE 3.69 (3.43) 128253
CYIENT LIMIT 628.05 (624) 6447
DECCAN CEMEN 574.85 (581.50) 529
DIVI'S LAB 1016.75 (1028.60) 26072
DR REDDY 2194.80 (2178.95) 49074
FOUR SOFT 93.75 (96.20) 2234
GATI CORPN 116.85 (117.05) 134240
GMR INFRASTR 19.65 (19.35) 4022695
GOLDST INFRA 194.70 (198.70) 19855
GRANULES (I) 118.80 (118.55) 152403

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 20.30 (19.65) 2238067
HBL NIFE POW 57.60 (59.25) 174708
HERITAGE FOO 702.15 (696.80) 104069
HYD INDUS 1693.30 (1712.85) 3121
IDL INDUSTRS 600.45 (601.65) 2809
ILFS ENGINEE 48.40 (46.85) 14133
IVRCL INFRAS 4.93 (5.06) 73458
KAKATIYA CEM 313.75 (314.85) 7228
KAVERI SEED 477.50 (473.50) 34668
KCP LTD 136.85 (138.50) 56575
KERNEX MICRO 41.65 (43.55) 16846
KNR CONSTRUC 310.35 (306.65) 29162
LANCO INDUS 370.90 (367.80) 22568
LANCO INFRAT 1.36 (1.38) 3498429
LAURUS LABS 515.40 (507.65) 105732
MADHUCON PRO 30.35 (30.05) 28241
MEGA SOFT 14.40 (14.49) 17039
MIC ELECTRON 7.94 (7.97) 39914
MOLDTK PLA 346.15 (349.45) 9155
NAGARJAGRICH 47.15 (47.75) 63870
NATCO PHARMA 812.35 (826.75) 36518
NAVA BH VENT 147.65 (147.70) 38549
NCC 114.35 (113.70) 344722
NEHA INTER 8.61 (8.37) 25703
NEULAND LAB 696.70 (701.65) 1362
NIHAR INFO 13.80 (13.25) 508
NILE 882.85 (880.20) 4237
OIL COUNTRY 45.05 (46.45) 16035
PANYAM CEMEN 54 (55.25) 30790
PENNER IND 64.80 (59.55) 266591
PIONEER DIST 194.95 (197.05) 202
PITTI LAMIN 88.40 (85.40) 25899
PREMIER EXPL 406.40 (411.45) 2805
PRISM CEMENT 133 (133.70) 290762
PRUDENTL PHA 4.91 (4.95) 237043
RAIN INDUSTR 391.65 (383.40) 820996
SAGAR CEM 988.45 (981.15) 3454
SAMKRG PIST 308.10 (310.70) 7504
SATVAH. ISPA 25.20 (25.30) 20873
SMS PHARMA 95.10 (95.75) 12262
SPHERE GLOBA 37.75 (38.50) 5266
SRINIVASA SH 63.90 (67.65) 51605
STEEL EXCHAN 33.10 (31.55) 44387
SUJANA TOWER 4.11 (4.12) 10638
SURYALATA SP 167.05 (158) 5686
SUVEN PHARMA 195.40 (197.85) 38463
TAJ GVK HOTE 175.40 (174.60) 20546
TANLA 32.05 (32.65) 103415
TERA SOFTWAR 61.15 (63.55) 1507
TRANS BIOTEK 2.19 (2.24) 26253
VICEROY HOTE 17.10 (16.15) 117256
VIMTA LABS 197.70 (194.75) 6590
VISAKA IND 698.15 (680.90) 12106
VISTA PHARMA 41.95 (40.05) 39254
VIVIMED LABS 85.45 (86.40) 103065
YBRANT DIGIT 5.98 (6.03) 1278113
ZENTECH 114.55 (117.85) 33120

ఈనాడు బిజినెస్



యమహా: కొత్త వైజడ్‌ఎఫ్‌-ఆర్‌3

ధర రూ.3.48 లక్షలు

గ్రేటర్ నోయిడా: ఇండియా యమహా తన కొత్త స్పోర్ట్స్ బైక్ వైజడ్‌ఎఫ్‌-ఆర్‌3ని శుక్రవారమిక్కడ జరిగిన వాహన ప్రదర్శనలో ఆవిష్కరించింది. దీని ధర రూ.3.48 లక్షలు(ఎక్స్‌షోరూం దిల్లీ). ఈ కొత్త బైకులో డ్యూయల్ చానెల్ యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్(ఏబీఎస్) సాంకేతికతను వాడారు. కేవలం కొన్ని అధీకృత డీలర్‌షిప్‌ల వద్ద మాత్రమే ఇది లభ్యమవుతుంది. బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహాం సమక్షంలో దీనిని ఆవిష్కరించారు. 4 స్ట్రోక్, 321 సీసీ ఇంధన ఇంజెక్టెడ్ ఇంజిన్‌తో ఇది తయారైంది.



ఇసుజు మోటార్స్: 2018 వి-క్రాస్

భారత్‌లోనే తొలి అడ్వెంచర్ యుటిలిటీ వాహనం ఇసుజు డిమాక్స్ వి-క్రాస్‌తో పాటు.. అయిదు సీట్లుండే పికప్ క్యాబ్ 'డిమాక్స్ ఎస్-క్యాబ్'ను శుక్రవారమిక్కడ ఇసుజు మోటార్స్ ఆవిష్కరించింది. 2018 వి-క్రాస్‌లో ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్(ఈఎస్‌సీ), ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్(టీసీఎస్), ఆటో క్రూయిజ్ కంట్రోల్, పగలు వాడే ల్యాంప్(డీఆర్ఎల్), వెనక వైపు కెమేరా వంటి సదుపాయాలున్నాయి. ఇక ఎస్-క్యాబ్‌లో ఎక్కువ గ్రౌండ్ క్లియరెన్స్, అధికంగా బరువులు మోసే సామర్థ్యం తదితర ప్రత్యేకతలున్నాయి.

ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో మరో కొత్త పరిణామం

ఆ రూ.500 కోట్లు అలా వచ్చాయా?

కీలకంగా మారిన ప్రమోటర్ల అప్పు వ్యవహారం

- పూర్తి హామీతో షరతులకు లోబడే ఇచ్చామంటున్న కంపెనీ
- లెక్క తేలాకే త్రైమాసిక ఫలితాలపై ఆడిటర్ల సంతకం!
- సింగ్ సోదరుల రాజీనామాతో 18% పెరిగిన షేరు



శివిందర్ సింగ్ మల్వీందర్ సింగ్

ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో సింగ్ సోదరుల వ్యవహారం మరో కొత్త మలుపు తిరిగింది. వాళ్ల రాజీనామాతో కేసుల గోల నుంచి బయటపడినట్లే నని భావించిన కంపెనీకి.. మరో చిక్కువచ్చి పడింది. సింగ్ సోదరులకు ఏడాదిక్రితం ఇచ్చిన రూ.500 కోట్ల రుణమే ఇందుకు కారణం. ఈ అప్పు లెక్క తేలే వరకు త్రైమాసిక ఫలితాలపై సంతకం చేసేది లేదంటూ ఆడిటర్లు చెప్పినట్లు తెలుస్తోంది. నిబంధనలకు లోబడి పూర్తి హామీతోనే రుణం ఇచ్చామని త్వరలోనే వాళ్లు తిరిగి చెల్లిస్తారని భావిస్తున్నామని అటు కంపెనీ సమర్థించుకుంది. ఈ రూ.500 కోట్ల అప్పు వ్యవహారాన్ని ఇటీవల కంపెనీల్లో చోటు చేసుకున్న పరిణామాలకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో ఇప్పుడు విశ్లేషకులు చూస్తున్నారు.

ఫోర్టిస్ హెల్త్‌కేర్ అంటే దేశీయ కార్పొరేట్ ప్రపంచంలో ఎవరికైనా తక్కున గుర్తొచ్చేది ఆ ఇద్దరే. సింగ్ సోదరులుగా ప్రసిద్ధి చెందిన వారి పేర్లు మల్వీందర్ మోహన్ సింగ్, శివిందర్ మోహన్ సింగ్. కంపెనీ ప్రమోటర్లుగా ఉన్న ఈ అన్నదమ్ములు గురువారం హఠాత్తుగా బోర్డు డైరెక్టరు పదవులకు రాజీనామా చేశారు. ఇదే కారణంతో శుక్రవారం కంపెనీ షేరు ఆరంభంలోనే భారీ లాభాల్లో కదలాడింది. దీనికి తోడు ఫోర్టిస్ హెల్త్‌కేర్‌ను విలీనం చేసుకునేందుకు టీపీజీకి చెందిన మణిపాల్ హాస్పిటల్ జరుపుతోన్న చర్చలు తుది దశకు చేరుకున్నాయన్న వార్త కూడా ఇందుకు కలిసొచ్చింది. అయితే ఫోర్టిస్ హాస్పిటల్స్ నుంచి సింగ్ సోదరులు తీసుకున్న రూ.500 కోట్ల రుణానికి లెక్క చెప్పేంతవరకు రెండో త్రైమాసిక ఫలితాల ఆడిటింగ్ పత్రాలపై సంతకం చేసేందుకు డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ ఎల్ఎల్‌పీ నిరాకరించిందన్న వార్తతో లాభాలు కాస్త తగ్గాయి. అయినప్పటికీ ఆఖరుకు కూడా ఆకర్షణీయ లాభాలతోనే షేరు ముగిసింది.

✦ అప్పు.. ఆడిటింగ్

ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు చెందిన ఫోర్టిస్ హాస్పిటల్స్ నుంచి సింగ్ సోదరులు బోర్డు అనుమతి లేకుండా రూ.500కోట్లు (7.8 కోట్ల డాలర్లు) రుణం తీసుకున్నారు. స్వల్పకాలిక పెట్టుబడుల కింద ఏడాదిక్రితం ఈ రుణాన్ని ఇచ్చినట్లు ఫోర్టిస్ హెల్త్‌కేర్ తెలిపింది. అయితే ఈ రుణాలను పూర్తి హామీతో, నియంత్రణ నిబంధనలకు అనుగుణంగానే ఇచ్చామని పేర్కొంది. 2018-19 తొలి త్రైమాసికం చివరికల్లా కంపెనీకి ఈ రుణాన్ని ప్రమోటర్లు తీరుస్తారని భావిస్తున్నామని వివరించింది. అయితే ఈ రుణం తిరిగి చెల్లించడం లేదా పద్దులో చూపించేంత వరకు రెండో త్రైమాసిక ఫలితాల ఆడిట్ పత్రాలపై సంతకం చేయబోమని డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వార్తలను కంపెనీ ఖండిస్తూ.. రెండో త్రైమాసిక ఫలితాలను ఇంతవరకు డైరెక్టర్ల బోర్డు ఎదుట ఉంచలేదని తెలిపింది. ఇదే విషయాన్ని 2017 నవంబరు 14న ఎక్స్ఛేంజీలకు తెలిపామని వివరించింది. రెండో, మూడో త్రైమాసిక ఫలితాల ఆడిటింగ్ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. ఫిబ్రవరి 13న జరిగే బోర్డు సమావేశంలో వీటిని పరిశీలనకు ఉంచుతామని తెలిపింది.

✦ రాజీనామా వెనక

సింగ్ సోదరులు రాజీనామా చేయడానికి కొన్ని వరుస ఉదంతాలు నేపథ్యంగా పనిచేశాయి. జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ దైచీ శ్యాంక్యోకు అనుకూలంగా ఇటీవల దిల్లీ హైకోర్టు తీర్పు ఇవ్వడం ఇందులో ప్రధానమైనది. ఈ పరిణామం చోటుచేసుకున్న కొన్ని రోజులకే వీళ్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రమోటర్లకు సంబంధించి ఎలాంటి కేసులు, ఇతరత్రా వివాదాలు కంపెనీ కార్యకలాపాలకు విఘాతం కలగకుండా సజావుగా సాగే ఉద్దేశంతోనే వాళ్లు రాజీనామా చేసినట్లు భావిస్తున్నామని అటు కంపెనీ చెబుతోంది.

✦ ఇదీ కేసు

ర్యాన్‌బాక్సీ షేర్లను తమకు విక్రయించే సమయంలో అమెరికా ఆహార ఔషధ, నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తనిఖీల విషయాన్ని సింగ్ సోదరులు దాచిపెట్టారన్నది దైచీ శాంక్యో అభియోగం. సింగ్ సోదరులు చేసిన ఈ పనికి ర్యాన్‌బాక్సీ ఇండియాకు సంబంధించి సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారం నిమిత్తం అమెరికా న్యాయస్థానంలో 50 కోట్ల డాలర్ల జరిమానాను చెల్లించాల్సి వచ్చిందని, దీనికి న్యాయం చేయాల్సిందిగా సింగపూర్ కోర్టును జపాన్ కంపెనీ ఆశ్రయించింది. కీలక సమాచారాన్ని దాచిపెట్టారన్న ఆరోపణ నిజమేనని తేల్చిన కోర్టు దైచీ శ్యాంక్యోకు రూ.2,562 కోట్లు కట్టాల్సిందిగా సింగ్ సోదరులకు ఆదేశం ఇచ్చింది. ఈ మొత్తాన్ని సింగ్ సోదరుల నుంచి ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా 2016లో తిరిగి దిల్లీ హైకోర్టులో దైచీ శ్యాంక్యో పిటీషన్ వేసింది. ఈ పిటీషన్‌ను స్వీకరించిన దిల్లీ హైకోర్టు దైచీ శ్యాంక్యోకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. సింగపూర్ కోర్టు చెల్లించమన్న రూ.2,562 కోట్లకు వడ్డీ, న్యాయవాదుల రుసుం కలిపి మొత్తం రూ.3,500 కోట్లు చెల్లించమని సింగ్ సోదరులకు ఆదేశం ఇచ్చింది.

✦ దైచీతో సంబంధం ఎలా..

ర్యాన్‌బ్యాక్సీ ఇండియాకు గతంలో సింగ్ సోదరులు ప్రమోటర్లుగా ఉన్నారు. ఆ తర్వాత 2008లో ర్యాన్‌బాక్సీలోని తమ షేర్లను రూ.9,576.10 కోట్లకు దైచీ శాంక్యోకు వీళ్లు విక్రయించారు. అనంతరం 2015లో ర్యాన్‌బాక్సీలోని దైచీ శాంక్యో వాటాను రూ.22,679 కోట్లకు సన్ ఫార్మా సొంతం చేసుకుంది.

✦ ఎవరెవరికి ఎంతెంత..

2017 డిసెంబరు 31 నాటికి ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు మొత్తంగా 51,86,17,631 షేర్లు ఉన్నాయి. ఇందులో ఇరువురు అన్నదమ్ములు 11,508 చొప్పున షేర్లను కలిగి ఉన్నారు. వివిధ సంస్థల్లో ప్రమోటర్ల గ్రూపు మొత్తం వాటా 34.43 శాతం.

శుక్రవారం ఫోర్టిస్ షేరు కదలికలు ఇలా..

ప్రారంభం (ఇదే కనిష్ఠం కూడా)	రూ.123.00	
గరిష్ఠం	రూ.157.00	+34 (25%)
ముగింపు	రూ.148.00	+26 (18%)

ఆర్థిక ఫలితాలు..

టాటా స్టీల్ లాభం ఐదింతలు

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో టాటా స్టీల్ ఏకీకృత నికర లాభం ఐదు రెట్లు పెరిగి రూ.1,135.92 కోట్లకు చేరింది. కిందటేడాది ఇదే సమయంలో నికర లాభం రూ.231.90 కోట్లుగా నమోదైంది. ఏకీకృత ఆదాయం కూడా రూ.29,154.75 కోట్ల నుంచి రూ.33,672.48 కోట్లకు చేరింది. 'గత తొమ్మిది నెలలుగా అన్ని విపణుల్లో మేం మెరుగైన పనితీరు కనబర్చాం. సానుకూల పరిస్థితులు కొనసాగుతుండటంతో మున్ముందు కూడా కంపెనీ ఇదే స్థాయిలో రాణిస్తుందని భావిస్తున్నామ'ని టాటా స్టీల్ సీఈఓ, ఎండీ టి.వి.నరేంద్రన్ తెలిపారు. చైనాతో సహా అంతర్జాతీయంగా వ్యాపార పరిస్థితులు మెరుగయ్యాయని పేర్కొన్నారు. భారత్‌లో అమ్మకాలు గణనీయంగా పెరిగాయని చెప్పారు. కళింగనగర్ ప్లాంట్ విస్తరణతో పాటు ఇతర సంస్థలకు చెందిన మరికొన్ని ప్లాంట్ల కొనుగోళ్లపై దృష్టి సారించామని వివరించారు. కళింగనగర్ ప్లాంటు విస్తరణకు రూ.23,500 కోట్ల వ్యయం అవుతుందని కంపెనీ అంచనా వేసింది. సమీక్ష త్రైమాసికంలో కంపెనీ స్థూల రుణాన్ని రూ.1,658 కోట్ల మేర కంపెనీ తగ్గించుకుంది. డిసెంబరు 31 నాటికి నగదు, నగదు నిల్వలు రూ.22,544 కోట్లుగా నమోదయ్యాయి. రూ.12,800 కోట్ల విలువకు మించకుండా రైట్స్ ఇష్యూ పద్ధతిలో షేర్ల జారీకి కంపెనీ డైరెక్టర్ల బోర్డు అనుమతిని ఇచ్చింది. ఈ ఇష్యూ 14న ప్రారంభమై 28న ముగిసింది.

బీఎస్ఈలో షేరు 1.83% పెరిగి రూ.683.65 వద్ద ముగిసింది.

బీఓబీ లాభంలో 56% క్షీణత

మొండిబకాయిలపై కేటాయింపుల భారం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.112 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.253 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 56 శాతం తక్కువ కావడం గమనార్హం. ఇక మొత్తం ఆదాయం రూ.12,181 కోట్ల నుంచి 6.53 శాతం వృద్ధితో రూ.12,976 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 40.20 శాతం పెరిగి రూ.4,394 కోట్లకు చేరింది.



నికర వడ్డీ మార్జిను 2.31 శాతం నుంచి 2.72 శాతానికి మెరుగుపడింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది రూ.3,134 కోట్లుగా ఉంది. మొత్తం అడ్వాన్సుల్లో స్థూల నిరర్థక ఆస్తులు 11.40 శాతం నుంచి 11.31 శాతానికి తగ్గాయి. విలువ పరంగా చూస్తే మాత్రం రూ.42,642.40 కోట్ల నుంచి రూ.48,480.44 కోట్లకు చేరాయి. నికర నిరర్థక ఆస్తులు సైతం 5.43 శాతం నుంచి 4.97 శాతానికి తగ్గాయి. విలువ పరంగా చూస్తే.. రూ.19,006.33 కోట్ల నుంచి రూ.19,852.15 కోట్లకు చేరాయి. ఫలితంగా మొండి బకాయిలపై కేటాయింపులు రూ.1,638 కోట్ల నుంచి ఏకంగా 92.61 శాతం పెరిగి రూ.3,155 కోట్లకు చేరాయి. ఇక మొత్తం బ్యాంక్ డిపాజిట్లు రూ.5.89 లక్షల కోట్ల నుంచి రూ.5.73 లక్షల కోట్లకు తగ్గాయి. మొత్తం అడ్వాన్సులు రూ.3.49 లక్షల కోట్ల నుంచి 14.12 శాతం వృద్ధితో రూ.3.99 లక్షల కోట్లకు చేరాయి. రిటైల్ రుణాల వృద్ధి 33.37 శాతం నమోదైందని, ఇందులో గృహ రుణాలు విభాగం 44.33 శాతం వృద్ధి సాధించిందని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది.

బీఎస్ఈలో షేరు 1.68 శాతం నష్టంతో రూ.296.40 వద్ద ముగిసింది.

మహీంద్రాకు అమ్మకాల దన్ను

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా స్టాండలోన్ ప్రాతిపదికన రూ.1,215.91 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.1,080.85 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 12.49 శాతం అధికం. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.11,843.74 కోట్ల నుంచి రూ.11,577.78 కోట్లకు చేరాయి. ప్రస్తుత ఫలితాలను గత ఆర్థిక సంవత్సరంతో పోల్చిచూడలేమని కంపెనీ తెలిపింది. ఎక్సైజ్ సుంకాన్ని కొత్తగా అమల్లోకి వచ్చిన వస్తు సేవల పన్నులోకి తీసుకురావడమే ఇందుకు కారణమని వెల్లడించింది.



సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ అమ్మకాలు 8 శాతం వృద్ధితో 1,21,786గా నమోదయ్యాయి. ప్రయాణికుల వాహన అమ్మకాలు 6.1 శాతం పెరిగాయి. ట్రాక్టరు అమ్మకాలు 6 శాతం అధికమై 76,953కు చేరాయి. గత త్రైమాసికంలో మెరుగైన వర్షపాతంతో గ్రామీణ సెంటిమెంట్ బలపడిందని, ట్రాక్టర్లకు గిరాకీ పెరిగిందని కంపెనీ తెలిపింది. రబీ పంటలకు మద్దతు ధరలను పెంచడంతో రాబోయే నెలల్లో ఇదే జోరు కొనసాగుతుందని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది. జీఎస్‌టీకి ఆర్థిక వ్యవస్థ అలవాటు పడుతోందని, వృద్ధి జోరు స్థిరంగా ఉండొచ్చని అంచనా వేసింది.

బీఎస్ఈలో షేరు 0.50 శాతం నష్టంతో రూ.749.95 వద్ద ముగిసింది.

ఓఎన్‌జీసీకి కలిసొచ్చిన ధర

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ రూ.5,014.67 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.4,32.33 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 15.2 శాతం అధికం. అధిక ధరలు ఇందుకు తోడ్పడ్డాయని కంపెనీ తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో బ్యారెల్ ముడిచమురు ఉత్పత్తిపై కంపెనీ 60.58 డాలర్లు ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది 51.80 డాలర్లుగా ఉంది. గత త్రైమాసికంలో మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ గ్యాస్ ధర 2.5 డాలర్ల నుంచి 2.89 డాలర్లకు పెరిగింది. ఇక ముడిచమురు ఉత్పత్తి 1 శాతం తగ్గి 5.2 మిలియన్ టన్నులకు చేరగా.. గ్యాస్ ఉత్పత్తి 4.5 శాతం పెరిగి 6 బిలియన్ క్యూబిక్ మీటర్లకు చేరింది. మొత్తం ఆదాయం 15 శాతం వృద్ధితో రూ.24,122.42 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. గత నెలలో హెచ్‌పీసీఎల్‌లో ప్రభుత్వ వాటా కొనుగోలును పూర్తిచేసిన కంపెనీ. . రెండో మధ్యంతర డివిడెండు చెల్లింపు నిర్ణయాన్ని వచ్చే బోర్డు సమావేశానికి వాయిదా వేసింది. 2017-18లో ఇప్పటివరకు 10 చమురు-గ్యాస్ క్షేత్రాలను కనుగొన్నట్లు ప్రకటించింది.

బీఎస్ఈలో షేరు 0.42 శాతం నష్టంతో రూ.187.75 వద్ద ముగిసింది.

కుంగదీసిన మొండి ఘటాలు

- ఎస్‌బీఐ నికర నష్టం రూ.1887 కోటకు
- నాలుగో త్రైమాసికంపైనా ప్రభావం
- 2018-19పై బ్యాంకు ఆశలు

ముంబయి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎస్‌బీఐ నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరులో ఇది రూ.1886.57 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో లాభం రూ.2152.14 కోట్ల లాభాన్ని ఆర్జించింది. భారీ స్థాయిలో మొండి బకాయిలు ఉన్నట్లు ఆర్‌బీఐ కనుగొనడం నష్టాలకు నేపథ్యం. నిరర్థక ఆస్తుల సమస్యకు పరిష్కారం కనిపించకపోవడంతో వచ్చే త్రైమాసికంలో మరింత అధ్వానంగా ఫలితాలుంటాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. స్టాండలోన్ పద్ధతిన బ్యాంకు రూ.2416 కోట్ల నష్టాన్ని ప్రకటించింది.

భవిష్యత్ ఆశావహంగానే కనిపిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి మేం సానుకూల సంకేతాలతో పనిచేస్తాం. నాలుగో త్రైమాసికంపై మరీ ఆశావహంగానూ.. మరీ నిరాశావాదంతోనూ లేమ'ని బ్యాంకు ఛైర్మన్ రజనీశ్‌కుమార్ విలేకర్లతో పేర్కొన్నారు.

తాజాగా రూ.25,000 కోట్ల నిరర్థక ఆస్తులు

సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఏకంగా రూ.25,000 కోట్ల రుణాలు నిరర్థక ఆస్తుల విభాగంలోకి మారాయి. ముఖ్యంగా రూ.23,330 కోట్ల నిరర్థక ఆస్తులను తక్కువగా చూపించడం ఇందుకు కారణమైంది. అంతక్రితం ఏడాది అక్టోబరు-డిసెంబరుతో పోలిస్తే స్థూల నిరర్థక ఆస్తులు 7.23 శాతం నుంచి 10.35 శాతానికి చేరాయి. ఇదే సమయంలో మొండి బకాయిల కోసం చేసిన మొత్తం కేటాయింపులు సైతం రూ.7,244 కోట్ల నుంచి రూ.17,759 కోట్లకు పెరగడం గమనార్హం.

మా లక్ష్యం 2 శాతం: ప్రస్తుతం 'గమనిస్తున్న ఖాతాల' విలువ రూ.10,400 కోట్లకు తగ్గిందని.. నిరర్థక ఆస్తుల విభాగంలోకి జారే పెద్ద రుణాలేమీ లేవని రజనీశ్ కుమార్ అన్నారు. అంతే కాకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో నమోదైన 4.17 శాతం మొండి బకాయిలను 2018-19లో 2 శాతంలోపునకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

40 ఖాతాలు.. రూ.78,000 కోట్లు: బ్యాంకు మొత్తం 40 ఖాతాలకు రూ.78,000 కోట్ల రుణాలివ్వగా.. ప్రస్తుతం వాటిని దివాలా ప్రక్రియ ద్వారా పరిష్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఖాతాల వల్ల లాభదాయకతపై ఏ ప్రభావం పడదని రజనీశ్ అంటున్నారు. ఎందుకంటే ఈ ఖాతాలకు ఇప్పటికే 60 శాతం వరకు కేటాయింపులు జరిపినట్లు ఆయన వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరిలోగా ఇందులో కనీసం 3 ఖాతాలకు పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తొలి జాబితాలోని 12లో మిగిలిన వాటికి జూన్ త్రైమాసికంలో పరిష్కారం లభించొచ్చని ఆయన అన్నారు. మరో పక్క, నికర నిరర్థక ఆస్తులు రూ.61,430 కోట్ల నుంచి రూ.102,370.12 కోట్లకు చేరడం గమనార్హం.



వేతన పెంపునకు రూ.700 కోట్లు

2.66 లక్షల సిబ్బందికి వేతన పెంపు కారణంగా బ్యాంకు రూ.700 కోట్లను పక్కకు పెట్టింది. ప్రమోటరేతర పెట్టుబడుదార్ల నుంచి రూ.20,000 కోట్ల వరకు నిధులను సమీకరించడానికి బ్యాంకు ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వానికి త్వరలో ప్రిఫరెన్షియల్ ఇష్యూ జారీ చేయడం ద్వారా రూ.8800 కోట్లనూ సమీకరించనున్నట్లు రజనీశ్ తెలిపారు.

బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు ధర 1.68 శాతం నష్టపోయి రూ.296.40 వద్ద ముగిసింది.

జైట్లీతో నేడు ఆర్‌బీఐ, సెబీ సమావేశం

దిల్లీ: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), సెబీ బోర్డులతో సమావేశం కానున్నారు. 2018-19 బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆర్థిక సంస్కరణల గురించి వారికి విశదీకరించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వం ఆశిస్తున్న మరో రూ.13,000 కోట్ల డివిడెండ్ పైనా చర్చించే అవకాశముంది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటం, స్టాక్ మార్కెట్లు నష్టపోతున్న తరుణంలో దేశీయంగా దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను (సీజీఎల్‌టీ)ను బడ్జెట్‌లో ప్రతిపాదించడం వల్ల ఇక్కడ మరింత ప్రభావం పడుతోంది. బాండ్‌పై ప్రతిఫలాలు పెరుగుతూ, వడ్డీరేట్ల పెంపు దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో జైట్లీ సమావేశం జరగనుండటం ఆసక్తికరంగా మారింది. 2017-18కి ద్రవ్యలోటు జీడీపీలో 3.2% చేయాలని గతంలో నిర్దేశించుకున్నా, 3.5 శాతంగా నమోదు కావచ్చని తాజా అంచనాలు పేర్కొంటున్నాయి.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో 19% వృద్ధి

ఏప్రిల్-జనవరిలో రూ.6.95 లక్షల కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల్లో ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు రూ.6.95 లక్షల కోట్లకు చేరాయి. 2016-17 ఇదే కాలం వసూళ్ల కంటే ఇవి 19.3 శాతం ఎక్కువ. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తంమీద ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.10.05 లక్షల కోట్లకు చేరతాయన్నది సవరించిన అంచనా. అంటే 10 నెలల్లో వసూలైన మొత్తం వార్షిక లక్ష్యంలో 69.2 శాతానికి సమానం. కార్పొరేట్ ఆదాయపు పన్ను నికర వసూళ్లు 19.2 శాతం, వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు 18.6 శాతం పెరిగాయి. ఈ 10 నెలల్లో రూ.1.26 లక్షల కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు.

హెచ్‌పీసీఎల్ లాభంలో 22% వృద్ధి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,950 కోట్ల స్టాండలోన్ నికరలాభాన్ని హెచ్‌పీసీఎల్ (హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్) నమోదు చేసింది. 2016-17 ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన లాభం రూ.1590 కోట్లతో పోలిస్తే, ఈసారి 22 శాతం పెరిగింది. ఇదే సమయంలో సంస్థ టర్నోవర్ రూ.55,471 కోట్ల నుంచి రూ.62,832 కోట్లకు పెరిగిందన్నారు. విశాఖపట్నం, ముంబయిలలో రిఫైనరీలు నిర్వహిస్తున్న సంస్థ ముడిచమురును ఇంధనాలుగా మార్చడం ద్వారా సమీక్షా త్రైమాసికంలో బ్యారెల్‌కు 9.04 డాలర్లు ఆర్జించింది. ఏడాది క్రితం ఈ మొత్తం 6.38 డాలర్లు మాత్రమే. అయితే శుద్ధి చేసిన ముడిచమురు పరిమాణం 4.66 మిలియన్ టన్నుల నుంచి 4.52 మి.టన్నులకు తగ్గింది. రిఫైనరీ మార్జిన్లు, ఇన్వెంటరీ లాభాల వల్ల మూడో త్రైమాసికంలో మంచి ఫలితాలు సాధించామని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ కె.సురానా తెలిపారు. పాత నిల్వల (ఇన్వెంటరీ) ధరలు పెరగడం వల్ల ఈసారి రూ.1,477 కోట్ల (బ్యారెల్‌కు 2.94 డాలర్ల చొప్పున) లాభం వచ్చినట్లు వివరించారు. దేశీయంగా పెట్రోల్ అమ్మకాల్లో 7.1 శాతం, డీజిల్ 2.3 శాతం, వంటగ్యాస్‌లో 9.2 శాతం, విమాన ఇంధనం (ఏటీఎఫ్)లో7.7 శాతం వృద్ధి లభించిందన్నారు. మధ్యంతర డివిడెండ్‌గా ప్రతిషేరుకు రూ.14.50 ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది. డివిడెండ్ పంపిణీ పన్నుతో కలిపి ఇందుకు రూ.2659 కోట్లు అవుతుందని సురానా పేర్కొన్నారు. 2018-19లో 18 మిలియన్ టన్నుల ముడిచమురు శుద్ధి చేయాలన్నది సంస్థ లక్ష్యం.

బీఎస్ఈలో షేరు 1.34 శాతం నష్టపోయి, రూ.395.15 వద్ద స్థిరపడింది.

చాంపియన్స్



"ప్రత్యర్థి జట్టులో ప్రధాన ఆటగాడిని ఔట్ చేయాలని ఎవరు కోరుకోరు? కోహ్లీనే భారత్‌కు కీలకం. అతని ప్పుడు బాగా పరుగులు చేస్తున్నాడు. సరిగ్గా బౌలింగ్ చేస్తే విరాట్‌ను ఔట్ చేయడం కష్టమేమీ కాదు. అతడిని త్వరగా పెవిలియన్ చేరిస్తే భారత్‌పై ఒత్తిడి పెంచొచ్చు. మేం ఇప్పుడు ఎంతో ఒత్తిడిలో ఉన్న మాట వాస్తవం. ఇంకో మ్యాచ్ ఓడితే సిరీస్ పోతుంది కాబట్టి చావోరేవో తేల్చుకోవాలని.. బాగా ఆడాలని అందరూ తపిస్తున్నారు. ఏబీ నాలుగో వన్డేలో ఆడతాడు. అతడి రాక మాకు మేలు చేస్తుంది''

– క్రిస్ మోరిస్, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్

- ఈ మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్ సొంతం కావడమే కాదు.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఇప్పటికే అగ్రస్థానానికి చేరిన భారత్, ఆ ర్యాంకును నిలబెట్టుకుంటుంది. సిరీస్‌లో మిగతా రెండు మ్యాచ్‌లు ఓడినా ర్యాంకు మారదు.

318 ప్రస్తుత సిరీస్‌లో కోహ్లి బ్యాటింగ్ సగటు. మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు సహా 318 పరుగులు చేశాడు. అతను ఔటైంది ఒక్కసారే.

- క్యాన్సర్ బాధితులకు సంఘీభావంగా దక్షిణాఫ్రికా జట్టు గులాబీ రంగు దుస్తులతో బరిలోకి దిగినపుడల్లా ఆ జట్టును విజయమే వరించింది. ఒకసారి (2013లో) భారత్‌తోనూ ఈ దుస్తులతో ఆడి విజయం సాధించింది. శనివారం కూడా ఆ జట్టు ఈ దుస్తులతోనే ఆడనుంది. మరి ఈసారి ఫలితం ఎలా ఉంటుందో?





ముువ్వన్నెల జెండాతో శివ కేశవన్

చలింపిక్స్.. ఘనంగా ఆరంభం

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): చలి గజ గజ వణికిస్తోంది.. ఉష్ణోగ్రత -10 డిగ్రీలకు పడిపోయింది.. ఇలాంటి పరిస్థితిలో అసలు నిలవడమే కష్టం! కానీ క్రీడాకారుల ఉత్సాహం ముందు అసలు ఇది సమస్యనే కాలేదు. దక్షిణ కొరియాలోని ప్యాంగ్ చాంగ్ నగరంలో శుక్రవారం శీతాకాల ఒలింపిక్స్ అట్టహాసంగా ఆరంభమయ్యాయి. బాణసంచా వెలుగుల్లో స్టేడియం మెరిసిపోయింది. బద్ధ శత్రువులైన దక్షిణ కొరియా, ఉత్తర కొరియా ఒకే పతాకం కింద కలిసి మార్చ్‌పాస్ట్ చేయడం విశేషం. ఆరోసారి శీతాకాల ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత ఆటగాడు శివ కేశవన్ మువ్వన్నెల జెండాను చేతబూని మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నాడు.

సాయంత్రం 4.30 నుంచి సోనీ టెన్-1, 3ల్లో

ఇది గెలిస్తే చరిత్రే!

- సిరీస్‌పై కోహ్లీసేన కన్ను
- నాలుగో వన్డే నేడే
- ఏబీ రాకతో సఫారీ జట్టులో ఆశ

దక్షిణాఫ్రికా పర్యటనను ఆరంభించిన తీరు చూసి.. ఇప్పుడు కోహ్లీసేన ఇలాంటి స్థితిలో ఉంటుందని ఎవ్వరూ ఊహించి ఉండరు! టెస్టు సిరీస్‌లో ఓటమి తర్వాత వరుసగా మూడు వన్డేల్లోనూ గెలిచి 3-0 ఆధిక్యంలో నిలవడం ఒకెత్తయితే.. ఆ మూడు మ్యాచ్‌ల్లో చలాయించిన ఆధిపత్యం మరో ఎత్తు. ప్రత్యర్థికి విజయావకాశాలివ్వడం కాదు కదా.. కనీసం గౌరవప్రదంగా కూడా ఓడే అవకాశమూ ఇవ్వలేదు టీమ్‌ఇండియా. దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికాపై ఇలాంటి ఆధిపత్యం అనూహ్యం, అద్భుతం! ఇదే ఊపును శనివారం కూడా కొనసాగిస్తే ఒక చారిత్రక సిరీస్ విజయం భారత్ ఖాతాలో పడుతుంది. వన్డేల్లో నంబర్‌వన్ ర్యాంకు కూడా పదిలం అవుతుంది.

జొహానెస్‌బర్గ్

ఫార్మాట్ ఏదైనా దక్షిణాఫ్రికా గడ్డపై సిరీస్ విజయం భారత్‌కు కలే! ఈసారి కూడా టెస్టుల్లో ఆ అవకాశం దక్కలేదు. ఓటమి తప్పలేదు. కానీ చివరి టెస్టులో విజయం ఇచ్చిన ఉత్సాహంతో వన్డేల్లో చెలరేగి ఆడిన టీమ్‌ఇండియా.. తొలి మూడు మ్యాచ్‌ల్లో తిరుగులేని విజయాలతో 3-0 ఆధిక్యం సంపాదించింది. ఇప్పుడు చివరి టెస్టులో భారత్‌కు విజయాన్నందించిన జొహానెస్‌బర్గ్‌లోనే చారిత్రక సిరీస్ విజయం సాధించడానికి అవకాశం వచ్చింది. శనివారం వాండరర్స్‌లో నాలుగో వన్డే జరగబోతోంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్ సొంతం కావడమే కాదు.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఇప్పటికే అగ్రస్థానానికి చేరిన భారత్, ఆ ర్యాంకును నిలబెట్టుకుంటుంది. సిరీస్‌లో మిగతా రెండు మ్యాచ్‌లు ఓడినా ర్యాంకు మారదు. ఒకరి తర్వాత ఒకరు కీలక ఆటగాళ్లు దూరం కావడంతో ప్రదర్శన తీసికట్టుగా తయారైన దక్షిణాఫ్రికా.. నాలుగో వన్డేలో ఎలా ఆడుతుందో చూడాలి. ఏబీ డివిలియర్స్ పునరాగమనం ఆ జట్టుకు ఊరటనిచ్చేదే. కానీ అతనొక్కడి రాకతో ఆతిథ్య జట్టు రాత మారిపోతుందా అన్నదీ సందేహమే.



డివిలియర్స్

ఏబీ × స్పిన్ ద్వయం: ప్రస్తుత సిరీస్‌లో అనూహ్యమంటే భారత యువ స్పిన్నర్లు కుల్‌దీప్, చాహల్‌ల ప్రదర్శనే. తొలి మూడు వన్డేల్లో కలిపి దక్షిణాఫ్రికా 28 వికెట్లు కోల్పోతే అందులో 21 వీళ్లిద్దరి ఖాతాలోనే చేరాయి. పేసర్ల నిలయాలైన దక్షిణాఫ్రికా పిచ్‌లపై స్పిన్నర్లు ఈ స్థాయిలో హవా సాగించడం అనూహ్యం. అందులోనూ చివరి రెండు వన్డేల్లో వారి ధాటికి ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ విలవిలలాడిపోయారు. పరుగులు చేయడం సంగతటుంచితే క్రీజులో నిలవడమే కష్టమైపోయింది వారికి. వీళ్లిద్దరి ముందు తమ ప్రణాళికలేవీ పని చేయలేదని, వారిని ఎదుర్కోవడానికి కొత్త మార్గాలు చూడాలని అన్నాడు దక్షిణాఫ్రికా సీనియర్ బ్యాట్స్‌మన్ డుమిని. మరి నాలుగో వన్డేకు సఫారీ జట్టు ఎలా సన్నద్ధమై వస్తుందో చూడాలి. ఇప్పుడు వారి ఆశలన్నీ డివిలియర్స్ మీదే ఉన్నాయి. స్పిన్నే కాదు, ఎలాంటి బౌలింగ్‌నైనా ఎదుర్కోగల సమర్థుడు ఏబీ. బౌలర్లపై ఎడతెరపి లేకుండా ఎదురుదాడి చేసే డివిలియర్స్ నిలిస్తే దక్షిణాఫ్రికా పోటీలోకి వచ్చినట్లే. మరి ఏబీ ఎలా ఆడతాడో.. చాహల్, కుల్‌దీప్ అతడికి ఏమేర కళ్లెం వేస్తారో చూడాలి. డివిలియర్స్‌తో పాటు సీనియర్లు ఆమ్లా, డుమిని కూడా సత్తా చాటాలని దక్షిణాఫ్రికా కోరుకుంటోంది.

విరాట్.. విరాట్: ఇక ఈ పర్యటనలో భారత బ్యాటింగ్ అంతా కెప్టెన్ విరాట్ చుట్టూనే తిరుగుతోంది. వన్డే సిరీస్‌లో అతను చెలరేగిపోతున్నాడు. ముఖ్యంగా మూడో వన్డేలో కెరీర్లోనే నిలిచిపోయే ఇన్నింగ్స్ ఆడాడతను. ధావన్ కూడా ఫామ్ అందుకుని సత్తా చాటుతున్నాడు. ఐతే రోహిత్ వైఫల్యమే కలవరపరుస్తోంది. మిడిలార్డర్‌కు సిరీస్‌లో తొలిసారిగా మూడో వన్డేలో ఆడే అవకాశం లభించినా సద్వినియోగం చేసుకోలేదు. అందరూ విఫలమయ్యారు. మరి సిరీస్ విజయం ఊరిస్తున్న తరుణంలో బ్యాట్స్‌మెన్ ఎలా ఆడతారో చూడాలి. భారత్ ఈ మ్యాచ్‌కు జట్టులో మార్పులేమీ చేసే అవకాశం లేదు. దక్షిణాఫ్రికా జట్టులో మాత్రం రెండు మూడు మార్పులుంటాయి. డివిలియర్స్‌తో పాటు బెహార్డీన్, మోర్నీ మోర్కెల్ కూడా జట్టులోకి రావచ్చు.

5 దక్షిణాఫ్రికాలో భారత్ ఆడుతున్న ద్వైపాక్షిక వన్డే సిరీస్. గత నాలుగు పర్యాయాలూ ఓటమి చవిచూసింది.

9.05 ప్రస్తుత సిరీస్‌లో చాహల్, కుల్‌దీప్‌ల ఉమ్మడి సగటు. మూడు వన్డేల్లో కలిపి దక్షిణాఫ్రికా 28 వికెట్లు కోల్పోతే అందులో 21 వీళ్లిద్దరే తీశారు.

భారత్ విజయం

దిల్లీ: ఫెడ్‌కప్ టెన్నిస్‌లో భారత్ ఎట్టకేలకు విజయం సాధించింది. అంకిత రైనా, కర్మన్ కౌర్ విజయాలు సాధించడంతో శుక్రవారం ఆసియా ఓసియానియా గ్రూప్-1 పోరులో 3-0తో హాంకాంగ్‌ను ఓడించింది. తొలి మ్యాచ్‌లో హర్మన్ 6-3, 6-4తో ఎడిస్ చాంగ్‌ను ఓడించి జట్టుకు 1-0 ఆధిక్యం అందించింది. ఆ తర్వాత అంకిత 6-3, 6-2తో లింగ్ జాంగ్‌పై గెలవడంతో 2-0తో విజయం ఖాయమైంది. నామమాత్రమైన డబుల్స్‌లో ప్రాంజల, ప్రార్థన జోడీ 6-2, 6-4తో క్వాన్ యు, చింగ్ హు వూ జంటను ఓడించడంతో మ్యాచ్‌ను భారత్ 3-0తో సొంతం చేసుకుంది. పూల్-ఎలో మూడో స్థానంలో నిలిచిన భారత్.. ఆసియా ఓసియానియా గ్రూప్-1లో చోటు నిలబెట్టుకోవాలంటే శనివారం పూల్-బి జట్టు చైనీస్ తైపీని ఓడించాలి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు గ్రూప్-2కి పడుతుంది.

ఐసీసీ డైరెక్టర్‌గా ఇంద్రా నూయి



దుబాయ్: పెప్సీకో ఛైర్మన్ ఇంద్రా నూయి ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్‌గా నియమితురాలైంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఐసీసీ ప్రకటించింది. ఈ ఏడాది జూన్‌లో ఇంద్రా నూయి బాధ్యతలు చేపట్టనుంది. రెండేళ్ల పాటు ఆమె పదవిలో ఉంటుంది. ఐసీసీలో తొలి మహిళా డైరెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని నూయి చెప్పింది.

రాయల్స్‌దే సిరీస్

సెయింట్ మారిట్జ్ (స్విట్జర్లాండ్): సెయింట్ మారిట్జ్ మంచు క్రికెట్ సిరీస్‌ను రాయల్స్ సొంతం చేసుకుంది. మాజీ క్రికెటర్ల మధ్య గడ్డకట్టిన సరస్సుపై నిర్వహించిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను అఫ్రిది నేతృత్వంలోని రాయల్స్ 2-0తో దక్కించుకుంది. శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో రాయల్స్ 8 వికెట్ల తేడాతో ప్యాలెస్ డైమండ్స్‌ను ఓడించింది. సైమండ్స్ (67 నాటౌట్), మహ్మద్ కైఫ్ (57), సెహ్వాగ్ (46) రాణించడంతో మొదట ప్యాలెస్ డైమండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. కలిస్ (90 నాటౌట్; 37 బంతుల్లో 13×4, 4×6), స్మిత్ (58), ఒవైస్ షా (43) చెలరేగడంతో రాయల్స్ 16.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. కలిస్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', ఒవైస్ షా 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు గెలుచుకున్నారు.



స్మృతి మంధాన

అమ్మాయిలకు ఎదురుందా?

- భారత్ × దక్షిణాఫ్రికా
- మూడో వన్డే నేడు

పోచెఫ్‌స్ట్రూమ్: సిరీస్ ఇప్పటికే సొంతమైంది. పురుషుల జట్టులానే దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శిస్తున్న మహిళల జట్టు ఇప్పుడు వైట్‌వాష్‌పై కన్నేసింది. శనివారం జరిగే మూడో వన్డేలోనూ విజయం సాధించి సిరీస్‌ను 3-0తో సగర్వంగా ముగించాలని పట్టుదలగా ఉంది. బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించడంతో తొలి రెండు వన్డేల్లో ఆతిథ్య దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన అద్భుత ఫామ్ కొనసాగుతోంది. తొలి వన్డేలో 84 పరుగులు చేసిన ఆమె రెండో వన్డేలో 135 పరుగులు బాదింది. ఆమెకు తోడు మిథాలీ, హర్మన్, వేద కృష్ణమూర్తి కూడా రాణిస్తే భారత్‌కు తిరుగులేనట్లే.

అఫ్గానిస్థాన్ శుభారంభం

జింబాబ్వేతో తొలి వన్డేలో ఘన విజయం



రషీద్ (4/26)

షార్జా: జింబాబ్వేతో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన అఫ్గానిస్థాన్ వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. శుక్రవారం తొలి వన్డేలో 154 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. రహ్మత్ షా (114; 110 బంతుల్లో 8×4, 4×6), నజిబుల్లా జద్రాన్ (81; 51 బంతుల్లో 5×4, 5×6) చెలరేగి ఆడటంతో మొదట అఫ్గానిస్థాన్ 5 వికెట్లకు 333 పరుగులు చేసింది. భారీ లక్ష్యఛేదనలో రషీద్ ఖాన్ (4/26) స్పిన్ వలలో చిక్కుకున్న జింబాబ్వే 179 పరుగులకే కుప్పకూలింది. మైర్ (34) ఆ జట్టులో టాప్ స్కోరర్. అఫ్గాన్ బౌలర్లు సమష్టిగా రాణించడంతో జింబాబ్వే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది.

ఆ ఫోన్లు అందరికీ ఇచ్చారు కానీ..

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా): వింటర్ ఒలింపిక్స్ నిర్వాహకులకు ఓ చిక్కు వచ్చి పడింది. అథ్లెట్లకు పంచాలంటూ నాలుగు వేల గ్యాలక్సీ నోట్ 8 ఫోన్లను నిర్వాహకులకు ఒలింపిక్స్ స్పాన్సర్ శామ్‌సంగ్ ఇవ్వగా.. ఉత్తర కొరియాకు మినహాయించి మిగతా దేశాలన్నింటికీ పంచేశారు నిర్వాహకులు. అందుక్కారణం.. ఆ దేశంపై ఐక్య రాజ్య సమితి ఆంక్షలుండడమే. విలాస వస్తువుల్ని ఉత్తర కొరియాకు లేదా ఆ దేశ పౌరులకు పంపించడంపై ఐరాస నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో వాళ్లకు పంచితే ఎక్కడ తమపై ఐరాస చర్యలు తీసుకుంటుందోనన్న భయం నిర్వాహకులది. అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య (ఐఓసీ) మాత్రం ఉత్తర కొరియా అథ్లెట్లకు ఫోన్లు ఇవ్వాలని సూచించింది. ఐతే ఒక షరతు పెట్టింది. ఒలింపిక్స్ ముగిసేవరకు మాత్రమే ఉత్తర కొరియా అథ్లెట్లు ఫోన్లను వాడుకోవాలని, తర్వాత నిర్వాహకులకు అప్పగించాలని పేర్కొంది. ఆ దేశ అథ్లెట్లకు అసలు ఫోన్లివ్వాలా వద్దా అని తీవ్రంగా ఆలోచించిన నిర్వాహకులు.. చివరికి ఈ షరతు మేరకే వారికి మొబైల్స్ ఇచ్చినట్లు సమాచారం. ఇరాన్ అథ్లెట్లకు ఫోన్లు ఇచ్చే విషయంపైనా కొంత గందరగోళం నెలకొని వెనుకంజ వేసిన నిర్వాహకులు.. ఆ తర్వాత వారికి క్షమాపణలు చెప్పి, ఏ షరతులూ లేకుండా మొబైల్స్ అందజేశారు.



హైదరాబాద్, ఆంధ్రా విజయాలు

చెన్నై: విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీలో శుక్రవారం హైదరాబాద్, ఆంధ్రా జట్టు విజయాలు నమోదు చేశాయి. ఉప్పల్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో సౌరాష్ట్రను ఓడించింది. 278 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 6 వికెట్లు కోల్పోయి ఇంకో 3 బంతులుండగా ఛేదించింది. అక్షత్ రెడ్డి (94; 96 బంతుల్లో 10×4, 1×6), అంబటి రాయుడు (76; 83 బంతుల్లో 2×4, 3×6), ఆకాశ్ బండారి (41; 29 బంతుల్లో 5×4, 1×6) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అంతకుముందు మన్కడ్ (62), వ్యాస్ (57), వసవాడ (49) రాణించడంతో సౌరాష్ట్ర 50 ఓవర్లలో 7 వికెట్లకు 277 పరుగులు చేసింది. చెన్నైలో ఉత్కంఠ భరితంగా సాగిన మరో మ్యాచ్‌లో ఆంధ్రా ఒక వికెట్ తేడాతో గోవాను ఓడించింది. మొదట గిరినాథ్ రెడ్డి (4/32) ధాటికి గోవా 47.4 ఓవర్లలో 188 పరుగులకే ఆలౌటైంది. స్నేహల్ (43), సుయాష్ (38) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. అనంతరం లక్షయ్ (3/32), విజేష్ (3/43) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఛేదనలో ఆంధ్రా కూడా తడబడింది. ఐతే రికీ భుయ్ (56 నాటౌట్; 86 బంతుల్లో 6×4, 1×6) గొప్పగా పోరాడటంతో.. ఆంధ్రా ఇంకో మూడు బంతులుండగా 9 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

కుప్పకూలిన బంగ్లా.. పటిష్ఠ స్థితిలో లంక

ఢాకా: బంగ్లాదేశ్-శ్రీలంక రెండో టెస్టు రెండో రోజు ఆసక్తికర మలుపులు తిరిగింది. తొలి టెస్టులో లంక బౌలర్లను ఆటాడుకున్న బంగ్లా.. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అనూహ్యంగా 110 పరుగులకే కుప్పకూలింది. సురంగ లక్మల్ (3/25), అఖిల ధనంజయ (3/20), దిల్రువాన్ పెరీరా (2/32) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. 38 పరుగులు చేసిన మెహదీ హసనే బంగ్లా ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్. 112 పరుగుల కీలక ఆధిక్యం సాధించిన లంక.. రెండో ఇన్నింగ్స్ ఆరంభించి శుక్రవారం ఆట ఆఖరుకు 200/8తో నిలిచింది. బంగ్లా బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టినప్పటికీ రోషన్ సిల్వా (58 నాటౌట్)తో పాటు కరుణరత్నె (32), చండిమాల్ (30), ధనంజయ డిసిల్వా (28) తలో చేయి వేయడంతో లంక ఆధిక్యం 300 దాటింది. 2 వికెట్లు చేతిలో ఉన్న లంక 312 పరుగుల ముందంజలో ఉంది. మ్యాచ్‌లో బౌలర్ల ఆధిపత్యం సాగుతున్న నేపథ్యంలో బంగ్లాకు ఓటమి తప్పకపోవచ్చు. మూడో రోజే మ్యాచ్ ముగిసిపోయే అవకాశాలున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో లంక 222 పరుగులు చేసింది. రెండు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే.



ధనంజయ (3/20)



శ్రీకాంత్

ముగిసిన పోరాటం

- పురుషులు, మహిళల జట్ల ఓటమి
- ఆసియా బ్యాడ్మింటన్

అలోర్ సెతర్ (మలేసియా): ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత పోరాటం ముగిసింది. పురుషులు, మహిళల జట్లు క్వార్టర్‌ఫైనల్లో నిష్క్రమించాయి. ఏకపక్షంగా సాగిన పోరాటాల్లో మహిళల జట్టు 1-3తో ఇండోనేషియా చేతిలో ఓడగా.. పురుషుల జట్టు 1-3తో బలమైన చైనా చేతిలో పరాజయంపాలైంది. సింగిల్స్‌లో సింధు, శ్రీకాంత్ మినహా మిగతా అన్ని మ్యాచ్‌ల్లో భారత జట్లకు ఓటమి తప్పలేదు. మహిళల విభాగం గ్రూప్-డబ్ల్యూలో హాంకాంగ్‌ను ఓడించి క్వార్టర్‌ఫైనల్ చేరిన భారత బృందం కఠిన ఇండోనేషియాతో పోరులో తేలిపోయింది. తొలి సింగిల్స్‌లో సింధు 21-13, 24-22తో ఫిత్రియానిపై నెగ్గి జట్టుకు శుభారంభాన్ని అందించింది. ఆ తర్వాత డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి 5-21, 16-21తో గ్రేసియా పోలి-అప్రియాని రహాయు చేతిలో, రెండో సింగిల్స్‌లో శ్రీ కృష్ణప్రియ 8-21, 15-21తో హనా రమాదిని చేతిలో ఓడిపోయారు. పోటీలో ఉండాలంటే తప్పక గెలవాల్సిన మహిళల రెండో డబుల్స్‌లో సింధు, సంయోగిత జంట 9-21, 18-21తో ఆంగియా షిత, మహాదేవి ఇస్త్రాని జోడీ చేతిలో పరాజయంపాలైంది. ఇండోనేషియా 3-1తో మ్యాచ్‌ను గెలుచుకుని సెమీస్‌లో అడుగుపెట్టింది. పురుషుల విభాగంలో చైనాతో క్వార్టర్‌ఫైనల్‌లోనూ భారత్‌కు శుభారంభం లభించింది. తొలి సింగిల్స్‌లో.. ఆరంభంలో వెనకబడిన శ్రీకాంత్ తొలి గేమ్ కోల్పోయాడు. ఐతే ఆ తర్వాత దూకుడుగా ఆడిన శ్రీకాంత్.. 14-21, 21-16, 21-7తో షి యుకిని ఓడించాడు. ఆ తర్వాత భారత్ ఆనందించడానికి మరేం లేదు. తొలి డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 17-21, 18-21తో హి జితింగ్-టాన్ కియాంగ్ చేతిలో, రెండో సింగిల్స్‌లో సాయి ప్రణీత్ 21-9, 11-21, 17-21తో కియావో బిన్ చేతిలో, రెండో డబుల్స్‌లో మను అత్రి-సుమీత్ రెడ్డి 21-14, 19-21, 14-21తో హన్-జువో చేతిలో ఓటమిపాలయ్యారు.

పుడమికి పురిటి నొప్పులు



- 760 కోట్లకు చేరిన ప్రపంచ జనాభా
- 2056 నాటికి 1000 కోట్లకు!
- వృద్ధి రేటు తగ్గడం కొంత ఊరట

జనం.. జనం.. జనం..- ఎటు చూసినా జనమే. భూగోళంపై సంభవిస్తున్న జనాభా విస్ఫోటంతో పుడమి తల్లి తల్లడిల్లుతోంది. కొన్నేళ్ల కిందటి దాకా పెద్దగా జనాభా పెరుగుదల లేని నైజీరియా, ఇథియోపియా లాంటి కొన్ని ఆఫ్రికా దేశాల్లోనూ ఇటీవలి కాలంలో అత్యధిక జనాభా వృద్ధిరేటు నమోదయింది. అమాంతం పెరిగిపోతున్న జనాభా సవాలక్ష సమస్యల్ని సృష్టిస్తోంది. జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వాలు ఇటీవల చేపడుతున్న చర్యలు వృద్ధిరేటును మందగించేలా చేయడం కొంతలో కొంత ఊరట. ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం, అమెరికా జనాభా గణన బ్యూరో వెల్లడించిన గణాంకాలు ప్రపంచ జనాభా పెరుగుదలకు అద్దంపడుతున్నాయి.

గతం- ప్రస్తుతం- భవిష్యత్ అంచనా సంవత్సరాల వారీగా ప్రపంచ జనాభా

సంవత్సరం	జనాభా
1500	45,00,00,000
1900	160,00,00,000
1950	258,38,16,786
1975	407,90,87,198
2000	614,50,06,989
2017	755,02,62,101
2018	760,02,73,431
ఇకపై ఇలా ఉంటుందని అంచనా...	
2025	818,56,13,757
2050	979,18,22,753
2090	1105,00,55,193
2100	1118,43,67,721


- *2056 నాటికి ప్రపంచ జనాభా 1000 కోట్లకు చేరుకుంటుందని ఐక్యరాజ్యసమితి అంచనావేసింది.*

ప్రపంచ వ్యాప్తంగా ఏడాదిలో జనాభా పెరుగుదల... (01.02.17 నుంచి 01.02.18 వరకు)..

జన్మించిన వారు	1,53,54,395
మరణించిన వారు	63,59,736
పెరిగిన జనాభా	89,94,659


అత్యధిక జనాభా కలిగిన 15 దేశాలు

చైనా	141,28,98,864
భారత్	134,82,63,675
అమెరికా	32,58,69,822
ఇండొనేషియా	26,57,03,962
బ్రెజిల్	21,02,50,151
పాకిస్థాన్	19,93,32,037
నైజీరియా	19,39,13,241
బంగ్లాదేశ్	16,57,03,364
రష్యా	14,39,74,481
మెక్సికో	13,01,34,068
జపాన్	12,73,01,274
ఇథియోపియా	10,65,27,683
ఫిలిప్పీన్స్	10,58,90,928
ఈజిప్టు	9,86,64,769
వియత్నాం	9,61,21,400



మతాల వారీగా జనాభా...

- క్రైస్తవులు 217,31,80,000 వీరిలో 50% మంది కేథలిక్కులు. ప్రొటెస్టెంట్‌లు- 37%, ఆర్థోడాక్స్- 12%, ఇతరులు- 1%
- ముస్లింలు 159,85,10,000 వీరిలో 87-90% మంది సున్నీలు, 10-13% మంది షియాలు.
- మతాలతో సంబంధం లేని వారు 112,65,00,000 నాస్తికులు, తమకు ఏ మతంతో సంబంధం లేదని చెప్పుకునే వారు ఇందులో ఉన్నారు. అమెరికాలో ప్రతి ఐదుగురిలో ఒకరు ఇలాంటి వారు.
- హిందువులు 115,30,80,000 వీరిలో అత్యధికంగా 94% మంది భారత్‌లోనే ఉన్నారు.
- బౌద్ధులు 48,75,40,000 వీరిలో సగం మంది చైనాలో ఉంటున్నారు.
- సంచార, ఆదిమ, గిరిజన జాతులు 40,51,20,000
- ఇతర మతస్థులు 5,81,10,000
- యూదులు 1,38,50,000



వృద్ధి రేటు తగ్గుముఖం

1960లలో జనాభా వార్షిక వృద్ధిరేటు విపరీతంగా ఉండేది. ఈ పెరుగుదల 1952 నుంచే మొదలై 1973 ప్రాంతాల వరకు కొనసాగింది. ఆ తర్వాతి కాలంలో క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఇది 1.09 శాతం ఉంది. 2023 నాటికి 1 శాతానికి, 2052 నాటికి 0.5 శాతానికి, 2076 నాటికి 0.25 శాతానికి పడిపోతుందని అంచనా. 2100 సంవత్సరానికి 0.09 శాతమే నమోదై.. ఆ తర్వాత స్థిరమవుతుందని అంచనాలున్నాయి. ఈ వృద్ధిరేటు నేపథ్యంలో ప్రస్తుతమున్న 755 కోట్ల ప్రపంచ జనాభా రెట్టింపు కావడానికి మరో 200 సంవత్సరాలు పడుతుందని అంచనా.

ప్రాంతాల వారీగా జనాభా తీరు...

ప్రాంతం	జనాభా	వార్షిక వృద్ధి (శాతాల్లో)
ఆసియా	450,44,28,373	0.94
ఆఫ్రికా	125,62,68,025	2.55
ఐరోపా	74,20,73,853	0.08
లాటిన్ అమెరికా, కరేబియన్	64,55,93,253	1.02
ఉత్తర అమెరికా	36,12,07,811	0.73
ఓషియానా	4,06,90,786	1.43

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఉభయ కొరియాల ఐక్యరాగం

- శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో ఒకే పతాకంతో కవాతు
- ఉత్తర కొరియా అధినేత సోదరితో దక్షిణ కొరియా అధ్యక్షుడి కరచాలనం

ప్యాంగ్‌చాంగ్: ఉప్పు-నిప్పులా ఉండే ఉత్తర కొరియా, దక్షిణ కొరియాల మధ్య శుక్రవారం సామరస్యం వెల్లివిరిసింది. శీతాకాల ఒలింపిక్ క్రీడల ప్రారంభోత్సవ వేడుకలో ఉభయ కొరియాలు నీలి, శ్వేత వర్ణాలతో కూడిన ఐక్య పతాకంతో కలిసికట్టుగా అడుగేశాయి. దీంతో ప్రేక్షకులు పెద్దయెత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. మరోవైపు, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్‌తో దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే-ఇన్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో చేతులు కలిపారు. వీఐపీలు కూర్చునే ప్రాంతంలోకి వచ్చినప్పుడు తొలుత మూన్.. యో జోంగ్‌తో కరచాలనం చేశారు. అనంతరం కొరియా అథ్లెట్లు కవాతు చేస్తున్నప్పుడు మరోసారి ఇరువురు నేతలూ చిరునవ్వులు చిందిస్తూ కరచాలనం చేసుకున్నారు. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నట్లు సంకేతాలు వెలువడినట్లయింది. కొరియా యుద్ధం అనంతరం. ఉత్తర కొరియా పాలక రాజవంశ కుటుంబం నుంచి దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న తొలి వ్యక్తి యో జోంగ్ కావడం గమనార్హం. ప్యాంగ్‌చాంగ్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి ముందే ఉత్తర కొరియా సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ ప్రిసీడియం అధ్యక్షుడు కిమ్ యోంగ్ నామ్.. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌ను ఓ అధికారిక కార్యక్రమంలో కలిశారు. ప్యాంగ్‌యాంగ్‌లో 2000, 2007ల్లో నిర్వహించిన ఉత్తర-దక్షిణ కొరియా సదస్సుల్లో కూడా దక్షిణ కొరియా అధ్యక్షులతో నామ్ సమావేశమయ్యారు.



కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్‌తో దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే-ఇన్ కరచాలనం

భారత్-జోర్డాన్ మైత్రి బలోపేతం: మోదీ



జోర్డాన్ రాజు అబ్దుల్లాతో మోదీ ఆత్మీయ ఆలింగనం

దిల్లీ: పశ్చిమాసియా పర్యటనలో భాగంగా శుక్రవారం జోర్డాన్ చేరుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. అక్కడి రాజు అబ్దుల్లా-2తో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇద్దరు నేతలు నిర్ణయించారు. పాలస్తీనా సహా మూడు పశ్చిమాసియా దేశాల పర్యటన కోసం మోదీ.. జోర్డాన్ రాజధాని అమ్మాన్ చేరుకున్నారు. "రాజుతో నా సమావేశం అద్భుతంగా సాగింది. మా చర్చలతో రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడతాయి" అని మోదీ ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ నెలాఖరులో తాను భారత్‌లో చేపట్టబోయే పర్యటన కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని రాజు పేర్కొన్నారు. ఇద్దరు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. భారత ప్రధాని ఒకరు.. జోర్డాన్‌లో కాలుమోపడం గత 30 ఏళ్లలో ఇదే మొదటిసారి. పాలస్తీనా వెళ్లడం కోసం అమ్మాన్‌లో మోదీ దిగారు. తన విమానం దిగడానికి ఏర్పాట్లు చేసిన రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మోదీ.. శనివారం పాలస్తీనా చేరుకుంటారు. భారత ప్రధాని ఒకరు ఈ దేశాన్ని సందర్శించడం గత 30 ఏళ్లలో ఇదే మొదటిసారి. అనంతరం ఆయన యూఏఈ, ఒమన్‌లో పర్యటిస్తారు. ఆదివారం ప్రధాని.. దుబాయ్‌లో ఒక హిందూ దేవాలయ ప్రారంభోత్స వేడుకను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తారు. ఒపేరా హౌస్‌లో భారత సంతతివారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రపంచ ప్రభుత్వ శిఖరాగ్ర సదస్సులో మాట్లాడతారు. భారత విదేశాంగ విధానంలో గల్ఫ్, పశ్చిమాసియాకు కీలక ప్రాధాన్యం ఉందని పర్యటనకు బయలుదేరి వెళ్లడానికి ముందు ప్రధాని పేర్కొన్నారు. ఆ ప్రాంతంతో బంధాన్ని బలోపేతం చేసుకోవడమే తన యాత్ర లక్ష్యమన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- జనబాహుళ్యంలో విస్తృతంగా ప్రచారం చేయండి
- బడ్జెట్‌లోని అంశాలపై భాజపా ఎంపీలకు ప్రధాని మోదీ దిశానిర్దేశం

దిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. పథకాలకు కల్పించే విస్తృత ప్రచారం ఎన్నికల్లో పార్టీకి విజయాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. శుక్రవారం భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ ప్రసంగించారు. ప్రజాహిత బడ్జెట్ అంశాలను ప్రజలకు వివరించాలని, క్షేత్ర స్థాయిలోనూ సమావేశాలను, సభలను నిర్వహించాలని ఎంపీలకు సూచించారు. ఎంపీలు తమ పని తీరులో సాధించే ఫలితాలకు పార్టీ విజయావకాశాలకు సంబంధం ఉంటుందని వివరించారు. రైతులకు, పేద ప్రజలకు లబ్ధికలిగించే బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని చెబుతూ 10కోట్ల కుటుంబాలను ఆరోగ్య బీమా పథకం పరిధిలోకి తీసుకొస్తున్న విషయాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారని సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ వెల్లడించారు. లోక్‌సభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇచ్చిన సమాధానాన్ని, రాజ్యసభలో భాజపా అధ్యక్షుడు అమిత్ షా తొలి ప్రసంగాన్ని మోదీ ప్రశంసించారని తెలిసింది. త్రిపురలో తాను పాల్గొన్న ఎన్నికల సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారని మోదీ వివరించారు. అమిత్ షా మాట్లాడుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అప్రజాస్వామిక రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బుధవారం లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగానికి ఆ పార్టీ సభ్యులు అడ్డుతగిలిన తీరును తప్పుపట్టారు. రాఫెల్ ఒప్పందంపై కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చారు.



దిల్లీలో భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, అగ్రనేత అడ్వాణీ

ప్రధాని మోదీపై ప్రత్యేక బుక్‌లెట్

ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో ప్రధాని ప్రసంగాలు, వాటికి అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కవరేజి, స్పందనలతో కూడిన 60 పేజీల బుక్‌లెట్‌ను సమావేశంలో ఎంపీలకు అందజేశారు. భాజపా ప్రధాన కార్యదర్శి కైలాస్ విజయ్‌వర్గీయ సంకలన కర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కైలాస్ మాట్లాడుతూ...ప్రధాని మోదీ నాయకత్వ ప్రతిభను యావత్ ప్రపంచం గుర్తించిందని తెలిపారు.

మాల్దీవులు సంక్షోభంపై ఫోన్‌లో చర్చించుకున్న ట్రంప్, మోదీ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ టెలిఫోన్‌లో సంభాషించుకున్నారు. మాల్దీవుల్లో ఏర్పడిన రాజకీయ సంక్షోభంపై వీరు చర్చించారు. అఫ్గానిస్థాన్, ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రతపైనా సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అమెరికా అధ్యక్ష కార్యాలయం శ్వేతసౌధం సంభాషణ వివరాలు వెల్లడించింది. కీలక రాజకీయ ఖైదీలను విడుదల చేయాలంటూ తమ దేశ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు మాల్దీవులు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. దేశంలో అత్యయిక పరిస్థితిని విధించి.. ప్రధాన న్యాయమూర్తితోపాటు మరికొందరిని కూడా అరెస్టు చేసింది. ఈ పరిణామాలపై ఫోన్ సంభాషణ సందర్భంగా ట్రంప్, మోదీ ఆందోళన వ్యక్తం చేసినట్లు శ్వేతసౌధం పేర్కొంది. ప్రజాస్వామ్య సంస్థలు, న్యాయపాలనను గౌరవించాల్సిన అవసరముందని ఇద్దరు నేతలూ అభిప్రాయపడ్డట్లు తెలిపింది. అఫ్గానిస్థాన్ భద్రత, స్థిరత్వం కోసం కలిసి పనిచేయాలని ట్రంప్, మోదీ పునరుద్ఘాటించినట్లు వెల్లడించింది. రోహింగ్యా శరణార్థుల అంశం, ఉత్తర కొరియా అణ్వస్త్ర నిరాయుధీకరణకు చేపట్టాల్సిన చర్యల విషయం కూడా వీరి మధ్య చర్చకు వచ్చినట్లు పేర్కొంది. భద్రత, ఆర్థికపరమైన సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని ట్రంప్, మోదీ అంగీకారానికి వచ్చారని వెల్లడించింది.

ఈజిప్టులోని విశ్వవిద్యాలయంలో భారతీయ భాషా విభాగం ఏర్పాటు!

కైరో: ఈజిప్టులోని 'ఐన్ షామ్స్' విశ్వవిద్యాలయంలో భారతీయ భాషా విభాగాన్ని వచ్చే విద్యాసంవత్సరం నుంచీ ఏర్పాటు చేయనున్నారు. ఈజిప్టులో భారత రాయబారి సంజయ్ భట్టాచార్య ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచ హిందీ దినోత్సవం సందర్భంగా ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతీయ భాషా విభాగం ఏర్పాటుకు సంబంధించిన అవగాహన ఒప్పందం(ఎంవోయు)పై ఐన్‌షామ్స్ విశ్వవిద్యాలయం, 'భారత సాంస్కృతిక సంబంధాల మండలి'(ఐసీసీఆర్)లు సంతకాలు చేసినట్లు చెప్పారు.

చిరునామా, వయస్సు నిర్ధారణకు 'ఆధార్'

దిల్లీ: డ్రైవింగ్ లైసెన్స్ పొందగోరే అభ్యర్థులు ఇకపై ఆధార్‌కార్డును చిరునామా, వయస్సు నిర్ధారణ కోసం దరఖాస్తుతో పాటు సమర్పించే అవకాశం కలగనుంది. కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు-1989లో ఈ మేరకు మార్పులు చేయాలని కేంద్ర రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. సంబంధిత ముసాయిదా పత్రాన్ని సంప్రదింపుల కోసం కేంద్రన్యాయ శాఖకు పంపిందని కేంద్ర న్యాయమంత్రి రవిశంకర్‌ప్రసాద్ రాజ్యసభలో శుక్రవారం తెలిపారు. ఆధార్‌కార్డు లేనివారు ఎప్పటిలాగే పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణపత్రం, జీవిత బీమా పాలసీ తదితరాలను ఉపయోగించుకోవచ్చన్నారు.

తెరుచుకున్న అమెరికా ప్రభుత్వం

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వం తిరిగి తెరుచుకుంది. కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం ఆలస్యం కావడంతో.. 5 గంటపాటు స్తంభించిపోయిన ప్రభుత్వ కార్యకలాపాలు శుక్రవారం ఉదయం మళ్లీ మొదలయ్యాయి. ఇందుకు వీలు కల్పిస్తూ.. శుక్రవారం ఉదయం బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ప్రభుత్వం మూతపడకుండా ఉండేందుకు గురువారం అర్ధరాత్రిలోగా బిల్లును కాంగ్రెస్ ఆమోదించాల్సి ఉండగా.. సెనేట్‌లో ఆలస్యం జరిగింది. సెనేట్ 71-28 ఓట్ల తేడాతో, ప్రతినిధుల సభ 240-186 ఓట్ల తేడాతో దీన్ని ఆమోదించింది.

గ్రీన్‌కార్డుల నిరీక్షణ సమయం తగ్గుతుంది

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెస్తున్న వలస ముసాయిదా కార్యాచరణ వల్ల భిన్నత్వ లాటరీ విధానానికి ముగింపు పడుతుందని వైట్‌హౌస్ పేర్కొంది. అత్యంత నిపుణులైన శ్రామికులు గ్రీన్‌కార్డుల కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గిస్తుందని వివరించింది. కేటాయింపుల్లో దేశాలవారీ పరిమితిని తొలగించాలని భారత హెచ్-1బీ వీసాదారుల నుంచి డిమాండ్లు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది. భారత అమెరికన్లలో ఎక్కువమంది 'అత్యంత నిపుణుల' కోవలోకే వస్తారు. వారు ప్రధానంగా హెచ్-1బీ పనివీసాలపై అమెరికాకు వస్తుంటారు. అయితే చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదా లేదా గ్రీన్ కార్డులు కేటాయింపులో దేశానికి ఏడు శాతం చొప్పున కోటాను కేటాయించే ప్రస్తుత వలస వ్యవస్థ వల్ల వీరు ఎక్కువగా నష్టపోతున్నారు. ఫలితంగా నిపుణులైన భారత వలసదారులు గ్రీన్‌కార్డు పొందడానికి వేచిచూడాల్సిన సమయం 70 ఏళ్ల మేర ఉంది. గతవారం భారతీయ నిపుణులు వాషింగ్టన్ డీసీలో సమావేశమై, వలస వ్యవస్థలోని ఈ లోపాన్ని సరిదిద్దాలని ట్రంప్ సర్కారును, కాంగ్రెస్‌ను కోరారు. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్.. వాస్తవ పరిస్థితిని వివరించే ఒక పత్రాన్ని విడుదల చేసింది. ''ట్రంప్ ముసాయిదా కార్యాచరణ.. వీసా లాటరీ కార్యక్రమానికి ముగింపు పలుకుతుంది. కొన్ని వీసాల పునఃకేటాయింపు జరిపి.. అత్యంత నిపుణులు, ఉపాధి ఆధారిత వలస కేసుల నిరీక్షణ సమయాన్ని తగ్గిస్తాం" అని అందులో పేర్కొంది. అనంతరం ఈ అంశంపై ట్రంప్ ట్విటర్‌లో స్పందిస్తూ.. "వీసా లాటరీకి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది. వలస వ్యవస్థను, అమెరికన్లను కాంగ్రెస్ రక్షించాలి" అని అందులో పేర్కొన్నారు. ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థను ట్రంప్ కోరుకుంటున్నారని వైట్‌హౌస్ ఉప మీడియా కార్యదర్శి రాజ్‌షా తన తొలి పాత్రికేయ సమావేశంలో తెలిపారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులను తమ దేశంలోకి ఆకర్షించడానికి వీలవుతుందని చెప్పారు. "అధ్యక్షుడు వలస సంస్కరణలను కోరుకుంటున్నారు. ప్రస్తుతమున్న విస్తృత కుటుంబ శృంఖల వలస విధానం నుంచి ప్రతిభ ఆధారిత ప్రక్రియ వైపు మళ్లాలని భావిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. జాతి, మతం వంటి అంశాలతో నిమిత్తం లేకుండా ప్రతిభావంతులు తమ దేశంలోకి వచ్చేలా చూడాలని ఆయన అనుకుంటున్నట్లు వివరించారు. "విద్యాపరమైన నేపథ్యాలు, అమెరికాలోని శ్రామికశక్తి సామర్థ్యానికి వారు అందించే సేవలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనుకుంటున్నాం" అని తెలిపారు.



గంజాం జిల్లా తీరానికి కొట్టుకువచ్చిన మృత రిడ్లీ

ఆలివ్ రిడ్లీల మృత్యుఘోష

అరుదైన విదేశీ అతిథులైన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు సాగరంలో వివిధ కారణాల వల్ల మృతిచెందుతూ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా తీరానికి కొట్టుకు వస్తున్నాయి. గత నవంబరు నుంచి ఇప్పటివరకూ ఈ తీరానికి మొత్తం 92 మృత రిడ్లీలు కొట్టుకు వచ్చినట్లు బ్రహ్మపుర అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) ఆశీష్ కుమార్ బెహరా తెలిపారు. సాగరంలో వేల కి.మీ. దూరం ప్రయాణించి పునరుత్పత్తికి ఒడిశా తీరానికి వస్తున్న రిడ్లీలు మార్గమధ్యంలో సాగరంలో ట్రాలర్లు ఢీకొని, నిషేధిత వలలకు చిక్కుకుని మృతిచెందుతున్నాయన్నారు. అవి సాగర జలాల్లో కొట్టుకుని జిల్లా తీరానికి వస్తున్నాయని పేర్కొన్నారు. - బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే



దిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ. చిత్రంలో ఆ పార్టీ నేతలు ఆజాద్, కపిల్ సిబాల్ తదితరులు

జడ్జి లోయా మృతిపై సిట్‌ని నియమించండి

రాష్ట్రపతి కోవింద్‌కు విపక్షాల వినతి

దిల్లీ: సీబీఐ జడ్జి బీహెచ్ లోయా అనుమానాస్పద మృతిపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరిపించాలని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు ప్రతిపక్ష పార్టీల ఎంపీలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, ఎస్పీ, ఎన్సీపీ, ఆర్జేడీ, ఆప్ తదితర పార్టీలకు చెందిన ఎంపీలు రాష్ట్రపతిని కలిశారు. జడ్జి లోయా, న్యాయవాది శ్రీకాంత్ ఖండల్కర, రిటైర్డ్ జడ్జి ప్రకాశ్ తొంబ్రేల మృతిపై చాలా మంది ఎంపీలలో అనుమానం ఉందని రాహుల్ గాంధీ తెలిపారు. సీబీఐ, ఎన్ఐఏలకు ఈ కేసును అప్పగించరాదని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర అధికారుల బృందంతోనే దర్యాప్తు చేయించాలని కోరామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆ తర్వాత వెల్లడించారు. తమ వినతిపై రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారని, విషయాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. వినతి పత్రంపై 15 పార్టీలకు చెందిన 114 మంది ఎంపీలు సంతకాలు చేశారు. బీఎస్పీ ఎంపీల సంతకాలు లేవు.

లోయా మృతిపై విచారణను వ్యతిరేకించిన మహారాష్ట్ర

దిల్లీ: సంచలనం సృష్టించిన సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బి.హెచ్.లోయా అనుమానాస్పద మృతిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలన్న పిటిషన్లను మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. ఇప్పటికే వాంగ్మూలాలను నలుగురు న్యాయాధికారులు నమోదు చేశారనీ, వారిని విశ్వసించడమో.. . లేదా వారంతా అబద్ధం చెబుతున్నారని న్యాయస్థానం ప్రకటించడమో జరగాలని మహారాష్ట్ర తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఎదుట ఆయన వాదనలు వినిపించారు.

బాంబే హైకోర్టులో సీబీఐ వాదన

ముంబయి: సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో కేవలం ప్రభుత్వ అనుమతి లేదనే కారణంగా కొందరు పోలీసు అధికారులకు కేసు నుంచి విముక్తి కల్పించడం తగదని బాంబే హైకోర్టులో సీబీఐ శుక్రవారం వాదించింది. నకిలీ ఎన్‌కౌంటర్ అభియోగాల్ని ఎదుర్కొంటున్న పోలీసు అధికారుల్ని విచారించడానికి ప్రభుత్వాల అనుమతి అవసరం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్‌సింగ్ స్పష్టం చేశారు. కొందరు పోలీసుల్ని విడిచిపెట్టేయడంపై సొహ్రాబుద్దీన్ సోదరుడు రుబాబుద్దీన్ పిటిషన్ దాఖలు చేశారు.

ఉపరాష్ట్రపతిపై ఫేస్‌బుక్‌లో కామెంట్లు

- పక్షపాతంతో రాజ్యసభను నడిపిస్తున్నారని ఆరోపణ
- ఎంపీ చర్యను ముక్తకంఠంతో ఖండించిన రాజ్యసభ

దిల్లీ: రాజ్యసభను నడపడంలో ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఓ ఎంపీ ఫేస్‌బుక్‌లో కామెంట్లు పోస్ట్ చేయడాన్ని రాజ్యసభలోని ఎంపీలంతా పార్టీలకతీతంగా ఖండించారు. సభ్యులందరికీ రాజ్యసభ ఛైర్మన్‌పై పూర్తి విశ్వాసం ఉందని సమాజ్‌వాదీ పార్టీకి చెందిన నరేశ్ అగర్వాల్ అన్నారు. సదరు ఎంపీ వ్యాఖ్యలు అసమంజసం, అమర్యాదకరమన్నారు. ఆ ఎంపీ పేరు కూడా ప్రస్తావించకుండా మాట్లాడిన అగర్వాల్.. క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. రాజకీయంగా భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ అలాంటి వ్యాఖ్యలు చేయడం రాజ్యసభ ఛైర్మన్ స్థానానికే అవమానకరమని భాజపాకు చెందిన భూపేందర్‌యాదవ్ అన్నారు. సభ్యుడి చర్య అమర్యాదకరమని, మనమంతా ఖండించాల్సిందేనని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గులాం నబీఆజాద్ పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి సభ్యులందరికీ అవకాశాలిస్తున్నారని, సామాజిక మాధ్యమాలకు ఎక్కాల్సిన అవసరం లేదని టీఎంసీకి చెందిన డెరెక్ ఒబ్రియాన్ అన్నారు.

రాఫెల్‌పై అరుణ్ జైట్లీ అసత్యాలు: రాహుల్

దిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోమారు ఆరోపణలు సంధించారు. ఆంగ్ల అక్షరాలలో జైట్లీ పేరును స్వల్పంగా మార్చుతూ కేంద్ర మంత్రి (జైట్....లై)అసత్యాలు చెబుతున్నారనే అర్థం వచ్చేలా ట్వీట్ చేశారు. ఇలా పేరు మార్పు చేయటంపై ఇప్పటికే రాహుల్ పరువునష్టం దావాను ఎదుర్కొంటున్నారు. "మిస్టర్ జైట్‌లై, రక్షణ కొనుగోళ్ల ధరలను యూపీఏ ప్రభుత్వం ఎన్నడూ వెల్లడించలేదని చెప్పారు. పార్లమెంటుకు ఇచ్చిన మూడు సమాధానాల్లో యూపీఏ ప్రభుత్వం ధరలను వెల్లడించింది. పారదర్శకతను పాటించింది. ఇప్పుడు మీ రక్షణ మంత్రిని రాఫెల్ జెట్ ఖరీదు ఎంతో చెప్పమనండి" అంటూ ట్వీట్ చేశారు.

బాలల న్యాయ చట్టాన్ని అమలు చేయండి: సుప్రీం

దిల్లీ: బాలల న్యాయ చట్టం-2015ను ప్రభావవంతంగా అమలుచేయడానికి సుప్రీంకోర్టు శుక్రవారం పలు ఆదేశాలు జారీ చేసింది. బాలల న్యాయ బోర్డులు, శిశు సంక్షేమ కమిటీలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని పేర్కొంది. నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రప్రభుత్వాలకు సూచించింది. బాలల న్యాయ చట్టాన్ని అమలుచేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ మదన్ బి.లోకుర్, జస్టిస్ దీపక్‌గుప్తాతో కూడిన ధర్మాసనం పైమేరకు ఆదేశాలు జారీ చేసింది.

పాలు కావాలంటూ ఏడ్చినందుకు ఏడాది కుమార్తెను హత్య చేసిన తల్లి

ధార్(మధ్యప్రదేశ్): తల్లి పాల కోసం అదేపనిగా ఏడుస్తున్న పాపను. ..సాక్షాత్తూ కన్నతల్లే ఓ బలహీన క్షణాన కోపంతో చంపేసిన దారుణం ధార్‌జిల్లాలోని తల్వాడీ గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం ఈ దుర్ఘటన జరిగింది. అనితాసింగ్(25)కు ఏడాది పాప ఉంది. ఆరోజు అమ్మ పాలకోసం పాప అదేపనిగా ఏడవడంతో కోపోద్రిక్తురాలైన అనిత విసురుగా వచ్చి....పాపను తీసుకుని లోపలకు వెళ్లిపోయింది. మరుక్షణం పాప ఏడుపు ఆగిపోయింది. అనుమానం వచ్చిన అనిత అత్తగారు హడావుడిగా ఇరుగుపొరుగును పిలిచింది. లోపలికెళ్లి చూస్తే ఏడాది పసికూన రక్తపు మడుగులో చనిపోయి పడిఉంది. పోలీసులు తల్లి అనితను అరెస్టు చేశారు. స్తన్యం కోసం విసిగిస్తుండటంతో కోపం వచ్చి తానే కొడవలితో గొంతు కోసేసినట్లు అనిత అంగీకరించింది. కేసు దర్యాప్తు జరుగుతోంది.

కీలక సమాచారం పాక్‌కు చేరవేత

ఐఏఎఫ్ అధికారి అరెస్టు

ఈనాడు, దిల్లీ: భారత వైమానిక దళాని(ఐఎఎఫ్)కి సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐకి దొంగచాటుగా చేరవేశారన్న ఆరోపణలతో ఐఎఎఫ్ అధికారి అరుణ్ మర్వాహా(51)ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఐఏఎఫ్ ఉన్నతాధికారి ఒకరు అరుణ్ మర్వాహా వ్యవహారాన్ని కనిపెట్టి విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. రహస్య సమాచారం చేరవేతకు మర్వాహా సామాజిక మాధ్యమాన్నే చక్కగా వాడుకున్నారు. మహిళల పేర్లతో సామాజిక మాధ్యమంలో మాటామాటా కలిపిన ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లకు ఆయన కీలక సమాచారాన్ని చేరవేశారు.

ఎల్‌ఓసీ వద్ద పాక్ కాల్పుల్లో మహిళ మృతి

జమ్ము: జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రరేఖ (ఎల్‌ఓసీ) వెంబడి పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో ఓ మహిళ మృతిచెందారని. . మరో ముగ్గురు జవాన్లు గాయపడ్డారని రాష్ట్ర మంత్రి అవుఖాఫ్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గురువారం సాయంత్రం నుంచి ఈ కాల్పులు చోటుచేసుకున్నాయని శుక్రవారం ఆయన అసెంబ్లీలో వెల్లడించారు.

తప్పుడు పత్రాలతో మాయాజాలం

- పరీక్షల బోర్డుకు బోగస్ నామినల్ రోల్స్
- కొన్ని గుర్తింపు లేని బడుల యజమానుల నిర్వాకం
- 'పది' పరీక్షల కోసం బరితెగింపు..!
- పాఠశాల విద్యాశాఖ సిబ్బంది సహకారం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల నుంచి విద్యార్థుల్ని పదో తరగతి పరీక్షలు రాయించేందుకు కొందరు ప్రైవేటు పాఠశాలల యజమానులు బోగస్ పత్రాలు సృష్టించారు. ఇందుకోసం విద్యాశాఖలోని సిబ్బంది సహకారం వారికి లభించడం గమనార్హం. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ బాగోతం చోటు చేసుకుంది. గుర్తింపు లేని పాఠశాలల పేరిట ఏకంగా పదో తరగతి పరీక్షల నామినల్ రోల్స్ పరీక్షల బోర్డుకు పంపించడం కలకలం రేపుతోంది. ఇందుకోసం ఫోర్జరీ సంతకాలతో బోగస్ తాత్కాలిక గుర్తింపు/ పొడిగింపు (ఈటీఆర్) పత్రాలను సృష్టించారు. కొన్నాళ్ల క్రితం రాష్ట్ర రాజధానిలో వెలుగు చూసిన మదర్సాల అక్రమాలను తలపించేలా తాజా నిర్వాకం సాగింది.

అక్రమం జరిగిందిలా..

ప్రైవేటు పాఠశాల తరఫున విద్యార్థులు పదో తరగతి రెగ్యులర్ పరీక్షలకు హాజరు కావాలంటే ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి. గుర్తింపు ఉంటేనే పదేళ్లకోమారు ఈటీఆర్‌లు జారీ చేస్తారు. గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలల ఉన్నత తరగతుల 'ప్రొవిజనల్ రికగ్నిషన్' కోసం కొంతమందితో కూడిన ముఠా ఆర్జేడీ కార్యాలయం పేరిట తప్పుడు ప్రొసీడింగ్స్‌ను, ఈటీఆర్‌లను సృష్టించింది. వాటినే జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని ఓ విభాగం సిబ్బంది సహకారంతో అక్కడి దస్త్రాల్లో కలిపేసింది. సాధారణంగా విద్యాధికారి కార్యాలయానికి ఏ దస్త్రం లేదా దరఖాస్తు వచ్చినా అక్కడి రిజిస్టర్‌లో ఓ సంఖ్యను కేటాయిస్తారు. అయితే ఇవి బోగస్‌వి కావడం.. రిజిస్టర్‌లో నమోదు చేసే అవకాశం లేకపోవడంతో ఇతర దరఖాస్తులకు కేటాయించిన సంఖ్యల్నే ఈ బోగస్ ప్రొసీడింగ్స్‌కు వాడారు.

19 పాఠశాలల పేరుతో..

జిల్లా విద్యాధికారి కార్యాలయం సిబ్బంది హస్తం లేకుండా కోడ్ కేటాయించడం సాధ్యం కాదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. తాజా అక్రమంలో భాగంగా మొత్తం 19 పాఠశాలల పేరిట ఇలా బోగస్ ఈటీఆర్‌లతో నామినల్ రోల్స్ పంపించినట్లు తెలుస్తోంది. బండ్లగూడ, బహదూర్‌పురా, గోల్కొండ, సైదాబాద్ ఉప విద్యాధికారుల కార్యాలయాల పరిధిలో ఇలా జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు నిజానిజాలను నిగ్గు తేల్చాల్సి ఉంది. 'ఈనాడు' ఈ వ్యవహారాన్ని హైదరాబాద్ ఆర్జేడీ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణం విచారణకు ఆదేశించారు.

అక్రమాలకు మచ్చుతునకలివి..

బోగస్ పత్రాల బాగోతం గురించి సమాచారాన్ని ధ్రువీకరించుకునేందుకు 'ఈనాడు' తనకు అందిన పత్రాల్ని జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని రిజిస్టర్‌తో సరిపోల్చింది. ఈ పరిశీలనలో తేలిన అంశాల్లో మచ్చుకు కొన్ని..

- బహదూర్‌పురా మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల 2016లో ప్రొవిజనల్ రికగ్నిషన్ పొందినట్లు తప్పుడు పత్రాల్ని సృష్టించారు. జిల్లా విద్యాధికారి కార్యాలయంలో లేఖ సంఖ్యను 6839గా ఈ పత్రాల్లో చూపించారు. వాస్తవానికి విద్యాధికారి కార్యాలయంలోని రిజిస్టర్‌లో మాత్రం ఆ సంఖ్యను బోయినపల్లికి చెందిన ఓ ఉపాధ్యాయురాలి ఆరోగ్య సెలవు కోసం కేటాయించారు.
- బండ్లగూడ మండలంలోని ఓ పాఠశాల అదే ఏడాది గుర్తింపు పొందినట్లు బోగస్ పత్రాల్లో ఉంది. విద్యాధికారి కార్యాలయపు లేఖ సంఖ్యగా 6908గా చూపించారు. కానీ కార్యాలయంలోని రిజిస్టర్ ప్రకారం ఈ సంఖ్య సైదాబాద్ మండలం మూసారాంబాగ్‌లోని ఓ ఎడ్యుకేషనల్ సొసైటీ చేసిన దరఖాస్తుకు సంబంధించినది.

తెరపై కనిపించే వస్తువును తాకాలనుందా?

- 4డీ కళ్లద్దాలను తయారుచేసిన అమెరికా శాస్త్రవేత్తలు

లాస్ఏంజిలెస్: తెరపై కదులుతున్న వస్తువును స్వయంగా తాకే అనుభూతిని కల్పించే '4డీ' కళ్లద్దాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచారు. ఇది ధరించి సినిమా చూస్తే కదులుతున్న వాహనం, వస్తువును తాకినట్లు, అవి మనల్ని తాకినట్లు కూడా అనుభూతి చెందవచ్చు. అమెరికాలోని కాలిఫోర్నియా-శాన్‌డియాగో విశ్వవిద్యాలయానికి చెందిన నాడీశాస్త్రవేత్తలు దీన్ని రూపొందించారు. మెదడులో దృష్టి, స్పర్శను అనుభూతి చెందే భాగాల అనుసంధాన ప్రక్రియను ఇందుకు అధ్యయనం చేశారు. ఈ కళ్లద్దాలు ధరించి చూస్తే సినిమాలు, సంగీతం, ఆటలు ఎంతో గమ్మత్తుగా ఉంటాయని, ఈ అనుభూతి ఎంతో ఆనందాన్నిస్తుందని ఈ పరికరాన్ని రూపొందించే శాస్త్రవేత్తలకు నాయకత్వం వహించిన నాడీ శాస్త్రవేత్త ర్యూసాంగ్ హుయాంగ్ పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్త పర్యటనకు రజనీ సిద్ధం

ఈనాడు డిజిటల్, చెన్నై: లోక నాయకుడు కమల్‌హాసన్ తరహాలోనే సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు శుక్రవారం మక్కల్ మండ్రం సభ్యులు, అభిమాన సంఘం ముఖ్యనాయకులతో కోడంబాక్కంలోని రాఘవేంద్ర కళ్యాణ మండపంలో సమావేశమయ్యారు. ఇందులో రాజకీయ వ్యూహాలపై అభిమానులకు, ముఖ్యనాయకులకు సూచనలు చేసినట్లు సమాచారం. ప్రధానంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మక్కల్ మండ్రం సభ్యత్వం పెంచాలని, కొన్ని జిల్లాల్లో మందకొడిగా సాగుతున్న సభ్యత్వంపై దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా మహిళా సభ్యులను పెంచడానికి ఇళ్ల వద్దకే దరఖాస్తులు పంపి పెద్ద సంఖ్యలో వారిని భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్త పర్యటనకు కూడా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

అమెరికా పర్యటనలో కమల్‌హాసన్

మరోవైపు హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరగనున్న సదస్సులో పాల్గొనడానికి అమెరికా వెళ్లిన కమల్‌హాసన్ అక్కడ రాష్ట్ర సమస్యలపై మాట్లాడారు. అక్కడుంటున్న రాష్ట్రానికి చెందిన నిపుణులతో సమావేశం కానున్నారు. ఈ నెల 21న కమల్ పార్టీ ప్రకటన చేయనున్న నేపథ్యంలో ప్రస్తుత పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి.

న్యాయస్థానాల లోపల జరిగే విచారణ ప్రక్రియలను ప్రత్యక్ష ప్రసారం చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్ సహకారాన్ని సుప్రీంకోర్టు కోరింది. తమ పిటిషన్ల ప్రతులను వేణుగోపాల్‌కు అందించాల్సిందిగా ధర్మాసనం పిటిషన్‌దారులను శుక్రవారం ఆదేశించింది. ఆధార్ చెల్లుబాటు వంటి కోర్టు లోపల జరిగే జాతీయ ప్రాముఖ్యమున్న కేసుల విచారణ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయాల్సిందిగా సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి గమనార్హం.

ఘనంగా ముగిసిన 'విటోపియా-2018'

- ఏపీ విట్‌లో ఆటపాటలతో హోరెత్తించిన ఇంజినీరింగ్ యువత
- 40 రాష్ట్రాల నుంచి పాల్గొన్న 300 మంది



ఏపీ విట్ వర్సిటీలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఈనాడు, గుంటూరు: తరగతి గదిలో నిరంతరం పుస్తకాలతో కుస్తీపడుతూ విపరీతమైన ఒత్తిడి మధ్య గడుపుతున్న ఇంజినీరింగ్ యువత ఆటపాటలతో సందడి చేసింది. ఆ సందడికి రాజధాని అమరావతిలోని ఏపీ విట్ విశ్వవిద్యాలయం హోరెత్తింది. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయటానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందించటానికి, బృంద స్ఫూర్తిని అలవర్చే లక్ష్యంతో అమరావతిలోని ఏపీ విట్ విశ్వవిద్యాలయం తొలిసారిగా కళాశాల ప్రాంగణంలో 'విటోపియా-2018' కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన 40కు పైగా ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 300 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. తమలో ఉన్న ప్రతిభ, పాటవాలను ప్రదర్శించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, క్రికెట్ వంటి క్రీడలతో పాటు సినీ, శాస్త్రీయ సంగీతానికి సంబంధించిన ఆట, పాటల పోటీలు నిర్వహించారు. ఈ నెల 3 నుంచి కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న క్రీడా, సాంస్కృతిక పోటీలు శుక్రవారం ముగిశాయి.

త్వరగా భవన నిర్మాణాలు పూర్తిచేస్తాం: విటోపియా-2018 కార్యక్రమం నిర్వహణతో మరోసారి తమ వర్సిటీ ఖ్యాతిని రుజువు చేసుకోగలిగామని విట్ విశ్వవిద్యాలయం కులపతి డాక్టర్ విశ్వనాథన్ పేర్కొన్నారు. భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి అనేక కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని ఆయన వెల్లడించారు.

ఆకట్టుకున్న బెన్నీ, దామిని పాటలు: రాత్రి 7 గంటల తర్వాత జరిగిన మ్యూజికల్ నైట్ షోలోనూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలీవుడ్ గాయకుడు బెన్నీ దయాళ్, టాలీవుడ్ గాయిని దామిని బాట్ల పాటలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

గవర్నర్‌ను కలిసిన టీజీవోలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గెజిటెడ్ అధికారుల సంఘం, టీజీవోల నగర శాఖల అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ఇతర ప్రతినిధులు సయామొద్దీన్, వాజిద్‌ఖాన్, రామకృష్ణ, రోహిత్ తదితరులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు టీజీవోలు, టీఎస్‌పీఎస్సీ డైనందినిలను బహూకరించారు.

ఒడిశా ఎంపీకి అస్వస్థత

దిల్లీ: ఒడిశాకు చెందిన ఎంపీ ఏ.వి.స్వామి పార్లమెంటు సముదాయంలో అస్వస్థతకు గురై పడిపోవడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు సభకు తెలిపారు. చక్కెర స్థాయిల వల్ల లేదా మరే కారణంగా అస్వస్థతకు గురయ్యారా? అన్నది వైద్య పరీక్షల అనంతరం తెలుస్తుందని పేర్కొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో వరుసగా రెండు పరాభవాలు ఎదురవ్వగానే విరాట్ కోహ్లి నాయకత్వంపై ఎన్నెన్నో విమర్శలు.. జట్టు ఎంపిక విషయంలో ఇవేం నిర్ణయాలంటూ మాజీల ముప్పేట దాడి.. కోహ్లికి సరైన సలహాలిస్తూ అతడిని నడిపించే ఓ వ్యక్తి డ్రెస్సింగ్ రూంలో ఉండాలంటూ సలహాలు!

కానీ వన్డే సిరీస్‌కు వచ్చేసరికి టీమ్‌ఇండియాదే తిరుగులేని ఆధిపత్యం. ఆటగాడిగా, కెప్టెన్‌గా విరాట్‌లో ఏ తడబాటూ లేదు. అతడి నిర్ణయాలు అదుర్స్ అనిపిస్తున్నాయి. తుది జట్టు ఎంపిక, బౌలింగ్ మార్పులు, ఫీల్డింగ్ కూర్పులు.. అన్నీ అద్భుతంగా పని చేస్తున్నాయి.

మరి ఏంటి తేడా..?

మహేంద్ర సింగ్ ధోని.. అన్నది జట్టు వర్గాల మాట!

ఇంగ్లాండ్‌తో ఈ ఏడాది ఆరంభంలో జరిగిన వన్డే సిరీస్‌లో ఓ మ్యాచ్. వన్డేలు, టీ20ల్లో జట్టు పగ్గాలు వదిలేశాక ధోని ఆడిన తొలి సిరీస్ అదే. ఇంగ్లాండ్ కెప్టెన్ మోర్గాన్ ప్యాడ్లకు బంతి తాకింది. ఎల్బీ అంటూ అప్పీల్ చేశారు భారత ఆటగాళ్లు. అంపైర్ వేలెత్తలేదు. ధోని మరీ గట్టిగా ఏమీ అప్పీల్ చేయలేదు. సమీక్ష వద్దన్నట్లుగా ధోని వారిస్తున్నా కోహ్లి తొందరపడి వెంటనే సంజ్ఞ చేసేశాడు. చివరికి సమీక్షలో బ్యాట్స్‌మన్ నాటౌట్ అని తేలింది. ధోని చిన్నగా ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాడు!

మొన్న నవంబర్లో న్యూజీలాండ్‌తో ఓ వన్డే మ్యాచ్. చివరి ఓవర్లలో ఉత్కంఠగా సాగుతోంది మ్యాచ్. బౌండరీ హద్దుల దగ్గర బలమైన ఫీల్డర్లుండాలి. దీంతో కోహ్లీనే ఓ బౌండరీ హద్దు వద్దకు వెళ్లిపోయాడు. ఫీల్డింగ్ ఏర్పాట్లు.. బౌలింగ్ మార్పులు.. సూచనలు, సలహాలు అన్నీ ధోనీనే! అప్పుడతడిని చూస్తే కెప్టెన్ కోహ్లీనా..? ధోనీనా..? అనిపించింది.

పై రెండు ఉదంతాల్లో ఎంత వ్యత్యాసం..? మొదటి సందర్భంలో ధోని అభిమానులు ఒకింత ఆశ్చర్యానికి, ఆవేదనకు లోనయ్యారు. ఇలా కెప్టెన్సీ వదిలేయగానే అలా ధోని ప్రాధాన్యం తగ్గిపోయిందేంటి అని చర్చించుకున్నారు. చాలా దూకుడుగా ఉండే కోహ్లి ధోనీని ఏమాత్రం గౌరవిస్తాడో.. అతడి అభిప్రాయాలకు ఏమాత్రం విలువ ఇస్తాడో అంటూ ఎన్నెన్నో సందేహాలు! కానీ విరాట్ ఆ సందేహాల్ని పటాపంచలు చేశాడు.

ధో'నీడలో'... విరాట్ విశ్వరూపం!



"నాపై వేటు ఓ సందర్భంలో వేటు పడకుండా కాపాడింది ధోనీనే. మహి భాయ్ ఎప్పటికీ నా కెప్టెనే".. ఇదీ ధోని నుంచి వన్డే పగ్గాలందుకున్న కొత్తలో కోహ్లి అన్న మాటలు.

ఊరికే మాటలు చెప్పడం కాదు. ఆ తర్వాత పలు సందర్భాల్లో ధోనీని నిజంగానే కెప్టెన్ లాగే గౌరవించాడు విరాట్. ఒకప్పుడు కోహ్లి దూకుడు, కొన్ని సందర్భాల్లో అతడి తలబిరుసు చూస్తే అతను సీనియర్లు, దిగ్గజ ఆటగాళ్ల పట్ల ఏమాత్రం విధేయత ప్రదర్శిస్తాడో అన్న సందేహాలు కలిగిన మాట వాస్తవం. ఐతే ధోని కెప్టెన్సీ నుంచి దిగిపోయాక అతడితో కోహ్లి వ్యవహరించిన తీరు అతడిపై ఉన్న అభిప్రాయాల్నే మార్చేశాయి. ఒకప్పుడు సచిన్ సహా దిగ్గజ ఆటగాళ్లతో ధోని ఎంత గౌరవంగా వ్యవహరించి, వాళ్ల అభిమానాన్ని చూరగొన్నాడో.. ధోని విషయంలో విరాట్ కూడా అలాగే ప్రవర్తించాడు. మ్యాచ్‌ల్లో కీలక సందర్భాల్లో ధోని సలహాలు తీసుకోవడానికి ఏమాత్రం వెనుకాడడు విరాట్. గత ఏడాది కాలంలో ఎన్నో సందర్భాల్లో మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో కోహ్లి.. ధోని వద్దకు వెళ్లడం.. అతడి సలహాలు తీసుకోవడం, వాటినే అమల్లో పెట్టడం గమనించే ఉంటారు. అంపైర్ నిర్ణయంపై సమీక్ష కోరాలంటే కోహ్లి చూపు ఎప్పుడూ ధోని వైపే. సమీక్ష విషయంలో ధోని ఎంత పక్కాగా ఉంటాడో తెలిసిందే. ఈ పద్ధతికి అభిమానులు 'ధోని రెఫరల్ సిస్టమ్' అంటూ పేరు కూడా పెట్టేయడం విశేషం. "కెప్టెన్‌గా నేను నా నిర్ణయాల్ని నమ్ముతా. కానీ అవసరమైనపుడు ధోని సలహా తీసుకోవడానికి సందేహించను. అతను పది సలహాలిస్తే అందులో 8-9 పని చేస్తాయి" అంటాడు విరాట్. ఆ మధ్య ధోని రెండు మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలమై, వేగంగా ఆడలేక విమర్శలు ఎదుర్కొన్నపుడు.. "నేను విఫలమై ఉంటే ఇలా మాట్లాడి ఉండేవారా? ధోనీ లాంటి దిగ్గజాన్ని గౌరవించడం తెలియదా" అంటూ విమర్శకులపై ఎదురు దాడి చేశాడు కోహ్లి. ధోని బ్యాటింగ్‌లో కొంచెం తడబడుతున్నప్పటికీ అతడి అవసరం జట్టుకుందని కోహ్లీకి తెలుసు! ముఖ్యంగా అతడి క్రికెట్ బుర్రపై కోహ్లీకి అపారమైన నమ్మకం! అందుకే ధోనీని వదులుకోవట్లేదు!

మొత్తంగా ధోని-కోహ్లి జుగల్‌బందీ అభిమానుల్లో భలే ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇద్దరూ చక్కటి సమన్వయంతో సాగుతూ ప్రత్యర్థుల పని పడుతున్నారు. ధోని 2019 ప్రపంచకప్ వరకు కొనసాగుతాడన్న సంకేతాలు ఇప్పటికే వచ్చిన నేపథ్యంలో ఈ జోడీని ఇంకో ఏడాదిన్నర పాటు ఇలాగే చూడొచ్చు. ఈ సమన్వయం ఇలాగే కొనసాగి, టీమ్‌ఇండియా జోరూ కొనసాగితే.. కోహ్లితో కలిసి ధోని మరో ప్రపంచకప్ గెలిచి సగర్వంగా ఆటకు టాటా చెబుతాడేమో చూద్దాం!

కొన్ని నెలల కిందట న్యూజిలాండ్‌తో సిరీస్ ఫలితాన్ని నిర్దేశించే టీ20 మ్యాచ్‌లో భారత్ మొదట 8 ఓవర్లకు 68 పరుగులే చేసింది. కివీస్ చివరి 2 ఓవర్లలో 29 పరుగులే చేయాల్సి వచ్చింది. పొదుపుగా బౌలింగ్ చేసే బుమ్రా కోసం చివరి ఓవర్ అట్టిపెట్టి.. హార్దిక్ పాండ్యతో ఏడో ఓవర్ వేయించాలనుకున్నాడు కోహ్లి. ఐతే బ్యాట్స్‌మన్ ఏడో ఓవర్లోనే బాదేస్తే.. బుమ్రాను ఉంచుకుని లాభమేమీ ఉండదని అతడితోనే ఏడో ఓవర్ వేయించాలన్న సలహా ఇచ్చాడు ధోని. ఆ సలహా పని చేసింది. భారత్ నెగ్గింది. ధోని ఇచ్చిన సలహా బాగా పని చేసిందంటూ కోహ్లినే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించడం విశేషం. గత ఏడాది కాలంలో ఇలా ధోని తనదైన సలహాలతో జట్టుకు మేలు చేసిన సందర్భాలెన్నో!

అతడి కోసం ధోని..

ఒకప్పుడు భారత క్రికెట్లో ఒక కెప్టెన్ నుంచి మరో కెప్టెన్‌కు నాయకత్వ బాధ్యతల బదలాయింపు అంత సాఫీగా ఏమీ సాగలేదు. అజహర్, సచిన్, గంగూలీ, ద్రవిడ్ లాంటి వాళ్లు అనూహ్య పరిస్థితుల్లో కెప్టెన్సీ విడిచిపెట్టారు. ఆయా సందర్భాల్లో తర్వాత ఎవరికి కెప్టెన్సీ ఇవ్వాలా అనే విషయంలో చాలా అయోమయంతో ఉండేవారు బోర్డు పెద్దలు, సెలక్టర్లు. ఐతే ధోని నుంచి కోహ్లికి పగ్గాలప్పగించే ప్రక్రియ మాత్రం చాలా సాఫీగా సాగిపోయింది. ఇందుకు ప్రధాన కారణం ధోనీనే! ముందు నుంచి కోహ్లీని నాయకత్వ బాధ్యత అందుకునే దిశగా తయారు చేయడంలో ధోని కీలక పాత్ర పోషించాడు. విరాట్‌కు దూకుడెక్కువని.. అతడు మైదానంలో నియంత్రణతో ఉండలేడని చాలామంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ తనకు పూర్తి భిన్నంగా కనిపించే కోహ్లిలోనూ కెప్టెన్ ఉన్నాడని ధోని నమ్మాడు. అతడికి మద్దతుగా నిలిచాడు. కొన్నేళ్ల పాటు అతడికి మార్గనిర్దేశం చేశాడు. 2014 చివర్లో ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ సందర్భంగా తన గైర్హాజరీలో కోహ్లి జట్టును ముందుండి నడిపించడం చూడగానే ఇక ఆలస్యం చేయకుండా.. రిటైర్మెంట్ ప్రకటించేశాడు. అతడికి పగ్గాలు అందేలా చూశాడు. ఇక వన్డేల్లో తాను నాయకత్వాన్ని త్యజించాల్సిన అవసరం లేకపోయినా.. గత ఏడాది ఆరంభంలో ఉన్నట్లుండి ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. కెప్టెన్ అంటే ధోని.. ధోని అంటే కెప్టెన్ అన్న అభిప్రాయం కలిగించిన ధోని ఒక సాధారణ ఆటగాడిగా జట్టులో ఎలా కొనసాగుతాడో.. ఎలా సర్దుకుపోతాడో.. ఇలా ఇమడలేక మొత్తంగా అన్ని ఫార్మాట్లకూ రిటైర్మెంట్ ప్రకటించేస్తాడేమో అని కూడా అనుకున్నారు చాలామంది. కానీ అలా ఏమీ జరగలేదు. ఆటగాడిగా ధోని బాగానే ఒదిగిపోయాడు. కెప్టెన్ కాదు కదా అని అంటీ ముట్టనట్లేమీ ఉండలేదు. అవసరమైనప్పుడు తానున్నానంటూ ముందుకొస్తున్నాడు. కోహ్లీకి, సహచరులకు సాయపడుతున్నాడు. ఇప్పటికీ బౌలర్లకు ఎక్కడ బంతులేయాలో సూచిస్తూ, ఫీల్డర్లను సర్దుబాటు చేస్తూ కనిపిస్తుంటాడు మహి. ప్రస్తుత వన్డే సిరీస్‌లోనూ ధోని తనవంతు పాత్ర పోషిస్తున్నాడు. కోహ్లితో.. స్పిన్నర్లు చాహల్, కుల్‌దీప్‌లతో సమన్వయం చేసుకుని సఫారీల పని పట్టడంలో అతను కీలకంగా మారుతున్నాడు.

గజ గజ.. శివ శివ!



కాస్త చలిగాలి తగిలితే చాలు వణికిపోతాం..

కానీ విపరీతమైన చలి.. శరీరం గడ్డ కట్టుకుపోతుందా అన్నట్లుండే వాతావరణం..


ఈ పరిస్థితుల్లో నిలవడమే కష్టం..

అలాంటిది ఆడడం అంటే! అందులోనూ గంటకు 140 కి.మీ వేగంతో దూసుకుపోవడం అంటే!! ఊహకే అందట్లేదు కదా!!

ఒక భారత ఆటగాడికి మాత్రం ఇదెంతో సరదా! రయ్.. రయ్ మంటూ మంచులో మెరుపులా దూసుకెళ్లడం అంటే ఎంతో ఇష్టం. అతడే శివ కేశవన్.. అతనాడే ఆట పేరు లూజ్.

వింటర్ ఒలింపిక్స్ అనగానే వెంటనే గుర్తొచ్చే భారత అథ్లెట్ పేరు శివ మాత్రమే. ఎందుకంటే ఈ పోటీల్లో రికార్డు స్థాయిలో ఆరోసారి పాల్గొంటున్నాడు. తన చివరి వింటర్ ఒలింపిక్స్ ఆడుతున్న శివ.. ఆఖరి మజిలీలోనైనా మెరవాలనే పట్టుదలతో ఉన్నాడు.

వింటర్ ఒలింపిక్స్ అంటే అదేదో మనకు సంబంధం లేని క్రీడల్లాగే భావిస్తాం. ఎందుకంటే భారత్‌లో మంచు క్రీడల సంస్కృతి లేదు. మనాలి, గుల్‌మార్గ్ లాంటి చోట్ల మాత్రమే ఐస్ స్కేటింగ్ లాంటి క్రీడలకు కాస్తో కూస్తో ఆదరణ ఉంది. అలాంటి మంచు క్రీడలకు ఆదరణ ఉన్న మనాలి నుంచే వచ్చాడు శివ కేశవన్. అతని తండ్రిది కేరళ..తల్లిది ఇటలీ. వీళ్లకు హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక రెస్టారెంట్ ఉండేది. అక్కడే పుట్టిన శివ హిమ క్రీడల్లో రాణించాడు. అందరిలా స్కేటింగ్‌లో కాకుండా ఐరోపా దేశాల్లో ప్రాముఖ్యత ఉన్న లూజ్‌లో పట్టు సంపాదించాడు. అదే క్రీడలో 1998 వింటర్ ఒలింపిక్స్‌లో తొలిసారి భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అప్పటి నుంచి ఇప్పటి దాకా శివ ప్రతి ఒలింపిక్స్‌కూ వెళుతూనే ఉన్నాడు. ఆరంభోత్సవంలో భారత జెండాను చేబూని ముందుకు సాగడం అతనికెంతో ఇష్టం. శీతాకాల ఒలింపిక్స్‌లో ఇప్పటిదాకా ఒక్క పతకాన్ని కూడా సాధించలేకపోయిన శివ.. ఆసియా లూజ్ క్రీడల్లో నాలుగు స్వర్ణ, నాలుగు రజత, రెండు కాంస్య పతకాలు చేజిక్కించుకున్నాడు.



ఏంటీ లూజ్?

ఏదైనా పార్కులకు వెళ్లినప్పుడు చిన్న పిల్లలకు జర్రున జారే ఒక బల్ల (స్లైడర్) కనిపిస్తుంది. దీనిపైకి ఎక్కి కిందకి జారడం అంటే చిన్నారులకు ఎంతో ఇష్టం. ఈ స్లైడర్ మాదిరిగానే ఉంటుంది లూజ్ ఆట. కాకపోతే దీన్ని మంచులో ఆడతారు. ఆ స్లైడర్‌నే ఇక్కడ లూజ్ పేరుతో పిలుస్తారు. జారుడు బల్లలా ఉండే ఈ లూజ్‌లో కూర్చొని ఊహించని వేగంతో దూసుకెళ్తారు ఆటగాళ్లు. మొదట కూర్చున్న భంగిమలో కుఫెన్స్ (లూజ్ హ్యాండిల్స్) పట్టుకుని నెమ్మదిగా కదలడం మొదలు పెడతారు. అలాగే వేగాన్ని పెంచుతూ ఒక దశ దాటిన తర్వాత అదే లూజ్‌లో నిద్రపోయిన భంగిమలో వెల్లికిలా పడుకుంటారు. గంటకు సుమారు 140 కి.మీ వేగంతో ఆటగాళ్లు దూసుకెళ్తుంటే కళ్లు చెదిరిపోతాయి. ఈ ఆటలో మాన్యుయల్ (ఆస్ట్రియా, గంటకు 154 కి.మీ) అత్యధిక వేగాన్ని నమోదు చేశాడు. ఇది చూడటానికి ఎంత వినోదంగా ఉంటుందో దీని వెనుక అంత ప్రమాదం దాగుంది. ఆ వేగంలో పొరపాటున పట్టుతప్పితే ఇంతే సంగతులు. ఇలా రేసులో పాల్గొంటూ దుర్మరణం పాలైనవాళ్లు కూడా ఉన్నారు.



జగ్‌దీష్ కూడా...

శివ కేశవన్‌తో పాటు వింటర్ ఒలింపిక్స్‌కు వెళ్లాడు జగ్‌దీష్ సింగ్. అతను క్రాస్‌కంట్రీ స్కీయింగ్‌లో పోటీపడనున్నాడు. 15 కి.మీ ఫ్రీస్టయిల్ ఈవెంట్ ఫిబ్రవరి 16న జరగనుంది. ఈ పోటీల్లో పాల్గొనబోతుండడం అతనికిదే తొలిసారి. ఈ పోటీలకు వెళ్లే ముందే అతను ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. జగ్‌దీష్‌తో పాటు ఎవరు కోచ్‌గా వెళతారు అనే విషయంపై చివరి వరకు తర్జనభర్జన జరిగినా.. ఆఖర్లో ఇక్బాల్ నదీమ్ పేరును భారత ఒలింపిక్ సంఘం ఖరారు చేసింది. క్రాస్‌కంట్రీ అంటే అథ్లెటిక్స్‌లో మాదిరి పరుగుపందెమే. కానీ పరుగు మంచుపై ఉంటుంది. ఉత్తి కాళ్లతో కాదు స్కేటింగ్ చక్రాలతో పరుగెత్తాల్సి ఉంటుంది. స్కై లిఫ్ట్స్ (చేతి కర్రలు లాంటివి) పట్టుకుని స్కేట్స్ సాయంతో మంచు కొండల్లో దూసుకెళ్తారు అథ్లెట్లు. ఎవరు వేగంగా గమ్యాన్ని చేరితే వారే విజేత. ఇప్పుడు జగ్‌దీష్ పోటీపడబోయేది ఈ ఈవెంట్లోనే.

అలా మొదలయ్యాయి..

వేసవి ఒలింపిక్స్ మాదిరిగానే నాలుగేళ్లకోసారి జరిగే ఈ పోటీలు 1924లో ప్రారంభం అయ్యాయి. ఫ్రాన్స్‌లో జరిగిన ఈ క్రీడలను అప్పట్లో అంతర్జాతీయ శీతాకాల క్రీడలు పేరుతో పిలిచేవాళ్లు. తొలి క్రీడల్లో 16 దేశాల నుంచి 258 మంది అథ్లెట్లు 16 ఈవెంట్లలో పోటీపడ్డారు. 1940లో రెండో ప్రపంచ యుద్ధం కారణంగా ఈ క్రీడలు వాయిదా పడ్డాయి. 1948లో మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రతి ఒలింపిక్స్‌లోనూ పోటీపడే దేశాలు నెమ్మదిగా పెరుగుతూ వచ్చాయి. శుక్రవారం ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా)లో ఆరంభమైన శీతాకాల ఒలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో 92 దేశాలు పోటీపడుతున్నాయి.

అమెరికా కాదు నార్వే

ఒలింపిక్స్‌లో అనాదిగా అమెరికా, రష్యాల హవా కొనసాగుతుంది. ఎక్కువ పతకాలు కొట్టేది.. అగ్రస్థానంలో నిలిచేది ఈ రెండు దేశాలే. గత రెండు ఒలింపిక్స్ నుంచి చైనా అగ్రస్థానం కోసం పోటీపడుతోంది. అయితే వింటర్ ఒలింపిక్స్‌లో మాత్రం నార్వేదే అగ్రస్థానం. 22 క్రీడల్లో ఆ దేశం 329 పతకాలు సాధించింది. అందులో 118 స్వర్ణాలు ఉన్నాయి. ఆ తర్వాత స్థానంలో అమెరికా (282), జర్మనీ (209) ఉన్నాయి. ఈ పోటీల్లో ఆసియా దేశాలు పాల్గొనడమే గొప్పగా భావిస్తాయి. అలాంటిది ఇప్పుడు దక్షిణకొరియా ఆతిథ్యాన్నే చేజిక్కించుకుంది.

కాళ్లతో ఫోర్లు... సిక్సర్లు!



బ్యాట్స్‌మన్ సిక్స్ కొడతాడు. కానీ చేతిలో బ్యాటు ఉండదు. బౌలర్ వికెట్ తీస్తాడు. కానీ మనం నిత్యం చూస్తున్నట్లు అతడు బౌలింగ్ చేయడు. అతడి చేతిలో క్రికెట్ బంతీ ఉండదు. కానీ ఇదీ ఓ ఆటే!

క్రికెట్టంటే మనకు కొట్టిన పిండే. ఫుట్‌బాలూ చూసే ఉంటారు. కానీ రెంటినీ కలిపి ఆడితే ఎలా ఉంటుందన్న తమాషా ఆలోచన నుంచి పుట్టి ఈ ఆట పేరు లెగ్ క్రికెట్. ఆట మాత్రం సీరియస్‌గానే ఆడుతున్నారండోయ్!

క్రికెట్ లాంటిదే కానీ..

లెగ్ క్రికెట్ చాలా రకాలుగా క్రికెట్ లాంటిదే. కానీ దానికంటూ ఓ ఫార్మాట్, నిబంధనలు ఉన్నాయి. టాస్ గెలిచిన కెప్టెన్ లెగ్గింగ్ (బ్యాటింగ్‌లాగ) లేదా ఫీల్డింగ్ ఎంచుకుంటాడు. సింగిల్స్, డబుల్స్‌తో పాటు బౌండరీలు కూడా ఆటలో భాగమే. కానీ కొట్టేది బ్యాటుతో కాదు. కాలితో ఫుట్‌బాల్ తరహాలో తన్నాలి. ఎందుకంటే బౌలర్ విసిరేది ఫుట్‌బాల్ పరిమాణంలో ఉండే బంతి. క్రికెట్ బంతి కాదు.

నాలుగు దేశాల్లో..

ప్రస్తుతానికి ఈ ఆటను నాలుగు దేశాలు.. భారత్, శ్రీలంక, భూటాన్, నేపాల్‌లో ఆడుతున్నారు. భారత్ తన మొట్టమొదటి అంతర్జాతీయ సిరీస్‌ను 2003లో నేపాల్‌తో ఆడింది. ఆ టీ-10 లెగ్ క్రికెట్ సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. 2016 దక్షిణాసియా ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచింది. భారత లెగ్ క్రికెట్ సమాఖ్య 2011లో ఏర్పాటైంది.

విశేషాలు వివరంగా..

- ఈ ఆటను వృత్తాకార మైదానంలో ఆడతారు. 80 నుంచి 120 అడుగుల వ్యాసార్ధంలో మైదానం ఉంటుంది.
- పిచ్ ఎనిమిది అడుగుల వెడల్పు, 42-48 అడుగుల పొడవు ఉంటుంది. రెండు వైపులా వికెట్లు, ఓవర్లు మామూలే
- ఒక జట్టులో 11 మంది ఆటగాళ్లు ఉంటారు
- బౌలర్ అండర్ ఆర్మ్ శైలితో బంతిని పిచ్‌పై దొర్లించాలి. లెగ్స్‌మన్ (బ్యాట్స్‌మన్) పరుగుల కోసం బంతిని తన్నాలి. వికెట్ల మధ్య పరుగెత్తడం ద్వారా క్రికెట్లో లాగే సింగిల్, డబుల్, ట్రిపుల్ తీయొచ్చు. క్రికెట్లోలాగే ఫోర్లు సిక్స్‌లు కూడా ఉంటాయి.
- బంతిని రెండు సార్లు తాకితే లేదా మరో కాలితో (సాధారణగా ఆడే కాలితో కాకుండా) తన్నితే లెగ్స్‌మన్‌ను అంపైర్ ఔట్‌గా ప్రకటిస్తాడు. క్యాచ్‌లు, రనౌట్లు, హిట్ వికెట్ కూడా ఉంటాయి.
- తాను ఏ కాలితో ఆడతాడన్నది లెగ్స్‌మన్.. అంపైర్‌కు ముందే చెప్పాలి.
- ఇప్పటి వరకు ఈ ఆటకు సంబంధించి అధికారిక రికార్డులేమీ లేవు. కానీ ఐదు ఓవర్లలో 216 పరుగులు అత్యధిక స్కోరట.



లెగ్ క్రికెట్ ఆలోచన 2010లో పుట్టింది. ఈ ఆట నిబంధనలు తెలుసుకోవడం, ఆడడం తేలికే. కానీ మరీ అంత తేలిక కాదు. ఆటగాళ్లు వ్యూహాలు పన్నుతారు. క్రికెట్లోలాగే నెమ్మదిగా, వేగంగా డెలివరీలు వేస్తారు. ఫీల్డింగ్ ఏర్పాటు కూడా ముఖ్యమే. అన్నింటికంటే ముఖ్య విషయం ఏంటంటే ఈ ఆటలో గాయాలయ్యే అవకాశాలు చాలా చాలా తక్కువ"

-జేపీ వర్మ,
భారత లెగ్ క్రికెట్ సమాఖ్య అధ్యక్షుడు

ఈనాడు సినిమా



విభిన్నమైన కథలతో ప్రయాణం చేస్తున్న కథా నాయకుడు వరుణ్‌తేజ్. ఇమేజ్ గురించి కాకుండా... నటుడిగా తనని కొత్తగా ఆవిష్కరిస్తూ వినోదాన్ని పంచే పాత్రలపైనే దృష్టిపెడుతున్నాడు. ఆ ప్రయత్నం ఆయనకి బాగా కలిసొచ్చింది. 'ముకుంద', 'కంచె', 'ఫిదా' చిత్రాలతో మంచి పేరు తెచ్చుకొన్నాడు వరుణ్. ఇటీవల 'తొలి ప్రేమ'లో నటించాడు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించిన ఆ చిత్రం శనివారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు వరుణ్‌తేజ్. ఆ విషయాలివీ...

ఆ అమ్మాయి ఫోన్ నంబరు ఇచ్చింది కానీ...

మీ బాబాయ్ 'తొలిప్రేమ'కీ, మీ సినిమాకీ ఏమైనా సంబంధం ఉందా?

అస్సలు పోలికే లేదు. అందులో బాబాయి రక్తంతో రాసి ప్రేమలేఖ ఇస్తాడు. ఆ తరంలో ప్రేమని వ్యక్తం చేయడానికి చాలామంది అలా ఆలోచించేవాళ్లు. ఇప్పటిలా సాంకేతికత అప్పట్లో అందుబాటులో ఉండేది కాదు. ఇప్పుడు పరిస్థితులు వేరు. నా సినిమాలో కథానాయకుడు అమ్మాయిని చూడగానే ప్రేమిస్తున్నట్టు చెప్పేస్తాడు. మా 'తొలిప్రేమ' ఈ తరానికి తగ్గట్టుగానే ఉంటుంది. విదేశాల్లో ఇప్పటికే సినిమా విడుదలైంది. అక్కడ చూసినవాళ్లు చాలామంది 'బాగుందనీ, మమ్మల్ని మేం సినిమాలో చూసుకున్నామ'ని ట్వీట్ చేశారు. అమ్మాయిల నుంచి కూడా ట్వీట్లు వచ్చాయి.

సినిమాకి 'తొలి ప్రేమ' అనే పేరే పెట్టడానికి ప్రత్యేకమైన కారణమేదైనా ఉందా?

ఆంగ్లంలో రెండు మూడు పేర్లు ఆలోచించాం. 'విత్ లవ్ ఆదిత్య' అనుకున్నాం. చివరికి దర్శకుడు వెంకీ, నిర్మాత బాపినీడు కలిసి తెలుగులోనే పేరుంటే బాగుంటుందని, 'తొలిప్రేమ'గా నిర్ణయించారు.

ఈ పేరు గురించి మీ బాబాయ్ పవన్ కల్యాణ్ ఏమైనా స్పందించారా?

చరణ్ అన్న, సాయిధరమ్‌తేజ్ వాళ్ల సినిమాల్లో పెదనాన్న చిరంజీవి పాటలు రీమిక్స్ అయ్యి వినిపిస్తుంటాయి. మా కుటుంబంలో మాకు అన్ని విధాలుగా ప్రోత్సాహం లభిస్తుంటుంది. బాబాయి దగ్గర ఈ పేరు గురించి ఎలాంటి ప్రస్తావన రాలేదు. మేం 'తొలి ప్రేమ' పేరు అనుకోగానే, అది ఉషాకిరణ్ మూవీస్ సంస్థ దగ్గరుందని తెలిసింది. నిర్మాత వారిని సంప్రదించగానే సహృదయంతో అంగీకరించి ఇచ్చారు.

'ఫిదా'తో పోలిస్తే నటన పరంగా 'తొలి ప్రేమ' ఎలాంటి అనుభవాన్నిచ్చింది?

అందులో నా పాత్ర చాలా సున్నితంగా ఉంటుంది. ఇందులో అందుకు పూర్తి భిన్నం. దూకుడుగా, సరదాగా కనిపిస్తా. నేను చేసిందే సరైనదనే తత్వం ఉన్న పాత్ర నాది. అమ్మాయేమో ఏం చేసినా, ఆలోచించి చేయాలంటుంది. ఇలా ఇద్దరివీ భిన్న దృక్పథాలు. వెంకీ చిత్రాన్ని బాగా తెరకెక్కించారు. తొలిప్రేమ అనేది సులభంగా వదిలించుకోలేనిది. ఆ విషయాన్నే ఈ సినిమాలో చూపించాం.

ఈ పాత్రలో మిమ్మల్ని మీరు చూసుకొన్నారా మరి?

నా వ్యక్తిత్వానికీ, ఈ పాత్రకీ చాలా సంబంధం ఉండదనే చెప్పాలి. స్వతహాగా నాలో సిగ్గు ఎక్కువ. అమ్మాయిలతో చొరవగా మాట్లాడలేను. నా మిత్రుల్లో ప్రేమికులున్నారు. వాళ్లు మాత్రం పెళ్లి చేసుకుని సంతోషంగా ఉన్నారు.

మీ నిజ జీవితంలో తొలి ప్రేమ గురించి చెప్పమంటే?

దాన్ని ప్రేమంటారో, ఏమంటారో తెలియదు కానీ... భారతీయ విద్యాభవన్‌లో తొమ్మిదో తరగతి చదివేప్పుడు ఒకమ్మాయి నాతో చొరవగా మాట్లాడేది. తను నాకు ఫోన్ నెంబరూ ఇచ్చింది. కానీ ఆమెతో ఫోన్‌లో మాట్లాడేవాణ్ని కాదు. మా పరిచయం కొన్నాళ్లు కొనసాగింది. అబ్బాయి, అమ్మాయి కలిసి కొన్నాళ్లు ప్రయాణం చేస్తే, తొలిప్రేమ అనే పేరుతో పిలవాల్సిన అవసరం లేదేమో. స్నేహం అనుకోవచ్చు కదా!

స్టార్ ఇమేజ్ గురించి ఆలోచిస్తుంటారా? ఆ దిశగా ఏమైనా ప్రయత్నాలు చేస్తుంటారా?

ఒక రకంగా చెప్పాలంటే సినిమాల పిచ్చోడిని నేను. ఇంగ్లిషు సినిమాలు ఎక్కువగా చూసేవాడిని. అలా మన తెలుగు సినిమాల్లోనూ ఏదో ఒక కొత్తదనం ఎందుకు చూపించకూడదు అనిపించేది. స్టార్, ఇమేజ్ అనే విషయాల కంటే నటన పరంగా నిరూపించుకోవడంపైనే నాకు దృష్టి ఉంటుంది. అందుకే నా ప్రయాణం కూడా కొత్త పంథాలో మొదలైంది.

తదుపరి చేయనున్న కొత్త సినిమాల కబుర్లేంటి?

'కంచె' నిర్మాతలు మరో కొత్త కథతో నాతో సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'ఘాజీ' దర్శకుడు సంకల్ప్ దర్శకత్వంలో ఆ చిత్రం తెరకెక్కబోతోంది. అంతరిక్షం నేపథ్యంలో సాగే కథ అది. మన శ్రీహరి కోట నేపథ్యంలో సాగుతుంది. గ్రాఫిక్స్‌కి ప్రాధాన్యం ఉంటుంది. అది నాకు ప్రతిష్ఠాత్మకమైన చిత్రమవుతుంది. అంతరిక్షం నేపథ్యంలో సాగే కథ తెలుగు ప్రేక్షకులకి కొత్త. ఆ చిత్రం రెండు నెలల తర్వాత ఆరంభం అవుతుంది. ప్రస్తుతం నా మనసంతా దానిపైనే ఉంది.

పోరాటం చేస్తున్న భరత్


మహేష్‌బాబు

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. కైరా అడ్వాణీ కథానాయిక. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. డి.వి.వి. దానయ్య నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లో పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. గురువారం వరకు పతాక సన్నివేశాలతో పాటు, నాయకానాయికల మధ్య వచ్చే కొన్ని కీలక సన్నివేశాల్ని రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరించారు. మార్చి 8తో ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తవుతుందని సినిమా వర్గాలు తెలిపాయి. వేసవిని పురస్కరించుకొని ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన వెంటనే, వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించనున్న కొత్త చిత్రం కోసం రంగంలోకి దిగుతారు మహేష్. 'భరత్ అనే నేను'లో మహేష్ ముఖ్యమంత్రిగా సందడి చేయబోతున్నారు. కొత్త చిత్రం అమెరికా నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కుతోందని సమాచారం.

పంచ్ డైలాగ్

సమాజానికి మంచి చెయ్యకపోయినా ఫర్వాలేదు. కానీ చెడు చేయకూడదు.

చిత్రం: సింహా
- పంపినవారు: బి.సుభాష్, ధర్మాపురం


ఏం వయ్యారమో...


'రంగస్థలం'లో సమంత

'ఈ చిట్టిగాడి గుండెకాయని గోలెట్టిచ్చేసింది ఈపిల్లేనండి...' అంటూ తన హృదయాన్ని దోచుకొన్న అమ్మాయి రామలక్ష్మిని పరిచయం చేశాడు చిట్టిబాబు. మరి రామలక్ష్మి, చిట్టిబాబుల సరదాలు, సరసాలు చూడాలంటే మాత్రం 'రంగస్థలం' చూడాల్సిందే. రామ్‌చరణ్, సమంత జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. మైత్రీ మూవీ క్రియేషన్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ (సి.వి.ఎం) నిర్మిస్తున్నారు. ఇందులో రామ్‌చరణ్ చిట్టిబాబుగా, సమంత రామలక్ష్మిగా సందడి చేయబోతున్నారు. సమంత పోషించిన పాత్రని పరిచయం చేస్తూ చిత్రబృందం శుక్రవారం టీజర్‌ని విడుదల చేసింది. "ఓహోహో.. ఏం వయ్యారం.. ఏం వయ్యారం.. ఏమాటకామాట సెప్పుకోవాలండీ.. ఈ పిల్ల ఎదురొత్తుంటే ఈ ఊరికే 18 సంవత్సరాల వయసు వచ్చేసినట్టుంటుందండీ.." అంటూ సాగే టీజర్‌కి సమంత అందం, ఆమె లుక్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటున్న ఈ చిత్రం మార్చి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

13న తొలిపాట

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న తొలి పాటని విడుదల చేయబోతున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. పల్లెటూరి నేపథ్యంలో సాగే 'రంగస్థలం'లో ఆది పినిశెట్టి, జగపతిబాబు, ప్రకాష్‌రాజ్, నరేష్, అనసూయ తదితరులు కీలక పాత్రలు పోషించారు. సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: రత్నవేలు, కూర్పు: నవీన్ నూలి, పాటలు: చంద్రబోస్, పోరాటాలు: రామ్‌లక్ష్మణ్.



మణిరత్నం 'నవాబ్'


అగ్ర దర్శకుడు మణిరత్నం ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న ఆ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లబోతోంది. తెలుగులో 'నవాబ్' పేరుతో రూపొందనున్న ఈ చిత్రంలో అరవింద్ స్వామి, శింబు, విజయ్ సేతుపతి, జ్యోతిక, అరుణ్ విజయ్, ప్రకాష్‌రాజ్, జయసుధ, అదితిరావు హైదరీ, ఐశ్వర్య రాజేష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఎ.ఆర్.రెహమాన్, ఛాయాగ్రహణం: సంతోష్ శివన్, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, సాహిత్యం: సిరివెన్నెల సీతారామశాస్త్రి.

పవన్‌కల్యాణ్ కోసం కథ రాశా!

సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. నటుడు కృష్ణ తనయ మంజుల దర్శకురాలిగా పరిచయమవుతున్న చిత్రమిది. పి.కిరణ్, సంజయ్ స్వరూప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రాదన్ స్వరకర్త. ఇందులోని ఆరవ పాట హైదరాబాద్‌లో విడుదలైంది. ఈ సందర్భంగా జరిగిన వేడుకలో మంజుల మాట్లాడుతూ "ఒక మంచి విషయం చెప్పాలనే ప్రయత్నంలో భాగంగానే విభిన్నమైన ఈ ప్రేమకథని తెరకెక్కించా. ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. మా ఆయన సంజయ్‌స్వరూప్ ముఖ్యపాత్రలో నటించారు. మా అమ్మాయి జాన్వి మంచి పాత్రను పోషించింది. ఈ సినిమా మహేష్‌బాబు వాయిస్ ఓవర్‌తో సాగుతుంది. మహేష్ ఈ సినిమా పాటలు విని, ప్రచార చిత్రం చూసి బాగుందన్నాడు. పవన్ కల్యాణ్ కోసం ఆయనకి సరిపడే ఓ కథని రాశా. దానిని పవన్ విని ఒప్పుకుంటే ఆయనతో సినిమా చేయాలనుంది" అన్నారు. సందీప్‌కిషన్ మాట్లాడుతూ "మంచి కాఫీ తాగితే ఎలా ఉంటుందో అలాంటి భావనను కలిగించే మధురమైన ప్రేమకథ ఈ చిత్రం. భావోద్వేగాలతో హృదయాల్ని హత్తుకుంటూనే ఆహ్లాదాన్నీ పంచుతుంద"న్నారు. అమైరా దస్తర్ మాట్లాడుతూ "మంజుల అందంగా ఈ ప్రేమకథని తెరకెక్కించార"న్నారు. ఈ నెల 16న చిత్రాన్ని విడుదల చేస్తామని చెప్పారు జెమిని కిరణ్. "చక్కని సంభాషణలు రాసేందుకు అవకాశం దక్కింద"న్నారు బుర్రా సాయిమాధవ్. ఈ కార్యక్రమంలో సంజయ్ స్వరూప్, అనితా చౌదరి, కళా దర్శకుడు హరి తదితరులు పాల్గొన్నారు.


కిరణ్, సాయిమాధవ్ బుర్రా, సంజయ్, మంజుల, సందీప్ కిషన్, అమైరా దస్తర్


కొడుకుని వృద్ధాశ్రమానికి పంపించే తండ్రి


రిషి కపూర్, అమితాబ్ బచ్చన్

అమితాబ్ బచ్చన్, రిషి కపూర్ తండ్రీకొడుకులుగా నటిస్తున్న చిత్రం '102 నాట్ అవుట్'. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విడుదలైంది. అందులో అమితాబ్, రిషి మధ్య సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి. 102 ఏళ్ల వ్యక్తి 75 ఏళ్ల తన కొడుకుని అపురూపంగా చూసుకుంటుంటాడు. అన్నేళ్లు వచ్చినా ఇంకా చిన్నపిల్లాడిలానే ఆ కొడుకు ప్రవర్తన ఉంటుంది. కొడుకు కంటే తండ్రే ఇంకా హుషారుగా ఉంటాడు. 102 ఏళ్ల వయసులో సాక్సోఫోన్ వాయిస్తుంటాడు. ఫుట్‌బాల్ ఆడుతుంటాడు తండ్రి. కొడుకేమో టెన్షన్ పడుతూ యోగాసనాలు వేస్తుంటాడు. "ప్రపంచంలో కొడుకుని వృద్ధాశ్రమంలో చేర్చాలనుకుంటున్న తొలి తండ్రిని నేనేనేమో" అని అమితాబ్ పలికే సంభాషణ ఆకట్టుకుంటుంది. తండ్రీ కొడుకులు వర్షంలో తడుస్తూ చేసే డ్యాన్స్ ఆహ్లాదంగా సాగుతుంది. సౌమ్య జోషి రాసిన గుజరాతీ నాటిక '102 నాట్ అవుట్' ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఉమేష్ శుక్లా దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. అమితాబ్ మాట్లాడుతూ "అందరూ యువతరం నటుల సినిమాలే కోరుకుంటారు. అందులో తప్పులేదు. కానీ వాళ్లు అందించిన వినోదం మాలాంటి వయసొచ్చిన నటులు అందివ్వలేరనుకుంటే ఒప్పుకోను. వాళ్లకంటే గొప్పగా మేమూ అలరించగలం" అని చెప్పారు అమితాబ్ బచ్చన్.

లేటు వయసులో ఫ్యాషన్ డిజైనర్ ప్రేమకథ

ఆస్కార్ బరి


'ఫాంటమ్ థ్రెడ్'

ఈ ఏడాది ఆస్కార్ బరిలో ఆరు నామినేషన్లు సాధించి అందరి చూపు తనవైపు తిప్పుకుంది 'ఫాంటమ్ థ్రెడ్'. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు లాంటి ప్రధాన విభాగాలతో పాటు ఉత్తమ సహాయ నటి, ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ కాస్ట్యూమ్స్ నామినేషన్లు ఈ చిత్రానికి దక్కాయి. 'బూగీ నైట్స్', 'దేర్ విల్ బి బ్లడ్' లాంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ అమెరికన్ దర్శకుడు పాల్ థామస్ ఆండర్సన్ ఈ సినిమాను తెరకెక్కించారు. మూడు సార్లు ఉత్తమ నటుడిగా ఆస్కార్ పురస్కారం అందుకున్న డేనియల్ డే లెవిస్ ప్రధాన పాత్రలో నటించారు. లెస్లీ మాన్‌విల్లె, విక్కీ క్రిప్స్ కీలక పాత్రల్లో నటించారు. ఆ చిత్ర విశేషాలివీ.

ఆ సినిమా బడ్జెట్ 35 మిలియన్ డాలర్లు. ఇప్పటి వరకూ వచ్చిన వసూళ్లు సుమారు 17.5 మిలియన్ డాలర్లు. అంటే బొటాబొటిగా బడ్జెట్‌లో సగం మాత్రమే తిరిగొచ్చింది. కానీ ప్రశంసలు, పురస్కారాల విషయంలో మాత్రం ముందుంది. ఆ చిత్రమే 'ఫాంటమ్ థ్రెడ్'. ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్ పురస్కారాల్లో ఉత్తమ నటుడు, ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగాల్లో నామినేషన్లు సాధించింది. బాఫ్టా పురస్కారాల్లో నాలుగు నామినేషన్లు అందుకుంది. టొరంటో, శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, లాస్ ఏంజెలెస్ చిత్రోత్సవాల్లో పలు పురస్కారాలు సాధించింది. అంతేకాదు.. 2017లో వచ్చిన పది ఉత్తమ చిత్రాల్లో ఒకటిగా నేషనల్ బోర్డ్ ఆఫ్ రివ్యూ ఈ చిత్రాన్ని ఎంపిక చేయడం గమనార్హం. 1950 నేపథ్యంలో లండన్‌లోని ఓ వయసు మళ్లిన ఫ్యాషన్ డిజైనర్ ప్రేమకథగా ఈ చిత్రం తెరకెక్కింది.

కథేంటి: ఫ్యాషన్ డిజైనర్ రెనాల్డ్స్ వుడ్‌కుక్ (డేనియల్ డే లెవిస్) పెళ్లి చేసుకోకుండా వృత్తే జీవితంగా బతుకుతుంటాడు. ఆయనకు చెల్లెలు సిరిల్(లెస్లీ) అంటే ప్రాణం. ఎంతో మంది సుందరాంగులు రెనాల్డ్స్‌ను ఇష్టపడుతున్నట్లు చెప్పినా అసలు పట్టించుకోడు. అయితే ఓసారి రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు అక్కడ వెయిట్రెస్‌గా పనిచేసే ఆల్మా(విక్కీ) అతణ్ని ఆకర్షిస్తుంది. క్రమంగా వారిద్దరి మధ్య బంధం బలపడుతుంది. ఇద్దరూ కలసి జీవిస్తుంటారు. అయితే రెనాల్డ్స్‌ది చిన్న చిన్న విషయాలకే గొడవపడే మనస్తత్వం. సరదాగా బయట డిన్నర్‌కు వెళ్దామని ఆల్మా అడిగితే కోపంతో అరిచేస్తాడు. రెనాల్డ్స్ ప్రేమను పొందడానికి ఆల్మా ఓ ప్లాన్ వేస్తుంది. అతను తాగే టీలో తక్కువ మోతాదులో విషం కలుపుతుంది. అనారోగ్యం పాలైన రెనాల్డ్స్‌కు సపర్యలు చేసి కోలుకొనేలా చేస్తుంది. తన పట్ల ఆల్మా చూపిస్తున్న ప్రేమను చూసి రెనాల్డ్స్ తనను పెళ్లి చేసుకుంటాడు. అయితే కొద్దిరోజుల తర్వాత పెళ్లి తన వృత్తిజీవితానికి అడ్డంకిగా మారిందని బాధపడ్తుంటాడు. తన జీవితంలో నుంచి ఆల్మాను పంపించేయాలని అనుకుంటాడు. అది తెలిసిన ఆల్మా రెనాల్డ్స్ తినే ఆమ్లెట్‌లో విషం కలుపుతుంది. ఈసారి రెనాల్డ్స్ ఆ విషయం ముందుగానే పసిగడతాడు. అప్పుడు ఆల్మా రెనాల్డ్స్‌తో 'నువ్వు అనారోగ్యంగా ఉంటేనే బాగుంటుందని అనుకుంటున్నాను. అప్పుడే నేను నీకు సపర్యలు చేసి ఒత్తిడి పోగొట్టగలను. తద్వారా నువ్వు వృత్తిపై మరింత శ్రద్ధ పెట్టగలవ'ని చెబుతుంది. అది విన్న రెనాల్డ్స్ ఆమ్లెట్‌ను తినేస్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందన్నది 'ఫాంటమ్ థ్రెడ్'లో చూడాలి.

విశేషాలు:

- దర్శకుడు ఆండర్సన్ ఒకసారి అనారోగ్యం బారిన పడితే ఆయన భార్య దగ్గరుండి సేవలు చేసిందట. అప్పుడు ఆమె కళ్లలో తనపై కనిపించిన ప్రేమను చూశాక ఆయనకు ఈ కథాలోచన వచ్చిందట.
- డేనియల్ డే లెవిస్ ఈ సినిమా చిత్రీకరణ పూర్తికాగానే సినిమాల నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. ఆలెక్కన ఇదే అతని చివరి చిత్రం.
- ఆండర్సన్, డేనియల్ కలయికలో వచ్చిన రెండో చిత్రమిది. గతంలో వారు కలసి పనిచేసిన 'దేర్ విల్ బి బ్లడ్'తో ఉత్తమ నటుడిగా ఆస్కార్ అందుకున్నాడు డేనియల్. దీంతో పాటు తాను అబ్రహం లింకన్ పాత్రలో నటించిన 'లింకన్', 'మై లెఫ్ట్ ఫుట్' చిత్రాలకూ ఆస్కార్ ఉత్తమ నటుడి పురస్కారాలు గెలుచుకున్నాడు డేనియల్.

ఈనాడు
వసుంధర
శనివారం ఫిబ్రవరి 10, 2018 కరీంనగర్ 15



ఆఫీసులో ఆ ఫొటోలు...!

ఉద్యోగినిగా మనం ఎక్కువసేపు ఉండేది ఆఫీసులోనే. మరి మన చుట్టూ ఉండే పరిసరాలు సౌకర్యవంతంగా ఉంటేనే పని ఉత్పాదకత పెరుగుతుంది. అవేంటో చూద్దామా!

✦ ప్రతిరోజూ మీరు చేయాలనుకుంటున్న పనుల జాబితాను తప్పనిసరిగా తయారుచేసుకోవాలి. దానికి అనుగుణంగా ముఖ్యమైన, అత్యవసరమైన పనులకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలి.

✦ పీకల్లోతు పనుల్లో కూరుకుపోయిన తరువాత సహజంగానే వేటిమీదకు దృష్టి మళ్లదు. ముఖ్యంగా మధ్యమధ్యలో నీళ్లు తాగాలన్న ఆలోచన కూడా రాదు. కాబట్టి మీ కంప్యూటర్‌కు చేరువగా మీరు అందుకునే దూరంలో నీళ్లసీసాను తప్పనిసరిగా పెట్టుకోవాలి. దాహంతో సంబంధం లేకుండా తరచూ తాగుతుంటే శరీరం డీహైడ్రేషన్ గురికాకుండా ఉంటుంది.

✦ ఖాళీ కడుపుతో ఎవరూ పనిమీద దృష్టి పెట్టలేరు. కాబట్టి పండ్లూ, డ్రైఫ్రూట్స్, అవిసె గింజల్లాంటి వాటిని ఎల్లప్పుడూ మీ బ్యాగులో పెట్టుకోవాలి. ఆకలిగా అనిపించినప్పుడల్లా నాలుగు బాదంపప్పులో, కొన్ని పళ్ల ముక్కలో తీసుకుంటే పొట్ట నిండుతుంది. ఫలితంగా ఆరోగ్యానికి హాని చేసే జంక్‌ఫుడ్ జోలికి వెళ్లకుండా ఉంటారు.

✦ అప్పుడప్పుడూ జలుబూ, రొంప లాంటివి రావడం సహజమే. కాబట్టి దీనికోసం ఒక టిష్యూ బాక్స్‌ను అందుబాటులో పెట్టుకోండి.

✦ టేబుల్‌పైన మీ ప్రియమైన వారి ఫొటోలను పెట్టుకోండి. వీలైతే కంప్యూటర్ స్క్రీన్‌పై కూడా ఉంచుకోండి. అప్పుడప్పుడూ పని ఒత్తిడిలో వారిని చూస్తూ ఉంటే చేస్తున్న పనిలోని ఒత్తిడిని మరిచిపోతారు. వాటిని చూసినప్పుడల్లా మీలో ఉత్సాహం పెరుగుతుంది.

✦ ఆఫీసుకు ఆలస్యం అవుతుందని కొందరు మహిళలు తమ అలంకరణను అసంపూర్తిగానే ఆపేస్తారు. మీరూ ఆ కోవకు చెందినవారైతే ఇది మీ కోసమే. మీరు ప్రతిరోజూ వాడే మేకప్ కిట్‌ను మీ డెస్క్‌లో కూడా ఒకటి పెట్టుకోవాలి. ఒకవేళ ఆఫీసు నుంచి నేరుగా ఏదైనా ఫంక్షన్‌కి వెళ్లాలనుకున్న వెంటనే తయారై వెళ్లిపోవచ్చు.

✦ నేటికాలంలో సెల్‌ఫోన్ వినియోగం తప్పనిసరి అయ్యింది. కాబట్టి ఫోన్‌తో పాటు ఛార్జర్ కూడా తప్పనిసరిగా డెస్క్‌లో పెట్టుకోవాలి. అప్పుడే ఛార్జింగ్ అయిపోతుందేమోననే భయం ఉండదు.

తేమ పెంచే రాయి...

చర్మంపై పేరుకుపోయిన మృతకణాలు తొలగించడానికి ప్యూమిస్ రాయిని వాడుతుంటాం. ఈ రాయిని మరికొన్ని రకాలుగా కూడా ఉపయోగించుకోవచ్చు. అదెలాగంటే..

● పాదాలకు పగుళ్లు ఉన్నప్పుడు వాటిని అలాగే వదిలేస్తే ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే కనీసం వారానికి రెండు సార్లయినా పాదాలను కనీసం పది నిమిషాలు నీళ్లలో ఉంచి ప్యూమిస్ రాయితో రుద్ది చూడండి. ఇలా చేయడం వల్ల పాదాలపై పేరుకున్న మృతకణాలు తొలిగిపోతాయి.

● పాదాలమీద కొన్ని చోట్ల చర్మం బరకగా మారి దద్దుర్లలాంటివి వస్తాయి. వాటివల్ల నడుస్తున్నప్పుడు నొప్పి కూడా ఉంటుంది. అలాంటప్పుడు సమస్య ఉన్న ప్రాంతంలో ఈ రాయితో రుద్దితే అక్కడున్న చర్మం రాలిపోయి ఇంతకుముందులా మృదువుగా మారిపోతుంది.

● ప్యూమిస్ రాయితో మర్దనా చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. దాంతో నిర్జీవంగా ఉన్న చర్మం ఆరోగ్యవంతంగా మారుతుంది.

● ముక్కుపై బ్లాక్‌హెడ్స్ రావడం మామూలే. ఈ సమస్య మరీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్యూమిస్ రాయితో రుద్దితే కాస్త ఫలితం ఉంటుంది.

● చర్మం పొడిగా మారి పొలుసులుగా ఊడిపోతుంటే కొద్దిసేపు సబ్బునీళ్లలో నానబెట్టిన ప్యూమిస్‌రాయి రుద్ది చూడండి. చర్మం మృదువుగా తయారవుతుంది.





కుళాయి నీటితో రసాయనాలు వదలవట..!!

రోజూ మార్కెట్లోనో, తోపుడు బండిమీదో కొనే కూరగాయల మీద అనేక రకాల రసాయనాలుంటాయని మనందరికీ తెలుసు. అయితే వాటిని కుళాయి నీటితో కడిగేస్తే శుభ్రపడతాయన్న అపోహలో ఉంటాం. అది నిజంగానే వాస్తవం కాదని నిరూపించారు తెలంగాణలోని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి సుధాకర్. కుళాయి నీటితో శుభ్రం చేయడం వల్ల కేవలం 17 నుంచి 39 శాతం రసాయనాలు మాత్రమే వదిలిపోతాయట. దానికి బదులు నాలుగు లీటర్ల నీటిలో నాలుగు నిమ్మకాయల రసం, 4 గ్రాముల వంటసోడా, 160 మిల్లీలీటర్ల వెనిగర్ కలిపి కూరగాయలు శుభ్రం చేస్తే 55 నుంచి 76 శాతం రసాయనాలు వదిలిపోతాయని ఆయన పరిశోధనలో తేలింది. కాబట్టి ఈ ద్రావణాన్ని తయారుచేసుకుని పెట్టుకుంటే... ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని రసాయనాలు లేని కూరగాయలు వాడుకోవచ్చు.





అవి వద్దు... అన్నం పెట్టండి అన్నారు!

జాతీయ కుటుంబ ఆరోగ్య అధ్యయనం (2015-2016) లెక్కల ప్రకారం మన దేశంలో కేవలం 48శాతం మంది గ్రామీణ మహిళలు మాత్రమే శానిటరీ న్యాప్‌కిన్లు ఉపయోగిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో అయితే ఆ సమస్య 78 శాతం ఉంది. ఈ గణన బట్టి చూస్తే ఇంకా ఈ అంకెల్లో మార్పు రావాల్సి ఉంది అంటున్నారు రేనీ గ్రేసీ. విజయవాడలో పుట్టి హైదరాబాద్‌లో స్థిరపడిన ఈ కార్పొరేట్ ఉద్యోగిని వారాంతపు సెలవుల్ని నెలసరి అవగాహన కార్యక్రమాలకు పరిమితం చేస్తున్నారు. 'డిగ్నిటీ డ్రైవ్' పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి నెలసరి గురించి అవగాహన కల్పిస్తూ.. శానిటరీ న్యాప్‌కిన్లను అందిస్తున్నారు.

నెలసరి వస్తే చాలు చాలా కుటుంబాల్లో తల్లులు అమ్మాయిల్ని బయట కూర్చోబెట్టడం.. ఇంట్లోకి రానివ్వకపోడం, ఏదీ తాకనివ్వకపోవడం చేస్తుంటారు. ఆమాట పక్కన పెడితే అమ్మాయిలకు అసలు నెలసరి.. దాని ప్రాధాన్యం మాత్రం వివరించట్లేదు. ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు... పరిశుభ్రత గురించి చెప్పట్లేదు. నిజంగా ఇది చాలా బాధాకరం. ఒకరకంగా చెప్పాలంటే నేను కూడా ఆ బాధ పడ్డాను. ఆ తరవాత చాలామందిని చూశాను. దీనివల్ల చాలా మంది అమ్మాయిలు భవిష్యత్తులో సమస్యలు ఎదుర్కొంటారు. అదంతా గమనించాక మూలాల నుంచి సమస్యని పరిష్కరించాలనిపించింది. అందుకే గతేడాది నుంచి 'డిగ్నిటీ డ్రైవ్' పేరుతో బాలికల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ శానిటరీ న్యాప్‌కిన్లు అందిస్తున్నా.

అధ్యయనం చేశా... నేను గత పద్నాలుగేళ్లుగా రకరకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నా. అనాథాశ్రమాలూ, వృద్ధాశ్రమాల వారికోసం విరాళాలు సేకరించి అందించేదాన్ని. ఆ తరువాత నేను పనిచేస్తోన్న సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద పలు కార్యక్రమాలు నిర్వహించా. అయినా అవేవీ నాకు తృప్తినివ్వలేదు. అందుకే గతేడాది 'డిగ్నిటీ డ్రైవ్' పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశా. దానిలో భాగంగా మహిళలకు నెలసరి మీద అవగాహన కల్పించాలంటే వారు దీని గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలనుకున్నా. అందుకే హైదరాబాద్‌లోని రసూల్‌పుర మురికివాడలో ఆరు వారాల పాటు అధ్యయనం చేశా. అక్కడ వారితో మాట్లాడి శానిటరీ న్యాప్‌కిన్ల గురించి చెప్పి.. వాటిని ఉచితంగా అందిస్తా వాడండీ అని చెప్పా. వారికి ఎంత చెప్పినా సరే అవేమీ వద్దు.. అన్నం పెట్టండి అంటూ మాట్లాడారు. మనకు అన్నం ఎంత అవసరమో.. ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని తెలియజెబుతూ.. మా కార్యక్రమానికి అక్కడి నుంచే శ్రీకారం చుట్టా. ముందు నా ఫేస్‌బుక్ పేజీ గోడ మీద డిగ్నిటీ డ్రైవ్ గురించి వివరిస్తూ పోస్ట్ పెట్టా. చాలా మంది స్పందించి నాతో కలిసి పని చేయడానికి ముందుకొచ్చారు.

నేనూ తెలుసుకున్నా... అలా నలుగురు స్నేహితురాళ్లు మాత్రం ఎప్పుడూ నా వెంటే ఉంటున్నారు. మొదట రసూల్‌పురలోని నూట యాభై మంది మహిళలకు రెండు ప్యాకెట్ల చొప్పున అందించా. ఆ తరువాత వారికి వాటిని డిస్పోజ్ చేయడం గురించి అవగాహన కల్పించి... గుజరాత్ నుంచి డిస్పోజ్ చేసే యంత్రాన్ని తెప్పించి అమర్చాం. అప్పట్నుంచీ ఇప్పటి వరకూ ప్రతి నెలా వాళ్లందరికీ ఒక్కొక్కరికీ రెండు చొప్పున ప్యాకెట్లు ఇస్తున్నా. అలానే ప్రతి శనివారం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి గంటపాటు అవగాహన కల్పిస్తుంటాను. ముందు వారు నెలసరి అంటే భయపడకుండా.. అది ఎందుకు వస్తుంది, ఆ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. వారి నుంచి సందేహాలూ, అపోహలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నా. ఇందుకోసం నేను కూడా చాలా పుస్తకాలు చదివాను. పెద్దవాళ్లతో, వైద్యులతో మాట్లాడి చాలా విషయాలు తెలుసుకున్నా. అందుకే పిల్లలతో మాట్లాడి.. వారికి కౌన్సెలింగ్ కూడా ఇస్తుంటా. కొందరు పిల్లలు ఆ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారిని గుర్తించి వైద్య సేవలు కూడా అందేలా చూస్తుంటాం.

11వేల మందిని కలిశా.. నేను ఇవన్నీ చేయడం మొదలుపెట్టాక.. పలు ప్రాంతాల పాఠశాలల నుంచి ఆహ్వానాలు అందుతున్నాయి. పలువురి సహకారంతో ఇప్పటి వరకూ నేను పాఠశాలలూ, కాలేజీలకు వెళ్లి 11వేల మంది విద్యార్థినులను కలిశాను. అయితే కాలేజీల్లో కూడా అవగాహన అవసరమా అని మీకు సందేహం రావొచ్చు. చాలా మంది కాలేజీ అమ్మాయిలు కూడా దీన్ని పట్టించుకోవట్లేదు. వారికీ సందేహాలు ఉంటున్నాయి. అందుకే పలు కార్పొరేట్ కాలేజీలూ మమ్మల్ని ఆహ్వానిస్తాయి. ఇక మేం ఎక్కడకు వెళ్లినా అక్కడ అమ్మాయిలకు శానిటరీ న్యాప్‌కిన్లు.. అందిస్తున్నాం. జగద్గిరిగుట్ట, బేగంపేట, యూసఫ్‌గూడ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లా తాడ్వాయి, దోమకొండ.. ఇలా చాలా ప్రాంతాలకు వెళ్లాం. ఒకసారి వెళ్లి వచ్చాక అలా వదిలేయం.. మళ్లీ మళ్లీ వారి వద్దకు వెళ్లి మేం చెప్పిన నియమాలు పాటిస్తున్నారా.. ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుంటూ ఉంటాం. ఇక మాకు నెలకి ముప్ఫై నుంచి నలభైవేల రూపాయల ఖర్చు అవుతుంది. మేం శానిటరీ న్యాప్‌కిన్లు మాత్రం బయట కొనుగోలు చేయం. స్వయం సహాయక సంఘాల వారి వద్ద నుంచి కొనుగోలు చేసి అమ్ముతుంటాం. క్రమంగా ప్రభుత్వ బడుల్లో శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ యంత్రాలను అమర్చే పనిలో ఉన్నాం.

– పద్మ వడ్డె

బరువు ఇలా కూడా పెరగొచ్చు!



బరువు పెరిగే విషయంలో చాలామందికి రకరకాల అపోహలుంటాయి. ఏం తినాలన్నా ఆలోచిస్తారు. ఏ పదార్థాలు ఎలా తీసుకోవాలో తెలియదు. అలాంటి వారికి సాధారణంగా ఎలాంటి సందేహాలు ఉంటాయంటే..

అపోహ: పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటే బరువు పెరుగుతారు!

వాస్తవం: ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ పిండిపదార్థాలు శరీరానికి అవసరమైనంత తీసుకోవాలి. అలా కాకుండా మాంసకృత్తులూ, కొవ్వులు ఏవి ఎక్కువగా తీసుకున్నా కూడా అవి శరీరంలో నిల్వగా మారతాయి. అలా కూడా బరువు పెరుగుతారు. అంతేగానీ పూర్తిగా పిండిపదార్థాల్ని దూరంగా పెట్టమని మాత్రం నిపుణులు చెప్పరు.

అపోహ: మాంసకృత్తులు ఉన్న పానీయాలు తాగితే కండలు వస్తాయా?

వాస్తవం: కండలు అనేవి వ్యాయామం సరిగా చేస్తూ తగిన ఆహారం తీసుకుంటే వస్తాయి. నిజానికి ఎవరైనా సరే 0.8గ్రా నుంచి 1.0గ్రా చొప్పున ప్రతి కేజీ బరువుకు మాంసకృత్తులు తీసుకోవాలి. అలా కాకుండా అతిగా తీసుకున్నా మంచిదికాదు. కణజాలం దెబ్బతినే ప్రమాదముంటుంది. బరువు పెరిగే అవకాశం కూడా ఎక్కువే.

అపోహ: దాహం వేస్తేనే నీళ్లు తాగాలి!

వాస్తవం: మనం తీసుకునే ఆహారం కంటే మంచి నీళ్లే ఎక్కువ శాతం శరీరానికి అందాలి. దాహం వేయకపోయినా ప్రతి అరగంటకోసారి మంచి నీళ్లు తాగాలి. రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే మాత్రం డీహైడ్రేషన్, తలనొప్పి, కండరాల నొప్పులూ, చర్మ సమస్యల వంటివి తలెత్తే ప్రమాదం ఉంటుంది.

అపోహ: బరువు తగ్గాలంటే... అల్పాహారం మానేయాలి!

వాస్తవం: అధ్యయనాల ప్రకారం అల్పాహారం తినేవారికంటే.. మానేసే వారే బరువు పెరుగుతున్నారని తెలుస్తోంది. నిజానికి అల్పాహారం జీవనశైలినీ, జీవక్రియల్ని క్రమబద్ధీకరిస్తుంది. ఆరోగ్యానికి కారణమవుతుంది. రాత్రి పూట ఎలాగూ డైటింగ్ అంటూ పొట్ట మాడ్చుకుంటారు కాబట్టి.. కనీసం ఉదయం పూటైనా కడుపునిండా అల్పాహారం తినమని సూచిస్తున్నారు వైద్యనిపుణులు.

పరిమళాలు వెదజల్లే... మాచిపత్రి

ఇప్పుడు చాలామందికి తెలియదు కానీ చూడటానికి అచ్చం చామంతిలానే కనిపిస్తూ సువాసనతో ఉండే ఆకులూ, పూలు కలిపి ఊళ్లలో మాలలు కట్టుకునేవాళ్లు. ఆ మొక్కే మాచిపత్రి. ఇది దవనం జాతికి చెందింది. దీన్ని 'కామన్ మగ్ వార్ట్', 'నాటీమేన్', 'సెయిలర్స్ టొబాకో'.. ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం ఆర్టిమీసియా వల్గారిస్.

సువాసనభరిత ఆకులు...

మాచిపత్రి సుమారు మూడేళ్లు బతుకుతుంది. ముదురు మొక్కలను తీసేసి పక్కన వచ్చే పిలకలను పెంచుకోవచ్చు. ఇది రెండు, మూడడుగుల ఎత్తువరకూ పెరుగుతుంది. ఆకులు ముదురాకుపచ్చ రంగులో ఉండి కింది వైపు తెల్లని, సన్నని నూగుతో వెండి రంగులో సువాసనతో ఉంటాయి. పొడవాటి కంకుల్లో పూసే పూలు అంత ఆకర్షణీయంగా ఉండవు. పైగా పూత వచ్చాక ఆకుల్లో నూనెశాతం తగ్గుతుంది. అందువల్ల సువాసనతో పాటు ఔషధగుణాలూ తగ్గుతాయి. విత్తనాలు కావాలనుకుంటే తప్ప పూలకంకులను ముందే తుంచేయడం మంచిది. మాచిపత్రిని పెంచడం చాలా సులభం. ఎండపడే చోటు చూసి నాటుకుని క్రమం తప్పకుండా నీళ్లు పోస్తుంటే చాలు. అన్ని నేలల్లోనూ ఈ మొక్క చక్కగా పెరుగుతుంది. దీనికి చీడపీడల ప్రమాదం పెద్దగా ఉండదు. ఎరువుల అవసరం కూడా అంతగా ఉండదు. మట్టి మిశ్రమంలో అప్పుడప్పుడూ వర్మీకంపోస్టు లేదా పశువుల ఎరువును కలిపితే చాలు. ఎండలైపోగానే నేలబారుకు కత్తిరిస్తే వచ్చే కొత్త కొమ్మలు తాజాగా, అందంగా, సువాసనతో ఉంటాయి. సరిగా గాలి ఆడకపోయినా, నీడ ఎక్కువైనా ఆకుల మీద తెగుళ్లు రావచ్చు. అందుకే ఎండ పడేలా చూసుకుని మరీ గుబురుగా పెరగకుండా మధ్యలో కొన్ని పిలకలు తీసేస్తుంటే సరి.



ఔషధగుణాలు కూడా...

మాచిపత్రిని కుండీలో చక్కగా పెంచుకోవచ్చు. గుంపుగా లేదా ఇతర మొక్కలతో కలిపి నాటుకోవచ్చు. ఆకుల అడుగుభాగం వెండి రంగులో ఉండటంతో ఇతర రంగుల ఆకుల మొక్కలతో కలిపి నాటుకుంటే బాగుంటుంది. ఈ మొక్కల్ని కుండీల్లో పెంచుకుని లెమన్‌గ్రాస్‌తో కలిపి బాల్కనీ, వరండాలో అమర్చుకుంటే దోమలనూ, ఇతర కీటకాలను రానివ్వవు. అలాగే మాచిపత్రికి పాములను నిలువరించే శక్తి ఉంది. ఫెన్సింగ్ పక్కనే వరుసగా నాటుకుంటే పాములు రావు.



ఆరోగ్యానికీ...

మాచిపత్రి మంచి ఔషధ మొక్క కూడా. జ్వరం, ఒళ్లు నొప్పులూ, మూత్ర సంబంధ వ్యాధులకు ఇది మంచి మందు. చర్మ, కాలేయ సంబంధ వ్యాధులకూ, అజీర్తికి కూడా మందుగా వాడతారు. దీని ఆకులను వేడినీటిలో వేసుకుని స్నానం చేస్తే కీళ్ల, కాళ్లనొప్పులు కూడా తగ్గుతాయట. మాచిపత్రి ఆకులతో టీ చేసుకుని కూడా తాగుతారు. ఈ ఆకులను సువాసన కోసం వంటల్లో కూడా ఉపయోగిస్తారు. వాటిని దగ్గర ఉంచుకుంటే వడదెబ్బ తగలదంటారు. మాచిపత్రిని పెంచుకుంటే ఎలాంటి అనారోగ్యం, దురదృష్టం దరిచేరదని యూరోపియన్లు నమ్ముతారట. ఈ ఆకులను దిండుకింద పెట్టుకుని నిద్రపోతే మంచి కలలు వస్తాయని కూడా వారి విశ్వాసమట.

– బోడెంపూడి శ్రీదేవి, లాండ్‌స్కేప్ కన్సల్టెంట్

బంగారం వెండి

9 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,030	30,960	30,900	-------
ఆర్నమెంట్	28,980	28,910	28,800	-------
వెండి (కిలో)	38,950	38,900	40,000	-------
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,950	-------	30,650	30,580
ఆర్నమెంట్	28,610	-------	28,660	28,580
వెండి (కిలో)	39,100	-------	38,300	38,100
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,090	31,040	-------	-------
ఆర్నమెంట్	28,740	28,870	2,866	2,858 గ్రా
వెండి (కిలో)	40,900	40,900	40.90	40.70

ఆ మాత్రలతో కోరికలు తగ్గుతాయా?

? నా వయసు ముప్పైఆరు. ఈ మధ్య జుట్టు విపరీతంగా ఊడిపోతోంటే... చర్మ వైద్య నిపుణుల దగ్గరకు వెళ్లా. పరీక్షలు చేసి.. ఒమెగా త్రీ ఫ్యాటీయాసిడ్లతోపాటూ, మరో రకం మాత్రల్ని కూడా సూచించారు. అయితే అవి పురుషుల లైంగికసామర్థ్యం తగ్గిస్తాయనీ, అదే స్త్రీలకు మాత్రం కేవలం తలపైనా ప్రభావం చూపుతాయనీ అని చెప్పారు. నేను వాటిని వేసుకోవచ్చంటారా... సలహా ఇవ్వండి.

– ఓ సోదరి

✔ బహుశా మీకు ఇచ్చిన మాత్రల్లో 5 అల్ఫారిడక్టేస్ ఇన్హిబిటర్స్ ఉండి ఉంటాయి. జుట్టు ఊడే సమస్య ఉన్నవారు వీటిని వేసుకోవడం వల్ల టెస్టోస్టెరాన్ స్థాయులు తల్లోనే పెరుగుతాయి. అలా రాలిన జుట్టు మళ్లీ వస్తుంది. నిజమే.. పురుషులు వేసుకోవడం వల్ల లైంగిక సామర్థ్యం తగ్గుతుంది. కానీ స్త్రీలపై మాత్రం ఆ ప్రభావం ఉండదు. ఈ మాత్రలు కేవలం జుట్టువరకే పనిచేస్తాయి. కానీ లైంగిక వాంఛల్ని కొంతవరకూ తగ్గిస్తాయి. అయితే పెళ్లయి ఇంకా గర్భం దాల్చనివారూ, ఒక కాన్పు మాత్రమే అయి.. రెండోసారి పిల్లల్ని కనాలనుకునేవారు వీటిని వేసుకోకపోవడమే మంచిది. గర్భధారణలో ఇబ్బందులే కాదు... పుట్టే పిల్లలపై ప్రభావం చూపించొచ్చు. కాబట్టి మీకు పిల్లలుండి, ఇక వద్దు అనుకున్నప్పుడే వేసుకోండి. అలాగే వీటిని జీవితాంతం కాకుండా కేవలం ఆరేడు నెలలు మాత్రమే సూచిస్తారు. కాబట్టి మరోసారి మాట్లాడి వేసుకోండి.


డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

టెడ్ టాక్‌లోనూ డోలు వాయించింది!

సంప్రదాయ వివాహాలు.. వేడుకల సమయంలో డోలు బాజా లేనిదే మజా ఉండదు. వాటిని వాయిస్తూ అబ్బాయిలు ఉత్సాహంతో చెలరేగిపోతుంటారు. సాధారణంగా అలాంటి డోలును వాయిస్తూ మనకు అబ్బాయిలే కనిపిస్తారు. కానీ చండీఘడ్‌లో మాత్రం ఓ అమ్మాయి బరువైన డోలును పట్టుకుని వాయిస్తుంటుంది. అంతేనా ప్రపంచంలో డోలు వాయించే అత్యంత పిన్న వయస్కురాలిగానూ పేరు తెచ్చుకుంది. తనే జహన్ గీత్ సింగ్. బరువుగా ఉండే డోలును వాయిస్తూ అమ్మాయిల సమస్యల మీదా పోరాటం చేస్తోంది. ఇంతకీ ఇదంతా ఎందుకంటే ఆసక్తి అని చెబుతోంది.



ఇరవై ఏళ్ల జహన్ గీత్ సింగ్ పుట్టి పెరిగింది చండీఘడ్‌లో. ప్రస్తుతం ఆమె పంజాబ్ విశ్వవిద్యాలయంలో న్యాయవిద్యను అభ్యసిస్తోంది. చిన్న వయసులో సంప్రదాయ వేడుకలకు హాజరైనప్పుడు అక్కడ డోలు వాయించడం చూసింది. అప్పుడే ఆమెకి ఆసక్తి కలిగింది. దాంతో తనూ నేర్చుకోవడం మొదలుపెట్టింది. ఆ తరవాత పలు స్టేజి ప్రదర్శనలు ఇవ్వడం ఆమె జీవితంలో భాగం అయింది. తనకు సంబంధించినవారిళ్లలో కార్యక్రమం ఏదైనా డోలు పట్టుకుని సిద్ధమైపోయే జహన్.. చదువుని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయదు. వాటితోపాటు.. ఆడపిల్లల కోసం కృషి చేసే స్వచ్ఛంద సంస్థలకోసం విరాళాలనూ సేకరించడంలో ముందుంటుంది.

ఆమె ఆసక్తిని గమనించిన పలు ఛానళ్లు.. తన ప్రదర్శన ఇవ్వడానికి ముందుకొచ్చాయి. డోలుతో ప్రత్యేకగా కార్యక్రమాలు చేయడం మొదలుపెట్టాయి. అంతేకాదు ఆమె చండీఘడ్ ఇండస్ట్రియల్ టూరిజం కార్పొరేషన్ వారి కార్యక్రమాలకూ డోలు వాయించి వీక్షకులకు కనువిందు చేస్తుంది. టెడెక్స్ టాక్‌లోనూ మాట్లాడే అవకాశం సంపాదించింది. దానిలో తాను అమ్మాయిగా ఈ రంగంలోకి వచ్చి ఎంతగా లింగ వివక్షను ఎదుర్కొందో కళ్లకు కట్టింది. ఆ వివక్షే తనని విజయవంతంగా తీర్చిదిద్దిందని గర్వంగా చెప్పుకుంటుంది జహన్. ఇక ముందు కూడా డోలు వాయిస్తూ.. మహిళల బాగు కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు సేకరిస్తానని చెప్పింది.



యువతరం

ఈనాడు కరీంనగర్
శనివారం, ఫిబ్రవరి 10, 2018 16
youth@eenadu.in

సెకనులో ఐదో వంతు చాలు

నిజమే!!! ప్రేమ పుట్టడానికి సెకనులో ఐదోవంతు సమయం చాలంటున్నారు మానసిక శాస్త్రవేత్తలు. మన సోల్‌మేట్‌ను చూడగానే మెదడులో ఆక్సిటోసిన్, డొపమైన్, వాసోప్రిసెన్, ఎడ్రినలిన్ విడుదలై ఒక రకమైన రసాయన చర్య మొదలవుతుంది. దీనికి అనుగుణంగా మెదడులోని నరాల్లో కదలిక వస్తుంది. ఇదే మనకు వారి పట్ల ప్రేమ పుట్టేలా చేస్తుందని చెబుతున్నారు. ఈ ప్రక్రియ జరగడానికి సెకనులో ఐదో వంతు సరిపోతుంది. అందుకే ప్రేమ ఏ క్షణమైనా, ఎక్కడైనా పుట్టే అవకాశముంది.

■ ముఖ్యంగా మూడు విషయాల్లో ప్రేమ జంటల మధ్య విభేదాలు వస్తున్నాయని గుర్తించారు శాస్త్రవేత్తలు. తరచూ విమర్శిస్తుండటం, ప్రతీదానికీ వ్యంగ్యంగా సమాధానం చెప్పడం, ఏ విషయంలోనూ స్పందన లేకుండా నిస్తేజంగా ఉండటం విడిపోవడానికి ముఖ్య కారణాలు.

■ 25 సంవత్సరాలు కలిసి జీవించిన జంటల్లో హావభావాలు చాలా మటుకు ఒక్కటిగా ఉంటాయని వీరు తేల్చారు. వాతావరణం, ఆహారం, ఆహార్యం వీరిని ఇలా ప్రభావితం చేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.


పడిపోవడానికి....



లవ్ చెక్

ఉండాల్సినవి		ఉండకూడనివి	
నమ్మకం		అనుమానం	
అంకితభావం		అధికారం	
సర్దుకుపోవడం		పోల్చిచూడడం	
స్పష్టత		ఆశించడం	
బాధ్యత		ఊగిసలాట	
పంచుకోవడం		ఉన్మాదం	
భావ నియంత్రణ		అభద్రత	

మనసులో మాట!



అది పాపమే

టెన్త్‌లో ప్రపోజ్ చేశావు. నాకు ఎంత భయమేసిందో తెలుసా? నేను ఏడుస్తుంటే.. ఇష్టం లేదాని అడిగావు. నేనేం చెప్పాలి. నాకంతా ఆయోమయం. రెండేళ్లు అవుతున్నా అదే కన్ఫ్యూజన్. నువ్వు మాత్రం నేను ప్రేమిస్తున్నా అని వెంటపడుతున్నావు. నువ్వంటే నాకూ ఇష్టమని కరెక్ట్‌గా చెప్పగలను. కానీ, అది ప్రేమో కాదో నాకు తెలియడం లేదు. అందుకే నువ్వు ఎన్నిసార్లు ప్రేమిస్తున్నా అని చెప్పినా సరే అనలేకపోతున్నా. ఐ టూ అని చెప్పలేకపోతున్నా. నువ్వు నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. నాతో ఎప్పుడూ తప్పుగా ప్రవర్తించింది లేదు. నో అని చెప్పడానికి ఒక్క కారణం కూడా చూపలేను. కానీ, ఇప్పుడు నేనేం చెప్పలేను. అర్థం చేసుకో. 'ఓకే' అని ఒక్కమాట చెప్పమని ఎప్పుడూ అంటుంటావ్. నాకున్న మనస్థత్వానికి నేను ఒక్కసారి కమిట్ అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ నిన్ను వదులుకోలేను. నువ్వే జీవితం అవుతావ్. నాకేమో నమ్మకం కలగట్లే. ఒక్కసారి ఆలోచించు. ఇద్దరం ఇంటర్ పూర్తి చేస్తున్నాం. ఇంజినీరింగ్ చేయాలి. జీవితంలో స్థిరపడాలి. సుమారు ఐదేళ్లయినా పడుతుంది. ఇప్పుడే మనం ప్రేమని అని తొందరపడితే అన్నేళ్లు మన ప్రేమని నిలబెట్టుకోగలమా? నేను నమ్మకంగా లేను. నువ్వు ఉన్నావా? మనకు ఈ వయస్సులో పుట్టేది ఆకర్షణే.. ప్రేమ కాదని నా భావన. నువ్వు ప్రేమిస్తున్నా అని చెప్పక ముందు నీతో మాట్లాడేప్పుడు భలే సరదాగా ఉంటేది. నువ్వు పక్కన ఉంటే భలే సంతోషంగా ఉంటుంది. నీ మాటల్లో ఏదో తెలియని శక్తి ఉంటుంది. కానీ, ఇప్పుడు.. మౌనంగా నేనేదో తప్పు చేసినట్టు చూస్తావు. నాకు కష్టంగా ఉంటుంది. నువ్వు కనబడగానే ఏదో తెలియని ఫీలింగ్. అది భయం అని చెప్పలేను. ఎందుకంటే నిన్ను చూస్తే ఎప్పుడూ ఏదో తెలియని ఆనందం. ఇప్పుడు ఆనందం పక్కనే ఆందోళన వచ్చి చేరింది. నువ్వా బాగా చదువుతావ్. భవిష్యత్తుపై దృష్టి పెట్టు.. శీను! నేను ఆడపిల్లని. అంతంతా ఎదురుగా నిలబడి చెప్పేంత ధైర్యం లేదు. అందుకే ఇలా. నేనున్న ఈ పరిస్థితిలో ప్రేమ నాకు ఆకర్షణలానే అనిపిస్తోంది. నిజంగా నీది ప్రేమే అయ్యుండొచ్చు. నువ్వు నా కోసం ఎదురుచూస్తావు కూడా. కానీ, భవిష్యత్ ఏంటో నేను చెప్పలేను. నీ చేత సంవత్సరాలు ఎదురుచూసేలా చేయడం, ఆ తర్వాత నీకు అందకుండా పోతే అది మహాపాపం. ఆ పాపం నేను చేయలేను. అందుకే... ఇప్పటికీ నేను నీకు మంచి ఫ్రెండ్‌ని. అంతే... అర్థం చేసుకో!! - పండు

ప్రేమించడానికి

మీ కెన్ని గుండెలు?

అమ్మ ప్రేమలో లాలన తరగనిది!
నాన్న ప్రేమలో బాధ్యత బలమైంది!
తోబుట్టువు ప్రేమలో తోడ్పాటు విలువైంది!
స్నేహితుడి ప్రేమలో స్వచ్ఛత నిజమైంది!
మరి, ప్రేమికుల ప్రేమ???

నిజం... అనుకునేలోపే అపార్థం పేరుతో ఆయువు పోతోంది!
బలం... అనుకునేలోపే బాధ్యత మరిచి బ్రేకప్ అంటోంది!
తోడ్పాటు... అందామంటే తీరు మార్చుకుని దార్లు వేరంటోంది!
రోజూ చూస్తున్న ఘటనలే అందుకు నిదర్శనం!

■ నో చెప్పిందని నాటు కత్తితో వేటు వేయడం చూశాం!

■ కాదందని కాలం చేయడం విన్నాం!

■ కన్నవారు బెట్టుచేశారని కలిసి తనువు తాలించడం కన్నాం!

■ బిల్లు కట్టలేదని.. సెల్లు ఎత్తలేదని... కారణాలు వెతుక్కుని ప్రేమకి కట్ చెప్పేవారైతే లెక్కలేదు!!

మరైతే, నిజమైన... బలమైన... విలువైన... ప్రేమికులు లేరా?
ఎందుకు లేరు? ఉన్నారు!! కానీ, అందుకు చాలా గుండెలు కావాలి! అన్ని గుండెలు ఉంటేనే ప్రేమికులవ్వండి... ప్రేమికుల దినోత్సవం జరుపుకోండి!!

'మీరెవరినైనా ప్రేమించారా?' అని ఎవరినైనా అడిగి చూడండి. లేదు... అనే సమాధానం తక్కువగా వినిపిస్తుంది. ప్రేమ మనందరికీ పరిచయమే. అమ్మ లాల పోస్తున్నప్పుడో.. టీచర్ నేచర్ కాల్స్‌కి నవ్వుతూ పొమ్మన్నప్పుడో... టీనేజ్ ఫస్ట్ క్రష్ లోనో... ప్రేమ ఫైవ్ స్టార్ చాక్లెట్‌లా కొంత తీపిని పంచే ఉంటుంది. అంత వరకూ ఒకే. కానీ.. చత్రాల చదువుల్లోనో... క్యాంపస్ జోష్‌ల్లోనో... ఆఫీస్ క్యాబ్‌ల్లోనో... సోషల్ అడ్డాల్లోనో... ఓ సాయంత్రం మెరుపు మెరుస్తుంది... వాన కురుస్తుంది... హృదయం తడిసి ముద్దవుతుంది... రెయిన్‌బో ఒంపుపై మెరుపు తీగకు మరదల్లా ఓ వయ్యారీ.... కట్..కట్... సినిమాల్లో కదా ఇలా జరిగేది. ఒకే యార్... అలా ఊహిస్తే బాగుంది కదూ! ఇంద్రధనస్సులు... మెరుపు తీగలు... లాంటివి పక్కన పెడితే నిజ జీవితంలోనూ ఇలా జరగొచ్చు. పరిపూర్ణమైన ప్రేమ పలకరిస్తుంది. పిల్లగాలిలో ఏదో పరిమళం తెస్తుంది. బహుశా ఆ శ్వాసలో ధ్యాసను మీరు గ్రహిస్తారు. ఏదో తేడా... తేడా... కుచ్ కుచ్ హోతా హై! అనిపిస్తుంది. ఇక్కడే... మీరు అప్పటి వరకూ చదవని శాస్త్రం ఒకటి జీవిత లైబ్రరీలో తారసపడుతుంది. అదే ప్రేమ శాస్త్రం!

ఏ శాస్త్రానికైనా ఉపోద్ఘాతం ఒక్కపేజీనే. కానీ, ప్రతి చాప్టర్ మిమ్మల్ని అడాప్టర్‌లా ఛార్జ్ చేస్తుంది. 'ఆర్ట్ ఆఫ్ లవ్' కూడా అలాంటిదే. చదువుతూ వెళుతుంటే... ప్రతి అధ్యాయంలోనూ అందమైన అనుభవాలు. ప్రతి పేజీలోనూ ఊహకు అందని మలుపులు... గెలుస్తామా? పడిపోతామా? హోల్డాన్... యామ్ ఇన్ లవ్!! అనుకునే వాళ్లంతా ఎక్కడికో వెళ్లిపోయినట్టున్నారు! మరి, ఇప్పటివరకూ ప్రేమలో పడినవాళ్ల సంగతేంటి? 'ప్రేమంటే గుడ్డిది.. బ్లైండ్... ట్రాష్... టైం వేస్ట్... యూస్ లెస్... ఎమోషనల్ బిజినెస్... ఇలా చాలానే విన్నాం. ఆర్ట్ ఆఫ్ లవింగ్ అనేది ఉందా?'... అని చాలా సందేహాలు వ్యక్తం చేస్తారు. యస్! ఆ సందేహాలకు ఆన్సర్ కావాలంటే? ప్రేమ శాస్త్రంలో పాస్ అవ్వాల్సిందే.


లవ్ క్వాలిఫికేషన్..

ఓహ్‌ccc చదువుల్లో ఓకే. ఇక్కడ కూడానా! ఇంటర్, డిగ్రీ సరిపోతుందా? పీజీ తప్పనిసరా? అని అడగొద్దు. కూల్‌గా కూర్చోండి. గుండె వేగం సాధారణ స్థితికి వచ్చాక మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. ప్రేమించడానికి మీకున్న అర్హతలేంటి?... ఆలోచనలో పడ్డారు కదూ! ఒక్కొక్కటిగా రాసుకోండి.. చదువు, ఉద్యోగం, డబ్బు, అందం... అన్నీ ఉన్నాయిగా అంటూ కాలర్ సరిచేసుకుంటున్నారా? వెయిట్.. వెయిట్.. లిస్ట్‌లో ఏదో మిస్ అయినట్టుందే. ఒక్కసారి క్రాస్ చెక్ చేయండి. అదే ప్రేమకి ఆయువు... అండ... గెలుపు... ఇంకా ఆలోచిస్తున్నారా? 'ధైర్యం' అనే మూడక్షరాలే బాస్! అందుకు మీకున్న గుండెలు ఎన్ని?

మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి!

కొత్త విషయంలా చెబుతున్నారేంటి ధైర్యం లేకుండానే ప్రేమించేస్తామా? అనుకునే వారందరూ ఒకసారి మిమ్మల్ని తిరిగి ప్రశ్నించుకోండి. కట్టుకునే స్కార్ఫ్‌లు... హ్యాండ్ కర్చీఫ్‌లు సూటిగా సమాధానం చెబుతాయి. 'అక్కడే నాన్న ఆఫీస్. నాకు భయం నేను రాలేను'... 'అన్నయ్య ఉంటాడు. చూస్తే అంతే సంగతులు...' అని తప్పించుకుని తిరిగిన సందర్భాలు మదిలో తప్పని సరిగా మెదులుతాయి. ఇదేనా ధైర్యం అంటే... 'మా పరిస్థితి అలాంటిది. ఏం చేయమంటారు. కావాలని ఎదురుపడలేంగా అని సమర్థించుకుంటారు.' గుడ్... కానీ, ఒకటే సూటి ప్రశ్న... మీ టైం బాగోక ఏదో రోజు వాళ్లు ఎదురుపడితే?... మీ ప్రేమకి ఎదురు నిలిచే ధైర్యం ఉండాలి. ధైర్యమంటే... కేవలం 'ఐ లవ్యూ' అని మధురమైన మూడక్షరాలను చెప్పేదొక్కటే కాదు. మరెన్నో గుండెలు ఉండాలి.

ఆర్ట్ ఆఫ్ లవింగ్



♡ కాదుపొమ్మంటే... తట్టుకునే గుండె

నువ్వు లేకుండా జీవితాన్ని ఊహించలేను అన్నవారే 'విసిగించకు... నన్ను వదిలెయ్!!' అంటూ దూరం పెడితే! జీవితం తల్లకిందులైనట్టుగా తల్లడిల్లిపోవద్దు. మీ నుంచి వారేం కోరుకుంటున్నారో ధైర్యంగా అడగండి. విడిపోవడమే వారి ఉద్దేశమైతే విచక్షణతో ఆలోచించండి. వద్దనే మనసుని పదే పదే మార్కెటింగ్ చేయడం మంచిది కాదు. అందుకే 'విష్ యూ గుడ్‌లక్' అని ఓ యూ టర్న్ తీసుకోండి. మరో రాంగ్ టర్న్ ఎదురుకాకుండా హైవేలో లైఫ్ సాఫీగా సాగిపోతుంది. నమ్మండి!!

♡ అడిగితే... వేచిచూసే గుండె

క్షణకాలంలో పుట్టిన ప్రేమ అనుక్షణం వెంటే ఉండాలంటే? ప్రేమ వేసుకున్న టీషర్టో... జడకి పెట్టుకున్న క్లిప్పో కాదన్న విషయం గ్రహించాలి. రెండు కుటుంబాలు... కల్చర్... కట్టుబాట్లు. వాటన్నింటినీ మెప్పించి ఒప్పించాలంటే ఎవరికైనా కాస్త సమయం పడుతుంది. 'నువ్వు... నీ నవ్వే కావాలి!!' అని ఎన్నో సార్లు అనుకుంటారు ప్రేమలో! 'నువ్వు... నవ్వు' వెనక వారికంటూ ఓ ప్రపంచం ఉందన్న విషయాన్ని గ్రహిస్తే వేచిచూసేందుకు ధైర్యం టన్నుల కొద్దీ పుడుతుంది. నిజం ఆలోచించండి!!

♡ కెరీర్‌లో నిలదొక్కుకునే దాకా కాపాడుకునే గుండె

తొలిప్రేమ సినిమాలో పవన్ కళ్యాణ్‌లానో... ఎంసీఏ మూవీలో పల్లవి మాదిరిగానో చూడగానే ప్రేమ పుట్టొచ్చు. అది ఇంటర్‌లోనైనా కావచ్చు... ఇంజినీరింగ్‌లో అయినా అవ్వొచ్చు. అయితే, ఆ ప్రేమకి కెరీర్‌ని జత చేసినప్పుడే మొక్కై మొలిచిన ప్రేమ మహావృక్షమై జీవితాంతం తోడూ... నీడని అందిస్తుంది. ఎందుకంటే ప్రేమ శాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తేనే 'డాక్టర్ లవ్' పట్టా అందుకోవడం సాధ్యం అవుతుంది.

♡ అర్థం చేసుకునే గుండె

ప్రేమికులు కళ్లని చూసి మనసులోని భావాల్ని ఇట్టే అర్థం చేసుకోగలరు మరి! అదే లవర్స్ కొంతకాలానికి 'ఇంతలా చెబుతున్నా అర్థం చేసుకోవెందుకు?' అని వాదించుకునే స్థితికి ఎందుకొస్తారు? మారుతున్న ఇరువురి అభిరుచుల్ని అర్థం చేసుకోకపోవడం వల్లే. ఇంటర్‌లో ఉన్న అభిప్రాయాలు... డిగ్రీలోనూ... తర్వాత పీజీలోనూ... చదువు, వయసుతో పాటు మారిపోతుంటాయి. అంటే... ఒకేలా ఆలోచిస్తామని ఇంటర్‌లో ప్రేమించుకున్నవారు డిగ్రీలో ఒకలా... తర్వాత మరోలా మారుతుంటారు. ఆ పరిణామ క్రమాన్ని ఇరువురూ అర్థం చేసుకోకుంటే అపార్థాలకు నానార్థాలు వెతుక్కోవాల్సిన అవసరం రాదు.

♡ పేరెంట్స్‌ని ఒప్పించే గుండె

తల్లిదండ్రులకు పిల్లలకు కోరింది ప్రతీదీ ఇవ్వాలనే అనుకుంటారు. కానీ, ఇచ్చేముందు ఆలోచిస్తారు. ఒకటికి పదిసార్లు చెక్ చేస్తారు. అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాలు చూస్తారు. ఇరువురి ప్రేమని పదుగురి ముందు పరీక్షించేందుకూ వెనకాడరు. అన్నింటికీ సిద్ధమై... అన్ని రకాలుగా మెప్పించేందుకు 'నాన్న' అంత ధైర్యం... 'అమ్మ' అంత ఓర్పు కావాలి.

♡ 'కారణాలను' క్షమించే గుండె

ప్రేమించడానికి కారణాలు ఉండవు. అగ్నిలాగ స్వచ్ఛమైనది అంటూ ప్రేమించుకుంటారు. కాలం గడుస్తున్నకొద్దీ అదే ప్రేమ ఎన్నో కారణాలు చూపిస్తూ దూరం అయ్యే ప్రయత్నం చేస్తుంది. ఎక్కువగా ప్రేమ పెళ్లిగా మారే సమయానికే! ఒకరి కారణాలకు మరొకరు పరిష్కారం అవుతూ వెళ్తే కొత్తవి పుట్టుకొస్తూనే ఉంటాయి. అంటే... ప్రేమ పరిణామ క్రమానికి వారు సిద్ధంగా లేనట్టే అని గ్రహించాలి. "ఒక్కమాటలో చెప్పాలంటే... మీకున్న గుండె ధైర్యంపైనే మీ ప్రేమ ఎత్తయిన సౌధమా? లోతైన అగాధమా? తేలిపోయే నీడి బుడగనా? అనేది తెలిసేది!

♡ ఇంత ధైర్యం మాకుందా?

ఓహ్‌cc కమాన్ కచ్చితంగా ఉంటుంది. మీరు చిన్నప్పుడు ఆడుకునే బొమ్మని లాక్కోవడానికి ఎవరైనా ప్రయత్నిస్తే! ధైర్యంగా ప్రతిఘటించే ఉంటారు. నాదని ఏడుస్తూ ఎదురు నిలబడుంటారు. నిశితంగా గమనించండి వాడి ధైర్యాన్ని. స్పందనలేని బొమ్మని ప్రేమించిన స్వచ్ఛమైన ప్రేమికుడు మీలో ఎప్పుడో ఉన్నాడు. నిజం కాదా? ఇంకా తెలియాలంటే ప్రేమలో పడి తేలినవారిని అడగండి. ఆ మూడు పదాల్ని చెప్పడానికి పడ్డ తిప్పల్ని గొప్పలుగా చెబుతారు. 'నేనప్పుడు ఇంటర్ చదువుతున్నా? తనని చూస్తే గుండెల్లో అదోలా ఉండేది. పక్కా ప్రేమేనని ఫీల్ అయ్యి చెబితే వాళ్ల నాన్నకి చెప్పింది. కొన్ని రోజులు కాలేజీ ఛాయలకు పోలే. పార్కుల్లో పార్ట్‌టైం దేవదాసయ్యా!!' అని ఒకరు... 'అప్పుడు పీజీ చేస్తున్నా. తను నా క్లాస్‌మేటే. ఇద్దరికీ ఇష్టమే. కొంతకాలం బాగానే ఉంది. ఓ రోజు ఇంట్లో తెలిసింది. పెద్ద పంచాయితీ. భయంతో ఏం అర్థం కాలేదు. తేరుకునేలోపే మా ప్రేమ పీహెచ్‌డీ థీసెస్‌గా మిగిలిపోయిందని' ఇంకొకరు.. 'తర్వాత ఏమైంది అని పొడిగించండి...' ఫ్రీగా ఉన్నప్పుడు ఇంటికో... ఇంకెక్కడికో రమ్మంటారు. ఎందుకంటే ప్రేమలో ఎదురయ్యే ట్విస్ట్‌లు అలాంటివి మరి. గెట్ రెడీ టు ఫేస్!! ముందస్తు 'ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు!!'

- రాజేష్ యడ్ల



ఒక షార్ట్ ఫిల్మ్ చేస్తే... ఫ్రెండ్స్ నుంచి ఫోన్ వస్తుంది.. మహా అయితే ఆత్మీయుల నుంచి అభినందనలు వస్తాయి.

మరి ఒక కుర్రాడికి నేరుగా ప్రముఖ క్రికెటర్ బ్రియన్‌లారా నుంచి కాల్ వస్తే...

గాత్రాలే తప్ప పాత్రల్లేని మరో లఘుచిత్రం తీస్తే... నేరుగా హీరో నాని ఫోన్ చేసి అభినందనలు చెబితే.

ఈసారి ఏదైనా చేయాలనుకుంటే ముందు నాతో చెప్పమని వరమిస్తే..

ఇంకేముంది... దర్శకుడి స్థానం దక్కుతుంది. అలా అవకాశం పొందిన కుర్రాడే ప్రశాంత్‌వర్మ.

చేపకు నానితో... చెట్టుకు రవితేజతో డబ్బింగ్ చెప్పించి...

ఫస్ట్‌లుక్‌తో ఆశ్చర్యంలో ముంచెత్తి... టీజర్‌తో ఉత్సుకత రేపిన 'అ' చిత్ర దర్శకుడు పాలకొల్లు ప్రశాంత్ గురించి చదివేయండి.

లారాను మెప్పించి... నానీని ఒప్పించి

"అన్ని సినిమాలందు 'అ' సినిమా వేరయా విశ్వదాభిరామ ఫిబ్రవరి 16న రిలీజ్ రా మామ!" - అంటూ కొత్త రకంగా ప్రేక్షకులకు ముందొచ్చిన 'అ' టీజర్ ఎంతగా అలరిస్తోందో ఆన్‌లైన్‌లో ఎవరినడిగినా తెలుస్తుంది. అటువంటి విభిన్న చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన పెన్మెత్స ప్రశాంత్ వర్మది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు. తల్లి కనకదుర్గ పాలకొల్లు బి.ఆర్.ఎం.వి. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు. తండ్రి నారాయణరాజు నిర్మాణరంగంలో ఉన్నారు. పాలకొల్లు సరస్వతి శిశుమందిర్‌లో తొమ్మిదో తరగతి వరకు చదివిన ప్రశాంత్‌వర్మ ఇంజినీరింగ్ హైదరాబాద్‌లో పూర్తిచేశారు.

బ్రియన్‌లారా పిలుపు...

సినిమాలు ఎక్కువగా చూసే ప్రశాంత్ సినిమా కథలు రాయాలని ప్రయత్నం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో 'సైలెంట్ మెలోడి' కథ రాసి... షార్ట్ ఫిల్మ్‌గా తీశాడు. ఈ కథ నచ్చి ఆర్థిక సహకారం సందీప్‌కిషన్ అందించారు. ఇందులో మాటలే ఉండవు. ఒక అందమైన కథను కవితాలా ఆవిష్కరించారు. తర్వాత 'డైలాగ్ ఇన్ డార్క్' అంటూ మరో లఘుచిత్రం చేశారు. ఇందులో మాటలు తప్ప పాత్రలే ఉండవు. ఇలా భిన్నమైన అతని ఆలోచనా విధానమే అందరినీ ఆకట్టుకుంది. యప్ టీవీ ప్రొడ్యూసర్లు ఇతని ప్రతిభ గుర్తించి బ్రియన్‌లారాకు సైలెంట్ మెలోడిని చూపించారు. ఆయన వెంటనే మెచ్చుకొని ప్రశాంత్‌కు ఫోన్ చేసి అభినందించారు. తనతో యప్ టీవీ చేస్తున్న యూట్యూబ్ సిరీస్‌లకు పనిచేయాల్సిందిగా అవకాశం ఇచ్చారు. ప్రశాంత్ వెస్టిండిస్ వెళ్లి 15 రోజుల పాటు లారాతో కలిసి పనిచేసి ప్రశంసలందుకున్నాడు. లారా ఇంట్లోనే ఆతిథ్యమిచ్చి మరీ గౌరవించాడంటే మనోడి ప్రతిభ ఎంతో అర్థం చేసుకోవచ్చు. ఐపీఎల్ క్రికెట్‌కు ప్రచారచిత్రాలను యువరాజ్‌సింగ్, జహీర్‌ఖాన్‌లపై చిత్రీకరించాడు. కాజల్, సమంత వంటి కథానాయికలతోనూ అనేక ప్రచారచిత్రాలను తీసి మెప్పించాడు.

అ సాధ్యుడు

నాని మెచ్చిన కథ

'డైలాగ్ ఇన్ డార్క్' లఘుచిత్రం చూసిన హీరో నాని ఒకసారి ప్రశాంత్‌ని పిలిచి అభినందించారు. ఇందులో ఒక పాత్రకు నా డబ్బింగ్ అయివుంటే ఇంకా బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఏదైనా వెరైటీగా ఆలోచించినప్పుడు తనకు ఒకసారి చెప్పమని తనవంతు సాయం చేస్తానని మాటిచ్చాడు. తర్వాత కొన్ని రోజులకు 'అ' కథని వినిపించి.. చేపకు మీ వాయిస్ ఓవర్ కావాలని అడగడానికి నాని వద్దకు వెళ్లాడు ప్రశాంత్. కథ విని నేను వాయిస్ ఓవరేకాదు... ఈసినిమాను నిర్మిస్తానని ముందుకొచ్చాడు. కాజల్, నిత్యమేనన్, రెజినా...ఇలా ఎందరో మంచి నటులు కథ నచ్చి పాత్రలు చేయడానికి ఒప్పుకొన్నారు. అదే త్వరలో రాబోతున్న 'అ' చిత్రం.



సినిమా ప్రింట్‌తోనే ఊరికి వస్తా

మునుపెన్నడూ వినని కథ.. చూడని సన్నివేశాలు ఉంటేనే ప్రేక్షకులకు నచ్చుతుంది. 'అ' చిత్రం అలాగే ఉంటుంది. ఇందులో ఒక విభిన్నమైన ప్రేమ కథ ఉంటుంది. 2016 డిసెంబర్ 31న కథ రాయడం ప్రారంభించి 2017 డిసెంబర్ 31 నాటికి చిత్రీకరణ పూర్తిచేశా. అమ్మానాన్న ఎంతగానో ప్రోత్సహించారు. నా చెల్లి స్నేహ సమీర ఈ చిత్రం తీయడంలో ఎంతో సహకరించింది. తనకు ఉద్యోగం వచ్చినా వదులుకొని నాకోసం కష్టపడింది. నాలుగేళ్ల కిందట సొంతూరు వచ్చినప్పుడు ఈసారి సినిమా చేసి ప్రింట్‌తోనే పాలకొల్లు వస్తానని స్నేహితులతో, బంధువులతో చెప్పాను. త్వరలో అది జరగబోతోంది. చాలా సంతోషంగా ఉంది.

- ప్రశాంత్‌వర్మ, దర్శకుడు

- చిలుకూరి సూర్యప్రసాద్, పాలకొల్లు సాంస్కృతిక, న్యూస్‌టుడే